
'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 176

సోమవారం 16-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎక్కువ ఖాతాలున్నా..

ఒకరికి ఒక్కటే పీపీఎఫ్ ఖాతా.. చిన్న మొత్తాల పొదుపులో మార్పులు - 15లో



భారత జట్ల దూకుడు

చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా ఐదో విజయం నమోదు - 14లో

న్యూస్‌రీల్

రాహుల్ అతిపెద్ద ఉగ్రవాది



సిక్కుల గురించి మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ దేశంలోనే నంబర్ వన్ ఉగ్రవాది అని, ఆయన భారతీయుడే కాదని మండిపడ్డారు. ఆయన్ను పట్టిచ్చిన వారికి రివార్డు ప్రకటించాలన్నారు.

- వివరాలు 6లో▶

ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి భట్టి



ఈ నెల 18 నుంచి 21 వరకు మెక్సికో దేశం న్యూవోలియోన్‌లోని మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకావాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నిర్వాహకులు ఆహ్వానించారు.

- వివరాలు 3లో▶

చరిత్రను తుడిచే యత్నంలో భాగం కాలేను



చరిత్రను తుడిచివేసే తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వామిని కాలేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం ప్రజల దృష్టిని మరల్చడమేనని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో విమర్శించారు.

- వివరాలు 2లో▶

మా జోలికొస్తే ఊరుకోం

వచ్చిన వారికి ఇక మూడినట్లే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

కొందరు సన్నాసులు మనవాళ్ల ఇంటికొస్తామన్నారు.. మనవాళ్లే అక్కడికి వెళ్లారు..

చింతపండు అయ్యాక మనమే వచ్చి దాడి చేశామంటున్నారు.. ఎందుకు రమ్మనాలి?

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఉదంతాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు

- టీపీసీసీ కొత్త చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్
- అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి
- పార్టీని, ప్రభుత్వాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తామని వెల్లడి
- మూడు, నాలుగు నెలల తర్వాత 'స్థానిక' ఎన్నికలు అనే సంకేతాలు
- పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం
- నేను పవర్ సెంటర్‌ను కాదు.: మహేశ్‌కుమార్‌గౌడ్
- ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తానని వెల్లడి



సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి, మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరి జోలికి వెళ్లబోరని.. అలాగని ఎవరైనా తమ జోలికి వస్తే ఊరుకోబోమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల వివాదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ''వాడొకడు వీడొకడు మోపైండు. కార్యకర్తలపై కేసులు మిగతా 2వ పేజీలో ▶

ఒక్కసారే ఎక్కువ.. రెండోసారి పగటి కలే..

- రైతు రుణమాఫీపై అన్నీ అబద్ధాలే
- నేను పొడుగున్న అంటున్నావ్.. నిన్ను లిల్లీపుట్ అనాలా?.. సీఎం అబద్ధాల బురదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
- రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుడే ఎక్కువ.. రెండుసార్లు గెలుస్తారని అనడం పగటి కలలు కనడమే' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఐదేళ్లలోపు ప్రభుత్వాలు పోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. 'అదృష్టం బాగుంటే మిగతా 2వ పేజీలో ▶

రెండు రోజుల్లో రాజీనామా చేస్తా..

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన



- నిజాయతీపరుడినని ప్రజలు తీర్పు ఇచ్చేంత వరకూ సీఎం కుర్చీపై కూర్చోనంటూ ప్రతిజ్ఞ
- పార్టీని విచ్ఛిన్నం చేయడానికే తనను జైలుకు పంపారని ఆరోపణ
- కొత్త సీఎం ఎంపికకు ఎమ్మెల్యేలతో భేటీ చేపడతామని వెల్లడి
- నవంబర్‌లో మహారాష్ట్రతోపాటే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు డిమాండ్

6లో

> కొద్ది నెలల్లో ఢిల్లీ ఎన్నికలున్నాయి. నేను నిజాయతీపరుడిని అనుకుంటే నాకు ఓటు వేయండి. నేను నేరస్తుడినని భావిస్తే నాకు ఓటు వేయకండి. మీరు వేసే ప్రతి ఓటూ నా నిజాయతీకి సర్టిఫికెట్ అవుతుంది. నేను నిజాయతీపరుడినని భావించి నన్ను గెలిపిస్తే అప్పుడు సీఎం పీఠంపై కూర్చుంటా. అప్పటి వరకూ నేను సీఎం సీటుపై కూర్చోను. 14 ఏళ్ల వనవాసం తర్వాత సీతాదేవి అగ్నిపరీక్ష ఎదుర్కోవాల్సి వచ్చింది. జైలు నుంచి వచ్చాక నేను కూడా అగ్ని పరీక్షకు సిద్ధంగా ఉన్నాను.
>
> - కేజ్రీవాల్

సాగర్ ఎడమ కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్



సాగర్ ఎడమకాల్వ వారంలోగా పునరుద్ధరణ

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రింబవళ్లు పనులు జరగాలి: మంత్రి ఉత్తమ్
- వరదలతో రాష్ట్రవ్యాప్తంగా రూ.10,300 కోట్ల నష్టం జరిగినట్లు వెల్లడి
- కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పర్యటన

సాక్షి, హైదరాబాద్/నడిగూడెం: వర్షాలు, వరదలతో రాష్ట్రంలో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాలు, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమకుమార్‌రెడ్డి చెప్పారు. వరదలతో రాష్ట్రానికి మొత్తం రూ.10,300 కోట్ల నష్టం జరిగిందని అంచనా వేసి, కేంద్ర సహాయం కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. చెరువులు, కాల్వలు, ఇతర ప్రాజెక్టులకు మొత్తం 773 చోట్ల గండ్లు పడడంతో ఒక్క నీటిపారుదల శాఖకే రూ.558 కోట్ల నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే మరమ్మతులు చేపట్టామన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో ఆదివారం ఆయన హెలికాప్టర్‌లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. నడిగూడెం మండలం కాగితం రామచంద్రాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు, కోదాడ మండలం ఆర్లగూడెం వద్ద రెడ్లకుంట మేజర్ కాల్వకు, హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం వద్ద మిగతా 12వ పేజీలో ▶



70 అడుగులు.. 7 లక్షల మంది..

మహా గణపతి దర్శనానికి పోటెత్తిన జనం

ఖైరతాబాద్ (హైదరాబాద్): మహా గణపతిని దర్శించుకునేందుకు తండోప తండాలుగా తరలివచ్చిన భక్తులతో ఆదివారం ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలన్నీ జాతరను తలపించాయి. మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్ రైళ్లలో భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం ఒక్కరోజే దాదాపు 7 లక్షల మంది 70 అడుగుల మహాగణపతి దర్శనానికి తరలి వచ్చారని అంచనా. మహాశక్తి గణపతి నిమజ్జనానికి ఏర్పాట్ల దృష్ట్యా సోమవారం భక్తులకు దర్శనం ఉండదని పోలీసులు తెలిపారు.



బీసీ కోటా పెంపు కసరత్తు మొదటికి..

రాష్ట్రంలో కొత్తగా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ఇదే.. బీసీ రిజర్వేషన్లపై ఇప్పటివరకు రెండు కమిషన్లు అధ్యయనం
- కొత్త కమిషన్‌తో గత పరిశీలనంతా అటకెక్కినట్టే..

2లో

ఇంటర్ నుంచి వర్సిటీ దాకా...

ఉన్నత విద్యలోని నియామకాలన్నీ ఒకే గొడుగు కిందకు..



- మళ్లీ తెరపైకి కాలేజీ సర్వీస్ కమిషన్
- 1985లో కాలేజీ సర్వీస్ కమిషన్ రద్దు... పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలు..
- త్వరలో ఇతర రాష్ట్రాల్లో అధికారుల అధ్యయనం

సాక్షి, హైదరాబాద్ : ఇంటర్, డిగ్రీ, టెక్నికల్, వర్సిటీ ఇలా ఉన్నత విద్యావ్యవస్థలోని నియామకాలన్నీ ఒకే గొడుగు కిందకు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా కాలేజీ సర్వీస్ కమిషన్‌ను తెర మీదకు తెచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని సాంకేతికవిద్య విభాగం అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కాలేజీ సర్వీస్ కమిషన్ ఏర్పాటు వల్ల నియామక విధానంలో కొత్తదనం ఉంటుందని భావిస్తున్నారు.

కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు రద్దు?..: రాష్ట్రంలో 11 యూనివర్సిటీలున్నాయి. వాటి పరిధిలో నియామకాలన్నీ ఆయా యూనివర్సిటీలే కామన్‌గా నోటిఫికేషన్ ఇచ్చి.. చేపడుతున్నాయి. ఈ విధానంపై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో గత ప్రభుత్వం మార్పులు చేసింది. అన్ని యూనివర్సిటీలకు మిగతా 3వ పేజీలో ▶

వైద్య రంగం బలోపేతానికి రూ. 4,944 కోట్లు

రోడ్‌మ్యాప్ రూపొందించిన వైద్య, ఆరోగ్యశాఖ



- అత్యధికంగా డయాగ్నొస్టిక్ సర్వీసెస్‌కే రూ.1,044 కోట్లు
- రాష్ట్రవ్యాప్తంగా 60 మినీహబ్‌ల ఏర్పాటు
- 109 కొత్త ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటుకు రూ.921 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. తద్వారా సామాన్యులకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువలోకి తేవాలని యోచిస్తోంది. దీనికోసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రోడ్‌మ్యాప్ తయారు చేసింది. ప్రభుత్వంలో డయాగ్నొస్టిక్ సెంటర్లు మొదలు... మానవ వనరుల అభివృద్ధి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పరికరాల వరకు అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రూ.4,944 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. ప్రధానంగా 14 కాంపోనెంట్లపై దృష్టిసారించింది. ట్రామా కేర్ సెంటర్లు, డయాలసిస్ సెంటర్లు, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్స్, డయాగ్నొస్టిక్ సర్వీసెస్ పెంపు, డ్రగ్ డీఅడిక్షన్ మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇంటింటికీ తిరిగి మీరు నిర్దోషి కారని సీబీఐ వాళ్లు ప్రచారం చేయరుగా.. సార్!

ఇంటర్‌సిటీ స్థానంలో వందే మెట్రో

దేశంలో తొలి సర్వీసు నేడు ప్రారంభం

- అహ్మదాబాద్–భుజ్ మధ్య సేవలు, త్వరలో చెన్నై–తిరుపతి మధ్య..
- తదుపరి జాబితాలో సికింద్రాబాద్–విజయవాడ
- 12 కోచ్‌లు.. 1,150 సామర్థ్యంతో సీటింగ్





సాక్షి, హైదరాబాద్: రెండు ప్రధాన నగరాల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో వందే మెట్రో రైళ్లను తిప్పాలని రైల్వే శాఖ నిర్ణయించింది. వందేభారత్ రైలు సిరీస్‌లో మరో కొత్త కేటగిరీని ప్రారంభిస్తోంది. దేశంలోనే తొలి వందే మెట్రో రైలు సోమవారం పట్టాలెక్కుతోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి 360 కి.మీ. దూరంలో ఉన్న భుజ్ నగరం మధ్య ఇది రాకపోకలు సాగిస్తుంది. ఇప్పటికే మరిన్ని వందే మెట్రో రైళ్లను సిద్ధం చేసిన రైల్వే శాఖ, త్వరలో వాటిని కూడా ప్రారంభించనుంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి తొలి వందే మెట్రో రైలును తిరుపతితో అనుసంధానించాలని నిర్ణయించినట్టు తెలిసింది. చెన్నై–తిరుపతి మధ్య దీన్ని నడపనున్నట్లు సమాచారం. తదుపరి జాబితాలో వరంగల్ మిగతా 3వ పేజీలో ▶

350 కి.మీ. నిడివి వరకు..

100 నుంచి 350 కి.మీ. దూరం ఉండే రెండు ప్రధాన నగరాలు/పట్టణాల మధ్య నడిచేలా ఈ రైళ్లను రూపొందించారు. వీటి గరిష్ట వేగం 110 కి.మీ. వీటిలో ప్రతి కోచ్‌లో రెండు చొప్పున టాయిలెట్లు ఉంటాయి. ఒకవైపు ఇండియన్ మోడల్, మరోవైపు వెస్ట్రన్ మోడల్ టాయిలెట్ ఉంటాయి. ఇవి పూర్తి ఏసీ రైళ్లు, భవిష్యత్తులో నాన్ ఏసీ రైళ్లను కూడా నడపనున్నట్లు సమాచారం.

కనీస చార్జీ రూ.30

ఈ రైళ్లలో కనీస చార్జీ రూ.30. దూరాన్ని బట్టి గరిష్ట చార్జీ (350 కి.మీ.కు) రూ.445గా ఉండనుంది. సీసీ కెమెరాలు, ఎమర్జెన్సీ బటన్, నేరుగా లోకోపైలట్‌తో మాట్లాడేందుకు టాక్ బ్యాక్ యూనిట్, అగ్నిమాపక వ్యవస్థ, ఇన్ఫర్మేషన్ స్క్రీన్, ఫైర్ అలారమ్, దివ్యాంగుల టాయిలెట్, అనారోగ్యానికి గురైన వారికి స్ట్రెచర్ తదితరాలు రైల్లో ఉంటాయి.

క్లుప్తంగా...

సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ చైర్మన్ వెంకట్ జాస్తి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ రూ.2 కోట్ల విరాళం అందజేసింది. సంస్థ చైర్మన్, సీఈవో వెంకట్ జాస్తి ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌కు రాశి గ్రోత్ ఫండ్ చైర్మన్ ఎన్‌కేపీ రాజు, డైరెక్టర్ విష్ణురాజు రూ.15 లక్షల విరాళం అందజేశారు. తెలుగు టెలివిజన్ డిజిటల్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్, వినోద్ బాల, ప్రసాద్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి రెండు సంస్థల ప్రతినిధులు ఈ మేరకు చెక్కులను అందజేశారు.

స్పీకర్‌తో పీఏసీ చైర్మన్ భేటీ



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అరికెపూడి గాంధీ

కూకట్‌పల్లి (హైదరాబాద్): ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీని.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అభినందించారు. కొత్త బాధ్యతలను విజయ వంతంగా నిర్వహించాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి పీఏసీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని గాంధీ పేర్కొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని, ఒవైసీలకు భయపడి ఈ ఉత్సవాలకు గత ప్రభుత్వం దూరంగా ఉందని విమర్శించారు. రజాకార్ల అరాచక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన అమరుల త్యాగాలను గౌరవించి, ప్రజాపాలన దినోత్సవంగా కాకుండా.. తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో 'ఏలేటి' విజ్ఞప్తి చేశారు. ఈసారి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో తెలంగాణ విమోచనా దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ నుంచి విడిపోయి మహారాష్ట్ర, కర్ణాటకలో కలిసిన జిల్లాల్లోనూ విమోచనా దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

బీసీ కోటా పెంపు కసరత్తు మళ్లీ మొదటికి..



- రాష్ట్రంలో కొత్తగా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ఇదే
- బీసీ రిజర్వేషన్లపై ఇప్పటివరకు రెండు కమిషన్ల అధ్యయనం
- కొత్త కమిషన్ ఏర్పాటుతో గత పరిశీలనంతా అటకెక్కినట్టే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల పెంపు అధ్యయన ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటివరకు రాష్ట్రంలో పనిచేసిన రెండు బీసీ కమిషన్లు వెనుకబడిన వర్గాల ఆర్థిక స్థితిగతులు, విద్య, ఉద్యోగ అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినప్పటికీ... ప్రభుత్వం తాజాగా జి.నిరంజన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీసీ కమిషన్‌ను డెడికేటెడ్ కమిషన్‌గా ప్రకటించింది. ఈ క్రమంలో బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషన్ జిల్లాల వారీగా పర్యటించి పరిస్థితులను అధ్యయనం చేయాలని నిర్ణయించడంతో ఈ ప్రక్రియ మళ్లీ మొదట్నుంచి ప్రారంభం కానున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ఈనెల 6న జి.నిరంజన్ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులతో బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాధ్యతలు స్వీకరించిన కమిషన్ చైర్మన్, సభ్యులు తాజాగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెండ్రోజుల క్రితం పూర్వపు బీసీ కమిషన్ చైర్మన్లు, సభ్యులతో సమావేశం నిర్వహించి సూచనలు స్వీకరించిన అనంతరం కులగణన కార్యాచరణ ప్రణాళికను త్వరలో రూపొందిస్తామని చెప్పారు. ఆ తర్వాత జిల్లాల వారీగా పర్యటనల షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన చేసిన తర్వాతే బీసీ రిజర్వేషన్లు తేల్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గత అధ్యయనం అటకెక్కినట్లే...

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండు బీసీ కమిషన్లు పని చేశాయి. బీఎస్ రాములు చైర్మన్‌గా వ్యవహరించిన కమిషన్ మూడేళ్లపాటు పనిచేసి అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ) లెక్కలు తేల్చడంతోపాటు మైనార్టీ రిజర్వేషన్లపై కసరత్తు చేసింది. రాములు కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం ఎంబీసీ కేటగిరీని విభజించింది. ఆ తర్వాత ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు... వరుసగా మూడేళ్లపాటు రూ.వెయ్యి కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయించింది. ఆ తర్వాత వకుళాభరణం కృష్ణమోహన్ అధ్యక్షతన రెండో బీసీ కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ బీసీ రిజర్వేషన్ల పెంపుపై లోతైన అధ్యయనం చేసింది. అంతేకాకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తమిళనాడు, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించి.. అక్కడి బీసీ కమిషన్‌లు రూపొందించిన అధ్యయనాలను సైతం పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

ఇదే డెడికేటెడ్ కమిషన్..

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కుల గణనకు సంబంధించి నిపుణులు, సామాజికవేత్తలతో సమావేశాలు నిర్వహించి, దేశవ్యాప్తంగా అనుసరించిన విధానాలను అధ్యయనం చేసి 64 ప్రశ్నలతో కూడిన 'ముసాయిదా ప్రశ్నావళి'ని వకుళాభరణం కమిషన్ ప్రభుత్వానికి సమర్పించింది. గత ఆగస్టు 31న వకుళాభరణం కమిషన్ పదవీ కాలం ముగియడంతో సర్కార్ కొత్తగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. స్థానిక సంస్థల్లో కోటా పెంపుపై ఇప్పటికే రెండు కమిషన్లు నివేదికలు సమర్పించినప్పటికీ.. ప్రభుత్వం తాజా కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా ప్రకటించడం, విధివిధానాలు జారీ చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించడంతో గత కమిషన్లు చేసిన అధ్యయనాలు అటకెక్కినట్లే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో తుమ్మల, బలరాం నాయక్, పొంగులేటి, కోమటిరెడ్డి, వీహెచ్, ఉత్తమ్, మహేశ్‌కుమార్ గౌడ్ దీపాదాస్ మున్షీ, సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కేశవరావు, గీతారెడ్డి తదితరులు

మా జోలికొస్తే ఊరుకోం

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టాలని చూస్తున్నారు. కొందరు సన్నాసులు మన వాళ్ల ఇంటికి వస్తామన్నారు. కానీ మనవాళ్లే వాళ్ల ఇంటికి వెళ్లారు. ఇంటికి రమ్మన్నవాడికి చింతపండు అయినంక దాడికి వచ్చారని అంటున్నాడు. మరి ఇంటికి ఎందుకు రమ్మనాలి? .. .. దానికి పిలవాల్నా'' అని పేర్కొన్నారు. తమ మంచితనాన్ని చేతగానితనంగా తీసుకుని ఎవరైనా తమ జోలికి వస్తే.. వీపు చింతపండు అవుతుందని వ్యాఖ్యానించారు. పీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సౌమ్యుడేనని.. కానీ ఆయన వెనుక తాను ఉన్నానని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తలను కాపాడుకుంటామని.. పార్టీని, ప్రభుత్వాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళతామని చెప్పారు. టీపీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.



ఆదివారం గాంధీభవన్‌కు ర్యాలీగా వస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్

పదేళ్లు అధికారంలో ఉంటాం..

కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌పై పార్టీ గురుతర బాధ్యతను పెట్టిందని రేవంత్ అన్నారు. ''మా ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మీ ఎన్నికలు రాబోతున్నాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ ఎన్నికలు వస్తాయి. ఈ ఎన్నికల్లో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యతలను నేను, మహేశ్‌గౌడ్ తీసుకుంటాం. మా ఎన్నికల కంటే ఎక్కువగా మీ ఎన్నికల కోసం పని చేస్తాం. మీరు గెలిస్తేనే మేం గెలిచినట్టు, కాంగ్రెస్ పార్టీ గెలిచినట్టు. స్థానిక ఎన్నికల్లో విజయానికి పునరంకితమవుదాం ''అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడు, నాలుగు నెలల్లో కులగణన పూర్తవుతుందని.. ఆ తర్వాత స్థానిక ఎన్నికలు జరుగుతాయని రేవంత్ చెప్పారు. గతంలో పదేళ్లు టీడీపీ, ఆ తర్వాత పదేళ్లు కాంగ్రెస్, మళ్లీ పదేళ్లు టీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయని.. ఇదే పద్ధతిలో మరో పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెప్పారు.

ఆ ఎన్నికలు ఫైనల్స్

2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సెమీఫైనల్స్‌లో లభించిన విజయం మాత్రమేనని రేవంత్ అన్నారు. ''2029లో ఫైనల్స్ జరగబోతున్నాయి. ఆ ఎన్నికల్లో ఢిల్లీ గద్దెపై కాంగ్రెస్ జెండా ఎగరాలి. మోదీని ఓడించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలి. అప్పుడే మనం ఫైనల్స్‌లో గెలిచినట్టు. తెలంగాణ నుంచి ఆ ఎన్నికల్లో 15 మందిని కాంగ్రెస్ ఎంపీలుగా గెలిపించాలి. అప్పటివరకు ఎవరూ విశ్రమించొద్దు''అని పిలుపునిచ్చారు.

రాజీనామా చేస్తానన్న వ్యక్తి ఎక్కడ?

తాను టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక ఇంద్రవెల్లిలో సమరశంఖం పూరించానని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా నేతలను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తెచ్చేందుకు పనిచేశానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆరు గ్యారంటీల అమలు ప్రారంభించామన్నారు. 'దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఒకేసారి రూ.18వేల కోట్లు రుణమాఫీ చేశాం. కాంగ్రెస్ రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న సన్నాసి ఎక్కడ? కావాలంటే వివరాలు పంపిస్తా..'అని రేవంత్ వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొడితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పానని.. చెప్పినట్టుగానే ఇప్పటికే 65వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

దేశానికి ఒలింపిక్స్ బంగారు పతకం తెస్తాం!

క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో దేశం తరఫున బంగారు పతకాన్ని తెచ్చే బాధ్యతను తెలంగాణ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా ఫోర్త్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

రేవంత్ నుంచి జెండా అందుకుని..

పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకునేందుకు మహేశ్‌గౌడ్ హైదరాబాద్‌లోని నార్సింగి నుంచి భారీ ర్యాలీగా అమరవీరుల స్థూపం వద్దకు వచ్చారు. అక్కడ నివాళులు అర్పించిన అనంతరం గాంధీభవన్‌కు చేరుకుని.. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి టీపీసీసీ చీఫ్ బాధ్యతలు తీసుకున్నారు. సభా ప్రాంగణంలో రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ జెండాను అందుకున్నారు.

నేను పవర్ సెంటర్‌ను కాదు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ గుర్తింపు ఇస్తుందనేందుకు తన నియామకమే నిదర్శనమని నూతన టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షుడిని అవుతానని అనుకోలేదని.. పార్టీ బాధ్యతలు చూడాల్సి వస్తుందని అప్పుడప్పుడూ రేవంత్‌రెడ్డి అంటుంటే ఊరికే అంటున్నారని భావించేవాడినని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తనకెలాంటి భేషజాలు లేవని.. తాను పవర్ సెంటర్‌ను కానని చెప్పారు. తాను ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా ఉంటానని.. తాను పీసీసీ అధ్యక్షుడిగా, రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నంత కాలం పార్టీ కార్యకర్తలపై గీత కూడా పడనీయమని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాలు నిర్మించాలన్నదే తన లక్ష్యమని, ఆ దిశలో ప్రభుత్వం కూడా సహకారం అందించాలని కోరారు. మంత్రులు వారంలో రెండు రోజులు గాంధీ భవన్‌కు రావాలని.. జిల్లాలకు వెళ్లినప్పుడు జిల్లా పార్టీ కార్యాలయాలకు వెళ్లాలని కోరారు. సీఎం రేవంత్ కూడా వీలును బట్టి నెలకు రెండు సార్లయినా గాంధీభవన్‌కు వచ్చి వెళ్లాలన్నారు. దీని వల్ల పార్టీ శ్రేణులతో మమేకం కావొచ్చన్నారు.

సౌమ్యుడినేగానీ.. కరాటే బ్లాక్ బెల్ట్ ఉంది..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని.. సోషల్ మీడియాను సోషల్‌సెన్స్ లేకుండా ఉపయోగించుకుంటున్నాయని మహేశ్‌గౌడ్ విమర్శించారు. వాటిని ఎదుర్కోవాల్సింది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని, గ్రామగ్రామానికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వివరించాలని పిలుపునిచ్చారు. తనను సౌమ్యుడని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.. ప్రజాస్వామ్యంలో తాను సౌమ్యుడినే అయినా కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఉందని చమత్కరించారు.

గాంధీభవన్‌లో 'లాల్ సలామ్'!

టీపీసీసీ కొత్త చీఫ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కమ్యూనిస్టుల తరహాలో 'లాల్‌సలామ్' వినిపించడం ఆసక్తిగా మారింది. ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి అర్పిస్తూ సాగిన పాటలో 'లాల్‌సలామ్' అనే చరణం ఉంది. ఇది విని కొందరు కాంగ్రెస్ ఆఫీసులో కమ్యూనిస్టు పాట అంటూ చమత్కరించారు.

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ప్రసంగిస్తున్న సమయంలోనే మంత్రి శ్రీధర్‌బాబు వేదిక మీదకు వచ్చారు. ఆయనకు స్వాగతం పలికిన మహేశ్‌గౌడ్.. 'అయ్యగారు వచ్చారు. ఆయన రాకతో మంత్రిమండలి సంపూర్ణంగా వచ్చినట్టయింది..' అని వ్యాఖ్యానించారు. సభలో ఎవరెవరు మాట్లాడాలనే విషయంలో గందరగోళం లేకుండా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆ జాబితాను రాసి ఇచ్చారు.

పెళ్లి ముహూర్తం పెట్టిన అయ్యగారితోనే..

మహేశ్‌కుమార్‌గౌడ్ తన పెళ్లికి ముహూర్తం పెట్టిన పురోహితుడితోనే పీసీసీ అధ్యక్ష బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పూజలు చేయించారు. ఆయన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన పూజారి కృష్ణమాచార్యులు. ఆయన, గాంధీభవన్ పూజారి శ్రీనివాసమూర్తి ఇద్దరూ కలిసి పూజలు చేశారు. ఇక గాంధీభవన్‌తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని, తన అడుగుపడని మిల్లీమీటర్ స్థలం కూడా గాంధీభవన్‌లో లేదని.. ప్రతి గోడ, కిటికీ, తలుపును తాను తాకానని మహేశ్‌గౌడ్ గుర్తు చేసుకున్నారు.

నేడు రాజీవ్ విగ్రహావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఒక్కసారే ఎక్కువ.. రెండోసారి పగటి కలే

▶ మొదటి పేజీ తరువాయి

ఐదేళ్లు ఉంటావు. మంచిగా ప్రవర్తించు. ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ఒక్కసారికే పోతుంది. రెండుసార్లు అధికారంలో ఉంటానని పగటి కలలు కనకు. అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి ముఖ్యమంత్రి పదవి ఇజ్జత్ తీస్తున్నావు. సీఎం కుర్చీ గౌరవం తగ్గిస్తున్నావు. రాష్ట్రంలో రెండు రకాల వరదలతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఒకటి వర్షాలతో వచ్చిన వరద అయితే...రెండోది చిల్లర ముఖ్యమంత్రి అబద్ధాల వరద. మోరీల కంపును మించిపోయింది ముఖ్యమంత్రి నోటి కంపు. ప్రభుత్వంలో ఉన్నాననే సోయి..ముఖ్యమంత్రి కుర్చీ మీద కూర్చున్నా అనే ఇంగితం లేక మాట్లాడుతున్నాడు. పదే పదే నా పొడుగును గురించి దుర్భాషలాడుతున్నావు. నేను పొడుగే. తెలంగాణ ఉద్యమం నన్ను మరింత ఎత్తుకు చేర్చింది. నీ బుద్ధి కురుచ. నీ చరిత్ర కురుచ. నీ భాష కురుచ. నీ కురుచతనం వల్ల నీకు కలిగిన ఆత్మనూన్యత వల్ల పదేపదే నా పొడుగు గురించి మాట్లాడుతున్నావు. నేను తాటి చెట్టంత ఎదిగిన. నువ్వు వెంపలి చెట్టంత కూడా ఎదగలే. నిన్ను లిల్లీపుట్ అని నేను అనలేనా. సన్నాసి అని నేను అనలేనా.. నా ఎత్తు ఎంత ఉంటే ఎందుకు. ఇప్పటికీ 20 సార్లు మాట్లాడివ్ నా ఎత్తు గురించి'అని తీవ్రస్థాయిలో హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

రుణమాఫీ ఎక్కడ అయిందో చెప్పు...

'రుణమాఫీ పూర్తి చేశా అని దేవుళ్ల మీద ఒట్లు పెట్టి అబద్ధాలు చెప్పినవ్. రుణమాఫీ అయ్యిందని నిరూపిస్తావా? కొండారెడ్డిపల్లి చౌరస్తా లేదా మా సిద్దిపేట వెంకటాపురం పోదామా? వెంకటాపురం గ్రామంలో 122 మంది ఉంటే.. 82 మందికి కాలేదు. రుణమాఫీ విషయంలో సీఎంకు, వ్యవసాయ శాఖ మంత్రి మాటల మధ్య తేడాలున్నాయి. రెండు లక్షలపైన మిత్తి ఉంటే కట్టిన వాళ్ల లిస్ట్ పంపుతున్నానని, దమ్ముంటే వాళ్లకు మాఫీ చెయ్యి అని ఆ వివరాలు హరీశ్‌రావు వెల్లడించారు.

గాంధీభవన్ ఆదేశాలను పాటిస్తాం

పార్టీ కార్యకర్తలను సముచితంగా గౌరవిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పరంగా గాంధీభవన్ నుంచి వచ్చే ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని, ముఖ్యమంత్రి సహా యావత్ మంత్రిమండలి ఇందుకు కట్టుబడి ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సభలో భట్టి మాట్లాడారు. సామాజిక న్యాయం జరిగేది కాంగ్రెస్ పార్టీలోనేనని.. ఇందుకు మహేశ్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించడమే నిదర్శనమని పేర్కొన్నారు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ కారణంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని.. కార్యకర్తలను సముచితంగా గౌరవిస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే బాధ్యతలను కార్యకర్తలు తీసుకోవాలన్నారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి: దీపాదాస్‌మున్షీ

పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పనిచేయాలని కోరారు.

మరింత బలోపేతం చేయాలి: ఉత్తమ్

కాంగ్రెస్ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని చెప్పేందుకు మహేశ్‌గౌడ్ నియామకమే నిదర్శనమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కార్యకర్తల శ్రమ, త్యాగాలతోనే తాము పదవుల్లో ఉన్నామని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి సీఎం పరామర్శ

చిన్నచింతకుంట: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల కన్నుమూశారు. ఈక్రమంలో చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరయ్యారు. మధుసూదన్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా సీఎం వెంట మంత్రి జూపల్లి, చిన్నారెడ్డి, మల్లురవి ఉన్నారు.

సీఎం రేవంత్ ఇంటి సమీపంలో బ్యాగు కలకలం

బంజారాహిల్స్ (హైదరాబాద్): సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి సమీపంలో ఆదివారం ఓ గుర్తుతెలియని బ్యాగు కనిపించడం కలకలం రేపింది. జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్ 36లోని రంగోలి స్టోర్ నుంచి సీఎం ఇంటికి వెళ్లేదారిలో ఈ బ్యాగును సీఎస్‌డబ్ల్యూ (సిటీ సెక్యూరిటీ వింగ్) అధికారులు గుర్తించారు. విషయం తెలిసిన పోలీసులు వెంటనే వెళ్లి.. ఆ బ్యాగ్‌ను పరిశీలన కోసం అక్కడి నుంచి తరలించారు. ఇది సీఎం నిత్యం ప్రయాణించే మార్గం కావడం గమనార్హం. బ్యాగ్‌ను పరిశీలించిన అధికారులు అందులో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని గుర్తించినట్లు పోలీసువర్గాలు చెప్తున్నాయి. కానీ అధికారికంగా ఏ ప్రకటనా చేయకుండా గోప్యత పాటిస్తున్నారు.

'చరిత్రను తుడిచివేసే ప్రయత్నం'లో

భాగస్వామిని కాలేను

- సెప్టెంబర్ 17న జరిపే 'ప్రజాపాలన' దినోత్సవానికి హాజరు కాను
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: చరిత్రను తుడిచివేసే తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వామిని కాలేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం ప్రజల దృష్టిని మరల్చడమేనని అన్నారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. 'సెప్టెంబర్ 17న ప్రతిపాదిత ప్రజాపాలనా దినోత్సవం కోసం ఆహ్వానం పంపినందుకు ధన్యవాదాలు. అయితే ఇంతటి పవిత్రమైన, స్ఫూర్తిదాయకమైన రోజును, వేలాదిమంది త్యాగాల ఫలితమైన విమోచన దినోత్సవానికి పేరుమార్చి.. చరిత్రలో ఏమీ జరగలేదన్నట్టుగా, పరిపాలన నియంత రాజు నుంచి ప్రజాస్వామ్యానికి మారడం మాత్రమే జరిగిందన్నట్టుగా చెప్పడం వాస్తవ చరిత్ర నుంచి ప్రజల దృష్టిని మరల్చడమేనని అర్థమవుతోంది. దీంతోపాటుగా బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహించినట్టవుతోంది. రజాకార్ల హింసకు వేలమంది ప్రాణాలు కోల్పోయిన సంగతి ఈ గడ్డపై పుట్టిన బిడ్డగా మీకు తెలుసు. వీరుల వీరోచిత పోరాటం, నిస్వార్థ త్యాగం, హృదయ విదారక పరిస్థితులను ఎదుర్కొనడం, బలిదానం కావడం ఇదే మన తెలంగాణ చరిత్ర. అందుకే సెప్టెంబర్ 17 నాడు.. ఆ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రస్తుత తరానికి మన పెద్దల ధైర్య, సాహసాలను తెలియజేసి జాతీయభావన కల్పించాల్సిన అవసరం ఉంది. విమోచన చరిత్రను వారికి అందజేయాల్సిన బాధ్యత మనపై ఉంది. అయితే గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17 నాడు తెలంగాణ వీరుల త్యాగాలను స్మరించుకునేలా, వారికి ఘనంగా నివాళులు అర్పించేలా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఘనంగా, అధికారికంగా నిర్వహిస్తోంది. అందుకే వాస్తవ, ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో నేను భాగస్వామిని కాలేను. సెప్టెంబర్ 17వ తేదీ.. అత్యంత ప్రాధాన్యం కలిగిన రోజుగా మీరు గుర్తించి కార్యక్రమాన్ని నిర్వహించాలనుకోవడం సంతోషకరం. సమీప భవిష్యత్‌లో వాస్తవాలను అర్థం చేసుకొని ఈ చరిత్రాత్మకమైన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గుర్తిస్తారని నేను బలంగా విశ్వసిస్తున్నాను' అని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

విమోచన దినంపై కాంగ్రెస్ వైఖరేంటి?: బండి సంజయ్



సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న కేంద్రమంత్రి సంజయ్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు జై తెలంగాణ అని నినదించి ఇపుడు ఎందుకని విమోచన దినోత్సవం జరపడం లేదో సమాధానం చెప్పాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. నిజాం నవాబు, రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన అమరవీరుల విశేషాలను తెలియజేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కేంద్ర సాంస్కృతిక, హోంశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రతీ ఒక్కరు చూడాలని భావితరాలకు నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆకృత్యాల వల్ల ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు, అవమానాలు పడ్డారో, ఏయే ప్రాంతాల్లో ఉద్యమాలు జరిగాయో ఫొటో ఎగ్జిబిషన్ తెలియజేస్తుందని చెప్పారు. గతంలో ఉన్న రజాకార్ల దళం నేడు ఎంఐఎం పార్టీగా మారిందని అలాంటి దళాన్ని నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పొగుడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ సమైక్యదినం అంటే కాంగ్రెస్ వాళ్ల ప్రజాపాలన అంటున్నారని ప్రజావంచన దినోత్సవం అని పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. పాఠ్యాంశాల్లో తెలంగాణచరిత్ర చేర్చాలన్న ఆలోచన త్వరలో ఫలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్. చింతల రామచంద్రారెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పీఎల్.శ్రీనివాస్ నగర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆ ముగ్గురే పెద్ద సన్నాసులు

సీఎం రేవంత్ గురించి నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సాక్షి, హైదరాబాద్: నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, లేదంటే తెలంగాణ ప్రజలు నాలుక కోస్తారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాజీమంత్రి హరీశ్‌రావును హెచ్చరించారు. రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులే పెద్ద సన్నాసులని ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇంట్లో కూర్చోబెట్టినా బుద్ధి రాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తే ఆయన గుండెల్లో పడుకుంటా అన్న హరీశ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 'గతంలో మీ మామ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తా అని చెప్పి మాట తప్పాడు. మీ మామ గుండెల్లో నిద్రపో. రాష్ట్రంలో రుణమాఫీ చేసి రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదే. ఈసారి సిద్దిపేటలో, మెదక్‌లో ఎక్కడ నిలబడ్డా హరీశ్‌ను ప్రజలు చిత్తుగా ఓడగొడతారు. మరోసారి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త' అని బీర్ల ఐలయ్య హెచ్చరించారు.

క్లుప్తంగా...

29న ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల కేంద్ర సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను తెలంగాణ హైకోర్టు ఆమోదించిందని ఆ సంఘం నేత డాక్టర్ నరహరి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించిన వివరాలివి. ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది. ఈనెల 16 నుంచి 19 వరకు నామినేషన్ల స్వీకరణ, 20వ తేదీన చెల్లుబాటయ్యే నామినేషన్లను ప్రదర్శిస్తారు. 21న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉస్మానియా వైద్య కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ గెస్ట్ హౌస్‌లో పోలింగ్ జరుగుతుంది.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ: ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి హాని జరిగినా, సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీదే బాధ్యత అని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే తొక్కి పడేస్తాం.. అంటూ సీఎం వ్యాఖ్యానించారని, ఇదేనా ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి కుట్రలో సీఎం రేవంత్ ప్రమేయం ఉందని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం ఒకటే పార్టీలో ఉంటూ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ పెట్టారన్నారు. డీజీపీ, సీపీ, సీఎం.. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడంలో తీరిక లేకుండా ఉన్నారని శ్రీనివాస్ ఎద్దేవా చేశారు

20న కలెక్టరేట్ల ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు



ముషీరాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కులగణన చేపట్టాలని కోరుతూ ఈ నెల 20న ఛలో కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన వివిధ బీసీ సంఘాల ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20% నుంచి 42%నికి పెంచాలని, గత 3 సంవత్సరాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 4,500 కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కులగణన చేయడం లేదని మండిపడ్డారు.


మల్లారెడ్డి ఆసుపత్రి ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్‌మెంట్‌ను రద్దు చేయండి

- సర్కార్‌కు మెడికల్ స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: డీమ్డ్ యూనివర్సిటీ పేరిట తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తున్న మల్లారెడ్డి మెడికల్, డెంటల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రుల ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్‌మెంట్‌ను రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. డీమ్డ్ యూనివర్సిటీల వల్ల స్థానిక విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని వాటిని అడ్డుకోవాలని కోరుతూ వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి రవి ప్రసాద్, తదితరులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మల్లారెడ్డితో పాటు అపోలో, సీఎంఆర్, ప్రతిమ, ఆర్వీఎం మెడికల్ కాలేజీలు కూడా డీమ్డ్ యూనివర్సిటీ స్టేటస్ కోసం యూజీసీకి దరఖాస్తు చేసుకున్నాయని, ఆయా కాలేజీలకు ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని రకాల ప్రోత్సాహాలను నిలిపివేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలకు డీమ్డ్ హోదా ఇవ్వకుండా యూజీసీని అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర హామీ ఇచ్చారు.

ఓపీఎస్‌పై నిర్ణయం తీసుకోవాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఈనెల 20న జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుకు నిర్ణయం తీసుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఓపీఎస్‌పై నిర్ణయం తీసుకున్నాయని, తెలంగాణలో కూడా నిర్ణయం తీసుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



నాడు సాగర్.. నేడు టైగర్..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టినప్పుడు మా గ్రామం (సూర్యాపేట) ముంపునకు గురవుతుందని అక్కడి నుంచి పంపించారు. ఇక్కడికొచ్చి 60 ఏళ్లు అవుతోంది. అప్పుడు చెట్లు, రాళ్లు రప్పలే ఉన్న ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్నాం. గొడ్డుచాకిరీ చేస్తే ఊరికి ఇప్పుడో రూపం వచ్చింది. భూమిని బాగు చేసుకొని, వ్యవసాయం చేస్తూ బతుకుతున్నాం. ఇప్పుడు మళ్లీ పొమ్మంటున్నారు. ఎక్కడికెళ్లాలి

75 ఏళ్ల ముత్తమ్మ, పాగిళ్ల గ్రామం



ఊరిని వదలం.. ఎక్కడికీ వెళ్లబోమని టైగర్ జోన్‌లోని పాగిళ్ల గ్రామస్తుల స్పష్టీకరణ

నాడు సాగర్ ముంపు పేరుతో ఇక్కడికి పంపించారు

ఇప్పుడు పులుల సంరక్షణ పేరుతో మరో చోటికి పొమ్మంటారా అంటూ ఆవేదన

అప్పట్లో ఇక్కడ మొత్తం అడవే. అందులోనే తిరిగాం. అందులోనే ఉన్నాం. మాపై ఏ జంతువూ దాడి చేయలేదు. ఐదు ఎకరాల భూమిని బాగు చేసుకొని బతుకుతున్నాం. సాగర్ వెనుక జలాలకు మోటార్లు పెట్టి, కిలో మీటర్ల పొడవునా పైపులైన్లు వేసుకొని పంటలు పండించుకుంటున్నాం. ఒక్కొక్కరికి రూ.15 లక్షల వరకు ఖర్చయింది. ఇప్పుడు పులుల పేరుతో పొమ్మంటున్నారు. ఇక్కడి నుంచి మేం వెళ్లిపోతే అవన్నీ ఇస్తారా?

మేకల పిచ్చయ్య, పాగిళ్ల గ్రామం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని నల్లగొండ జిల్లా చందంపేట మండలం పాగిళ్ల గ్రామానికి చెందిన ప్రజలందరిదీ ఒకటే ఆవేదన. ఇప్పుడు పులుల సంరక్షణ పేరుతో తమను పంపించాలని చూస్తున్నారని వాపోతున్నారు. తాము ఎక్కడికీ వెళ్లేది లేదని, గ్రామాన్ని వదిలేది లేదని స్పష్టం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..దేవరకొండకు 60 కిలోమీటర్ల దూరంలో అడవి లోపల ఉండే పాగిళ్ల గ్రామాన్ని జాతీయ పులుల సంరక్షణ సంస్థ (ఎన్‌టీసీఏ) స్వచ్ఛంద గ్రామ తరలింపు కార్యక్రమం (వీవీఆర్‌పీ) కింద మైదాన ప్రాంతానికి తరలించేందుకు కసరత్తు ప్రారంభించింది. నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో వాటి సంరక్షణతో పాటు అటవీ ప్రాంతంలో ఉన్న ప్రజలకు మెరుగైన జీవన స్థితిగతులను కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు ఇటీవల గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. దేవరకొండ సమీపంలోని ముదిగొండ వద్ద పునరావాసం కల్పిస్తామని, యూనిట్‌కు (భార్యాభర్తలు ఒక యూనిట్, 18 ఏళ్లు దాటి, వివాహం కాని వారు ఒక యూనిట్‌గా) రూ.15 లక్షలు.. లేదంటే వారికున్న మేరకు భూమి ఇస్తామని చెబుతున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రోడ్లు, ఇతర అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్నారు.

500 కుటుంబాలు.. 2 వేల జనాభా

పాగిళ్ల గ్రామంలో ప్రస్తుతం దాదాపు 2 వేల జనాభా ఉండగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడి రైతులు నాగార్జునసాగర్ వెనుక జలాల నుంచి దాదాపు 5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసుకొని దాదాపు 2 వేల ఎకరాల్లో పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇక్కడ మిర్చి, పత్తి అధికంగా సాగవుతుండటంతో పక్క గ్రామాల నుంచి కూడా కూలీలు ఇక్కడికి వచ్చి పనులు చేసుకుంటున్నారు. ఇప్పుడు గ్రామాన్ని ఖాళీ చేయమంటుండడంతో అందరి పరిస్థితీ అయోమయంగా మారింది.

వారు వెళతామంటేనే పంపిస్తాం

కేంద్ర ప్రభుత్వం టైగర్ రిజర్వులో ఉన్న ప్రజలకు మెరుగైన జీవనం కల్పించేందుకు, వన్యమృగాలను సంరక్షించేందుకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. బలవంతంగా ఎవరినీ పంపించదు. వారు వెళతామంటేనే పంపిస్తారు. ఈ పథకం గురించి వారికి తెలియజేయాలనే సమావేశం పెట్టాం. ఇక్కడి ప్రజలు ఒప్పుకుంటేనే ప్రభుత్వానికి తెలియజేస్తాం.

– పి.రాజశేఖర్, నల్లగొండ జిల్లా అటవీశాఖ అధికారి

..బలోపేతానికి రూ. 4,944 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

సెంటర్లు, కొత్త ఉస్మానియా, టిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పరికరాలు, ఆరోగ్య కార్డులు, పీఎంయూలు, కేన్సర్ కేర్‌లపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతోంది.

డయాగ్నొస్టిక్ సేవలకే అత్యధికం

టి–డయాగ్నొస్టిక్ సేవల బలోపేతానికి వైద్య ఆరోగ్యశాఖ అత్యధికంగా రూ. 1,044 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులోభాగంగా మరో 60 మినీ హబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో హబ్‌కు రూ.10 కోట్ల చొప్పున రూ.600 కోట్లు కేటాయించనుంది. అలాగే ప్రతీ బోధనాసుపత్రిలో ఒక ఎంఆర్‌ఐ ఏర్పాటుకు మొత్తం రూ.444 కోట్లు ఖర్చు చేయనుంది. రెండో ప్రాధాన్యంగా ప్రభుత్వం ట్రామా కేర్ సెంటర్లపై దృష్టిసారించింది. అందుకోసం రూ. 921 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో కొత్తగా 109 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. 35 ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు సహా నిమ్స్ పరిధిలో ఇవి ఏర్పాటు కానున్నాయి.

పరికరాలకు రూ.750 కోట్లు

టిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అత్యాధునిక పరికరాల కోసం రూ.750 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు టిమ్స్‌లు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పరికరాల కోసం రూ.550 కోట్లు ఖర్చు చేస్తారు. సనత్‌నగర్ టిమ్స్‌లో రూ.50 కోట్లతో స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్



ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేస్తారు. అలాగే గచ్చిబౌలి టిమ్స్‌లో నెఫ్రాలజీ, యూరాలజీలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను రూ.150 కోట్లతో ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని 35 జీజీహెచ్ ఆసుపత్రుల్లో ఒక్కోచోట రూ.350 కోట్లతో 30 పడకలతో డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్లను నెలకొల్పుతారు.

మరికొన్ని నిర్ణయాలు...

- కొత్తగా 108 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు రూ. 54 కోట్లు
- ఆరోగ్య మహిళ కార్యక్రమం సహా ఎంసీహెచ్ సేవలను బలోపేతం చేస్తారు. ప్రస్తుతం 376 కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమాలు జరుగుతుండగా, వాటిని వెయ్యికి పెంచుతారు. అందుకోసం రూ.300 కోట్లు ఖర్చుచేస్తారు. రూ. 10 కోట్ల వ్యయంతో 10 నియోనాటల్ అండ్ పీడియాట్రిక్ ఐసీయూలను ఏర్పాటు చేస్తారు. అలాగే ప్రస్తుతం ఉన్న 44 యూనిట్లను ఆధునీకరిస్తారు.
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో రూ. 11 కోట్లతో కొత్తగా ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటు.
- 35 జీజీహెచ్‌ల్లో వాస్క్యులర్ సెంటర్ల ఏర్పాటు. ఒక్కో సెంటర్‌కు రూ. 1.37 కోట్ల చొప్పున రూ. 49 కోట్లు.
- 35 బోధనాసుపత్రుల్లో ఎమర్జెన్సీ కేర్ ట్రైనింగ్ కోసం సిములేషన్ లేబొరేటరీలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో సెంటర్‌కు రూ.7 కోట్ల చొప్పున రూ. 245 కోట్లు కేటాయిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్స్ కోసం రూ.510 కోట్లు కేటాయిస్తారు. అందులో 10 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ కోసం రూ.180 కోట్లు, 10 డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ కోసం రూ.70 కోట్లు, 10 వాటర్ టెస్టింగ్ ల్యాబ్స్ కోసం రూ.160 కోట్లు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఆధునీకరణ కోసం రూ. 100 కోట్లు కేటాయిస్తారు.
- హైదరాబాద్‌లోని సనత్‌నగర్, ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రులు సహా నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్‌లలో ఆర్గాన్ రిట్రీవల్ అండ్ స్టోరేజ్ సెంటర్ల కోసం రూ.30 కోట్లు కేటాయిస్తారు.
- కోక్లియర్ ఇంప్లాంట్ సెంటర్లను రూ.79 కోట్లతో నెలకొల్పుతారు.
- కొత్త ఉస్మానియా ఆసుపత్రిలో పరికరాల కొనుగోలుకు రూ. 250 కోట్లు ఖర్చు చేస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ కార్డులు, ప్రోగ్రాం మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ)ల కోసం రూ.180 కోట్లు వ్యయం చేస్తారు.
- రూ. 165 కోట్లతో డీ సెంట్రలైజ్డ్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు.

ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి భట్టి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం

సాక్షి, హైదరాబాద్: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 18 నుంచి 21 వరకు మెక్సికో దేశం న్యూవోలియోన్‌లోని మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకావాల్సిందిగా భట్టి విక్రమార్కను నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. నోబెల్ శాంతి, ప్రపంచ శాంతి పురస్కార గ్రహీతల విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో పేర్కొన్నారు. ప్రపంచ సమస్యల పరిష్కారానికి వ్యూహాలు, కార్యాచరణను ఈ సమా వేశంలో రూపొందిస్తారని తెలిపారు.

గుజరాత్‌కు భట్టి..

గుజరాత్ గాంధీనగర్‌లోని మహాత్మ మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు జరుగుతున్న నాలుగో గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ అండ్ ఎక్స్‌పో (ఆర్‌ఈ ఇన్వెస్ట్ 2024)లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొంటున్నారు. సదస్సులో పాల్గొనేందుకు భట్టి ఆదివారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయం నుంచి గుజరాత్‌కు బయలుదేరి వెళ్లారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌లో 'కవచ్ 3.2' రక్షణ వ్యవస్థ

భవిష్యత్తులో కవచ్ 4.0 రానుందన్న దక్షిణమధ్య రైల్వే జీఎం



ఆదివారం సికింద్రాబాద్- ఉందానగర్ సెక్షన్‌లో 'కవచ్ 3.2' రక్షణ వ్యవస్థ పనితీరును పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్ : రైళ్లు ఢీకొనకుండా ప్రయాణికుల భద్రతకు భరోసాను కల్పించేవిధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్ 3.2'రక్షణ వ్యవస్థ పనితీరును దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదివారం సికింద్రాబాద్–ఉందానగర్ సెక్షన్‌లో పరిశీలించారు. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో కవచ్ 3.2 వెర్షన్ అమలు తీరుతెన్నులను తనిఖీ చేశారు. ఆయన వెంట దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ సౌరభ్ బందోపాధ్యాయ, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్, చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ వీఎస్ఎం.రావు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా కవచ్ టవర్స్, ట్రాక్ సైడ్ పరికరాలు, సిగ్నలింగ్ వ్యవస్థ, కవచ్‌తో ముడిపడిన వివిధ సాంకేతిక వ్యవస్థల పనితీరును జీఎం క్షుణ్ణంగా పరిశీలించారు. ఎదురుగా వచ్చే రైలును గుర్తించినా బ్రేక్ వేయడంలో లోకో పైలట్ విఫలమైతే ఆటోమేటిక్ బ్రేక్స్ అప్లికేషన్ ద్వారా నిర్దేశిత వేగ పరిమితుల్లో రైలును నిలిపేందుకు లోకో పైలెట్‌కు కవచ్ వ్యవస్థ సహాయం చేస్తుంది. ప్రతికూల వాతావరణంలో రైలును సురక్షితంగా నడిపేందుకు కూడా ఈ వ్యవస్థ సహాయ పడుతుంది. ఈ తనిఖీల సందర్భంగా బ్లాక్ సెక్షన్‌లలో, స్టేషన్లలో రన్నింగ్ లైన్లలో రైళ్లు ఢీకొనడాన్ని నివారించడానికి ఇండిపెండెంట్ సేఫ్టీ అసెస్సర్ ద్వారా కవచ్ సిస్టమ్ రూపొందిందని చెప్పారు. అత్యున్నతస్థాయి సేఫ్టీ ఇంటిగ్రిటీ లెవల్–(ఎస్.ఐ–ఎల్4) సర్టిఫికెట్ కూడా పొందిందని వివరించారు. ఇది ప్రమాదంలో సిగ్నల్ పాస్ కాకుండా నివారిస్తుందని, తద్వారా రైలు కార్యకలాపాల భద్రతకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో దక్షిణమధ్య రైల్వేజోన్ కవచ్ 4.0 వెర్షన్‌కు మారనున్నట్లు తెలిపారు.

- ఉందానగర్ రైల్వేస్టేషన్‌ను కూడా జీఎం తనిఖీ చేశారు. ప్రయాణికుల సదుపాయాలతోపాటు స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. కవచ్ సిస్టమ్ కోసం ఏర్పాటు చేసిన భద్రతాపరమైన ఇన్‌స్టలేషన్‌లను తనిఖీ చేశారు. భవిష్యత్తులో ప్రయాణికుల అవసరాలు, డిమాండ్ మేరకు ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు.

ఇంటర్ నుంచి వర్సిటీ దాకా...

▶ మొదటి పేజీ తరువాయి

కలిపి కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ సహా, పలువురు విద్యావేత్తలను బోర్డులో చేర్చింది. అయితే, ఈ బోర్డు ఇప్పటి వరకూ ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. దీనిపై యూనివర్సిటీల నుంచి వ్యతిరేకత వచ్చింది. మరోవైపు ఇంటర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకుల నియామకాన్ని పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపడుతోంది. ఇప్పటికే గ్రూప్స్, ఇతర పరీక్షలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధిలో ఉన్నాయి. అధ్యాపకులు, ప్రొఫెసర్ల నియామకం కూడా చేపట్టాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందని భావిస్తున్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపట్టడం వల్ల జాప్యం కూడా జరుగుతోందనే విమర్శలొస్తున్నాయి.

కమిషన్ పాతదే...

కాలేజీ సర్వీస్ కమిషన్ ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పట్నుంచో ఉంది. కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను గుర్తించి, కమిషన్‌కు తెలియజేస్తారు. కమిషన్ నేతృత్వంలోని కమిటీ పరీక్షలు చేపడుతుంది. అయితే 1985లో ఈ కమిషన్‌ను రద్దు చేశారు. నియామకాలన్నీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధిలోకి తెచ్చారు. మళ్లీ కాలేజీ సర్వీస్ కమిషన్‌కు ఊపిరి పోయడంతోపాటు విశిష్టమైన అధికారాలు ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు అధికారవర్గాలు అంటున్నాయి. ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో అర్హత లేని ఫ్యాకల్టీని నియమిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, ప్రైవేట్ కాలేజీల్లో పనిచేసే ఫ్యాకల్టీ అర్హతలను ఈ కమిషన్ పరిశీలించే అవకాశం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని 9 పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయాలని భావిస్తున్నారు. ఐటీఐలను కూడా ఆధునికీకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనిని దృష్టిలో ఉంచుకొని సాంకేతిక విద్య కాలేజీల్లో నియామకాలనూ ఈ కమిషన్ పరిధిలోకి తెచ్చే ఆలోచన ఉన్నట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు.

ఇంటర్‌సిటీ స్థానంలో వందే మెట్రో

▶ మొదటి పేజీ తరువాయి

మీదుగా సికింద్రాబాద్–విజయవాడ రూట్ ఉంది.

వందేభారత్ తరహాలోనే..

వందే మెట్రో కూడా వందేభారత్ రూపులోనే ఉండనుంది. బయటి నుంచి చూస్తే పెద్దగా తేడా ఉండదు. కానీ, లోపలి వ్యవస్థ మాత్రం కొంత భిన్నంగా ఉంటుంది. దీని సీటింగ్ పూర్తిగా వేరుగా ఉండనుంది. ముగ్గురు చొప్పున కూర్చునే వెడల్పాటి సీట్లను ఏర్పాటు చేశారు. సీట్ల మధ్యలో ప్రయాణికులు నిలబడి ప్రయాణించేందుకు వీలుగా లోకల్ రైళ్లలో ఉన్నట్టుగా రూఫ్ భాగంలో హ్యాండిల్స్ ఏర్పాటు చేశారు. ఈ రైళ్లలో 12 కోచ్‌లుంటాయి. మొత్తం 1,150 మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు ఉంటాయి. నిలబడి ప్రయాణించేవారితో కలుపుకొంటే మొత్తం సామర్థ్యం 3208 అవుతుంది. ఈ రైళ్లలో రిజర్వేషన్ వ్యవస్థ అమల్లో ఉండదంటున్నారు. అందుకే సీట్లకు నంబరింగ్ ఉండదు.

జీవో 33ను ఉపసంహరించుకోవాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానికత విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 33ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జీవో 33ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం మంత్రుల నివాస సముదాయం ముట్టడికి బీఆర్ఎస్వీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంపై కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతున్నారన్నారు.

ఓల్డ్ ఫర్ ఓపీఎస్ కొనసాగించాలి

ఎన్ఎంవోపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్



సాక్షి,న్యూఢిల్లీ: త్వరలో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలైన మహారాష్ట్ర, హరియాణ, జమ్మూకశ్మీర్, జార్ఖండ్, ఢిల్లీలో ఓట్ ఫర్ ఓపీఎస్ కొనసాగించాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంవోపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని సుర్జీత్ భవన్‌లో ఆదివారం జరిగిన నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఓట్ ఫర్ ఓపీఎస్‌పై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎంవోపీఎస్ జాతీయ కన్వెన్షన్‌ను డిసెంబర్ 15న ఢిల్లీలో నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్ఎంవోపీఎస్ అధ్యక్షుడు వీకే బంధు, రామాంజనేయులు, తెలంగాణ నుంచి కల్వల్ శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ సహా వివిధ రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


18 నుంచి 20 వరకు జేపీసీ వరుస భేటీలు

- వక్ఫ్ బిల్లుపై అభిప్రాయ సేకరణ చేయనున్న కమిటీ
- అనంతరం తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటన

సాక్షి, న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) బిల్లు–2024లో ప్రతిపాదించిన నిబంధనలపై చర్చించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఈ నెల 18 నుంచి వరుసగా మూడు రోజుల పాటు భేటీ కానుంది. ఇప్పటికే పలుమార్లు సమావేశమై వివిధ పార్టీలు, మతపరమైన సంస్థలు, పౌర సమాజ సమూహాలతో చర్చించి అభిప్రాయ సేకరణ జరిపిన జేపీసీ... 18 నుంచి జరిగే భేటీల్లో మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పస్మాండ ముస్లిం మహాజ్, ఆల్ ఇండియన్ ముస్లిం పర్సనల్ లాబోర్డు, ఆల్ ఇండియా సజ్జదనాషిన్ కౌన్సిల్, అజ్మీర్ ముస్లిం రాష్ట్రీయ మంచ్ వంటి వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ జరపనుంది. ఇప్పటికే కమిటీ ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, జకాత ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ వక్ఫ్‌బోర్డు వంటి సంస్థల అభిప్రాయాలను రికార్డు చేసింది. మూడు రోజుల భేటీ అనంతరం జేపీసీ బృందం దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించే అవకాశాలున్నాయి. తెలంగాణ నుంచే పర్యటన మొదలవుతుందని, ఆ తర్వాతే కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో జేపీసీ పర్యటనలు ఉండొచ్చని సమాచారం. సవరణ బిల్లులో ప్రత్యేకించి ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డుల్లో సభ్యులుగా ఉండేందుకు వీలు కల్పించే అంశాలపైనే ప్రధానంగా అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వస్తున్న విషయం తెలిసిందే.

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములందరికీ వైద్య పరీక్షలు

- వారందరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి తదనుగుణంగా వైద్యం
- ఆర్టీసీ ఉద్యోగుల పనితీరు మెరుగుపరిచేలా 'వారింటి ఆరోగ్యం'పై ఫోకస్



ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాముల ఆరోగ్యం కూడా బాగుండాలి అన్న ఉద్దేశంతో మరో గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌కు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. 15 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితితో కూడిన హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తోంది. ఈ నెల 12న ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ప్రస్తుతం 13 డిపోల్లో ఇది కొనసాగుతోంది. కార్మికులు సహా ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులందరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ఆర్టీసీ నిర్ణయించి ఒకేసారి 40 వేల మందికి సంపూర్ణ వైద్య పరీక్షలు చేయించిన విషయం తెలిసిందే. అలా రూపొందిన హెల్త్ ప్రొఫైల్ ఆధారంగా వారికి వైద్యం అందుతుండటంతో ఆకస్మిక మరణాలు తగ్గుముఖం పట్టాయి. ఇది ఆర్టీసీలో ఓ రికార్డుగా మారింది. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది.

ప్రైవేట్ సంస్థ సహకారంతో..

ఒకేసారి ఉద్యోగులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఆర్టీసీ ఆస్పత్రికి లేదు. దీంతో అప్పట్లో కాల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ ఉద్యోగులు అన్ని డిపోల్లో క్యాంపులు ఏర్పాటు చేసి 40 వేల మంది ఉద్యోగులకు దాదాపు 15 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు కూడా అదే సంస్థకు బాధ్యత అప్పగించారు. ఇప్పుడు ఉద్యోగుల జీవిత భాగస్వాములకు 15 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగుల తరహాలోనే..వీరికి కూడా వైద్య పరీక్షల్లో తీవ్ర సమస్యలున్నట్టు తేలితే వెంటనే వైద్యం కూడా అందిస్తున్నారు. ఇందుకు తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రితోపాటు నిమ్స్‌లో చికిత్సలు అందిస్తున్నారు. గతంలో దాదాపు 278 మంది ఉద్యోగులకు తీవ్ర గుండె సమస్యలున్నట్టు తేలింది. వారికి వెంటనే వైద్యం అందకుంటే వారంతా చనిపోయే పరిస్థితి ఉన్నట్టు అప్పట్లో వైద్యులు గుర్తించారు. దీంతో వారికి అవసరమైన వైద్యసాయం అందించారు. ఇందులో కొందరికి బైపాస్ సర్జరీలు కూడా నిర్వహించారు. వారిలో ఇద్దరు మాత్రం సరిగ్గా మందులు వాడకపోవటంతో చనిపోయారు. మిగతా వారి ఆరోగ్యం మెరుగుపడింది. ఉద్యోగుల ఆరోగ్యపరిస్థితి మెరుగుపడటంతో వారి పనితీరు కూడా మారిందని సంస్థ గుర్తించింది. కానీ, వారి జీవిత భాగస్వాముల ఆరోగ్యం కూడా బాగుంటే, వారు పనితీరు మరింతగా మెరుగుపడుతుందని సంస్థ భావిస్తోంది. నెలరోజుల్లో ఉద్యోగుల జీవిత భాగస్వాములందరి హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం చేసి వారిలో అవసరమైన వారందరికీ వైద్యం అందించాలని నిర్ణయించింది.



నీ సిద్ధాంతం ఎంత గొప్పదైనా కానీ, నువ్వెంత గొప్ప మేధావి అయినా గానీ ప్రయోగంలో నిలబడలేకపోతే నువ్వు, నీ మేధస్సు లెక్కలోకి రానట్లే!

– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 16 సెప్టెంబర్ 2024

ప్రపంచ వచనాలు

'పాప పుణ్యాలనేటటువంటివి/ మీ చేతుల్లో ఉన్నవి/ అయ్యా అంటే స్వర్గం/ ఒరే అంటే నరకం/ కూడల సంగమదేవా!' ఇది బసవన్న చెప్పిన ఎన్నో వచనాల్లో ఒకటి. కన్నడిగుల విశిష్ట సారస్వతం వారి 'వచనాలు'. కన్నడ ఉపనిషత్తులుగా ఇవి కీర్తినొందాయి. వీరశైవ భావధార ఉద్ధృతంగా ప్రవహించిన పన్నెండో శతాబ్దంలో ఇవి వెలువడ్డాయి. ఈ వచనకారులు ఒక్కరు కాదు, లెక్కకు మిక్కిలి. 'పారేనదికి/ ఒళ్లంతా కాళ్లు/ మండే నిప్పుకి/ ఒళ్లంతా నోళ్లు/ వీచే గాలికి/ ఒళ్లంతా చేతులు/ గుహేశ్వరా/ నీ వాళ్లకి/ ప్రతి అంగం లింగమే' అన్నాడు అల్లమ ప్రభు. ఛందస్సును అనుసరించకుండా, పాండిత్య ప్రకర్ష లేకుండా, సరళంగా, భావ ప్రధానంగా రాసిన ఈ వచనాలు అందులోని పదాల తూగు వల్ల ఒక లయను కలిగివుంటాయి. కొంతమంది శాస్త్రీయ సంగీత గాయకులు వీటిని ఆలపించడం కద్దు. మానవత్వాన్నీ, కాయక ధర్మాన్నీ ఈ వచనాలు చాటిచెప్పాయి. కులాల మధ్య, స్త్రీ పురుషుల మధ్య తేడాలను నిరసించాయి. జంగముడు ఏ కులానికి, ఏ వృత్తికి చెందినవాడైనప్పటికీ శివునిలా పూజనీయుడే; సహపంక్తి భోజనాదులకు అర్హుడే. ఈ విశాల దృక్పథంతో చెప్పినందువల్లే వచనాలు భక్తేతరుల ఆదరణనూ చూరగొన్నాయి. వీరశైవ భక్తులను 'శరణులు' అన్నారు కాబట్టి, వాళ్లు రాసింది 'శరణ సాహిత్యం' అయ్యింది. ఈ సాహిత్యాన్ని మరింతగా ప్రపంచానికి చేరువ చేసే ప్రయత్నాలను బెంగళూరులోని 'బసవ సమితి' చేస్తోంది. 173 మంది వచనకారుల ఎంపిక చేసిన 2,500 వచనాలను వివిధ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో భిన్న భాషల్లోకి అనువదింప జేస్తోంది. ఇప్పటికే అరబ్బీ, పర్షియన్ లాంటి సుమారు 30 జాతీయ, అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమైన వీటిని 2025 జనవరి కల్లా స్పానిష్, జర్మన్, జపనీస్, చైనీస్, ఫ్రెంచ్, నేపాలీల్లోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉంది.

పన్నెండో శతాబ్దంలో కళ్యాణకటకము నేలిన బిజ్జలుని కొలువులో బసవేశ్వరుడు మంత్రిగా పనిచేశాడు. వీరశైవ మతానికి ఎనలేని ప్రాబల్యాన్ని కల్పించాడు. బసవడు ఎంతటి కవియో అంతటి తాత్వికుడు. 'ఉన్నవాళ్లు/ గుళ్లు గోపురాలు కట్టిస్తారు/ లేనివాణ్ణి/ నేనేమి చెయ్యాలి?/ నా కాళ్ళే స్తంభాలు/ కాయమే కోవెల/ శిరసే బంగారు శిఖరం/ కూడల సంగమదేవా! విను/ చెడితే స్థావరం చెడుతుంది గాని/ జంగమం చెక్కుచెదరదు' అన్నాడు. బసవన్న స్థాపించిన ఆధ్యాత్మిక సంఘం 'అనుభవ మంటపం'. దానికి వేదిక ఆయన ఇల్లే. దీనికి అధ్యక్షుడు అల్లమ ప్రభు. అధ్యక్ష సింహాసనం పేరు శూన్య సింహాసనం. అనుభవ మంటపం అనే ఆలోచనే మేధా మథనానికీ, ప్రజాస్వామిక భావమార్పిడికీ ఉత్తేజాన్ని ఇచ్చేది. ఇందులో సుమారు 300 మంది శరణులు పాల్గొనేవారు. వాళ్లలో 'వీరరాగిణి' అక్క మహాదేవి సహా 36 మంది స్త్రీలు ఉండటం విశేషం. వీరిలో రకరకాల వృత్తులవాళ్లు ఉన్నారు. 'కట్టెలమ్ముకొనే మోళిగెయ మారయ్య, చెప్పులు కుట్టే మాదార చెన్నయ్య, తోళ్లు పదునుపెట్టే దోహర కక్కయ్య, బట్టలుతికే మడివాల మాచయ్య, వెదురు బుట్టలల్లే మేదర కేతయ్య, పడవ నడిపే అంబిగర చౌడయ్య...' వీళ్లు 'రామనాథా', 'సకలేశ్వరదేవా', 'అమరగుండ మల్లికార్జునా', 'సిద్ధ మల్లికార్జునా' అంటూ తమ ఇష్టదైవాలను మకుటంగా చేర్చుకొని తమ వచనాలను చెప్పారు. 'పిడకలు ఏరటంలోనే/ అయిపోతోంది బ్రతుకంతా/ ఇక నేను/ అన్నం వండేదెప్పుడు,/ తినేదెప్పుడు? కూడల సంగమదేవా' అన్నాడు బసవన్న. 'సువిశాలమైన కన్నడ సాహిత్య క్షేత్రంలో విహరిస్తుంటే వచనాల దగ్గరకు వచ్చేసరికి మనం ఒక తపోవనంలో అడుగు పెట్టినట్లుగా అనిపిస్తుంది. అక్కడ మనకు తారసపడేవారందరూ రుషులూ, సాధువులే! కల్మషంతో నిండిన మనుషుల అంతరంగాలు శుభ్రపడటానికి వారి బోధలు చాలు అనిపిస్తుంది' అంటారు ఈ వచనాల్లో కొన్నింటిని 'మాటన్నది జ్యోతిర్లింగం'గా పాతికేళ్ల క్రితమే తెలుగులోకి అనువదించిన దీవి సుబ్బారావు.

తెలుగులో మొట్టమొదట మల్లికార్జున పండితుడు 'శివతత్వ సారం'లో బసవన్నను స్తుతించాడు. పాల్కురికి సోమనాథుడు ద్విపదల్లో బసవ పురాణము రచించి వీరశైవాన్ని ప్రచారం చేశాడు. ఒక తెలుగు కవి తొలిసారిగా రాసిన స్వతంత్ర పురాణం ఇది. శివభక్తులకు శ్రీశైలం మహోజ్జ్వల సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లింది. బసవన్నకు ముందువాడని చెప్పే దేవర దాసిమయ్య శ్రీశైలం వచ్చి ఆగమాలు, పురాణాలు చదువుకొన్నాడు. అల్లమ ప్రభు శ్రీశైలంలో సమాధి నొందాడు. అక్క మహాదేవి శ్రీశైల కదళీవనంలో కాలం గడిపింది. 'కొండల్లో కాక కంచెల్లో ఆడుతుందా నెమలి? /కొలనుల్లో కాక కాలువల్లో ఈదుతుందా హంస/ ...చెన్నమల్లికార్జునుడు కాక అన్యుల్ని తలుస్తుందా నా మనస్సు?' అంటూ తన జీవితాన్ని ఆ చెన్నమల్లికార్జునుడికే అర్పించుకుంది. 'మిణుగురులు ఎగిరితే/ నా ఆకలిదప్పులు అణగారినాయనుకొంటా/ మబ్బులు కరిగితే/ నా స్నానం కొరకు పంపిన జలమనుకొంటా/ కొండరాయి జారిపడితే/ నా తల్లో తురిమిన పూవనుకొంటా/ నా కంఠం తెగితే/ చెన్నమల్లికార్జునా!/ అది నీకర్పితమనుకొంటా' అని పాడుకుంది. ఆమె తపస్సు చేసిందని చెప్పే 'అక్క మహాదేవి గుహలు' ఏ శ్రీశైల యాత్రికుడికైనా దర్శనీయ స్థలం.

'ఆవగింజంత సుఖానికి/ సాగరమంత సంకటం/ తన్నే కోల్పోయి/ నిధిని సాధించానంటే/ అందమేముంది?/ గుహేశ్వరా' అన్నాడు అల్లమ ప్రభు. భక్తి పరవశంలో రాసినవైనప్పటికీ, అంతకుమించిన తాత్విక చింతననూ, మానవ స్వభావాన్నీ ఈ వచనాలు ఆవిష్కరించాయి. అంతేనా? ప్రతి భాషా మేలిమి సాహిత్యాన్నీ అలా పూనిక వహించి ఎల్లలు దాటించాలన్న ప్రేరణను కూడా ఇస్తున్నాయి.

కొండంచుపై యుద్ధకాల ప్రధాని!

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ ప్రధానులలో హెర్బర్ట్ హెన్రీ ఆస్క్విత్ భిన్నమైనవారు. మొదటి ప్రపంచ యుద్ధారంభ సమయంలోనూ నిమ్మళంగానే ఉన్నారాయన! ఎంతటి అత్యవసర పరిస్థితులూ, సంక్షోభాలూ ఆయన్ని వెంటబడి తరమలేకపోయాయి. 'తొందరెందుకు?' అన్నట్లే తాపీగా ఉండేవారు. నెమ్మదిగా మాట్లాడేవారు. అర్ధరాత్రి వరకు సాగే విందు వినోదాలలో కనిపించేవారు. వీధులలోని పుస్తకాల దుకాణాలలో కాలక్షేపం చేసేవారు. బాడుగ టాక్సీ ఎక్కేసేవారు. అంగరక్షకులు లేకుండానే కాలు కదిపేవారు. అలాంటి వ్యక్తి తన కంటే 35 ఏళ్లు చిన్నదైన ఒక యువతి ప్రేమలో కొండంచు పైనుంచి జర్రున జారినట్లుగా పడిపోయారు. ఆ యువతి ధ్యాసలో తలమునకలైపోయి మొదటి ప్రపంచ యుద్ధ సమయపు ఘోరమైన విపత్తులలో ఒక దానికి జీవం పోశారు!

చారిత్రక రచనల్ని కాల్పనిక సాహిత్యంగా పరిగణించటం మన ఇండియాలో సాధారణ విషయం. అయితే మనకు తెలియనిదేమిటంటే – మంత్రముగ్ధులను చేసే కల్పనతో అక్షర రూపం దాల్చిన వాస్తవ చరిత్రలు కూడా ఉంటాయని! అటువంటి రచనే రాబర్ట్ హ్యారిస్ రాసిన తాజా పుస్తకం 'ప్రెసిపిస్' (కొండ చరియ). నిజ జీవిత పాత్రలు, నిజమైన సంఘటనలు, నిజంగా లభ్యమైన లేఖలతో ఈ పుస్తకం ఉత్కంఠను కలిగిస్తూ ... 'ఇదంతా నిజమేనా లేక అల్లికలోని నేర్పరితనమా?' అనే ప్రశ్నను మీలో రేకెత్తిస్తుంది.

'ప్రెసిపిస్' హెర్బర్ట్ హెన్రీ ఆస్క్విత్ కథ. ఆస్క్విత్ 1908 నుంచి 1916 వరకు బ్రిటన్ ప్రధాని. ఆయన పేరుతోనే ఆయనకు 'ఎర్ల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ అండ్ ఆస్క్విత్' అనే బిరుదు (టైటిల్) ఉండేది. సమాజంలోని సంపన్న వర్గాలలో గొప్ప గుర్తింపు కలిగిన వెనీషియా స్టాన్లీ అనే కులీన యువతి పట్ల ఆయన తీవ్రమైన మోహావేశంతో ఉండేవారు. ఆయనకు 62. ఆమెకు 27. రచయిత చెప్పిన విధంగా, ''ఈ పుస్తకంలో ఉటంకించిన లేఖలన్నీ ప్రధాని ఆస్క్విత్ – పాఠకులు ఆశ్చర్యచకితులు అయ్యేంతగా–ప్రామాణికమైనవి. ప్రధాని ఆస్క్విత్‌కు వెనీషియా స్టాన్లీ రాసిన లేఖలు మొత్తం తొలిసారి వెలుగు చూసినవి''.

ఆయన తన లేఖల్లో ''నా ప్రియా', ''ప్రియ సఖీ'', ''ప్రియమైన ప్రేయసీ'' అని ఆమెను సంబోధించేవారు. రహస్య దౌత్య సందేశాలను, మంత్రివర్గ చర్చల వివరాలను ఆమెతో పంచుకునేవారు. విన్‌స్టన్ చర్చిల్ (అప్పటికి నేవీ ఆఫీసర్)ను, లేదా లార్డ్ కిచనర్ (ఆర్మీ ఆఫీసర్)ను ఎలా దారికి తేవాలని అనే విషయమై తరచూ ఆమె సలహాలను కోరేవారు. ఆయన ప్రతిరోజూ, తరచుగా ఒక్కరోజులోనే రెండు మూడుసార్లు ఆమెకు లేఖలు రాసినట్లు తెలుస్తోంది.


శుక్రవారాల్లో వాళ్లిద్దరూ తీరిగ్గా మధ్యాహ్నం ప్రారంభమయ్యేలా సుదీర్ఘ ప్రయాణాలను పెట్టుకునేవారు. ''తక్కిన రోజులలో, వారాంతంలో వారు తరచూ భోజనానికి, విందు భోజనాలకు కలుసుకునేవారు. అయితే వారు ఎప్పుడూ కూడా చుట్టూ ఉన్న ఇతర వ్యక్తుల మధ్యనే కలుసుకోవటం జరిగేది. వారు ఏకాంతంగా కలుసుకునే అవకాశం ఉన్న ప్రదేశాలలో మాత్రం వారి కారు కూడా ఒకటి''. దీని అంతరార్థం ఏమిటంటే – డ్రైవర్ కారు నడుపుతుండగా ఆ 1908 మోడల్ నేపియర్ కారు వెనుక భాగంలో ఆమె ''తెరలు దించాక'' వారిద్దరూ లైంగిక క్రియకు ఉపక్రమించేవారు. 30 నిమిషాల తర్వాత ఆమె తన ''స్కర్ట్‌ను సవరించుకుంటూ'' పైకి లేచేవారు.

హ్యారిస్ రాసిన ఇతర గొప్ప నవలల మాదిరిగానే 'ప్రెసిపిస్' కూడా మిలియన్‌లలో అమ్ముడు పోతుందా అనే సందేహం నాకే



బ్రిటన్ ప్రధాని హెచ్.హెచ్. ఆస్క్విత్ (1908–1916)

మాత్రం లేదు. అయితే ఆస్క్విత్ వారసుల ఖండనతో ఈ పుస్తకం వివాదాస్పదం అయింది. ఆస్క్విత్ ముని మనవడు, '3వ ఎర్ల్' బిరుదాంకితుడు అయిన రేమండ్ దీనినొక (కారులో లైంగిక క్రియను) ''అర్థం లేని'' విషయంగా కొట్టిపడేశారు. ''ఇది పూర్తిగా హాస్యాస్పదం'' అన్నారు. బహుశా వెనీషియాపై ఆస్క్విత్‌కు ఉన్న గాఢమైన మోహం – అలా జరిగేందుకే ఎక్కువ అవకాశం ఉందని – అనుకోవటానికి ఆస్కారం ఇచ్చిందా?



'ప్రెసిపిస్' ముఖచిత్రం

పుస్తకంలో హ్యారిస్ రాసిన దానిని బట్టి వెనీషియాపై ఆస్క్విత్‌కు ఎంత గాఢమైన, నిలువనివ్వనంత ప్రేమ ఉండేదంటే... కేబినెట్ మీటింగ్‌లో గలిపలీ (టర్కీలోని ద్వీపకల్పం) పైన సైనికచర్య జరిపే తీర్మానాన్ని విన్‌స్టన్ చర్చిల్ ప్రతిపాదనకు పెడుతున్నప్పుడు ఆస్క్విత్ వెనీషియాకు లేఖ రాస్తూ కూర్చున్నారు! ఆయన ధ్యాసంతా తన ప్రేమపైనే ఉంది కానీ, డార్డనెల్లెస్ జలసంధి (గలిపలీ) మీద కాదు. బహుశా అందుకే గలిపలీపై సైనికచర్య అంత ఘోరంగా విఫలం చెంది ఉంటుంది.

ఆ కేబినెట్ సమావేశం ఎలా జరిగిందనే దాని గురించి హ్యారిస్ ఎంత రసవత్తరంగా రాశారో చూడండి. ''ప్రైమ్ మినిస్టర్?'' అనే పిలుపునకు ఆస్క్విత్ తలెత్తి చూశారు. విన్‌స్టన్ ఆయన వైపే చూస్తూ – ''నేనిప్పుడు కౌన్సిల్ ముందుకు డార్డనెల్లెస్ విషయాన్ని తీసుకురావచ్చునా?'' అని అడిగారు. ''తప్పకుండా'' అంటూ, చప్పున తను రాస్తున్న లేఖను కొన్ని విదేశాంగ శాఖ కార్యాలయ టెలిగ్రామ్‌ల మధ్య దాచేశారు ఆస్క్విత్.

కానీ ఆ లేఖ తిరిగి వెంటనే ఆస్క్విత్ మదిలోకి వచ్చేసింది. ''ఆయన తన కాగితాల కుప్ప కింది నుంచి అప్పుడే ప్రారంభించిన ఆ లేఖను బయటికి లాగారు. తిరిగి రాస్తున్నప్పుడు పక్కనే ఉన్న బాల్ఫోర్ (విదేశాంగ కార్యదర్శి) నిరామయ దృష్టి పడకుండా ఒక చేత్తో లేఖను మూసి ఉంచారు. ''లేఖ రాయటం పూర్తయ్యాక మాత్రమే విన్‌స్టన్ చర్చిల్ ప్రసంగంపైకి ఆయన ధ్యాస మరలింది. అప్పటికే ఆ 'ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది అడ్మిరాలిటీ' (రాయల్ నేవీ అధిపతి చర్చిల్) తన గలిపలీ ప్రతిపాదనకు తిరుగులేని విధంగా ఆమోద ముద్ర పొందేశారు. హ్యారిస్ రాసిన దాని ప్రకారం... ''ఎవరూ ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం చేయలేదు''. ''డార్డనెల్లెస్‌పై సైనిక చర్యకు ఏకగ్రీవ ఆమోదం లభించింది'' అని ఆస్క్విత్ ప్రకటించారు. కానీ దాని వివరాలపై ఆయన మనసు పెట్టలేదని తెలుస్తోంది. ఆ విధంగా మొదటి ప్రపంచ యుద్ధపు ఘోరమైన విపత్తులలో ఒకటి జీవం పోసుకుంది.

ఆస్క్విత్‌ది గతించిపోయిన కాలం. విస్మృత ప్రపంచంలోని ఒక భాగం. తొందరెందుకు అన్నట్లుగా ఆయన తీరు ఉండేది. తాపీగా, నెమ్మదిగా ఉండేవారు. అత్యవసర స్థితులు, సంక్షోభాలు ఆయన్నెప్పుడూ తరమలేకపోయాయి. తరచూ డిన్నర్ పార్టీలకు వెళ్లే వారు. అవి అర్ధరాత్రి వరకు సాగేవి. బాడుగ టాక్సీలో వెళ్లేవారు. పుస్తకాల దుకాణాలో కాలం గడిపేవారు. అంగరక్షకులు లేకుండా కాలు కదిపేవారు. బిడియపడకుండా మద్యం సేవించేవారు.

యుద్ధం మొదలవటానికి ముందు జరిగిన ఒక సందర్భం ఇది. ''రాత్రి ఒంటి గంటకు ప్రధాని ఆస్క్విత్ ఒక క్వార్టర్ బాటిల్ బ్రాందీని దుస్తుల లోపల ఉంచుకుని తూలుతూ టాక్సీలో ఎక్కి, వెనుక కూర్చున్నారు. తబ్బిబ్బై తనను చూస్తున్న ఆ టాక్సీ డ్రైవర్‌తో నేరుగా బకింగ్ హామ్ ప్యాలెస్‌కు పోనిమ్మని చెప్పాడు. ప్యాలెస్‌లోకి వెళ్లిన కొద్ది క్షణాల్లోనే బ్రిటన్ రాజు ఐదవ జార్జి ప్రత్యక్షమయ్యారు. స్లిప్పర్స్ తొడుక్కుని, నైట్ షర్టుపై గోధుమ రంగు డ్రెస్సింగ్ గౌను వేసుకుని పూర్తి నిద్రకళ్లతో ఉన్నారాయన. ఆ స్థితిలో– కైజర్ (జర్మనీ చక్రవర్తి)కి వ్యతిరేకంగా జార్ (రష్యా చక్రవర్తి) మద్దతు కోరుతూ టెలిగ్రామ్ పంపమని ఆస్క్విత్ ఆయనను కోరారు'' అని రాశారు హ్యారిస్.

మోదీని అలా ఉంచండి. స్టార్మర్, సునాక్ (బ్రిటన్ ప్రస్తుత, మాజీ ప్రధానులు) కూడా అలా చేయటానికి వెనుకాడి ఉండేవారు. అలా వెనుకాడక పోవటమే ఆస్క్విత్ కథను ప్రత్యేకమైనదిగా చేసింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతమే లేదా?



గాజాలో ఇప్పుడు జరుగుతున్నది ఆమోదయోగ్యం కాదు. దాదాపు 12 వేల మందికి ఆశ్రయం కల్పించిన గాజాలోని ఒక పాఠశాల... ఇజ్రాయిల్ వైమానిక దాడులకు గురైంది. ఐరాస వాలంటీర్లలో ఆరుగురు కూడా ఆ దాడులలో మరణించారు. అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారు తక్షణం తమ నాటకీయ చర్యలను ఆపాలి.

– ఆంటోనియో గుటెర్రెస్, ఐరాస ప్రధాన కార్యదర్శి

మట్టి తింటున్నారు!



హైతీ తల్లులు తమ పిల్లలకు మట్టి బిస్కెట్‌లను చేసి పెడుతున్నది అవి రుచిగా ఉంటాయని కాదు. ఆకలిని చంపేస్తాయని! హైతీలో ఇంత దారుణమైన పరిస్థితులు నెలకొనడానికి సగం కారణం... యూఎస్ బలవంతంపై పాటించిన నయా ఉదారవాద వాణిజ్య విధానం ఆ దేశ వ్యవసాయ రంగాన్ని సర్వ నాశనం చేయటం!

– మోహనాద్, సామాజిక వ్యాఖ్యాత

ఇది కదా ఇన్‌ఫ్లేషన్!



నా కూతురి 4వ తరగతి స్కూల్ ఫీజు రూ.1.80 లక్షల నుంచి రూ. 2.60 లక్షలకు పెరిగింది. దాదాపు ప్రతి నగరంలోనూ స్కూలు ఫీజులు స్టాక్ మార్కెట్ కంటే వేగంగా పెరుగుతున్నాయి. దేశ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోందని సంతోషిస్తున్నాం. విద్యారంగంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం సంగతేమిటి?

– పంకజ్ అరోరా, ఇన్వెస్టర్


అవి తప్పు కాదా?!



విదేశీ గడ్డపై భారతదేశ పరువు ప్రతిష్ఠలు మంట కలుస్తున్నాయని ఆందోళ వ్యక్తం చేస్తున్న వ్యక్తులు... మన ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఎక్స్‌లో, ఎఫ్‌బీలో, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టడం మానేయాలి. మన నాయకులు బయటి దేశాలలో ఇచ్చే ప్రసంగాల కన్నా, బయటి దేశాలకు చెందిన ఈ సోషల్ మీడియా వేదికల్లో మన అధికార పక్షం పెట్టే పోస్టులే ప్రపంచవ్యాప్తంగా మన పట్ల తక్కువ భావాన్ని కలిగిస్తున్నాయి.

– మిస్ అఫ్లాతూన్, ఇన్‌ఫ్లుయెన్సర్

ఉన్న విషయమే కదా!



మన దేశంలోని మైనారిటీలకు – ముఖ్యంగా సిక్కులకు – ఏం జరుగుతోందనే దాని గురించి రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో మాట్లాడినదంతా పూర్తిగా వాస్తవం. రైతుల నిరసనల నాటి నుంచి సోషల్ మీడియాలో సిక్కుల మీద కొనసాగుతున్న ద్వేషంపై ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి చర్యా తీసుకోలేదు!

– పర్గత్ సింగ్, 'పద్మశ్రీ', 'అర్జున' పురస్కారాల గ్రహీత

ఇన్ బాక్స్

అలుపెరుగని యోధుడు

ప్రముఖ మార్క్సిస్టు –లెనినిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొల్లా వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన ఇచ్చిన స్ఫూర్తిని నేటి తరాలకు అందించడం అవసరం. 1910లో జాతీయోద్యమంలో పన్నుల నిరాకరణ ఉద్యమానికి కేంద్రమైన గుంటూరు జిల్లా పెదనందిపాడులో జన్మించారు. 1928లో మహాత్మా గాంధీ పెదనందిపాడు వచ్చినప్పుడు ఆ సభల నిర్వహణలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ వాదిగా ఉన్న ఆయన పులుపుల వెంకట శివయ్య, పోలేపెద్ది నరసింహమూర్తి, మాకినేని బసవ పున్నయ్య తదితరుల పరిచయంతో కమ్యూనిస్టుగా మారారు. 1938లో ఇచ్ఛాపురం నుండి తడ వరకు జరిగిన రైతు మహాయాత్రలో ప్రముఖపాత్ర నిర్వహించారు. అప్పాపురం ప్రాజెక్టు రైతు సమస్యలు, రొంపేరు ముంపు నివారణ, రొంపేరు బంజరు భూముల పంపకం, పొన్నూరు తాలూకా జూపూడి చర్చి భూముల పోరాటం, గుంటూరు జిల్లా రైతు కూలీల–పాలేర్ల ఊరేగింపు, జూపూడి వద్ద పోలీసుల కాల్పులకు కారణమైన పోరాటం వంటి ముఖ్య పోరాట ఘట్టాలన్నిటా ఆయనది ప్రముఖ పాత్ర.



కొల్లా వెంకయ్య

చట్టసభలలో కూడా ఆయనకు విశేష అనుభవం ఉంది. 1952లో పొన్నూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా, 1957లో ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా, 1962లో తెనాలి లోక్‌సభ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని 1967 చివరలో పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేశారు.

సీపీఐ నుండి సీపీఐ(ఎం) ఏర్పాట్లలో భాగస్వామయ్యారు. ఆ తదనంతరం కొద్దిగా కాలానికి నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాట పంథా వైపు నిలిచారు. ఆ తరువాత చారు మజుందారు ప్రధాన కార్యదర్శిగా గల సీపీఐ(ఎంఎల్)లో ఉన్నారు. పార్వతీపురం కుట్ర కేసులో జైలుశిక్ష అనుభవించారు. 1980లో 'గ్రామీణ పేదల సంఘా'న్ని స్థాపించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలలో బంజరు భూముల ఆక్రమణ, నల్లమడ ముంపు నివారణ కోసం వేలాది సంఖ్యలో గ్రామీణ పేదలు రైతులను సమీకరించి ఉద్యమాలను నిర్వహించారు. 1998లో తుదిశ్వాస విడిచేవరకూ ఉద్యమబాటలోనే నడిచిన యోధుడాయన.

– మన్నవ హరిప్రసాద్,
సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు
(నేడు కొల్లా వెంకయ్య వర్ధంతి)

మనుషుల స్వార్థంతోనే మహోపద్రవం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కొన్ని ప్రశ్నలకు సమాధానాలుండవు. అలాంటి వాటిలో వజ్ర సమానమైన ప్రశ్నలను దేవులపల్లి కృష్ణశాస్త్రి సంధించాడు. వాటిలో ఒక మౌలికమైన ప్రశ్న –

''సౌరభము లేల చిమ్ము పుష్ప వ్రజంబు?
చంద్రికలేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు గాద్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?''

ఈ మౌలిక ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం ఎంత కష్టమో, 'గతి' తప్పిన 'నైరుతి'లో ప్రకృతి మతి తప్పి ఆశ్రయించే 'రుతు' రాగాలు కూడా భిన్నంగానే ఉంటాయి. ప్రకృతి అందించిన సహజ రుతువుల్ని ప్రకృతిలో భాగమైన మానవులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఏనాడు క్రుతిమించి దోచుకోవడం ప్రారంభించారో ఆ క్షణం నుంచి ప్రకృతి కూడా వికటించి అన్యథా ప్రవర్తించడం మొదలైంది.

స్వార్థ ప్రయోజనాల కోసం, క్రుతిమించిన సంపాదన తాపత్రయంలో మానవుడు ప్రకృతి విధ్వంసకునిగా మారడం వల్ల సమాజ శ్రేయస్సుకు ముంచుకొచ్చిన ప్రమాదాన్ని గుర్తెరగడం లేదు. అందుకే ప్రకృతి తిరగబడుతోంది. ఈ ప్రకృతి తిరుగుబాటుకు దోహదం చేస్తున్నవి రెండు రకాల ప్రపంచస్థాయి బాహ్య వాతావరణ శక్తులు. అవి – పసిఫిక్ మహాసముద్ర ప్రాంతం కేంద్రంగా ప్రపంచ వాతావరణాన్నే శాసిస్తున్న 'లా నినా', 'ఎల్ నినో' దృశ్యాలు! వీటి ప్రభావం వల్లనే కొన్ని సందర్భాల్లో అతివృష్టికి, అనావృష్టికి పసిఫిక్ సముద్రం కేంద్ర స్థానంగా వాతావరణం మారుతూ ఉంటుంది. 'దిక్కు' మార్పుతో ఎల్ నినో– లా నీనాల ప్రభావంతో ప్రకృతి కూడా తన 'రుతు రాగాల' పోకడను నిర్ణయించుకుంటుంది. ఈ కారణంగానే గతి తప్పిన 'నైరుతి' దిక్కు తన దిశను మార్చుకుని అగచాట్లు పడుతోంది. అంతేగాదు, 1976 తర్వాత మొదటి సారిగా అరేబియా సముద్రంలో ఇదే సమయంలో తొలి తుపాను అత్యంత భయంకర రూపంలో చొచ్చుకు వచ్చింది. దీనికి పాకిస్తానీయులు 'ఆస్నా' అని పేరు పెట్టారు. ఇలా పసిఫిక్ తీరం ఆధారంగా ఈసారి ఎన్నడూ లేనంత భీకరంగా రెండు వాతావరణ 'మహమ్మారులు' (లా నినా, ఎల్ నినో) తీర ప్రాంత దేశాల్ని అతలాకుతలం చేస్తున్నాయి.

ఫలితంగా ఈ పరిణామానికి 'సమాధానమా' అన్నట్టు ప్రకృతి కూడా వింత పోకడలు పోతోంది. అదుపు తప్పి విరగబడుతోంది. ప్రకృతి విధ్వంసకుడైన మానవుడి ప్రవర్తన మారనంతవరకు ప్రకృతి స్పందన భీకరంగానే ఉంటుంది. ఆ భీకర దృశ్యాల మధ్యనే నేడు మనం ఉన్నాం. అందుకే ఏది 'మల్లెల వేళో, మరేది వెన్నెల మాసమో' నేటి తరం గుర్తించ లేనంతగా ప్రకృతి తిరుగుబాటుకు సిద్ధమైంది. మహాకవి కాబట్టి కోయిలమ్మ కూతనుబట్టి మల్లెల వేళను, వెన్నెల మాసాన్ని గుర్తించగలిగాడు కృష్ణశాస్త్రి. కానీ, ఏది వెన్నెల మాసమో, మరేది మల్లెలు విరబూసే మాసమో గుర్తించ లేనంతగా మానవుడు ప్రకృతి విధ్వంసకుడుగానూ తయారయ్యాడు.

రెండో మాట



ఈనాడు ప్రపంచ వాతావరణాన్ని చండ శాసన శక్తులుగా నిర్బంధిస్తున్న పసిఫిక్ మహా సముద్ర వాతావరణ శక్తులు – 'లా నినా', 'ఎల్ నినో' పన్నిన విష వలయం నుంచి భద్రంగా బయట పడగల పరిస్థితులు కనిపించడం లేదు. కనుకనే దేశ వాతావరణ పరిశోధకులు కూడా ఎవరికి వారు జాగ్రత్త పడండి తప్ప తామూ చేయగలిగిందేమీ లేదని హెచ్చరిస్తున్నారు. కవి అద్దేపల్లి... జీవితమూ, కవిత్వమూ వేర్వేరు కావని చాటుతూ –

'జీవితం నన్ను ఉక్కు గోళ్లతో రక్కితే
కారే నెత్తురే నా అక్షరాల్లో ప్రవహిస్తుంది
బతుకు నన్ను పోరాటానికి రెచ్చగొడితే
రగిలే రవ్వలే నా అక్షరాల్లో మండి పడతై' అని తన సంకల్పం ప్రకటిస్తాడు. అననుకూల పరిస్థితులు ఎదురైనప్పుడు మనసు ఎంత నిబ్బరంగా ఉండాలో ఈ ఉదాహరణలన్నీ నేర్పుతున్నాయి. వాతావరణ శాస్త్రవేత్తలు, పరిశోధకులూ చేతులెత్తేసిన పరిస్థితుల్లో సామాజికులు ఆత్మస్థయిర్యంతో ప్రకృతి విపత్తును అధిగమించడం అనివార్యం. అందుకు మానవుడు ప్రకృతి విరుద్ధంగా ముందుకు సాగి స్వార్థ ప్రయోజనాల కోసం దాన్ని దోచుకునే మనస్తత్వానికి స్వస్తి పలకడం నేర్చుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా మానవుల పోరాటం ఏ రూపంలో సాగాలో తెలంగాణ కవి వేముగంటి నడిగితే చెబుతాడు: ఆ పోరాటం –

'జీబుకోనలు దాటి చిలువ కోనలో ప్రాకి
ఎండిపోయిన భూమి గుండె నాడులు తాకి
పసిమి పచ్చికల పసిపాపలై పోరాడి'నట్లు ఉండాలి!

అలా జీవితాంతం అన్యాయానికి, సమాజంలో పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా, సామాన్య ప్రజల తరపున సర్వత్రా కొమ్ముకాసి పోరాడిన తెలంగాణ మహాకవుల స్ఫూర్తి నుంచి ధైర్య సాహసాలు నేర్చుకోవాల్సిన తరుణం ఇది. వాతావరణ శాస్త్రవేత్తలు, పరిశోధకులు పదేపదే చేస్తున్న హెచ్చరికల సారాంశమిదేనని గ్రహించాలి. జీవితం, రచనలు వేర్వేరు అనుకుంటే ఆశయసిద్ధి పక్కదారులు పడుతుంది.

శ్రీశ్రీ అన్నట్టు **'రెండు రెళ్లు నాలుగన్నందుకే, జైళ్ళు నోళ్లు తెరుస్తున్న భూమిలో/ క్షేమం అవిభాజ్యం'**. అందుకే, కత్తులు నూరుతున్న ధనిక వర్గ సమాజంలో అనునిత్యం ప్రజాపక్షం జాగరూకతతో మెలగాల్సిన అవసరం ఉంది.

abkprasad2006@yahoo.co.in

సమాజ హితమే...

మానవులను అజ్ఞాన అంధకారాల నుండి రక్షించి, వారి ఇహ, పర సాఫల్యం కోసం కృషిచేసిన మహా పురుషుడు ముహమ్మద్ ప్రవక్త (స). మానవులంతా ఒక్కటే, మనిషికి మనిషికి మధ్య ఎలాంటి వ్యత్యాసం కానీ, ఆధిక్యం కానీ లేదు. అందరూ సమానమే, అందరూ ఒక తల్లి–తండ్రి బిడ్డలే అన్నది ఆయన సందేశం. మానవ సమాజంలో మనుషుల మధ్య ఉచ్చ నీచాలకు, హెచ్చుతగ్గులకు ఎంతమాత్రం ఆస్కారం లేదు. ఆధిక్యతకు, గౌరవానికి అసలైన కొలమానం నీతి, నిజాయతీలే అన్న ఆ మహనీయుని ప్రవచనం మానవ సమానత్వానికి, సామరస్యం, సోదరభావాలకు నిలువెత్తు నిదర్శనం. సాటి మానవుల ధనప్రాణాలను హరించడం, గౌరవ మర్యాదలకు భంగం కలిగించడం, మనోభావాలను గాయపరచడం, వారి హక్కులను కాజేయాలనుకోవడం మహాపాతకమన్నారాయన.



శ్రామికుని స్వేద బిందువుల తడి ఆరకముందే అతని వేతనం చెల్లించి వేయాలన్న హితోపదేశం కార్మికలోకం పట్ల ఆ మహనీయునికి ఉన్న కరుణకు తిరుగులేని సాక్ష్యం. మహిళలను గౌరవించాలని, వారి పట్ల చులకన భావం కూడదని ముహమ్మద్ ప్రవక్త విస్పష్టంగా ప్రకటించారు. స్త్రీ మీకు జన్మనిచ్చిన తల్లి, ఆత్మీయత కురిపించే చెల్లి, ప్రేమను పంచే ఇల్లాలు. అంతేకాదు, తల్లి పాదాల కింద స్వర్గం ఉంది. ఆమెను ప్రేమించి, సేవించి మాత్రమే స్వర్గార్హత సాధించవచ్చని స్త్రీజాతి గౌరవాన్ని, ఘనతను, ఔన్నత్యాన్ని పతాక స్థాయికి చేర్చారు ప్రవక్త. 'గుడ్డివారు, చూడగలిగేవారు సమానం కానట్లే, జ్ఞానులు, జ్ఞాన విహీనులు సమానం కాలేర'ని ప్రకటించారు.

పారేనది ఒడ్డున ఉన్నప్పటికీ నీటిని వృథా చేయరాదని ఉద్బోధించారు. వృక్షసంపదను నాశనం చెయ్యకూడదని, ప్రకృతి సమతుల్యతకు, మానవాళి మనుగడకు అడవుల పరిరక్షణ అత్యంత అవసరమని పర్యావరణ స్పృహను జాగృతం చేశారు. సమస్యల వలయంలో చిక్కుకుపోయిన నేటి మానవ సమాజానికి ఆయనగారి ఉపదేశాల్లోనే పరిపూర్ణ పరిష్కారం ఉంది. ఇహలోక సంక్షేమానికి, పరలోక సాఫల్యానికి ఈరోజు నుండే ఆయన దివ్యసందేశాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

– మదీహా అర్జుమంద్
(నేడు ముహమ్మద్ ప్రవక్త జయంతి: మిలాదున్నబీ)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.త్రయోదశి ప.1.12 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.3.52 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.10.40 నుండి 12.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.36 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.57 నుండి 7.28 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.02.

ప్రైవేటుపై దృష్టి



ప్రైవేట్ స్కూళ్లలో టీచర్లపై ఆరా.. వారి అర్హతలేంటో తెలుసుకునే ప్రయత్నం

జిల్లా అధికారులకు పాఠశాలవిద్య డైరెక్టరేట్ ఆదేశాలు.. ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో సమగ్ర వివరాలు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో పని చేసే ఉపాధ్యాయుల సమగ్ర సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించింది. ఏయే విద్యార్హతలున్నాయో ఆరా తీయాలంటూ జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాలవిద్య డైరెక్టరేట్ కార్యాలయం ఇప్పటికే అంతర్గత ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. గుర్తింపు పొందిన అన్ని ప్రైవేట్ పాఠశాలల వివరాలను ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసి..అందులో పొందుపర్చాలని అధికారులు భావిస్తున్నారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఉన్నత విద్య బోధించే ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలు కూడా పరిశీలించే అవకాశం ఉందని చెప్పారు. ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుల సదస్సులో ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూళ్లలో అర్హత లేనివారు బోధిస్తున్నట్టు చెప్పారు. దీనిపై ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో వాస్తవాలు ప్రజలకు వివరించాలని సీఎం భావించినట్టు అధికారులు చెబుతున్నారు.

యూడైస్‌కూ అందించాలి

కేంద్ర ప్రభుత్వ అధీనంలోని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్)లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల డేటా ఏటా పొందుపర్చాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతులు ఏమున్నాయో ఇందులో పేర్కొనాలి. విద్యాశాఖ ఇప్పటివరకూ ప్రభుత్వ స్కూళ్లలోని వివరాలనే యూడైస్‌కు సమగ్రంగా ఇస్తోంది. ప్రైవేటు స్కూళ్ల నుంచి అన్ని వివరాలు అందడం లేదని అధికారులు చెబుతున్నారు. వివరాల కోసం ఎన్ని లేఖలు రాసినా ప్రైవేట్ స్కూళ్లు స్పందించడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని సమగ్ర వివరాలు తెప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ప్రైవేట్‌లోనే టీచర్లు ఎక్కువ

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 వేల స్కూళ్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 29 వేలు, ప్రైవేట్ 11 వేల వరకూ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1.35 లక్షల మంది ఉపాధ్యాయులు, ప్రైవేట్ స్కూళ్లలో 2 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. అయితే సర్కారీ స్కూళ్లలో 26 లక్షల మంది విద్యార్థులుంటే, ప్రైవేట్ స్కూళ్లలో 34 లక్షల మంది చదువుతున్నారు. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు తగ్గడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కనీసం మౌలిక వసతులు కూడా లేని, ఏ అర్హత లేనివారు బోధిస్తున్నా విద్యార్థులు ఎందుకు ప్రైవేట్ బాట పడుతున్నారో నివేదిక ఇవ్వాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

పర్యవేక్షణ ఉంటేనే సాధ్యం

ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా ఉపాధ్యాయుల అర్హతలను వెల్లడించే అవకాశమే లేదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. బీఈడీ అర్హతతో సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉన్నారా అనేది తెలుసుకోవాలి. దీనికి మండల స్థాయిలో ఎంఈఓ, జిల్లా స్థాయిలో డీఈఓలు దృష్టి పెట్టాలి. అయితే డీఈఓ, ఎంఈఓ పోస్టుల్లో మెజారిటీగా ఇన్‌చార్జ్‌లనే కొనసాగిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ లోపాలు వెంటాడే అవకాశం ఉందని చెబుతున్నారు.



జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



బాలకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, కౌశిక్ రెడ్డి

నిస్వార్థ నాయకుడు జిట్టా

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

భువనగిరి: ఎమ్మెల్యే కంటే ఎక్కువ గౌరవం కలిగిన వ్యక్తి జిట్టా బాలకృష్ణారెడ్డి అని, నిస్వార్థ నాయకుడని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఆదివారం యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంతకుముందు ఆయన జిట్టా సతీమణి సునీత, కుమారుడు వివేకానందరెడ్డి, కుమార్తె ఝాన్సీ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు బొమ్మాయిపల్లిలోని జిట్టా ఫాంహౌస్‌లో ఆయన చిత్రపటానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి దశదిన కర్మకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

రైతులే కాడెడ్లుగా మారి...



మరిపెడ రూరల్: మహబూ బాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన రైతులు కాడెడ్లకు బదులు బండి లాగారు. గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల పిడుగుపాటుకు ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. భారీ వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లే రహదారి కూడా వరదకు ధ్వంసమైపోయింది. దీంతో సాగుకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఎలాగైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయించుకోవాలని నిర్ణయించుకున్న రైతులు.. ట్రాన్స్‌ఫార్మర్‌ను బండిపై పెట్టి భుజాలపై బయటకు లాక్కొచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

రాక.. పోక.. డోలి మీదే!



పాడేరు: కనీస రహదారి, వంతెన సౌకర్యం లేకపోవడంతో మృతదేహాన్ని డోలి కట్టి మోసుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం దేవాపురం పంచాయతీ తుమ్మలపాలేనికి చెందిన గాదె నాగరాజు(32) వారం కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రులకు వెళ్దామంటే గ్రామానికి మూడూ కిలోమీటర్ల దూరంలో ఉన్న కానుగుచెట్టు గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దానిపై వంతెన లేదు. దీంతో గెడ్డ ఉధృతి తగ్గాక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డోలి కట్టి గెడ్డ దాటించి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా.. శనివారం మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా కానుగుచెట్టు గెడ్డ వద్దకు తీసుకొచ్చారు. మళ్లీ డోలి కట్టి నడుము లోతులో ఉన్న గెడ్డ దాటించి 3 కి.మీ. మేర కాలి నడకన గ్రామానికి తీసుకెళ్లారు.

కుమారుడికి వైద్యం చేయించలేక తండ్రి ఆత్మహత్య



సునీల్

నల్లబెల్లి: మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఏడు నెలల కుమారుడి ప్రాణాలు కాపాడుకునేందుకు చేతిలో డబ్బులేక తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. గోవిందాపూర్‌కు చెందిన కుంజ సిరివెన్నెల, సునీల్ (30) దంపతులకు రెండేళ్ల కుమార్తె మేఘన, 7 నెలల కుమారుడు ఉన్నారు. సునీల్ గ్రామంలో పాలేరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడు మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతుండగా అప్పు చేసి నర్సంపేట, వరంగల్ ప్రాంతాల ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. వైద్యుల సూచన మేరకు గత నెలలో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాడు. ఈ క్రమంలో రూ.లక్ష అప్పు చేశాడు. అవి ఎలా తీర్చాలా అని ఆలోచిస్తున్న క్రమంలో కుమారుడికి వైద్యులు ఆపరేషన్ చేసిన చోట ఇన్‌ఫెక్షన్ వచ్చింది. మళ్లీ చికిత్స చేయించాలంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. దాంతో ఏం చేయాలో తోచలేదు. ఈ విషయమై భార్యాభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన సునీల్ ఈనెల 14న పాలేరు పనికి వెళ్లి అక్కడే పురుగు మందు తాగి ఇంటికి చేరుకుని వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సునీల్‌ను నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదేరోజు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనవడి మృతితో ఆగిన తాత గుండె

- గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి
- సిద్దిపేట జిల్లాలో ఘటన



శ్రీకాంత్



సాయిమల్లు

చేర్యాల(సిద్దిపేట): మనవడు మరణించాడన్న విషయాన్ని తట్టుకోలేని ఓ తాత గుండెపోటుకు గురై మరణించాడు. మనవడు మరణించిన గంటల వ్యవధిలోనే అతడి తాత కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చేర్యాల పట్టణంలోని గట్టుతోటకు చెందిన పుల్లన్నగారి శ్రీకాంత్(32) స్థానికంగా మోటార్ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. శ్రీకాంత్ మరణ వార్త బంధువుల ద్వారా విన్న అతడి తాత పుల్లన్నగారి సాయిమల్లు(72) గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడు శ్రీకాంత్‌కు ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు.

పాఠశాల తెరిపించాడని..

- ఉపాధ్యాయుడిని ఉరి తీసిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సుకుమా జిల్లాలో తాము మూయించిన పాఠశాలను మళ్లీ తెరిపించాడని కక్ష పెంచుకున్న మావోయిస్టులు దూది అర్జున్ అనే ఉపాధ్యాయుడిని దారుణంగా కొట్టి ఉరి తీశారు. ఈ మేరకు ప్రజాకోర్టు నిర్వహించి కర్రలతో కొట్టి.. చెట్టుకు ఉరి తీయడంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. పాఠశాల తెరిపించినందుకు గతంలోనే మావోయిస్టులు ఉపాధ్యాయుడిని పలుమార్లు హెచ్చరించారు. అయినా వినకుండా పాఠశాల నిర్వహించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, మృతుడు సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొండపల్లి గ్రామ వాసి అని ఎస్పీ కిరణ్ తెలిపారు.


చేతబడి ఆరోపణలతో ఐదుగురి హత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో చేతబడి చేశారనే ఆరోపణలతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులను గ్రామస్తులు ఆదివారం దారుణంగా కొట్టి చంపారు. కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇట్కాల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు తెలిపారు. చేతబడి చేస్తున్నారనే అనుమానంతో కొందరు గ్రామస్తులు వారి ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేశారని, దీంతో వారంతా అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్పీ కిరణ్ చౌహాన్ ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తిరిగొచ్చిన స్పేస్‌వాకర్లు

స్పేస్‌ఎక్స్ ప్రాజెక్ట్ విజయవంతం

స్పేస్ ఎక్స్ కంపెనీ ప్రైవేట్ స్పేస్‌వాక్ ప్రాజెక్టు 'పొలారిస్ డాన్' విజయవంతమైంది. అందులో భాగంగా ఐదు రోజుల క్రితం అంతరిక్షానికి వెళ్లడమే గాక వ్యోమగామిగా అనుభవం లేకున్నా స్పేస్‌వాక్ చేసిన తొలి వ్యక్తిగా చరిత్రకెక్కిన కుబేరుడు జరేద్ ఇసాక్‌మాన్ ఆదివారం సురక్షితంగా భూమికి తిరిగొచ్చారు. ఆయన, మరో ముగ్గురు సిబ్బందితో కూడిన స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ అమెరికాలో ఫ్లోరిడాలోని డై టార్టగస్ బీచ్ సమీప సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. ఇసాక్‌మాన్‌తోపాటు ఇద్దరు స్పేస్‌ఎక్స్ ఇంజనీర్లు, ఒక మాజీ ఎయిర్‌ఫోర్స్ థండర్‌బర్డ్ పైలట్ కూడా ఈ క్యాప్సూల్‌లో అంతరిక్షంలోకి వెళ్లడం తెల్సిందే. భూమి నుంచి 740 కి.మీ. ఎత్తులో తొలుత ఇసాక్‌మాన్, తర్వాత స్పేస్ ఎక్స్ ఇంజనీర్ సారా గిలిస్ స్పేస్‌వాక్ చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్సూల్ గరిష్టంగా భూమి నుంచి ఏకంగా 875 మైళ్ల ఎత్తుకు వెళ్లి మరో రికార్డు సృష్టించింది. చంద్రుడిపైకి నాసా అపోలో మిషన్ల తర్వాత మానవులు ఇంత ఎత్తుకు వెళ్లడం ఇదే తొలిసారి! ప్రైవేట్ రంగంలో స్పేస్‌వాక్ చేసిన తొలి వ్యక్తిగా, మొత్తమ్మీద 264వ వ్యక్తిగా ఇస్సాక్‌మాన్ నిలిచారు. ఆయన, గిలిస్ దాదాపు రెండు గంటల పాటు క్యాప్సూల్ నుంచి బయటికొచ్చి స్పేస్‌ఎక్స్ నూతన స్పేస్‌సూట్‌ను పరీక్షించారు. గిలిస్ అంతరిక్షం నుంచే సూపర్‌హిట్ హాలీవుడ్ సినిమా స్టార్‌వార్స్ థీమ్ సాంగ్‌కు వయొలిన్ వాయించి రికార్డు సృష్టించడం తెలిసిందే. - కేప్ కనావెరెల్


అమెరికాలో ఫ్లోరిడాలోని డై టార్టగస్ బీచ్ సమీప సముద్ర జలాల్లో ఆదివారం సురక్షితంగా దిగిన స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ (ఇన్‌సెట్) అనంతరం సిబ్బందితో జరేద్ కరచాలనం


సీబీఐ అదుపులో మండల్ (వృత్తంలో)

సీబీఐ కస్టడీకి ఘోష్, మండల్

కోల్‌కతా: ఆర్‌జీ కర్ వైద్యకళాశాలలో జూనియర్ వైద్యురాలి హత్యోదంతంలో ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌-ఇన్‌చార్జ్ అభిజిత్ మండల్‌ను స్థానిక కోర్టు మూడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగించింది. ఆదివారం ఈ మేరకు తీర్పు చెప్పింది. ''కేసులో వారిది కీలక పాత్ర. అందుకే వారిని కలిపి ప్రశ్నించేందుకు మూడు రోజుల అనుమతి సంపాదించాం'' అని సీబీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆస్పత్రిలో ఆర్థిక అక్రమాల కేసులో ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఘోష్‌ను హత్యాచార కేసులోనూ కస్టడీలోకి తీసుకోవాలని సీబీఐ భావిస్తుండటం తెల్సిందే. పోలీసు అధికారిగా ఉంటూ మండల్ సాక్ష్యాధారాల ధ్వంసానికి యత్నించారని సీబీఐ ఆరోపిస్తోంది. ''ఆర్‌జీ కర్ ఆస్పత్రి తాలా పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఆగస్ట్ 9న ఉదంతం వెలుగులోకి రాగానే ఘోష్ తొలుత ఆ పీఎస్ ఆఫీసర్‌-ఇన్‌చార్జ్ మండల్‌తో ఫోన్ సంప్రదింపులకు దిగారు. హత్య విషయం మండల్‌కు ఉదయం 10 గంటలకే తెలిసినా తాపీగా రాత్రి 11 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఈ ఆలస్యం వెనుక మండల్, ఘోష్ హస్తముంది. కిరాతక ఘటనను చిన్నదిగా చిత్రించే ప్రయత్నం చేశారు. హేయమైన నేరాన్ని కప్పిపుచ్చే యత్నాలు జరిగాయి. అందుకే చివరికి పోలీసులు ఈ కేసును సుమోటోగా తీసుకోవాల్సి వచ్చింది'' అని సీబీఐ తెలిపింది. హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు రాయ్ సహా ఇప్పటిదాకా ముగ్గురిని అరెస్టు చేశారు.

మోదీ 3.0 హయాంలోనే ఒకే దేశం-ఒకే ఎన్నిక!

న్యూఢిల్లీ: బీజేపీ సారథ్యంలోని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం తప్పక అమలవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విధానానికి పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా భారీగా మద్దతు లభిస్తుందని అభిప్రాయపడ్డాయి. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రధాన హామీల్లో ఇదీ ఒకటన్నది తెలిసిందే. దీన్ని అమలు చేయెచ్చంటూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని నిపుణుల కమిటీ మార్చిలో ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పేర్కొంది.

రెండ్రోజుల్లో రాజీనామా

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ప్రకటన

నిజాయితీపరుడినని ప్రజలు తీర్పిచ్చాకే గద్దెనెక్కుతా

నవంబర్‌లో అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలకు విజ్ఞప్తి

సీఎం పగ్గాలు భార్య సునీతకా? లేక ఆప్ నేతకా?

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి పదవికి రెండు రోజుల తర్వాత రాజీనామా చేయబోతున్నట్లు వెల్లడించారు. తాను నిజాయతీపరున్ని అని ప్రజలు తీర్పు ఇచ్చేదాకా సీఎం సీట్లో కూర్చోబోనని ప్రతిజ్ఞ చేశారు. ఢిల్లీ అసెంబ్లీకి సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో కేజ్రీవాల్ శుక్రవారం తిహార్ జైలు నుంచి విడుదలవడం తెలిసిందే. ఆదివారం భార్య సునీతతో కలిసి ఆయన ఆప్ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. రెండు రోజుల్లో ఆప్ ఎమ్మెల్యేలతో సమావేశమై కొత్త సీఎంను ఎంపిక చేస్తానని వెల్లడించారు.


ఆదివారం ఆప్ భేటీలో కేజ్రీవాల్

కేజ్రీవాల్ ఇంకా ఏమన్నారంటే...

నేరస్తుడినని భావిస్తే నాకు ఓటేయకండి

''దేశ ప్రజలను, ఢిల్లీవాసులను అడగాలనుకుంటున్నాను. కేజ్రీవాల్ నిజాయితీపరుడా? లేక నేరస్తుడా? ప్రజలే తీర్పు చెప్పాలి. కొద్ది నెలల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలున్నాయి. ప్రతి గల్లీకి, ప్రతి గడపకూ వెళ్తాను. నిజాయితీపరుడని అనుకుంటే నాకు ఓటేయండి. నేరస్తుడినని భావిస్తే వేయకండి. మీరు వేసే ప్రతి ఓటూ నా నిజాయతీకి సర్టిఫికెట్. ఆప్‌కు ఘనవిజయం కట్టబెట్టడం ద్వారా మీరు నన్ను గెలిపించినప్పుడే నేను ముఖ్యమంత్రి పీఠంపై, మనీశ్ సిసోడియా ఉప ముఖ్యమంత్రి సీట్లో కూర్చుంటాం. మా ఇద్దరి విషయంలో నిర్ణయాధికారం ఇక మీ చేతుల్లోనే ఉంది. ఢిల్లీలో వచ్చే ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. వాటిని మహారాష్ట్రతో పాటు వచ్చే నవంబర్‌లోనే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతున్నా.

సీతలా నాకు అగ్నిపరీక్ష

''14 ఏళ్ల వనవాసం తర్వాత సీతాదేవి అగ్నిపరీక్ష ఎదుర్కోవాల్సి వచ్చింది. జైలు నుంచి వచ్చాక నేను కూడా అగ్నిపరీక్షకు సిద్ధంగా ఉన్నాను. కేజ్రీవాల్ చోర్, అవినీతిపరుడు, భరతమాతకు ద్రోహం చేశాడంటూ నిందలేస్తున్నారు. నేను 'డబ్బుతో అధికారం, అధికారంతో డబ్బు' అనే ఆటాడేందుకు రాలేదు. దేశానికి మంచి చేద్దామని వచ్చా. ఆప్‌ను విచ్ఛిన్నం చేసేందుకే నన్ను జైలుకు పంపించారు. ఎమ్మెల్యేలను డబ్బుతో కొనడం, సీబీఐ, ఈడీలతో భయపెట్టడం, తప్పుడు కేసులు, జైళ్లకు పంపడం, ప్రభుత్వాలను పడగొట్టడం, చివరికి సొంత ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం.. ఇలా ఒక ఫార్ములా రూపొందించుకున్నారు. నన్ను జైలుకు పంపితే ఢిల్లీలో ఆప్ విచ్ఛిన్నమై ప్రభుత్వం పడిపోతుందని, బీజేపీ ప్రభుత్వం వస్తుందని అనుకున్నారు. కానీ మా పార్టీ, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు విచ్ఛిన్నం కాలేదు. కుట్రలకు వ్యతిరేకంగా పోరాడే సామర్థ్యం ఆప్‌కు ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే జైలులో ఉండగా సీఎం పదవికి రాజీనామా చేయలేదు''.

భార్యను సీఎం చేయడానికే డ్రామాలు: బీజేపీ

భార్య సునీతను సీఎం చేయడానికి కేజ్రీవాల్ నాటకాలాడుతున్నారని బీజేపీ ఎద్దేవా చేసింది. ''సమస్యలను అవకాశాలుగా మార్చుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అందులో భాగంగా రాజకీయంగా లబ్ధి కోసమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇలా డ్రామాకు తెర తీశారు'' అని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. రాజీనామా చేస్తా అనటమంటే మద్యం కుంభకోణంలో నేరాన్ని ఒప్పుకున్నట్లేనని బీజేపీ నేత సుధాంశు త్రివేది అన్నారు. ఆప్‌లో అంతర్గత ఘర్షణలను తట్టుకోలేకే రాజీనామా ప్రకటన చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

ఆప్ కొత్త సీఎం ఎవరు?

కేజ్రీవాల్ రాజీనామా ప్రకటన నేపథ్యంలో ఢిల్లీ కొత్త సీఎం ఎవరన్న దానిపై చర్చ ప్రారంభమైంది. రేసులో కేజ్రీవాల్ భార్య సునీత, మంత్రులు అతిశీ, గోపాల్ రాయ్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఆప్ వర్గాలు అధికారికంగా స్పందించకున్నా సునీతకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు పార్టీ నాయకుడొకరు చెప్పారు. కేజ్రీవాల్ మాదిరిగానే ఐఆర్ఎస్ అధికారిగా చేసిన ఆమెకు ప్రభుత్వాన్ని నడిపే విధానం క్షుణ్ణంగా తెలుసన్నారు. ''అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేజ్రీవాల్ నిర్ణయం తీసుకుంటారు. ఢిల్లీలో దళితులు, ముస్లింల ప్రాబల్యంగా అధికం గనుక ఆ వర్గాల నుంచి సీఎంను ఎంచుకున్నా ఆశ్చర్యం లేదు'' అని పరిశీలకులు అంటున్నారు.

అది 'నిపా' మరణమే: కేరళ

మలప్పురం: మలప్పురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఇటీవల చనిపోయిన 24 ఏళ్ల వ్యక్తికి నిపా వైరస్ సోకినట్లు వెల్లడైందని కేరళ ప్రభుత్వం ఆదివారం వెల్లడించింది. ఆ వ్యక్తి మరణంపై ప్రాంతీయ వైద్యాధికారి చేపట్టిన దర్యాప్తులో ఈ విషయం తేలిందని ఆరోగ్య మంత్రి వీణా జార్జి చెప్పారు. బాధితుడు ఈ నెల 9వ తేదీన బెంగళూరు నుంచి మలప్పురం వచ్చారని, ఆయన నుంచి సేకరించిన నమూనాలను కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ల్యాబ్‌కు పంపామన్నారు. ఫలితాలు పాజిటివ్‌గా రావడంతో శనివారం రాత్రి ఉన్నత స్థాయి నిర్వహించి అవసరమైన చర్యలను చర్చించామని ఆమె వివరించారు. బాధితుడితో కాంటాక్టులో ఉన్న 151 మందిని గుర్తించి ఐసోలేషన్‌లో ఉంచామని వివరించారు. వీరిలో జ్వరం, ఇతర లక్షణాలు కనిపించిన ఐదుగురి నమూనాలను ల్యాబ్‌కు పంపామని చెప్పారు. జూలై 21వ తేదీన మలప్పురానికే చెందిన ఓ బాలుడు నిపా వైరస్ బారినపడి చనిపోయాడు.

ఇజ్రాయెల్‌పైకి హౌతీల క్షిపణి ప్రయోగం

జెరూసలేం: నిన్నమొన్నటి వరకు ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్లు పంపిన యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు తాజాగా ఏకంగా బాలిస్టిక్ క్షిపణినే ప్రయోగించారు. దీంతో, సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని బెన్‌గ్యురియెన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సైరన్లు మోగాయి. కొద్దిసేపు రాకపోకలను ఆపేసిన అధికారులు, తిరిగి విమానాలను పునరుద్ధరించారు. పలు అంచెల గగనతల రక్షణ వ్యవస్థల ద్వారా క్షిపణిని అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు ఆర్మీ తెలిపింది. అయితే, మోదీన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎస్కలేటర్‌పై ఒక క్షిపణిని అడ్డుకున్న రాకెట్ శకలం పడిందని, ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది. సమీపంలోని బహిరంగ ప్రదేశంలో మంటలు మాత్రం చెలరేగాయని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌లోని సైనిక కేంద్రం లక్ష్యంగా క్షిపణిని ప్రయోగించినట్లు హౌతీలు ధ్రువీకరించారు.

బంగ్లాదేశీలు, రోహింగ్యాలతో జార్ఖండ్‌కు పెనుముప్పు

పరివర్తన్ ర్యాలీలో మోదీ ● జేఎంఎం కూటమి ఓటు బ్యాంకు రాజకీయాలు

రాజకీయ లబ్ధి కోసం అక్రమ వలసలకు ప్రోత్సాహం ● బీజేపీని బలోపేతం చేయడమే పరిష్కారమన్న ప్రధాని

జంషెడ్‌పూర్: జార్ఖండ్‌లో అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూటమి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. వెల్లువలా వచ్చిపడుతున్న బంగ్లాదేశీలు, రోహింగ్యాలతో జార్ఖండ్‌కు పెనుముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ''అక్రమ వలసల వల్ల సంథాల్ పరగణాలు, కోల్హాన్ ప్రాంతాల్లో జనాభా స్థితిగతుల్లో వేగంగా మార్పులొస్తున్నాయి. స్థానికులు మైనార్టీలుగా మారిపోయే ప్రమాదముంది. స్థానికేతరుల ఆధిపత్యం వల్ల గిరిజన జనాభా క్రమంగా తగ్గిపోతోంది. అక్రమ వలసదారులు పంచాయతీ వ్యవస్థపై పెత్తనం చెలాయిస్తున్నారు. భూములు కబ్జా చేస్తున్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్నారు. తమకు భద్రత లేదని జార్ఖండ్‌లో ప్రజలు భావిస్తున్నారు'' అని అభిప్రాయపడ్డారు. ఆదివారం జంషెడ్‌పూర్‌లో 'పరివర్తన్ మహార్యాలీ'లో మోదీ ప్రసంగించారు. విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వారికి జేఎంఎం అండగా నిలుస్తోందని మండిపడ్డారు. అధికార పార్టీపై అక్రమ వలసదారులు పట్టు బిగించారన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లపై దర్యాప్తు కోసం స్వతంత్ర కమిటీ వేయాలని హైకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

జనమే బుద్ధి చెబుతారు

జార్ఖండ్‌కు జేఎంఎం, ఆర్జేడీ, కాంగ్రెసే అతి పెద్ద శత్రువులని మోదీ అన్నారు. అధికార దాహంతో అవి ఓటు బ్యాంకు రాజకీయాలనే నమ్ముకున్నాయని ఆక్షేపించారు. ''గిరిజనుల ఓట్లతో అధికారం దక్కించుకున్న జేఎంఎం ఇప్పుడు వారికి అన్యాయం చేస్తున్న శక్తులతో చేతులు కలిపింది. రాజకీయ స్వార్థం కోసం దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలను బలి పెడుతోంది. గిరిజన సీఎం చంపయ్ సోరెన్‌ను అన్యాయంగా పదవి నుంచి తప్పించి ఘోరంగా అవమానించారు. జార్ఖండ్‌లో గిరిజనులకు జరుగుతున్న ద్రోహానికి ఇదో ఉదాహరణ అని తెలిపారు. సీఎం హేమంత్ సోరెన్ తన వదిన సీతా సోరెన్‌కే తగిన గౌరవమివ్వడం లేదు. జేఎంఎంకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం'' అన్నారు. మతం పేరిట జేఎంఎం కూటమి ఓటు బ్యాంకును పెంచుకోజూస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి ముప్పు తప్పాలంటే బీజేపీని బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లపాటు జరిగిన అవినీతి అక్రమాలు, కుంభకోణాలపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విపక్షాలు పెద్ద కుట్ర పన్నాయని ఆరోపించారు. జార్ఖండ్ సంక్షేమానికి కేంద్రం ఎంతో చేసిందన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిగా ఎన్నుకున్నామని గుర్తు చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జి) కింద జార్ఖండ్‌లో 32 వేల మంది లబ్ధిదారులకు ఈ సందర్భంగా మోదీ వర్చువల్‌గా అనుమతి పత్రాలు పంపిణీ చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా గృహాలు పొందిన మరో 46 వేల మందికి తాళాలు అందజేశారు. జార్ఖండ్‌లో రూ.660 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు.


హెలికాప్టర్ ప్రయాణం అనుకూలించకపోవడంతో రాంచీ నుంచి 126 కి.మీ. దూరంలోని జంషెడ్‌పూర్‌కు ఆదివారం రోడ్డు మార్గాన వెళ్తున్న మోదీ

నేడే వందేమెట్రోకు పచ్చజెండా



రాంచీ: మెట్రో నగరాల మధ్య వేగవంతమైన ప్రయాణాల కోసం దేశంలోనే తొలి వందే మెట్రో రైలు సేవలను మోదీ సోమవారం ప్రారంభించనున్నారు. ఇది గుజరాత్‌లోని భుజ్ నుంచి అహ్మదాబాద్‌కు 359 కి.మీ. దూరాన్ని కేవలం 5.45 గంటల్లో చేరనుంది. ఆరు వందే భారత్ రైళ్లను మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇవి టాటానగర్-పట్నా, బ్రహ్మపూర్-టాటానగర్, రుర్కెలా-హౌరా, దేవ్‌గఢ్-వారణాసి, భాగల్పూర్-హౌరా, గయా-హౌరా మార్గాల్లో ప్రయాణిస్తాయి.

రాహుల్ అతి పెద్ద ఉగ్రవాది

ఆయన భారతీయుడే కాదు: కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ



భాగల్పూర్ (బిహార్): సిక్కుల గురించి మాట్లాడిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'రాహుల్ గాంధీ దేశంలోనే నంబర్ వన్ ఉగ్రవాది. దేశంలో కంటే బయటే ఎక్కువగా గడిపిన ఆయన అసలు భారతీయుడే కాదు' అంటూ మండిపడ్డారు. ఆయన్ను పట్టిచ్చిన వారికి రివార్డు ప్రకటించాలన్నారు. సిక్కులు భారత్‌లో తలపాగా, కడియం ధరించి గురుద్వారాకు వెళ్లలేకపోతున్నారని ఇటీవలి అమెరికా పర్యటనలో రాహుల్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపడం తెలిసిందే. దేశంలో ఇతర మతాల వారిదీ ఇదే పరిస్థితని ఆయన అభిప్రాయపడ్డారు. బిట్టూ ఆదివారం బిహార్‌లోని భాగల్పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ వ్యాఖ్యలను దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ గతంలో ముస్లింలను వాడుకుంది. ఫలితం కనిపించకపోవడంతో ఇప్పుడు సిక్కులను వేరు చేయజూస్తున్నారు. రాహుల్‌కు ముందు మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదులు ఇలాంటి ప్రకటనలు చేశారు. రాహుల్ మాటలను టెర్రరిస్టులు కూడా మెచ్చుకుంటున్నారు. అలాంటి వారి మద్దతు పొందుతున్న రాహులే దేశంలో నంబర్‌వన్ టెర్రరిస్ట్. అందుకే రాహుల్‌ను పట్టుకున్న వారికి దేశానికి పెద్ద శత్రువును పట్టించిన వారికిచ్చే బహుమానం ఇవ్వాలి'' అన్నారు. ''రాహుల్ కుటుంబం, స్నేహితులు ఉన్నది విదేశాల్లోనే. అందుకే దేశం గురించి ఆయనకు వ్యతిరేక ఆలోచనలు వస్తున్నాయి. ఐదుసార్లు పార్లమెంటుకు ఎన్నికైనా నిరుపేదల ఇబ్బందులు ఆయనకు తెలియవు. అందుకే ఇప్పటికీ మెకానిక్, కార్పెంటర్ వంటి వృత్తి పనివాళ్ల దగ్గరికెళ్లి కష్టాలు తెలుసుకుంటున్నట్టుగా ఫొటోలకు పోజులిస్తున్నారు. వాస్తవానికి ఇదో జోకు'' అని మంత్రి బిట్టూ అన్నారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. మొన్నటిదాకా తమ పార్టీలో ఉండి రాహుల్‌ను పొగిడిన బిట్టూ బీజేపీలో చేరగానే స్వరం మార్చారని ఎద్దేవా చేసింది.

రాహుల్ రాజ్యాంగ వ్యతిరేకి: ధన్‌ఖడ్



ముంబై : రిజర్వేషన్లను ఎత్తివేయాలన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మండిపడ్డారు. ఆయనది రాజ్యాంగ వ్యతిరేక మనస్తత్వమని విమర్శించారు. ఆదివారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ధన్‌ఖడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''కొందరు రాజ్యాంగ స్వరూపం గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు. ఇలాంటి సమయంలో రాజ్యాంగంపై అందరికీ అవగాహన అత్యవసరం'' అని రాహుల్‌ను ఉద్దేశించి అన్నారు. ''రాజ్యాంగమున్నది డాంబికంగా ప్రదర్శించడానికి కాదు. దాన్ని గౌరవించాలి. అధ్యయనం చేయాలి. అర్థం చేసుకోవాలి. బాధ్యత కలిగిన, తెలివున్న, రాజ్యాంగాన్ని గౌరవించే ఏ వ్యక్తీ ఇలా ప్రవర్తించరు'' అంటూ రాహుల్‌పై నిప్పులు చెరిగారు. ఇటువంటి దుస్సాహాలను తిప్పికొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. ''రాజ్యాంగ పదవిలో వ్యక్తి రిజర్వేషన్లను ఎత్తేయాలని విదేశీ గడ్డపై మాట్లాడటం రాజ్యాంగ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనం. ఇలాంటి రిజర్వేషన్ల వ్యతిరేక వైఖరి బహుశా ఆయనకు వారసత్వంగా అబ్బింది'' అంటూ దుయ్యబట్టారు. రిజర్వేషన్లున్నది సమాజానికి మూలస్తంభాల్లాంటి సామాజిక వర్గాలకు చేయూతనిచ్చేందుకేనని ధన్‌ఖడ్ స్పష్టం చేశారు.

ఏఐపీ, జమాతె పొత్తు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ సారథ్యంలోని అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఏఐపీ), జమాతె ఇస్లామీ మధ్య ఆదివారం పొత్తు కుదిరింది. కేంద్రం నిషేధంతో జమాతె నేతలు ఇండిపెండెంట్లుగా అసెంబ్లీ బరిలో ఉండటం తెలిసిందే. 'కుల్గాం, పుల్వామా జిల్లాల్లో జమాతె అభ్యర్థులకు ఏఐపీ మద్దతివ్వనుంది. కశ్మీర్‌లో ఏఐపీ అభ్యర్థులకు జమాతె మద్దతిస్తుంది' అని ఏఐపీ నేత ఒకరు వెల్లడించారు. ఇరు అభ్యర్థులూ బరిలో ఉన్న చోట్ల స్నేహపూర్వక పోటీ ఉంటుందన్నారు. మారుతున్న పరిస్థితుల్లో ఏఐపీ, జమాతె ప్రేక్షక పాత్ర పోషించలేవని ఆయన తెలిపారు.


రాంచీలో కర్మా ఉత్సవంలో గిరిజన సంప్రదాయ డోలు వాయిస్తున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్, కల్పన దంపతులు

మా విశ్వాసం చెదిరిపోతోంది

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో జైలు శిక్ష పడిన దోషులను శిక్షాకాలం ముగియకముందే కారాగారం నుంచి బయటకు రప్పించడానికి న్యాయవాదులు తప్పుడు మార్గాలు అనుసరిస్తున్నారని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. కోర్టు ముందు పదేపదే తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని ఆక్షేపించింది. దోషులకు శిక్షాకాలం తగ్గించాలని కోరుతూ దాఖలు చేసే పిటిషన్లలోనూ అసత్య సమాచారం చేరుస్తున్నారని విమర్శించింది. ఇలాంటి కేసులు ఎదురైనప్పుడు తమ విశ్వాసం చెదిరిపోతోందని స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన ధర్మాసనం ఈ నెల 10వ తేదీన ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును తాజాగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఖైదీల రెమిషన్ విషయంలో లాయర్ల తప్పుడు స్టేట్‌మెంట్లపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ''మూడు వారాలుగా ఇలాంటి కేసులను పెండింగ్‌లో పెట్టాం. పర్మినెంట్ రెమిషన్ మంజూరు చేయడం లేదు. అయినా ఇందుకోసం భారీగా తప్పుడు పిటిషన్లు దాఖలవుతున్నాయి'' అని ధర్మాసనం ఆగ్రహించింది.

సమ్మతి ఉన్నా, భయపెడితే అత్యాచారమే

ప్రయాగ్‌రాజ్: సమ్మతితో లైంగిక సంబంధం పెట్టుకున్నాసరే ఆ సంబంధం భయంతో కొనసాగితే అత్యాచారంగానే పరిగణించాలని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి లైంగిక సంబంధం పెట్టుకున్నాడని ఒక మహిళ వేసిన కేసు విచారణ సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో విచారణ ఆపాలంటూ తమను ఆశ్రయించిన రాఘవ్ కుమార్ అనే వ్యక్తికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు వెలువరించింది. బాధితురాలు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో రాఘవ్ పరిచయమయ్యాడు. ఆమెను అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేసి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తర్వాత పెళ్లిచేసుకుంటానని నమ్మించి బలవంతంగా ఆ బంధాన్ని కొనసాగించాడంటూ బాధితురాలు ఆగ్రా జిల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు ఆగ్రా జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉంది. దీన్ని సవాలు చేస్తూ రాఘవ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ అనీస్ కుమార్ గుప్తా సారథ్యంలోని అలహాబాద్ హైకోర్టు బెంచ్ కొట్టేసింది.

హిందువంటే దయ కలిగి ఉండటమే

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



జైపూర్: హిందువుగా ఉండటమంటే మత విశ్వాసాలు, కులం, ఆహార అలవాట్లతో నిమిత్తం లేకుండా ఎదుటి వారి పట్ల దయ, సానుభూతి చూపడమేనని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం పేర్కొన్నారు. ''దేశానికి హిందూ సమాజం యజమాని వంటిది. అందుకే, దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా ఆ ప్రభావం హిందూ సమాజంపైనే ఉంటుంది. అదే విధంగా, దేశంలో ఏ మంచి పరిణామం సంభవించినా అది హిందువుల కీర్తిని పెంచుతుంది'' అన్నారు. హిందువుగా ఉండటమంటే ప్రతి ఒక్కరి శ్రేయస్సును ఆకాంక్షించడం, అత్యంత ఉదారుడిగా, అందరినీ ఆదరించేవాడిగా, సద్భావన కలిగి ఉండటమే'అని పేర్కొన్నారు.

ప్రధాని రేసులో దిగితే మద్దతిస్తామన్నారు!

కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ వెల్లడి



నాగ్‌పూర్: ప్రధాని పదవికి పోటీ పడితే మద్దతిస్తామంటూ గతంలో ఓ రాజకీయ నేత తనకు ఆఫరిచ్చినట్టు బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ గుర్తు చేసుకున్నారు. నాగ్‌పూర్‌లో జర్నలిజం అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. ''నేను ప్రధాని రేసులో ఉండే పక్షంలో తామంతా మద్దతిస్తామని ఒక నాయకుడు ప్రతిపాదించారు. ఆయనెవరో చెప్పబోను' అన్నారు. ఇదెప్పుడు జరిగిందో కూడా వివరించలేదు. ''మీరు నాకెందుకు మద్దతిస్తామంటున్నారు? మీ మద్దతు నేనెందుకు తీసుకోవాలి? ప్రధాని కావడం నా జీవిత లక్ష్యం కాదు. నా పార్టీకి విధేయుడినై ఉంటా. నా చిత్తశుద్ధికి కట్టుబడి ఉంటా'' అని ఆ నేతకు బదులిచ్చానన్నారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పరిశోధకులు స్థానిక చరిత్రను వెలికితీయాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.రాజేంద్రన్ తదితరులు

బంజారాహిల్స్: దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా ఉన్న చరిత్రను వెలికి తీయాలని, అసంబద్ధంగా ఉన్న చరిత్రను భావితరాలపై రుద్దాల్సిన అవసరం లేదని అలగప్ప యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఎస్. రాజేంద్రన్ అన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం, పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల వార్షిక సమావేశ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం నుంచే దేశ, ప్రాంతీయ చరిత్రను ఒక అంశంగా బోధించాలని సూచించారు. ఈ దిశగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ ప్రాంతీయ కార్యదర్శి, విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఇ.సుధా రాణి, ప్రొ.రోహిత్ దసనాయకా. ప్రొ.చెన్నారెడ్డి, ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, డా.జి. దయాకర్, పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా. సందీప్ కె.దాసరి పాల్గొన్నారు.

ఏమరుపాటు వద్దు

- రానున్న మూడు రోజులు అత్యంత కీలకం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పష్టం చేసిన సీపీ
- నిమజ్జనం నేపథ్యంలో మద్యం విక్రయాలు బంద్



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగానికి అత్యంత కీలక ఘట్టమైన గణేష్ నిమజ్జనంతో పాటు మిలాద్ ఉన్ నబీ, పబ్లిక్ గార్డెన్స్, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమాలు ఒకే విడతలో రావడం బందోబస్తుకు సవాల్ లాంటిదని కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి దీన్ని అధిగమిద్దామని పేర్కొన్నారు. ఏ దశలోనూ ఏ మాత్రం ఏమరుపాటుకు తావీయవద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. అదనపు సీపీ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అందరు అధికారులు ఇందులో పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో కీలక పాత్ర పోషించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల సిబ్బందినీ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వాముల్ని చేసిన ఆనంద్ వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సందర్భంలో కొత్వాల్ మాట్లాడుతూ... ఆదివారం రాత్రి నుంచే నిఘా, గస్తీ ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. బ్లూకోల్ట్స్‌తో పాటు పెట్రోలింగ్ వాహనాలు కేవలం ప్రధాన రోడ్ల పైనే కాకుండా ఇతర రహదారులు, గల్లీలను దృష్టిలో పెట్టుకుని సంచరించాలని సూచించారు. భిన్న వర్గాలకు చెందిన వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. నిమజ్జనం నేపథ్యంలో గత ఏడాది జరిగిన లోపాలను ప్రస్తావించిన కొత్వాల్ ఆనంద్ చిన్న ఊరేగింపులు వచ్చి పెద్ద వాటిలో కలిసే ప్రాంతాలతో పాటు ఇటు–అటు ట్రాఫిక్ రాకపోకల కోసం ఉద్దేశించిన ఎంజే మార్కెట్, బషీర్‌బాగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. 19న జరగనున్న మిలాద్ ఉన్ నబీ ఊరేగింపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆనంద్ వివరించారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో నగరంలో మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు నగర వ్యాప్తంగా కల్లు, మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులకు మినహాయింపు ఇచ్చారు.



రాష్ట్రంలో సైబర్ నేరస్తులు కొట్టేస్తున్న మొత్తం ఇది

రూ. 3 రోజుకు కోట్లు!

పెట్టుబడి మోసాల వలలో ఉద్యోగులు, గృహిణులు

ట్రై కమిషనరేట్లలో **9,150** కేసులు నమోదు

అత్యధికంగా సైబరాబాద్‌లో **5,500** కేసులు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరస్తులు పంజా విసురుతున్నారు. రాష్ట్రంలో రోజుకు దాదాపు రూ.3 కోట్ల కంటే ఎక్కువ కొట్టేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా మే 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు సైబర్‌క్రైమ్ బాధితులు ఏకంగా రూ.1,085 కోట్లు మోసపోయారు. ఉద్యోగులు, గృహిణులు, నిరుద్యోగులు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, పార్ట్ టైమ్ జాబ్స్ వంటి సైబర్ నేరాల బారిన పడుతున్నారు.

అత్యధికంగా సైబరాబాద్‌లో..
గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్లలో అత్యధికంగా సైబర్ నేరాలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో జరుగుతున్నాయి. గత ఎనిమిది నెలల్లో సైబరాబాద్‌లో 5,500 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే గత ఏడాది నమోదైన మొత్తం సైబర్ క్రైమ్ కేసుల కంటే ఇవి ఎక్కువ కావడం గమనార్హం . 2023లో ఈ కమిషనరేట్ లో మొత్తం 5,342 కేసులు రిజిస్టరయ్యాయి.


హైదరాబాద్ పరిధిలో..
గత ఎనిమిది నెలల్లో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో 2,140, రాచకొండలో 1,500 కేసులు నమోదయ్యాయి. గతేడాది హైదరాదాద్‌లో 2,735 కేసులు నమోదు కాగా.. కేవలం 51 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి.. అలాగే సైబరాబాద్‌లో 168 కేసులు పరిష్కారమయ్యాయి.


మహా గణపతి దర్శనానికి బారులుతీరిన భక్తులు... పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు



కీలక ఘట్టానికి వేళాయే

నిమజ్జనం నేపథ్యంలో రేపు ట్రాఫిక్ ఆంక్షలు


నిమజ్జనం ప్రధాన రూట్

- నగర వ్యాప్తంగా 66 ప్రాంతాల్లో అమలు
- ఖాళీ వాహనాలు వెళ్లేందుకూ ఓ మార్గం
- సందర్శకుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం మంగళవారం హుస్సేన్‌సాగర్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో భారీ ఊరేగింపులు సైతం ఉంటాయి. వీటి కారణంగా నగర శివార్లతో పాటు సిటీ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 66 ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించడమో, పూర్తిగా ఆపేయడమో చేస్తారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం నిమజ్జనం ముగిసే వరకు ఇవి అమలులో ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని పొడిగించే అవకాశం ఉంది. నిమజ్జనం పూర్తయిన తరవాత విగ్రహాలను తెచ్చిన ఖాళీ లారీల కోసం ప్రత్యేక రూట్లు కేటాయించారు. నిమజ్జనానికి వచ్చే ప్రజలు వ్యక్తిగత వాహనాలను వదిలి ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్‌లను ఆశ్రయించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన ఊరేగింపు మార్గం: కేశవగిరి–నాగుల్ చింత–ఫలక్‌నుమా– చార్మినార్– మదీనా–అఫ్జల్‌గంజ్–ఎంజే మార్కెట్–అబిడ్స్–బషీర్ బాగ్–లిబర్టీ–అప్పర్ ట్యాంక్/ఎన్టీఆర్ మార్గ్‌ల్లో నిమజ్జనం జరుగుతుంది.

సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చేది: ఆర్పీ రోడ్–ఎంజీ రోడ్–కర్బలా మైదాన్–ముషీరాబాద్ చౌరస్తా–ఆర్టీసీ క్రాస్‌రోడ్స్– నారాయణగూడ 'ఎక్స్' రోడ్–హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్ ద్వారా వచ్చి లిబర్టీ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరుతుంది.

ఈస్ట్‌జోన్ నుంచి వచ్చేది: ఉప్పల్–రామంతాపూర్–అంబర్‌పేట్–ఓయూ ఎన్‌సీసీ–డీడీ హాస్పిటల్ మీదుగా ప్రయాణించి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద సికింద్రాబాద్ రూట్‌లో కలుస్తుంది.

- వెస్ట్ జోన్ వైపు నుంచి వచ్చే ఊరేగింపు ఎంజే మార్కెట్ లేదా సెక్రటేరియేట్ వద్ద ప్రధాన ఊరేగింపుతో కలుస్తాయి.
- నిమజ్జనం ఊరేగింపు జరిగే మార్గాల్లో చిన్న వాహనాలకు అనుమతి ఉండదు. ఈ మార్గానికి అటు ఇటు ప్రాంతాల్లో ఉన్న వారు ప్రయాణించడానికి కేవలం బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద మాత్రమే అవకాశం ఇచ్చారు. సాధారణ ప్రజలు రింగ్‌రోడ్, బేగంపేట్ మార్గాలను ఆశ్రయించడం ఉత్తమం.
- వెస్ట్–ఈస్ట్ జోన్ల మధ్య రాకపోకలు సాగించే వారికి కేవలం బషీర్‌బాగ్ వద్దే అవకాశం ఉంటుంది.
- వాహనచోదకులు సాధ్యమైనంత వరకు ఔటర్‌రింగ్‌రోడ్, బేగంపేట్ మార్గాలను ఎంపిక చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్

- **సౌత్ జోన్:** కేశవగిరి, మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్స్, ఇంజన్ బౌలి, నాగుల్‌చింత, హిమ్మత్ పురా, హరిబౌలి, ఆశ్రా హాస్పిటల్, మొఘల్ పురా, లక్కడ్ కోటి, మదీనా చౌరస్తా, ఎంజే బ్రిడ్జి, దారుల్‌షిఫా చౌరస్తా, సిటీ కాలేజీ.
- **ఈస్ట్ జోన్:** చంచల్‌గూడ జైల్ చౌరస్తా, ముసారాంబాగ్, చాదర్‌ఘాట్ బ్రిడ్జ్, సాలార్జంగ్ బ్రిడ్జి, అఫ్జల్‌గంజ్, పుత్లిబౌలి చౌరస్తా, ట్రూప్‌బజార్, జాంబాగ్ చౌరస్తా, కోఠి ఆంధ్రాబ్యాంక్.
- **వెస్ట్ జోన్:** టోపీఖానా మాస్క్, అలాస్కా హోటల్ చౌరస్తా, ఉస్మాన్ జంగ్, శంకర్‌బాగ్, శీనా హోటల్, అజంతాగేట్, ఆబ్కారీ లైన్, తాజ్ ఐలాండ్, బర్తన్ బజార్, ఏఆర్ పెట్రోల్ పంప్
- **సెంట్రల్ జోన్:** ఛాపెల్ రోడ్ ఎంట్రీ, జీపీఓ దగ్గరి గద్వాల్ సెంటర్, శాలిమార్ థియేటర్, గన్ ఫౌండ్రీ, స్కైలైన్ రోడ్ ఎంట్రీ, హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్, దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చౌరస్తా, కంట్రోల్‌రూమ్ దగ్గరి కళాంజలి, లిబర్టీ చౌరస్తా, ఎంసీహెచ్ ఆఫీస్ 'వై' జంక్షన్, బీఆర్‌కే భవన్, ఇక్బాల్ మీనార్, రవీంద్రభారతి, ద్వారకా హోటల్ చౌరస్తా, వీవీ స్టాచ్యూ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్, వైస్రాయ్ హోటల్ చౌరస్తా, కవాడీగూడ జంక్షన్, కట్టమైసమ్మ టెంపుల్, ఇందిరాపార్క్
- **నార్త్‌జోన్:** కర్బాలామైదాన్, బుద్ధభవన్, సెయిలింగ్ క్లబ్, సెయిలింగ్ క్లబ్, నల్లగుట్ట చౌరస్తా వైపు నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌ల్లోకి ఎలాంటి ట్రాఫిక్‌ను అనుమతించరు. గురువారం ఉదయం నుంచి సీటీఓ, వైఎంసీఏ, ప్యారడైజ్ చౌరస్తా, ప్యాట్నీ జంక్షన్, బాటా 'ఎక్స్' రోడ్, ఆదివాసీ చౌరస్తా, ఘాస్‌మండీ చౌరస్తాల మధ్య ఆంక్షలు అమలులో ఉంటాయి.

హెల్ప్ లైన్‌ల ఏర్పాటు
ఈ ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సహకరించడం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌లను సైతం ఏర్పాటు చేశారు. ఎలాంటి సహాయం కావాలన్నా **040-27852482, 87126 60600, 90102 03626** నెంబర్లలో సంప్రదించవచ్చు.

సందర్శకులకు పార్కింగ్

హుస్సేన్‌సాగర్‌లో జరిగే నిమజ్జనాన్ని వీక్షించడానికి వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. అవి... ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్, ఆనంద్‌నగర్ కాలనీ నుంచి రంగారెడ్డి జెడ్పీ ఆఫీస్ మధ్య, బుద్ధ భవన్ పక్కన, ఎన్టీఆర్ స్టేడియం, నిజాం కాలేజీ, పబ్లిక్ గార్డెన్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, లోయర్ ట్యాంక్‌బండ్, గో సేవా సదన్, కట్టమైసమ్మ టెంపుల్. ఇక్కడ నుంచి సందర్శకులు కాలినడకనే ట్యాంక్‌బండ్ పరిసరాలకు చేరుకోవాలి.

నిమజ్జనం తర్వాత: విగ్రహాలను తెచ్చిన లారీలు/ట్రక్కులు నిమజ్జనం పూర్తి చేసిన తర్వాత తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక రూట్లు కల్పించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జనం చేసినవి నెక్లెస్‌రోటరీ, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, వీవీ స్టాచ్యూ, కేసీపీల మీదుగా వెళ్లాలి. వీటిని తెలుగుతల్లి స్టాచ్యూ, మింట్ కాంపౌండ్స్‌లోకి అనుమతించరు. అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనం చేసిన లారీలు/ట్రక్కులు చిల్డ్రన్స్‌పార్క్, డీబీఆర్ మిల్స్, కవాడీగూడ, ముషీరాబాద్ మీదుగా వెళ్లాలి. బైబిల్‌హౌస్ రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా అనుమతించరు.

ఇంటర్ డిస్ట్రిక్ట్/స్టేట్ లారీలకు నో: ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే లారీలను నగరంలోకి అనుమతించరు. ఔటర్ రూట్లను వినియోగించుకొని వెళ్లాల్సి ఉంటుంది.

ఆర్టీసీ బస్సులకూ: ట్రాఫిక్ ఆంక్షలు ఆర్టీసీ బస్సులకూ వర్తిస్తాయి. నిమజ్జనం నేపథ్యంలో మాసబ్‌ట్యాంక్, వీవీ స్టాచ్యూ, సీటీఓ, వైఎంసీఏ, రెతిఫైల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, క్లాక్ టవర్, చిలకలగూడ చౌరస్తా, ఛే నెంబర్, గడ్డిఅన్నారం, చాదర్‌ఘాట్, బహదూర్‌పురా, నల్గొండ చౌరస్తాలను దాటి ముందుకు రానీయరు.

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులకు: నిమజ్జనం పూర్తయ్యే వరకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల్ని నగరంలోకి అనుమతించరు. వీటిని శివార్లలోనే ఆపేసి అటునుంచే మళ్లిస్తారు.

ఆర్టీసీ అదనపు బస్సులు

నిమజ్జనం సందర్భంగా భక్తుల రద్దీ మేరకు మంగళవారం నగరంలోని వివిధ మార్గాల్లో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను ఖైరతాబాద్ చౌరస్తా వరకు నడుపుతారు. మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే బస్సులు లక్డీకాపుల్ వరకు రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ, అఫ్జల్‌గంజ్ నుంచి వచ్చే వాటిని బషీర్‌బాగ్ వరకు నడుపుతారు. ఉప్పల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను ఇందిరాపార్కు వరకు నడపనున్నారు. ప్రయాణికుల రద్దీ మేరకు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా బస్సులను అందుబాటులో ఉంచనున్నట్లు ఈడీ చెప్పారు. నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు వచ్చిన చివరి ప్రయాణికులు కూడా తమ ఇళ్లకు చేరుకొనేందుకు అనుగుణంగా బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. స్పెషల్ బస్సులపై ప్రయాణికుల సందేహాల నివృత్తికి ఆర్టీసీ కాల్‌సెంటర్: 99592 26160, 99592 26154లను సంప్రదించవచ్చు.

రేపు అర్ధరాత్రి వరకు మెట్రో

వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లను నడపనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం తెలిపారు. వివిధ కారిడార్‌లలో ఒంటిగంటకు బయలుదేరే రైళ్లు తెల్లవారుజామున 2 గంటలకు చివరి స్టేషన్‌లకు చేరుకొంటాయని చెప్పారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్‌లలో అదనపు టికెట్ కౌంటర్‌లకు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు స్వీయ క్రమశిక్షణ పాటించాలని, మెట్రో సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. మరోవైపు గత కొద్ది రోజులుగా ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని సందర్శించేందుకు వచ్చే ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ప్రతిరోజూ 5 లక్షల మందికి పైగా ప్రయాణికులు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. శనివారం ఒక్కరోజే సుమారు 9,4000 మంది ఖైరతాబాద్ వినాయకుడిని సందర్శించేందుకు వచ్చినట్లు ఎండీ పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎల్‌అండ్‌టీ అధికారులతో ఆదివారం ఎన్వీఎస్ సమావేశమయ్యారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా అదనపు సర్వీసులను నడిపేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రతి 3 నిమిషాలకు ఒక రైలు చొప్పున అందుబాటులో ఉండగా, వివిధ స్టేషన్‌లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు మెట్రో సదుపాయం కల్పించేందుకు అదనపు సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



మహా ట్రైలర్ సిద్ధం


ట్రైలర్ డ్రైవర్ భాస్కర్ రెడ్డి

ఖైరతాబాద్: అశేష భక్త జనం పూజలందుకున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి సాగర నిమజ్జనానికి తరలించేందుకు ఎస్టీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన ట్రైలర్ వాహనం శనివారం ప్రాంగణానికి చేరుకుంది. వెల్డింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ట్రైలర్ పొడవు 75 అడుగులు, 11 అడుగుల వెడల్పు. 26 టైర్లు ఉన్న ఈ వాహనం 100 టన్నుల బరువు వరకు కూడా మోయగలదు. ఖైరతాబాద్ మహా గణపతిని నిమజ్జనానికి తరలించే వాహన సారథిగా నాగర్‌కర్నూల్ జిల్లా గౌతంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ఈసారి కూడా వ్యవహరించనున్నారు. 'మహా గణపతి బరువు 70 టన్నుల వరకు ఉంటుంది. నిమజ్జన సమయంలో ఎలాంటి పగుళ్లు రాకుండా నాలుగు లేయర్లుగా తయారీ చేశాం. 4 గంటల పాటు వర్షం వచ్చినా కరిగిపోదు. నిమజ్జనం పూర్తిచేసిన 7 గంటల్లో నీటిలో కరిగిపోతుంది' అని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.


మెట్రోలో ప్రయాణిస్తున్న మేయర్ విజయలక్ష్మి

మెట్రోలో ప్రయాణించి.. సమస్యలు ఆలకించి..

ప్రయాణికులతో మేయర్ మాటామంతీ

లింగోజిగూడ: మెట్రో ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. ఆదివారం మూసారాంబాగ్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రోలో ప్రయాణించిన మేయర్.. ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్‌లో మిట్టా ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలీ హెల్త్ క్లినిక్, మెడికల్ హాల్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. మెట్రోలో ప్రయాణికులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా చికిత్స అందించేందుకు పాలీ హెల్త్ క్లినిక్, మెడికల్ హాల్ ఎంతగానో సహకరిస్తాయన్నారు. మిట్టా ఎక్సలెన్స్ చైర్మన్ మిట్టా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్‌లలోనూ పాలీ హెల్త్ క్లినిక్, మెడికల్ హాల్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వీటిలో 21 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మిట్టా ఎక్సలెన్స్ డైరెక్టర్లు డాక్టర్ నిఖిల్, మహ్మద్ రఫీ, వైద్యులు నిఖిల్ కుమార్‌రెడ్డి, నిఖితా రెడ్డి పాల్గొన్నారు.


హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తూ..



హస్తం శ్రేణుల్లో జోష్

సాక్షి, సిటీబ్యూరో: టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం గాంధీ భవన్‌లో అట్టహాసంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు నగరానికి పెద్ద ఎత్తున తరలివచ్చాయి. మహేష్ కుమార్‌గౌడ్ తన నివాసం నార్సింగి నుంచి గన్ పార్క్ మీదుగా గాంధీభవన్ వరకు కార్లతో ర్యాలీగా వచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఆ అనుభవాల నుంచి పాఠాలు!

- గత ఏడాది గణేశ్ సామూహిక నిమజ్జనంలో తీవ్ర జాప్యం
- కారణాలను విశ్లేషించిన ఉన్నతాధికారులు
- ఈసారి పునరావృతం కాకుండా కసరత్తు
- హుస్సేన్ సాగర్ వద్ద పటిష్ట చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గణేశ్ సామూహిక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా గత ఏడాది ఎదురైన అనుభవాలను పాఠాలుగా తీసుకొని ఈసారి ఆటంకాలు, అడ్డంకులు లేకుండా కసరత్తు చేస్తున్నారు. బందోబస్తు కోణంలో సామూహిక నిమజ్జనం నగర పోలీసులకు ఫైనల్స్ వంటివి. గత కొన్నేళ్లతో పోలిస్తే గత ఏడాది ఈ ప్రక్రియ చాలా ఆలస్యమైంది. 2023 సెప్టెంబర్ 28 తెల్లవారుజాము నుంచి 29 రాత్రి 10 గంటల వరకు హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం జరిగింది. ఈ ఆలస్యానికి కారణాలను ఉన్నతాధికారులు విశ్లేషించి ఈసారి ఏ ఒక్కటీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ కొత్వాల్ సీవీ ఆనంద్ ఈ లోపాలను ప్రస్తావించారు. వీటిని జీహెచ్ఎంసీ సహా ఇతర విభాగాల దృష్టికీ తీసుకువెళ్లారు.

రెండు క్రేన్ల మధ్య వంద అడుగుల దూరం...

కొన్ని క్రేన్లలో ఇనుపతాళ్లకు బదులుగా బెల్ట్‌లు వాడారు. నిమజ్జనం సందర్భంలో ఇవి ఊడిపోవడంతో మరింత ఆలస్యమైంది. అత్యవసర పరిస్థితుల్లో ఆఖరి నిమిషంలో ట్యాంక్‌బండ్‌పై క్రేన్లు ఏర్పాటు చేయాల్సి వస్తే... ప్రతి రెండు క్రేన్ల మధ్య కనీసం 100 నుంచి 150 అడుగుల దూరం ఉండాలి. అలా చేస్తేనే నిమజ్జనానికి విగ్రహాలను తెచ్చిన లారీలు, ఖాళీ అయినవి తేలిగ్గా ముందుకు వెళ్తాయి. అయితే సరైన పర్యవేక్షణ లేని కారణంగా గత ఏడాది ప్రతి క్రేన్ మధ్య 30 నుంచి 40 అడుగుల దూరమే ఉంచారు. దీంతో విగ్రహాలను తీసుకొచ్చిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి భారీ ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఫలితంగా నిమజ్జనానికి వచ్చే విగ్రహాల కోసం క్రేన్లు ఖాళీగా వేచి ఉండాల్సి వచ్చింది. అదేవిధంగా ట్యాంక్‌బండ్‌పై బయటి ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులకు ఎక్కువగా డ్యూటీలు వేశారు. సరైన అవగాహన లేని వీళ్ళు సక్రమంగా తమ విధులను నిర్వర్తించలేకపోయారు.

పటిష్టంగా బారికేడింగ్

నిమజ్జనం చూడటానికి వచ్చే సందర్శకులు లారీల మధ్యలోకి, రోడ్డు పైకి రాకుండా ఇరువైపులా పటిష్ట బారికేడింగ్ ప్రతి ఏడాదీ ఏర్పాటు చేస్తుంటారు. ఇది గత ఏడాది సక్రమంగా జరగలేదు. దీంతో అనేకమంది లారీల మధ్యకు వస్తుండటంతో అవి చాలా ఆలస్యంగా కదిలాయి. మరోపక్క బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి లిబర్టీ వైపు వాహనాలను అనుమతించడం మరో ఇబ్బందికి కారణమైంది. విగ్రహాలు తీసుకువచ్చే లారీల వెనుక వచ్చే ద్విచక్ర వాహనాలు, ఇతరాలను గత ఏడాది పూర్తిస్థాయిలో అడ్డుకోలేదు. ఇది కూడా నిమజ్జనం ఆలస్యానికి కారణంగా మారింది. ఇవన్నీ విశ్లేషిస్తున్న ఉన్నతాధికారులు ఈసారి అవి పునరావృతం కాకుండా, గతం కంటే మెరుగైన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇవీ లోపాలు...

ముందుగా వచ్చే విగ్రహాలు నిమజ్జనం కాగానే బండ్ నుంచి 20 అడుగుల దూరం మేర నీటిలో పేరుకుపోయే వ్యర్థాలు, వస్తువులను వెంట వెంటనే తొలగించాలి. అలా జరగకపోవడంతో ఆ వెంటనే నిమజ్జనం చేసే విగ్రహాలు మునగడానికి చాలా సమయం పట్టింది. నిమజ్జనం సందర్భంగా సాగర్‌లో కనీసం నాలుగు, ఐదు ఫ్లోటింగ్ జేసీబీలను ఏర్పాటు చేయాలి. ఓ పక్క విగ్రహాలు నీటిలో పడుతుంటే, మరోపక్క వాటి వ్యర్థాలను తొలగించాలి. అయితే జీహెచ్ఎంసీ అధికారులు గత ఏడాది కేవలం ఒక్క ఫ్లోటింగ్ జేసీబీ మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ కారణాల వల్ల నిమజ్జనం ప్రక్రియ వేగంగా జరగడానికి తీసుకువచ్చిన అత్యాధునిక క్యూఆర్టీ హుక్స్ సరిగ్గా పనిచేయలేదు. క్రేన్ ప్లాట్‌ఫామ్‌కు ఉన్న నాలుగు మూలలు సమానంగా నీటిలోకి దిగితేనే ఇవి సక్రమంగా పని చేస్తాయి. అయితే సాగర్‌లో ఉన్న వ్యర్థాలు, విగ్రహాలు, ఇనుప సీకులకు తట్టుకుని నాలుగు వైపులా నీటిలో దిగక హుక్స్ వెంటనే రిలీజ్ కాలేదు. దీంతో కొన్ని విగ్రహాల నిమజ్జనానికి 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టింది.

పోలీసులకు ప్రజలు సహకరించాలి: సీపీ

- గణేష్ నిమజ్జనానికి సకల ఏర్పాట్లు
- 25 వేల మందితో భారీ బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

అబిడ్స్: గణేశ్ సామూహిక నిమజ్జనోత్సవానికి పోలీస్ శాఖ తరఫున సకల ఏర్పాట్లు చేశామని, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. నగరంలో 25 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల నిర్వాహకులు నిర్ణీత సమయంలో నిమజ్జనం కోసం విగ్రహాలను తరలించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం మధ్యాహ్నం ఒంటిగంటన్నరకల్లా పూర్తి అవుతుందని, మిగిలిన విగ్రహాలను సైతం త్వరితగతిన నిమజ్జనం చేసినట్లయితే మరుసటిరోజు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆనంద్ పేర్కొన్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్ష తరహాలోనే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను కూడా దీక్షగా భావించి మాంసం, మద్యం లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, వెంకన్న ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, నేతలు డాక్టర్ రావినూతల శశిధర్ కరోడిమల్, మెట్టు వైకుంఠం, శ్రీరామ్ వ్యాస్, గోవింద్‌రాఠి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో కారు బీభత్సం


ధ్వంసమైన వాహనాలు

అమీర్‌పేట: ఎస్ఆర్ నగర్‌లో కారు బీభత్సం సృష్టించింది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. రవి(46) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మద్యం మత్తులో కారు నడుపుతూ యూ టర్న్ తీసుకునే క్రమంలో బ్రేక్‌కు బదులుగా ఎక్స్‌లేటర్ నొక్కాడు. దీంతో కారు అదుపు తప్పి అక్కడే ఉన్న ప్యూర్ న్యాచురల్స్ షాపు మెట్లపైకి ఎక్కి ఆగిపోయింది. దీంతో షాపులో ఉన్న వారికి త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనలో నాలుగు ద్విచక్ర వాహనాలు, కాంప్లెక్స్ గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంగళరావునగర్‌లో ఉండే రవి కుటుంబ కలహాల నేపథ్యంలో రోజూ పీకల దాక మద్యం సేవిస్తున్నట్లు విచారణలో తేలింది. మద్యం మోతాదును పరీక్షించగా 400 పైగా వచ్చిందని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రేమికుడిపై ప్రియురాలు దాడి

కంటోన్మెంట్: ప్రేమించిన యువకుడిపై ప్రియురాలు దాడి చేసిన ఘటన బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాలు... ప్లంబర్‌గా పనిచేస్తున్న పెద్ద తోకట్టాకు చెందిన హరికృష్ణ(26), కంసాలి బజార్‌కు చెందిన అశ్వినీ(23) ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అశ్వినీ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. వీరి ప్రేమ విషయం పెద్దలకు తెలియడంతో ఇరువురికి ఏడాదిలోగా పెళ్లి చేస్తామని హరికృష్ణ తండ్రి యాదయ్య హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం న్యూబోయిన్‌పల్లి జయనగర్‌లో వాకింగ్‌కు వెళ్లిన హరికృష్ణతో అశ్వినీ వాగ్వాదానికి దిగింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికుడు ఒకరు యాదయ్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే సంఘటనాస్థలికి వెళ్లిన యాదయ్య వాకబు చేయగా అశ్విని తనపై సర్జికల్ బ్లేడుతో దాడి చేసినట్లు హరికృష్ణ తెలిపాడు. వెంటనే హరికృష్ణను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ విషయమై యాదయ్య ఆదివారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరికో కేఫ్ ఆరోపణలు అవాస్తవం

– ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: లంచం ఇవ్వనందుకే తమ కేఫ్‌పై ఎక్సైజ్ అధికారులు దాడి చేసినట్లు అరికో కేఫ్ యాజమాన్యం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడులు నిర్వహించిన వారం తరువాత అరికో కేఫ్ యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఎక్సైజ్ అధికారులపై అవాస్తవమైన ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు తమను రూ. 25 వేలు డిమాండ్ చేశారని, ఆ డబ్బులు ఇవ్వనందుకే దాడి చేసి కేసులు నమోదు చేశారని యాజమాన్యం చేసిన ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో ఆ ఆరోపణలను కమలాసన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తినుబండారాలు విక్రయించే బేకరీలు, కేఫ్‌లు తమ పరిధిలోకి రావని పేర్కొన్నారు. కానీ, అరికో కేఫ్ యాజమాన్యం తినుబండారాలు, ఐస్ క్రీం తయారీలో మద్యాన్ని వినియోగిస్తున్నట్లు తమకు అందిన పక్కా సమాచారం మేరకే దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మద్యం దుర్వినియోగం అంశం ఎక్సైజ్ శాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు. కిందిస్థాయి సిబ్బందిని ఎక్సైజ్ అధికారులు ప్రలోభపెట్టి ఐస్‌క్రీమ్ తయారు చేయించారని ఆరోపించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అరికో కేఫ్ యాజమాన్యం ఐస్‌క్రీమ్ తయారీలో 100 పైపర్ బ్రాండ్ విస్కీ వినియోగించినట్లు తేలిందని చెప్పారు.


మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన సందడి

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జన సందడి నెలకొంది. ఊరేగింపుగా నృత్యాలతో ప్రత్యేక వాహనాల్లో మినీ ట్యాంక్‌బండ్‌కు చేరుకుని విగ్రహాలను చెరువు నీటిలో నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక టవర్ల ద్వారా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. నిరంతర నిఘా కోసం పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జనం కోసం చెరువుకట్టపై ఆరు క్రేన్‌లు ఏర్పాటు చేశారు. చివరి రోజు మరో రెండు క్రేన్‌లు అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు. మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్, ఎలక్ట్రికల్ అధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం 9వ రోజు సుమారు 600 విగ్రహాలు (ఒక అడుగు పైన) వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలివచ్చినట్లు అధికారులు తెలిపారు.



నిలోఫర్‌లో 'కుర్చీ' కుస్తీ !

- సూపరింటెండెంట్ సీటు కోసం ఇద్దరు ప్రొఫెసర్ల కొట్లాట
- ఎటూ తేల్చని డీఎంఈ కార్యాలయం
- ఇబ్బందుల్లో రోగులు


డాక్టర్ రవి కుమార్


డాక్టర్ ఉషారాణి

నాంపల్లి: ప్రముఖ నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కుర్చీ కోసం ఇద్దరు ప్రొఫెసర్ల మధ్య కొట్లాట జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియతో ఈ వైరం మొదలైంది. సూపరింటెండెంట్ పోస్ట్ నీదా... నాదా అన్నట్లుగా పోటీ నడుస్తోంది. ఆగస్టు మొదటి వారంలో నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్‌కు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే ఏడాది కూడా పూర్తి కాక ముందే తనపై బదిలీ వేటు వేశారని, అక్రమ బదిలీని నిలుపుదల చేయాలంటూ డాక్టర్ ఉషారాణి నిజామాబాద్‌కు వెళ్లకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాగా, న్యాయస్థానంలో డాక్టర్ ఉషారాణికి అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు ఆదేశాలతో డాక్టర్ ఉషారాణి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు బుధవారం నిలోఫర్ ఆసుపత్రికి వచ్చారు. అయితే అక్కడ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ రవికుమార్ ఆమెకు బాధ్యతలు అప్పగించేందుకు నిరాకరించారు. చెక్కుబుక్స్, సెల్‌ఫోన్‌ను తన దగ్గరే ఉంచుకున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రొఫెసర్ పోస్టులో కొనసాగుతున్నారు.

ఇద్దరూ ఉడుంపట్టు...

అన్యాయంగా, అక్రమంగా తన పోస్టులో కొనసాగుతున్నారని డాక్టర్ ఉషారాణి ఆరోపిస్తుండగా, కాదు తనకే బాధ్యతలు ఇచ్చారంటూ డాక్టర్ రవి కుమార్ అంటున్నారు. ఇద్దరూ ఈ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డాక్టర్ రవికుమార్ పూర్తిస్థాయి బాధ్యతల కోసం కోఠిలోని డీఎంఈ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లుగా తెలుస్తోంది. తాను దళితుడినని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కూడా దళితుడేనని, ఎలాగైనా తనకే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తారనే నమ్మకంతో ఆయన ఉన్నారు. అయితే ఈ వివాదాన్ని డీఎంఈ కార్యాలయం కూడా ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో పడేసింది. మరోవైపు నిలోఫర్‌లో రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. వైరల్ జ్వరాలు సోకి బాధితులతో కిక్కిరిసిపోతోంది. నిలోఫర్‌లో రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌తో కలిపి మొత్తం 1,300 పడకలు అందుబాటులో ఉన్నాయి. ఈ పడకలు ఎటూ సరిపోవడం లేదు. పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేనికారణంగా నెల రోజులుగా పాలనంతా అస్తవ్యస్తమైంది. ఇప్పటికైనా నిలోఫర్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించాలని రోగులు, రోగి సహాయకులు, ఆసుపత్రి వర్గాలు కోరుతున్నాయి.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

విగ్రహం మీద పడటంతో నీటమునిగి యువకుడి మృతి


హంజా(ఫైల్)

మేడ్చల్ రూరల్: మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాలో శనివారం రాత్రి నిర్వహించిన వినాయక నిమజ్జనం అపశ్రుతి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ఓ యువకుడు నీటమునిగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజబొల్లారం తండాకు చెందిన మాజీ సర్పంచ్ మాంగ్యా నాయక్ తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి పలువురు యువకులు సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసే క్రమంలో కరంతోడ్ సురేందర్ అలియాస్ హంజా(28) నీటిలో మునిగాడు. ఈ విషయాన్ని గమనించని మిగతా యువకులు విగ్రహాన్ని నీటిలోకి నెట్టారు. ఈ క్రమంలో విగ్రహం మీద పడి హంజా నీటిలో మునిగిపోయాడు. నిమజ్జనం తర్వాత రోడ్డుపైకి వచ్చిన యువకులకు హంజా కనబడకపోవడంతో తిరిగి నీటిలోకి వెళ్లి చూడగా విగ్రహం కింద పడి విగతజీవిగా కనిపించాడు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు చేయాలని నిరసన

ట్యాంక్‌బండ్‌పై బారికేడ్లను తొలగించిన భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు


నిమజ్జనం జరగకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగిస్తున్న ఉత్సవ సమితి నేతలు


ట్యాంక్‌బండ్‌లో బారికేడ్లను తొలగించి గణేశ్ నిమజ్జనం చేస్తున్న ఉత్సవ సమితి నాయకులు

కవాడిగూడ: హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనానికి అనుమతులు లేవంటూ ప్రభుత్వం వాదించడం సరికాదని భాగ్యనగర్ ఉత్సవ సమితి నేతలు అన్నారు. ఆదివారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారుసల్లాం అజెండాను అమలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. 45 ఏళ్లుగా హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాలు చేస్తున్నామని, కొత్తగా ప్రభుత్వాలు రూల్స్ తీసుకొచ్చి హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దని అన్నారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లను తొలగించి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నేతలు డాక్టర్ ఆర్.శశిధర్, ఆలే జితేంద్ర, వినయ్‌కుమార్, శక్తిసింగ్ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ఏర్పాట్లు

ట్యాంక్‌బండ్ వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు 15 భారీ క్రేన్లను సమకూర్చింది. దీంతో ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు జరుగుతాయా లేదా అనే ఉత్కంఠకు తెరపడింది.


ట్యాంక్‌బండ్‌పై నిరసన తెలుపుతున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతలు

రాపిడో రైడర్ దారుణ హత్య


దినేష్ మృతదేహం

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన దినేష్(32) తన కుటుంబంతో కలిసి పంచశీల కాలనీలో నివాసం ఉంటూ రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా విధులకు వెళ్లిన దినేష్ ఐడీపీఎల్ ఫారెస్ట్‌లో హత్యకు గురయ్యాడు. ముఖం, కళ్లు, ముక్కుపైన గాయాలతో చనిపోయి ఉన్నాడు. అతడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

తండ్రి మందలించాడని..


మృతుడు ధమ్మపాల్

సుభాష్‌నగర్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పకు చెందిన అశోక్ కుమారుడు ధమ్మపాల్(17) చింతల్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా, శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి గణేశ్ నిమజ్జనానికి వెళ్లిన ధమ్మపాల్ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. మరునాడు ఇంటికి రాగానే అతడిని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం


టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న వెన్న సదానందు

లిబర్టీ: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

వైఆర్పీ ఫౌండేషన్‌ చేయూత


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ అందజేస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్‌: వైఆర్పీ ఫౌండేషన్‌, వైష్టోయి గ్రూప్‌ వ్యవస్థాపకుడు, మేనేజింగ్‌ డైరెక్టర్‌ యెలిశాల రవిప్రసాద్‌ నిరుపేద విద్యార్థులకు చేయూతనందించారు. ఈ సందర్భంగా నగరంలోని ఫౌండేషన్‌ కార్యాలయంలో ఆయన 40 మందికి పైగా నిరుపేద విద్యార్థులకు రూ.15 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను ఆదివారం పంపిణీ చేశారు.

ఘనంగా హిందీ దివస్‌


ప్రదర్శనలు నిర్వహిస్తున్న చిన్నారులు

బంజారాహిల్స్‌: బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో హిందీ దివస్‌ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భాషా సామర్థ్యాన్ని పెంపొందించేలా చేపట్టిన కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. చిన్నారులు కవితా పఠనంతో పాటు హిందీలో తమ వాగ్ధాటిని ప్రదర్శించారు. 'అంతరిక్ష్‌ కే పార్‌ కి దునియా' అనే ఇతివృత్తంపై సాగిన ప్రదర్శన, అలాగే కబీర్‌దాస్‌, మీరాబాయి, జయశంకర్‌ప్రసాద్‌ వంటి ప్రఖ్యాత కవుల వేషాధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

మాన్‌సూన్‌ సెలూన్‌ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న సినీ హీరో తేజ సజ్జ

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌లో మాన్‌సూన్‌ పేరుతో ఏర్పాటు చేసిన లగ్జరీ సెలూన్‌ను సినీ హీరో తేజ సజ్జ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్‌ క్లాస్‌ బ్యూటీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. తాను కూడా అందంగా కనిపించేందుకు చాలా ఇష్టపడతానని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ శుభి జోహారీ, టెర్రా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌ ఎండీ అర్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌ నిమజ్జనానికి సర్వం సిద్ధం..!

- విగ్రహాల తరలింపునకు ర్యూట్‌ మ్యాప్‌
- పూర్తయిన చెట్ల కొమ్మల తొలగింపు, గుంతల పూడ్చివేత
- ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటు


ఎత్తును సూచిస్తూ బంజారాహిల్స్‌ రోడ్‌ నంబర్‌-2 ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


బంజారాహిల్స్‌ రోడ్‌ నెం 9లో గుంతలు పూడ్చుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్‌: గణనాథుడి నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండపాల నుంచి విగ్రహాలను తరలించే రూట్‌మ్యాప్‌ను ఇప్పటికే పోలీసులు మండపాల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వివరించారు. బంజారాహిల్స్‌, ఫిలింనగర్‌, జూబ్లీహిల్స్‌, పంజగుట్ట, ఖైరతాబాద్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 1000 పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో ఇప్పటికే 30 శాతం మేర నిమజ్జనం పూర్తికాగా మిగతావి సోమ, మంగళవారాల్లో హుస్సేన్‌సాగర్‌కు తరలిరానున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు ఆయా మార్గాలను క్లియర్‌ చేశారు.

ఎత్తును చూపే సూచికలు..

బంజారాహిల్స్‌, పంజగుట్ట, జూబ్లీహిల్స్‌ ప్రాంతాల్లో పాదాచారులు రోడ్డు దాటేందుకు వీలుగా ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలు ఉన్నాయి. వీటి కింది నుంచి వెళ్లే విగ్రహాలను ఎత్తును సూచిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జీవీకే వన్‌ ముందు ఉన్న ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి కింది నుంచి 16 ఫీట్లు, బంజారాహిల్స్‌ రోడ్‌నెం.2 ఎల్వీ ప్రసాద్‌ ఆస్పత్రి వద్ద ఉన్న ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి కింది నుంచి 20 అడుగుల గణనాథుల విగ్రహాలు ముందుకు వెళ్తాయని ట్రాఫిక్‌ పోలీసులు సూచిస్తున్నారు.

గుంతలు లేకుండా చర్యలు...

గణనాథులు తరలివెళ్లే రోడ్లపై గుంతలు లేకుండా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. రోబో సాండ్‌, మట్టి, డాంబర్‌తో గుంతలు పూడ్చారు. ఇంకా ఎక్కడైనా గుంతలు ఉంటే తమకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని సర్కిల్‌-18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు.

పూర్తయిన చెట్ల కొమ్మల తొలగింపు..

రహదారుల వెంట చెట్ల కొమ్మలు గణనాథుల విగ్రహాలకు తగిలకుండా ఉండేందుకు వారం రోజులుగా జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్‌తో పాటు యూబీడీ, విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యటు చేపట్టారు. ప్రధాన, అంతర్గత రహదారుల్లోని భారీ వృక్షాల కొమ్మలను తొలగించారు. గతేడాది ఫిలింనగర్‌ యువజన సంఘం వినాయకుడిని కేన్సర్‌ ఆస్పత్రి మీదుగా నిమజ్జానికి తీసుకెళ్తుండగా చెట్ల కొమ్మలు తగిలి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ప్రాంతంలో కూడా చెట్ల కొమ్మలు తొలగించాలని మండప నిర్వాహకులు కోరుతున్నారు.


ఫిలింనగర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా 'మెడ్‌ కనెక్ట్‌'


కార్యక్రమంలో డాక్టర్‌ అక్రమ్‌ అహ్మద్‌

బంజారాహిల్స్‌: హెల్త్‌కేర్‌ ఎడ్‌టెక్‌ కంపెనీ అకడమిక్లీ గ్లోబల్‌ సంస్థ డాక్టర్‌ అక్రమ్‌ అహ్మద్‌తో కలిసి ఆదివారం మెడ్‌ కనెక్ట్‌ కార్యక్రమాన్ని నిర్వహించింది. దాదాపు 100 మందికి పైగా ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. మెడిసిన్‌, డెంటిస్ట్రీ, ఫార్మసీ, ఫిజియోథెరపీ, ఆప్టోమెట్రీ, ల్యాబ్‌ టెక్నాలజీలో కెరీర్‌ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో రెక్టార్‌ డాక్టర్‌ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ సునీతా రెడ్డి, అకడమిక్లీ గ్లోబల్‌ సీఈఓ డాక్టర్‌ అక్రమ్‌ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దాండియా శిక్షణ

లాలాపేట: సీఎస్‌ఆర్‌ మెమోరియల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం (ఈ నెల 16 నుంచి 30 వరకు) తార్నాకలోని మర్రి కృష్ణా హాల్‌ల్లో గర్బా, దాండియాలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు 63038 68045లో సంప్రదించవచ్చు.

నిధులు మంజూరు వివరాలు తెలపాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్‌ : సైట్‌-3 శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే ఎన్ని నిధులు మంజూరు చేయించారో తెలిపాలని పీజేఆర్‌ ఎస్పీఆర్‌హిల్స్‌ ఉమ్మడి బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య డిమాండ్‌ చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌ పీజేఆర్‌ ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము లోకాయుక్త ద్వారా వైకుంఠధామానికి నిధులు మంజూరు చేయించామని అందుకు సంబంధించిన జీవో కాపీలు తమ వద్ద ఉన్నాయన్నారు. శ్మశాన వాటికలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే క్రిస్టియన్‌ సోదరులను ఎమ్మెల్యే వాడుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలుసుల ఎల్లయ్య, చెన్నయ్య, అబ్బయ్య, ముద్దంగుల శేఖర్‌, నందునాయక్‌, పోగుల హనుమంతు, మురళీ మేఘన పద్మ, నాగమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు సత్కారం

లక్డీకాపూల్‌: ఇంజినీర్స్‌ డేను పురస్కరించుకుని ఇంజినీరింగ్‌ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురు ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్‌లోని లయన్స్‌ భవన్‌లో ఇంజినీర్స్‌ దినోత్సవ వేడుకలు జరిగాయి. లయన్స్‌ ఇంటర్నేషనల్‌ 320సి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, విద్యుత్‌ పంపిణీ సంస్థలకు చెందిన ఇంజినీర్లతో పాటు వాటర్‌ బోర్డు ఇంజినీర్లు, ప్రైవేటు రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యాక్రమంలో లయన్స్‌ జిల్లా చైర్మన్‌ బీఆర్‌ రావు, ప్రతినిధి ఎం.రాములు పాల్గొన్నారు.

ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ ఆంక్షలు

సుభాష్‌నగర్‌: వినాయక విగ్రహాల నిమజ్జనంలో భాగంగా రెండు రోజుల పాటు ట్రాఫిక్‌ ఆంక్షలు విధించినట్లు జీడిమెట్ల ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సూరారం లింగా చెరువులో గణేశ్‌ నిమజ్జన నేపథ్యంలో నర్సాపూర్‌ రాష్ట్ర రహదారిలోని సూరారం చౌరస్తా, బహదూర్‌పల్లి వద్ద వాహనాలను డైవర్ట్‌ చేయనున్నారు. గండిమైసమ్మ నుంచి వచ్చేవారు బహదూర్‌పల్లి జంక్షన్‌ నుంచి దూలపల్లి గ్రామం, జీడిమెట్ల ఈటీఎల్‌ మీదుగా బాలానగర్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బాలానగర్‌ నుంచి వచ్చే వాహనదారులు సూరారం చౌరస్తా నుంచి భౌరంపేట్‌ స్నేక్‌ పార్కు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుందని జీడిమెట్ల సీఐ పేర్కొన్నారు.

బీరప్ప, కురుమ కుల చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ

బంజారాహిల్స్‌: బీరప్ప, కురుమ కుల చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం వ్యవస్థాపకుడు ముత్త సంపత్‌కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేశ్‌కురుమ, కరీంనగర్‌ జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ తుల ఉమ తదితరుల సమక్షంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంచార వర్గానికి చెందిన కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మాణం చేసి పార్లమెంట్‌కు పంపాలని డిమాండ్‌ చేశారు. సబ్సిడీ గొర్రెల పథకానికి డబ్బులు కట్టిన ప్రతి లబ్ధిదారుడికి నెల రోజుల్లో రూ. 2 లక్షలు ఖాతాలో జమ చేయాలన్నారు. కురుమ కార్పొరేషన్‌ చైర్మన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్‌ పదవిని కురుమలకే ఇవ్వాలని దాదాపు 11 డిమాండ్ల సాధనకు కలసికట్టుగా పోరాడాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘాల నాయకులు శ్యాం కురుమ, రవికుమార్‌, ఎగ్గే మహేందర్‌, బెల్లం మాధవి, వంశీ కురుమ, పాండు, నర్రి స్వామి, శ్రీనివాస్‌, తెలంగాణ ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మయ్య ఒగ్గు, పృథ్వీరాజ్‌యాదవ్‌, విఠల్‌, బీరప్ప పుస్తక రచయిత నాగేశు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

లిబర్టీ: గణేశ్‌ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్‌ సూచించారు. సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా హైదరాబాద్‌ నిలిచిందని ఈసారి కూడా అదే ఒరవడిని కొనసాగించాలని ఎలాంటి వదంతులు నమ్మవద్దని, అన్ని వర్గాల సహకారంతో నిమజ్జనాన్ని పూర్తి చేయాలని కోరారు.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ

కాచిగూడ: తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ వారం రోజులుగా హైదరాబాద్‌ జిల్లా సీపీఐ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ తెలిపారు. బషీర్‌బాగ్‌ ప్రెస్‌ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ వాస్తవ చరిత్రను చీకటి పొరల్లోకి నెట్టాలనుకుంటున్న బీజేపీ ఆటలు సాగనీయమన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌ సంస్థానంలో సాగిన మహత్తరమైన ప్రజాపోరాట చరిత్రను సామాజిక మాధ్యమాల ద్వారా యువతలోకి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌.ఛాయాదేవి, స్టాలిన్‌, బి.వెంకటేశం, చందు నాయక్‌, నెర్లకంటి శ్రీకాంత్‌, చంద్రమోహన్‌ గౌడ్‌, ఉమర్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

కాచిగూడ: హైదరాబాద్‌ సంస్థాన విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినప్పుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లని ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్‌ విఠల్‌రావు ఆర్య అన్నారు. ఆర్య ప్రతినిధి సభ ఆంధ్రప్రదేశ్‌-తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని పండిత్‌ నరేంద్రభవన్‌లో హైదరాబాద్‌ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధులను ఘనంగా సత్కరించి అభినందించారు. హైదరాబాద్‌ విమోచన ఉద్యమానికి సంబంధించి భారత ప్రభుత్వం జరిపిన ఆపరేషన్‌ పోలో, ఉద్యమ పోరాటాన్ని పలువురు వక్తలు వివరించారు. విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గుచేటని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగఫలమే తెలంగాణకు స్వాతంత్య్రం వచ్చిందన్నారు.

సర్దార్‌ పటేల్‌ చొరవతో స్వేచ్ఛా వాయువులు పీల్చాం..

కోట్లాది మంది భారతీయులు నిరంతర పోరాటం, అసమాన త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం లభించిందని పేర్కొన్నారు. ఆ సమయంలో తెలంగాణ ప్రజలు తమవంతూ పాత్ర పోషించారని గుర్తు చేశారు. అదే సమయంలో నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రాజ్యంలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని చెప్పారు. అప్పటి హోంమంత్రి సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ చొరవ చూపి భారత భద్రత బలగాలను హైదరాబాద్‌ సంస్థానానికి పంపి పోలీసు చర్యతో విముక్తి కల్పించారని గుర్తు చేశారు. సర్దార్‌ పటేల్‌ చొరవతోనే స్వేచ్ఛా వాయువులు పీల్చామని అన్నారు.

మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారికంగా వేడుకలు

హైదరాబాద్‌ సంస్థానంలో ఉన్న కొన్ని ప్రాంతాలు మహారాష్ట్ర, కర్ణాటకలో విలీనమయ్యాయని అన్నారు. అయితే అక్కడ అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అల్వాల దేవేందర్‌ రెడ్డి, హరికిషన్‌ వేదాలంకార్‌, అచార్య విద్యానంద్‌, డాక్టర్‌ వసుదా శాస్త్రీ, ఠాకూర్‌ లక్ష్మణ్‌ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.


ఫిలింనగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న స్పీకర్‌ ప్రసాద్‌


శ్రీ వినాయక యూత్‌ ఆధ్వర్యంలో అన్నదానం..


వినాయకనగర్‌ పూజల్లో కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేశ్‌..


శ్రీ విజయగణపతి ఆలయంలో మహాపూర్ణాహుతి..


గణనాథుడితో చిన్నారి


దైవసన్నిధానంలో మహాపూర్ణాహుతి వేడుకలు..


రహమత్‌నగర్‌ అన్నదానం ..


ఎస్పీఆర్‌హిల్స్‌ భగత్‌సింగ్‌ యూత్‌ ఆధ్వర్యంలో..


పూజల్లో బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

గణనాథుడికి ఘనమైన పూజలు

జూబ్లీహిల్స్‌, ఖైరతాబాద్‌ నియోజకవర్గాల్లో గణేశ్‌ నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వినాయడికి పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు మండపాలను సందర్శించి పూజలు చేశారు. పలుచోట్ల లడ్డూలను వేలం వేయగా పోటీ పడి దక్కించుకున్నారు. అలాగే అన్నదానాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌, ఖైరతాబాద్‌, జోన్ల బృందం


రాజీవ్‌నగర్‌కాలనీలో హోమం..


గణనాథుడి వద్ద కుంకుమార్చనలో మహిళలు


లడ్డూని దక్కించుకున్న హీరోయిన్‌ భానుశ్రీ, బొవిళ్ల శ్రీకాంత్‌రెడ్డి


ఐపీసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి చెన్నారెడ్డి


నిమజ్జనోత్సవంలో భక్తులు


వెంకటగిరిలో పూజల్లో ఎమ్మెల్యే మాగంటి..


పూజల్లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి..


జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం. 36లో మహారాష్ట్ర బ్యాండ్‌ సందడి

మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

- భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో ఎంపీ లక్ష్మణ్

రహమత్‌నగర్(బోరబండ): మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయమం లేక అనారోగ్యం పాలవుతున్నారని ఆయన చెప్పారు. బోరబండ డివిజన్ నాట్కో ప్రభుత్వ పాఠశాలలో స్వర్ణభారత్, ఏఐజీ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సెల్‌ఫోన్ మోజులో పడి శారీరక శ్రమకు దూరమై ఆరోగ్యాన్ని పూర్తి అశ్రద్ధ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత రాత్రివేళలో సెల్‌ఫోన్లు చూస్తూ ఆలస్యంగా నిద్రలేచి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చిన్నపిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆరోగ్యం కోసం ప్రతిరోజూ ఒక గంట సమయం కేటాయించాలన్నారు. భారత ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు తాను ప్రతిరోజూ ఒక గంట షటిల్ ఆడేవాడినని తెలిపారు. ఎంపీ డా.లక్ష్మణ్, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన తొమ్మిది మంది వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 600 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. బీజేపీ నాయకులు అట్లూరి రామకృష్ణ, లంకల దీపక్‌రెడ్డి, కుంభాల గంగరాజు, బంగారు ప్రశాంత్, ప్రేమ్, కొలన్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం, సభ్యులు వెంకటనారాయణ, కిరణ్, సత్యనారాయణరాజు, కిషోర్, శివశంకర్, పీవీరావు, సురేష్, సతీష్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. గోరక్ష మహా పాదయాత్ర



గో భక్తుల ఆత్మీయ సమ్మేళనంలో కమలానంద భారతీ స్వామిజీ, సినీనటుడు సుమన్, బాలకృష్ణ గురుస్వామి

కాచిగూడ: గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ రక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అఖిల భారత గో సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి బృందం గోరక్ష మహా పాదయాత్ర చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కాచిగూడ శ్యామ్‌మందిర్‌లో జరిగిన గోభక్తుల ఆత్మీయ సమ్మేళనంలో భువనేశ్వరి పీఠం అధిపతి కమలానంద భారతీ స్వామిజీ ముఖ్యఅతిథిగా పాల్గొని గోరక్ష మహా పాదయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బాలకృష్ణ గురుస్వామి బృందం 14 రాష్ట్రాలు, 4,900 కిలోమీటర్లు, 6 నెలల పాటు కాలినడకన పాదయాత్ర చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందజేస్తూ యాత్ర కొనసాగుతుందన్నారు. మన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సినీ హీరో తల్వార్ సుమన్, ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయ్‌రామ్, సి.నందకిషోర్ యాదవ్, రఘోత్తం, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ నుంచి కన్వర్షన్ పొందే వరకు పోరాటం



మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు తదితరులు

కాచిగూడ: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆవిర్భావ సభను బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కే.ఈశ్వర్‌రావు, ప్రతినిధులు ఎంఏ వజీర్, బీ.శంకర్, వీ.నరేందర్, సీహెచ్.ఎల్లయ్య, జీ.నాగరాజు, జీ.అరవింద్‌కుమార్, వీ.తిరుపతి, ఎస్.సదానందం మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం యాజమాన్యాలు ఆర్టిజన్ కార్మికులను గ్రేడ్స్ రూపంలో విడదీసి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించి చివరి క్షణంలో ఆర్టిజన్ అనే పేరుతో ఒక ప్రత్యేకమైన స్టాండింగ్ ఆర్డర్స్‌ను తయారు చేసి 23 వేల మంది కార్మికులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వాలు మారినా మా బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్ నుంచి కన్వర్షన్ పొందే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎగ్జిస్టింగ్ పోస్టులను ఆర్టిజన్స్‌తో భర్తీ చేయాలని వారు దీనివలన సంస్థపై ఎలాంటి ఆర్థిక భారం పడదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

33 గంటల పాటు సినీ గీతాలాపన

- పంబ రత్నమ్మకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. పంబ రత్నమ్మ 33 గంటల పాటు హిందీ, తెలుగు సినీ గీతాలను ఆలపించి వండర్ బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత బింగి నరేందర్‌గౌడ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి మాట్లాడారు. రత్నమ్మ అంకితభావం, క్రమశిక్షణ కలిగిన గాయని అని ప్రశంసించారు. కార్యక్రమంలో గాయకులు మురళీధర్, పి.సురేష్, రాధాకృష్ణ, భారతి మోహన్, మధు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



భారీగా పెరిగిన వెల్లుల్లి ధర

- అల్లం, వెల్లుల్లి ధరల్లో వ్యత్యాసం
- పతనమైన అల్లం ధర
- వెల్లుల్లి ధర పెరిగే అవకాశం ఉందంటున్న మార్కెట్ వర్గాలు



సాక్షి, సిటీ బ్యూరో: మార్కెట్‌లో నిత్యం సమాన ధరలు పలికే అల్లం, వెల్లుల్లి(తెల్ల ఉల్లి) ధరల్లో తాజాగా భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. కిలో వెల్లుల్లి మార్కెట్‌లో రూ.380 నుంచి రూ.450 వరకు అమ్ముతుండగా, అల్లం మాత్రం కిలో రూ.60 నుంచి రూ.120 వరకు లభిస్తోంది. దీంతో మార్కెట్‌లో కొనుగోలుదారులు తెల్లముఖం వేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కొంత మంది మాత్రం దుకాణదారులతో వాదనకు దిగుతున్నారు. గతంలో కిలో రూ.150 నుంచి రూ.200 వరకు లభించేవి. ఇప్పుడు ఒక్కసారిగా రూ.450 ఎలా అయిపోతాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వెల్లుల్లి నిల్వలు తగ్గాయి. బయట నుంచి రావాల్సినవి రావడంలేదు. వచ్చిన కొద్దిపాటి సరుకు హాట్ కేకుల్లా అమ్ముడైపోతోంది. అందుకే ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక అల్లం విషయానికి వస్తే ఇప్పుడే కొత్త పంట మార్కెట్‌లోకి వస్తోంది. స్థానికంగా భారీగా సాగు చేయడం, బీదర్ నుంచి అల్లం వస్తుండటంతో ధరలు పడిపోయాయి. సాధారణ మార్కెట్‌లో కిలో రూ.60 పలుకుతున్నా, హోల్‌సేల్‌గా మాత్రం రూ.40కి మించడంలేదని వ్యాపారులు అంటున్నారు. ఏదేమైనా ఈ తరహా ధరల వ్యత్యాసం ఎన్నడూ చూడలేని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ధరలు ఎందుకు పెరుగుతున్నాయంటే..

సాధారణంగా హైదరాబాద్ మార్కెట్‌కు మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వెల్లుల్లి దిగుమతి అవుతుంది. గతేడాది ఆయా రాష్ట్రాల్లో వెల్లుల్లి ధర ఘోరంగా పతనమైంది. దీంతో రైతులు ఈ ఏడాది కూడా అలాగే ఉంటుందని భావించి సాగు పూర్తిగా తగ్గించేశారు. విత్తనాలను సైతం అమ్ముకునే పరిస్థితి కనిపించింది. దీంతో ఈ సీజన్‌లో దిగుబడులు లేక ధరలు పైపైకి వెళ్తున్నాయని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ధర కాస్తా డిసెంబరు నాటికి కిలో వెల్లుల్లి రూ.750 వరకు వెళ్తుందని అంచనా వేస్తున్నారు.

వెల్లుల్లి ధర ఇంకా పెరుగుతుంది

మార్కెట్‌కు సరుకు రావడం లేదు. భవిష్యత్తులో ఇంకా ధర పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం క్వాలిటీని బట్టి కిలో వెల్లుల్లి కిలో రూ.380 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు. మరో మూడు నెలల వరకు కొత్త పంట వచ్చే అవకాశం లేదు. ఈ ఏడాది చివరికి సుమారు కిలో రూ.750 వరకు వెళుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

– పురుషోత్తం, గుడిమల్కాపూర్

ఏఐ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులతో పాటు వందకు పైగా అంతర్జాతీయ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల నుంచి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్: 95058 00050లో సంప్రదించాలని సూచించారు.

సర్వీస్ సెంటర్ నిర్లక్ష్యం

- మునిగిన కారుకు రూ.31 లక్షల పరిహారం
- రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు

సిటీ కోర్టులు: అది 2020 అక్టోబర్ నెల.. హైదరాబాద్ నగరంలో కురిసిన భారీ వర్షాలు కురిశాయి. ఓ సర్వీస్ సెంటర్ నిర్లక్ష్యం వల్ల వరదల్లో కారు మునిగిపోయింది. పరిహారం కోసం బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. దీంతో రూ.31 లక్షల పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ సర్వీస్ సెంటర్‌ను ఆదేశిస్తూ సంచలన తీర్పును వెల్లడించింది. సర్వీస్ కోసం వచ్చిన కారును బయటకు తీయకుండా కారు పూర్తిగా దెబ్బతినడానికి సర్వీస్ సెంటర్ సిబ్బందే కారణమని కమిషన్ తేల్చింది. ఈ పరిహారాన్ని 45 రోజుల్లోపు పిటిషనర్‌కు చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు సీహెచ్ లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, శ్యామలతో కూడిన బెంచ్ తీర్పును ఇచ్చింది.

కారు ధర రూ.51 లక్షలు, రిపేరుకు రూ.50 లక్షల అంచనా..

హైదరాబాద్‌లోని బ్లూ ఓషన్ మల్టీ క్వయింట్ ఆఫీస్ వారు 2015లో రూ.51 లక్షలు వెచ్చించి వోల్వో కారును కొనుగోలు చేశారు. 2019లో కారు అకస్మాత్తుగా ఎయిర్ కండీషన్ పనిచేయకుండా ఆగిపోయింది. అంతేగాకుండా ఇంజిన్ వేడెక్కి ప్రమాదకరంగా మారింది. దీంతో వెంటనే పిటిషనర్ తల్వార్ కార్స్ ప్రైవేట్ సర్వీస్ సెంటర్ దగ్గర రూ.83 వేలు వెచ్చించి రిపేరు చేసుకున్నాడు. తర్వాత కొద్ది రోజులకే కారులో మళ్లీ సమస్యలు వచ్చాయి. కారు ఏసీ పూర్తిగా నీటితో నిండిపోవడంతో పలు రకాల సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో కారు యజమాని 2020లో కృష్ణ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించగా కారు రిపేరు కోసం రూ.2.73 లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో కారు రిపేరు కోసం సర్వీస్ సెంటర్‌లోనే పెట్టుకున్నారు. 2020లో భారీ వర్షాలు కురిసి వరదలు రావడంతో సర్వీస్ సెంటర్‌లోకి నీరు వచ్చి, కారు మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కారు రిపేరు కోసం రూ.50.45 లక్షల వరకు ఖర్చు అవుతుందని సర్వీస్ సెంటర్ సిబ్బంది అంచనా వేసి చెప్పారు. సరైన సమయానికి కారు రిపేరు చేయకుండా పెట్టి వరదల్లో మునిగిపోవడానికి కారణం అయిన సర్వీస్ సెంటర్ సిబ్బంది దీనికి పూర్తి బాధ్యత వహించాలని పిటిషనర్ సూచించాడు. దీనికి వారు అంగీకరించకపోవడంతో పిటిషనర్ రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ కారు పూర్తిగా దెబ్బతినడానికి కృష్ణ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీస్ సెంటర్ కారణమని తేల్చింది. అందుకు పైన తెలిపిన విధంగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఉత్తమ ఉపాధ్యాయులతోనే పాఠశాలకు గుర్తింపు

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

పోచారం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే ఉపాధ్యాయులతోనే పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందని శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నారపల్లి, చౌదరిగూడ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఎక్కువగా ఉంటారన్నారు. వారికి ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించి, మంచి మార్గంలో వెళ్లేలా కృషి చేయాలని కోరారు. పిల్లలకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పలు అంశాల్లో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అసోసియేషన్ చేపట్టే కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ వృత్తి వారైనా ఉపాధ్యాయుల చేతుల నుంచే ఎదుగుతారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించే దిశగా అసోసియేషన్ పనిచేస్తోందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి సన్మానపత్రంతో పాటు జ్ఞాపికను కోదండరాం చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు తొంట సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ గొంగళ్ల బాలేష్, నాయకులు నల్లవెల్లి శేఖర్, కొర్రెముల మాజీ వార్డు సభ్యుడు జి.మన్యం, సంఘ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కిరయ్‌కుమార్, కోశాధికారి తొంట కృష్ణ, ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి నాగమల్లు, సీహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను ప్రారంభిస్తున్న క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ తదితరులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్–క్రీడా)లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2వ వరకు పక్షం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలను ఆదివారం ఐసీఏఆర్–క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ ప్రారంభించారు. కార్యక్రమాలను సూచించిన తేదీల వారిగా కార్యకలాపాలు ప్రధాన కార్యాలయం, హెచ్ఆర్ఎఫ్, జీఆర్ఎఫ్, ఎస్సీఎస్‌పీ, టీఎస్‌పీ, కేవీకే దత్తత గ్రామాల్లో నిర్వహించనున్నామన్నారు. ప్రధాన కార్యాలయంలో ఐసీఏఆర్–క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ సిబ్బంది, మెగావర్సిటీ, హబ్, విద్యార్థులతో సహా సుమారు 75 మంది సభ్యులకు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పరిశుభ్రత ప్రాముఖ్యతను ఎత్తిచూపారు. స్వచ్ఛతా హి సేవ కోసం ప్రిన్సిపాల్ సైంటిస్ట్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.నాగార్జున కుమార్ 15వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న చేస్తున్న కార్యక్రమాలను ఉద్యోగులకు వివరించారు. పక్షం రోజుల్లో స్వచ్ఛత గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో వివిధ మండలాల్లోని ప్రధాన కార్యాలయం, గిరిజన ఉప ప్రణాళిక (టీఎస్‌పీ), ఎస్సీఎస్‌పీ, కేవీకే దత్తత గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.

సెవెన్‌హిల్స్‌లో శోభాయాత్ర

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని సెవెన్‌హిల్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. దాడి శ్రీనివాస్‌రావు–మౌనిక, జగన్– పావని కుటుంబాలు గణనాథుడిని ప్రతిష్ఠించి 9 రోజుల పాటు పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆ వినాయకున్ని ప్రార్థించామన్నారు.



ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల యూనియన్ వార్షికోత్సవం

గాంధీఆస్పత్రి: ఎయిడ్స్ నియంత్రణకు రెండు దశాబ్దాలుగా అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల యూనియన్ 15వ వార్షికోత్సవ వేడుకలను సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన 67 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేసిందన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలోనే చర్చిస్తానని అన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో 20 ఏళ్లపాటు పనిచేసిన స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు మొత్తం 67 మందికి 20 శాతం వెయిటేజీ లభించడంతో రెగ్యులరైజ్ అయ్యారని యూనియన్ ప్రధాన కార్యదర్శి సుజిత్‌గాంధీ వివరించారు. ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా నియంత్రించేందుకు కృషి చేస్తున్న టీసాక్స్‌ను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిదని తెలిపారు. కార్యక్రమంలో కనీస వేతనాల తెలంగాణ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యదీప్‌రెడ్డి, పబ్లిక్‌హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు ఆర్‌డీ చంద్రశేఖర్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘మైహోం భూజ’ లడ్డూ @ రూ.29 లక్షలు



లడ్డూ సొంతం చేసుకున్న కొండపల్లి గణేష్, సరితలను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

గచ్చిబౌలి: వినాయక చవితి ఉత్సవాల్లో గణేష్ లడ్డూకు ఎంతో ప్రాధాన్యత, విశిష్టత ఉందో ఏటేటా జరిగే వేలం పాటలో పోటాపోటీగా భక్తులు పాల్గొన్నట్లు వింటూనే ఉంటాం. అదే తరహాలో ఈ ఏడాది గణేష్ ఉత్సవాల్లో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మైహోమ్ భూజ గణేష్ ఉత్సవ లడ్డూ వేలం పాట ఆదివారం పోటాపోటీగా సాగింది. లడ్డూను చివరకు ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన గణేష్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి కొండపల్లి గణేష్, సరిత దంపతులు వేలం పాటలో రూ.29 లక్షలకు సొంతం చేసుకున్నారు. అనంతరం ఈ ఇద్దరు దంపతులు తమ పిల్లలతో కలిసి గణేష్ పూజల్లో పాల్గొని అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా లడ్డూను అందుకున్నారు. వారిని ఉత్సవ కమిటీవారు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు అభినందించారు.

ఇజ్జత్‌నగర్ అలేఖ్య విండ్ మిల్స్ అపార్ట్‌మెంట్ లడ్డూ రూ.56,116



ఇజ్జత్‌నగర్‌లో లడ్డూను సొంతం చేసుకున్న బీజేపీ నాయకుడు రాధాకృష్ణయాదవ్

ఇజ్జత్‌నగర్‌లోని అలేఖ్య విండ్ మిల్స్ అపార్ట్‌మెంట్‌లో కూడా లడ్డూ వేలంను ఆదివారం నిర్వహించారు. వేలం పాటలో బీజేపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్ కుటుంబ సభ్యులు పాల్గొని లడ్డూను రూ.56,116లకు సొంతం చేసుకున్నారు. అనంతరం గణేష్ పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తండ్రి గంగల నర్సింహాయాదవ్ చేతులమీదుగా లడ్డూను అందుకున్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో పెచ్చులూడిన స్లాబ్

- ఓ విద్యార్థి తలకు తీవ్రగాయాలు
- మరికొందరికి తప్పిన ప్రమాదం



వంశీకృష్ణను పరామర్శిస్తున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్లాబ్ పెచ్చులూడిన ప్రాంతం

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల(బాయ్స్)లో విశ్రాంతి భవనంలో స్లాబ్ పెచ్చులూడి పడటంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్న భోజనం అనంతరం బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి వంశీకృష్ణ వారికి సంబంధించిన విశ్రాంతి గదిలోకి వెళ్లాడు. రోజూ పడుకునే చోటే పడుకున్నాడు. ఒక్కసారిగా స్లాబ్ పెచ్చులూడి పడటంతో అతడి తలకు బలమైన గాయమైంది. అదేచోట ప్రతి రోజూ పడుకునే మరికొందరు విద్యార్థులు గది బయట ఉండిపోవడంతో వారికి ప్రమాదం తప్పింది. వంశీకృష్ణను వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి గాయమైన చోట కుట్లు వేసి చికిత్స అందించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులు రాత్రి వేళ పడుకునే సమయంలో సంఘటన జరిగి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. సంఘటన జరిగిన వెంటనే ఆయన కళాశాలకు చేరుకున్నారు. ప్రభుత్వం అద్దె సక్రమంగా చెల్లిస్తున్న నాసిరకం భవనంలో కళాశాలను కొనసాగిస్తున్న అధికారులు, అధ్యాపకులపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు.

కందుకూరు కళాశాల ఇక్కడ..

గత ప్రభుత్వంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాల మహేశ్వరం నియోజకవర్గంలోని (కందుకూరు) మంజూరైంది. కానీ కొన్నేళ్లుగా కళాశాలను మాత్రం శంషాబాద్ పట్టణంలోని సాతంరాయిలో ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా కళాశాలను మరోచోటికి మార్చేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నవ్యనాటక సమితి పోటీలు 19న ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి

నాంపల్లి: ఆరు దశాబ్దాల నవ్యనాటక సమితి 49వ జాతీయ సంగీత, నృత్య పోటీలు నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వారం రోజుల పాటు జాతీయ సంగీత నృత్య పోటీలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఏసీగార్డ్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణోత్సవాలకు దగ్గరపడుతున్న నవ్య నాటక సమితి సంగీత, నృత్య పోటీలు ఇన్నేళ్లుగా కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ఈసారి జరిగే పోటీలు తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో నృత్య ప్రదర్శనలు, శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి కళాకారులు విచ్చేస్తున్నారని తెలిపారు. పోటీల్లో సుమారు 384 మంది కళాకారులు పోటీ పడుతున్నారని తెలిపారు. 49 సంవత్సరాలుగా సాంస్కృతిక సేవలో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడం గొప్ప విషయం అన్నారు. పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి ఎ.లక్ష్మీనారాయణ హాజరవుతారని నవ్య నాటక సమితి అధ్యక్షులు విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నవ్యనాటక సమితి ప్రతినిధులు వసుంధర, రాజ్‌కుమార్, సుధారాణితో పాటు పలువురు నృత్య గురువులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీలో నివసించే దివ్య గచ్చిబౌలిలోని బొటిక్‌లో డ్రెస్ స్టిచ్చింగ్‌కి ఇచ్చారు.. స్టిచ్చింగ్ పూర్తయ్యాక వాళ్ల ఇంటికి ర్యాపిడో ద్వారా పంపారు. తీరా ఇంటికి వచ్చిన డ్రెస్ ధరించి చూస్తే కొన్ని ఆల్టరేషన్స్ అవసరం అని అర్థమైంది.. బొటిక్ వారిని సంప్రదిస్తే.. తమకు ఆ డ్రెస్‌ని ఇస్తే ఆల్టరేషన్స్ చేసి మరో రెండు రోజుల్లో పంపిస్తామన్నారు. కానీ దివ్య అదే రోజు ఫంక్షన్‌కు వెళ్లాల్సి ఉంది.. మరేం చేయాలి? 'ఇలాంటి సమస్య మాతో రాదు మేం డ్రెస్‌ని మాత్రమే ఇంటికి పంపం. టైలర్, కుట్టుమిషన్‌తో సహా పంపిస్తాం. ఏమైనా మార్పు చేర్పులు ఉంటే క్షణాల్లో చేసేసి ఇస్తాం' అంటోంది ఓ ఆన్‌లైన్ స్టిచ్చింగ్ సంస్థ. - సాక్షి, సిటీబ్యూరో





సేవలన్నీ కస్టమర్ ఇంటి ముంగిటకే

పలు చోట్ల టచ్ పాయింట్స్‌తో డిజైనర్లతో కన్సల్టేషన్స్

ఆన్‌లైన్ ఫ్యాషన్ సర్వీసెస్‌లో వినూత్న మార్పులు వంటి సేవలకు కేరాఫ్‌గా సిటీ

ఆన్‌లైన్ ఫ్యాషన్.. సేవల ఓషన్

కొనడం, కుట్టడం, కట్టడం దాకా..



అమెరికాలో ఉంటున్న నగరవాసికి సిటీలోని ఓ ప్రముఖ వస్త్ర షోరూమ్‌లో ఓ చీర నచ్చింది. అయితే అది కొని తన దగ్గరకు పంపించినా, ఆ చీరకు మ్యాచింగ్ బ్లౌజ్, సీకో వర్క్ వగైరాల కోసం అమెరికాలో వెదకడానికి సమయంతో పాటు వ్యయం కూడా ఎక్కువే..! మరేం చేయాలి? 'అంత కష్టం మీకక్కర్లేదు. ఆ షోరూమ్‌లో మీరు కొన్న చీర నేరుగా మాకే వస్తుంది. దానికి అవసరమైన బ్లౌజ్, వర్క్స్ పూర్తి చేసి భద్రంగా అమెరికా చేర్చే బాధ్యత మాదే' అంటోంది మరో స్టిచ్చింగ్ సంస్థ. ఒకటా రెండా.. దుస్తులు/ఫ్యాబ్రిక్స్ కొనడం, వాటిని కుట్టించడం, అంతేనా.. అందంగా చీర కట్టించడం.. దాకా కాదు ఏ సేవాకు ఆన్‌లైన్‌లో అసాధ్యం అంటున్నాయి నగరంలో పుట్టుకొచ్చిన పలు ఆన్‌లైన్ ఫ్యాషన్ బ్రాండ్స్. దాదాపు రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆన్‌లైన్ టైలరింగ్ సేవలు ఇంతింతై వటుడింతై అన్నట్టు విజృంభిస్తూ.. అనూహ్యమైన రీతిలో దూసుకుపోతున్నాయి. ఈ తరహా ఆన్‌లైన్ విప్లవాలకు సారథ్యం వహిస్తున్న సంస్థల్లో అత్యధిక భాగం మహిళల ఆధ్వర్యంలోనే ఉండడం విశేషం.

యాప్‌లోని మార్కెట్ ప్లేస్ ద్వారా..

'పలు చోట్ల పరిమిత విస్తీర్ణంలో ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేశాం. వీటిలో ఒక డిజైనర్, ఒక కుట్టుమిషన్ వగైరాలు అందుబాటులోకి తెచ్చాం. కస్టమర్లు నేరుగా సంప్రదింపులు చేసి అక్కడే ఆర్డర్స్ ఇచ్చి వెళ్లొచ్చు. చిన్న చిన్న ఆల్టరేషన్స్ కూడా చేయించుకోవచ్చు.. ఇలాంటివెన్నో కస్టమైజ్డ్ డ్రెస్సింగ్‌కు జత చేస్తున్నాం. అలాగే కస్టమర్స్ మా యాప్‌లోని మార్కెట్ ప్లేస్ ద్వారా నగరంలోని పలు షోరూమ్స్ నుంచి కొనుగోలు చేసిన చీరలు, డ్రెస్‌మెటీరియల్స్ మాకు చేరిపోతాయి. వాటికి అవసరమైన హంగులన్నీ జతచేసి తిరిగి కస్టమర్‌కు చేరవేసే బాధ్యత మాది. చీరకు బ్లౌజ్ వగైరాలు కుట్టడం మాత్రమే కాదు, అవసరమైతే చీర కట్టడం కూడా మా సిబ్బందే చేస్తారు.. విభిన్న రకాల శారీ డ్రేపింగ్స్ సైతం చేస్తారు. అంటూ నగరవాసులకు తాము అందిస్తున్న సేవల జాబితాను 'సాక్షి'కి వివరించారు సుష్మిత. నగరవ్యాప్తంగా దాదాపుగా 80కిపైగా డిజైనర్లు, పదుల సంఖ్యలో షోరూమ్స్‌తో కలిసి పనిచేస్తున్నామని చెప్పారామె. నగరంలో మాత్రమే కాకుండా బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోనూ క్లౌడ్ టైలర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.



హైదరాబాద్ వైబ్స్



సాఫ్ట్‌వేర్ నుంచి డిజైనర్ వేర్ దాకా..

'ఐటీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇప్పుడు ఏ సంస్థ లేదండీ. అలా చూస్తే ఇప్పుడు అన్నీ సాఫ్ట్‌వేర్ కంపెనీలే' అంటారు సుష్మిత. మంచి ఆదాయాన్నిచ్చే కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకుని, అంతకు మించిన ఆత్మసంతృప్తిని ఆశిస్తూ.. ఓ రెండేళ్ల క్రితం నగరంలో క్లౌడ్ టైలర్ పేరిట టైలరింగ్ సేవల్ని ప్రారంభించా. ఇంటి దగ్గరకే వచ్చి కొలతలు తీసుకుని ఫ్యాబ్రిక్స్ తీసుకెళ్లి, స్టిచ్చింగ్ పూర్తి చేసి తిరిగి ఇంటికే తెచ్చి ఇవ్వడం అనే ఏకైక సేవతో వేసిన తొలి అడుగుకే అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో ఇనుమడించిన ఉత్సాహంతో మా సేవల్ని కూడా విస్తరించాం. - సుష్మిత లక్కాకుల, ఫ్యాషన్ డిజైనర్



విదేశాల్లో ఎక్స్‌పోర్ట్స్, ఇంపోర్ట్స్ బిజినెస్‌లు చేసిన అనుభవం ఉన్న రుహిసుల్తానా.. నగరానికి వచ్చి ఆన్‌లైన్ టైలరింగ్ సేవల్ని అర్బన్ సిలాయీ పేరుతో ప్రారంభించారు. అనతికాలంలోనే పెద్ద సంఖ్యలో కస్టమర్లకు చేరువయ్యారు.. పిక్, స్టిచ్, డెలివర్ అనే కాన్సెప్ట్‌తో ఆమె ప్రారంభించిన ఈ సంస్థ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా తమ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు.

కుట్టుమిషన్‌తో సహా పంపిస్తాం..





'ఇప్పుడీ రంగంలో మరికొందరు కూడా ఉన్నారు. అయితే చెప్పిన సమయానికి ఏ మాత్రం తేడా రాకుండా ఖచ్చితత్వంతో ఇచ్చే డెలివరీలో మాకు సాటి లేదు. అదే విధంగా ఇంటికి డ్రెస్ మాత్రమే కాదు ఆల్టరేషన్స్ అవసరమైతే కస్టమర్ కళ్ల ముందే దాన్ని కంప్లీట్ చేయడానికి ఓ మాస్టర్‌ని కుట్టుమిషన్‌తో సహా పంపిస్తాం' అంటూ చెప్పారు. బంజారాహిల్స్‌లో ఓ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నా.. విదేశాల్లో సైతం మాకు కస్టమర్స్ ఉన్నారు. వారికి షిప్పింగ్ ద్వారా సేవలు అందిస్తున్నాం. త్వరలోనే ఇతర నగరాలకూ విస్తరించనున్నాం. - రుహిసుల్తానా, అర్బన్ సిలాయీ నిర్వాహకురాలు



లేబుల్స్ స్పేస్‌లో..

డీ సన్స్ పటోలా ఆర్ట్స్ ప్రదర్శన


సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్ 1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను ప్రముఖ ఫ్యాషనిస్ట్ ప్రవల్లిక గూడపాటి ఆదివారం ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు ముఖ్యంగా పటోలా ఆర్ట్ చీరలు, హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. నేటి తరం ఫ్యాషన్ ప్రియులకు నేరుగా వీవర్ నుండి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెటింగ్ సదుపాయాలను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్‌కోట, పటోలా దుపట్టా, శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు తమ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల నుండి ప్రదర్శిస్తున్నాయని ఈ నెల 20 వరకూ ప్రదర్శన కొనసాగుతుందని వివరించారు.



20 నుంచి

'అక్కినేని' ఫిలింఫెస్టివల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మల్టీప్లెక్స్ బ్రాండ్ పీవీఆర్ ఐనాక్స్ ఆధ్వర్యంలో దివంగత మహానటులు అక్కినేని నాగేశ్వరరావు 100వ పుట్టిన రోజు వార్షికోత్సవం సందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అన్నపూర్ణ స్టూడియోస్ సహకారంతో దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 20 నుంచి 3 రోజుల పాటు ఈ సినీ పండుగ జరగనుందని, ఇందులో భాగంగా దేవదాసు, మాయా బజార్, భార్యాభర్తలు, గుండమ్మ కథ, డాక్టర్ చక్రవర్తి, సుడి గుండాలు, ప్రేమాభిషేకం, ప్రేమ్ నగర్, మనం సినిమాలను ప్రదర్శిస్తామని తెలియజేశారు. అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ ఫెస్టివల్ హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర 32 నగరాలలో ఉంటుందన్నారు.





- ఆర్గానిక్, సహజసిద్ధ ఉత్పత్తులకు ప్రాధాన్యం
- భవిష్యత్ తరాల కోసం బాసటగా..

సందడిగా... ఆదివారం అంగడి



చదువుతూ.. బొమ్మలుగీస్తూ..

మేము ఇఫ్లూ యూనివర్సిటీలో స్కాలర్స్. మా చేతితో వేసిన ఆర్ట్, మినిమం క్రాఫ్ట్, వుడ్, వస్త్రం, పేపర్ మీద వేసిన చిత్రాలు, చెవి రింగులు మొదలు నెక్లెస్‌ల వరకూ మేం తయారు చేసిన వస్తువులు ప్రదర్శిస్తూ అమ్మకానికి ఉంచాం. కళ ప్రొత్సాహానికి ఆదివారం అంగడి ఒక సృజనాత్మక వేదికగా భావిస్తున్నాం. - శ్రేయోషి, అంజలి జోష్ (చిత్రకారులు)

భవిష్యత్తు తరాల కోసం..



పర్యావరణానికి హాని కలిగించకుండా, మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బ తీయని ఉత్పతులను పట్నం ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఆదివారం అంగడి నిర్వహిస్తున్నాం. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం కల్పించాలనే స్పృహతో, గ్రామీణ చేతి వృత్తులకు సహకారంగా నడుపుతున్నాం. ఇక్కడ ఉత్పత్తిదారులే అమ్మకందారులుగా చూడవచ్చు. ఉత్పత్తిదారుల కోసం మేం అనేక వర్క్‌షాప్స్ నిర్వహిస్తుంటాం. - నయనతార నందకుమార్. (ఆదివారం అంగడి నిర్వాహకురాలు)

చేతి కళలకు ప్రోత్సాహక వేదికగా...

బంజారాహిల్స్: అంగడి అంటే అందరికీ పల్లెటూర్లు గుర్తొస్తాయి. ఆ పల్లెటూర్లే పట్నం వచ్చినట్లు ఉంటుంది 'ఆదివారం అంగడి'. సికింద్రాబాద్‌లోని అవర్ సేక్రెడ్ స్పేస్ గార్డెన్‌లో ప్రతి ఆదివారం అంగడి జరుగుతుంది. గత 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సింథటిక్, కెమికల్స్ లేకుండా పండించిన, తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే అమ్మకానికి ఉంచుతారు. పల్లె, పట్టణంలో తయారు చేసిన చేనేత, క్రాఫ్ట్స్, వంటకాలు ఇలా అనేకం దర్శనమిస్తాయి. మొదట 20 స్టాల్స్‌తో మొదలైన అంగడి క్రమేణ 80 స్టాల్స్ గా రూపాంతరం చెందాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ సహజసిద్ధమైన ఉత్పత్తుల పట్ల మక్కువతో, పర్యావరణ స్పృహతో ప్రతివారం సందడి చేస్తుంది. ఆదివారం అంగడి వ్యాపార కోణంలో కాక ఓ సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్నారు. నిబంధనలకు లోబడి అందరికీ ఆహ్వానం పలుకుతోంది. ఎవరైనా తమ ఉత్పత్తులను, ఆర్ట్‌ను ఉచితంగా ఇక్కడ ప్రదర్శించవచ్చు, అమ్ముకోవచ్చు. గ్రామాల్లో చేతివృత్తులకు సాయంగా, కళాకారులకు ప్రోత్సాహక వేదికగా నిలుస్తోంది. వివిధ రాష్ట్రాల, వివిధ గిరిజన తెగల వస్తువులు లభ్యమవుతాయి.

సృజనను పెంపొందించడానికి..



గృహిణిగా వుంటూ ఉన్ని దారాలతో క్రోషియేట్ ఆర్ట్ వస్తువులు చేస్తుంటాను. నేను తయారు చేసిన వస్తువులను గత కొంతకాలంగా స్టాల్ నిర్వహిస్తున్నాను. కీ చెయిన్స్ మొదలు ఇంట్లో అలంకార వస్తువుల వరకూ అమ్మకానికి ఉంచుతున్నాను. చిన్నపిల్లలు, టీనేజ్ స్టూడెంట్స్ ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. వారి అభిరుచి మేరకు వస్తువులను తయారు చేస్తాం. - దీప్తి (క్రోషియేట్ కళాకారిణి)

వైవిధ్యమైన చేనేత వస్తువులు..



రెండేళ్లుగా చేనేత స్టాల్ నిర్వహిస్తున్నాం. దేశ వ్యాప్తంగా తయారైన చేనేత వస్తువులు, గిరిజన తెగల వారు రూపొందించిన వస్త్రాలు ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నాం. బెంగాలీ, ఢాక, ఒరిస్సా, అస్సాం, కర్ణాటక, పోచంపల్లి ఇక్కత్, మంగళగిరి, ప్రొద్దుటూరు, వరంగల్, పాలగుట్టపల్లి, లంబాడ మహిళలు నేసిన వస్త్రాలు, వస్తువులు లభ్యమవుతాయి. - పాయల్ (చేనేత స్టాల్)

ప్రతి వారం వస్తుంటాం..





ఇక్కడ చాలా వెరైటీలు, ఆర్గానిక్ వస్తువులు కొనుగోలు చేస్తుంటాం. కూరగాయల నుంచి చేనేత వస్తువుల వరకూ ఇక్కడే కొనుగోలు చేస్తుంటాం. వారితో స్నేహాలు ఏర్పడడం భలే అనిపిస్తుంది. చాలా సమయం కేటాయించి వారి కళతో, ప్రేమతో తయారుచేసిన వస్తువులు ఇక్కడ అందిస్తుంటారు. ఈ అంగడి ఆరోగ్యాన్నే కాక ఆహ్లాదాన్ని పెంపొందిస్తుంది. - డా. పద్మిని రాఘవన్

గాయత్రి మంత్రం ఏకదంతుని రూపం

- విభిన్న రూపాల్లో ప్రతిమలకు జీవం
- అబ్బురపరిచే ఆకారాలు తీర్చిదిద్దుతున్న కళాకారిణి







లక్డీకాపూల్: నగరానికి చెందిన దీపాల గాయత్రి సాధారణ గృహిణి. 2012లో ఆమె కుమార్తె వైష్ణవి స్కూల్ కాంపిటీషన్ కోసం పేపర్లతో గణేష్ ప్రతిమను చేశారు. మొదట ఐదారు గంటల పాటు శ్రమించినా వినాయకుడి రూపు రాలేదు. కూతురి అవస్థను గమనించిన గాయత్రి గణేషుడిని తయారు చేయడానికి సిద్ధపడింది. ఈ క్రమంలో పేపర్స్‌తో గణేషుడిని తయారు చేసింది. అభిమన్య యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన భారీ గణేషుడి పక్కన ఈ పేపర్ గణపతికి స్థానం లభించింది. భక్తులు, బంధువులు, స్నేహితుల నుంచి ప్రశంసలు దక్కాయి. అది మొదలు విభిన్న రూపాల్లో ఏటా ప్రతిమలకు ప్రాణం పోస్తున్నారు. దూది, టూత్‌పిక్స్, పెన్సిల్, జూట్, ఇలా అనేక రకాల వస్తువులతో అబ్బురపరిచే రూపాల్లో తీర్చిదిద్దుతున్నారు. చివరికి లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులతో కూడా గణనాథుని తయారుచేశారు. రెండు అడుగుల ఎత్తుతో మొదలు పెటి ప్రస్తుతం ఐదున్నర అడుగుల ఎత్తులో రూపుదిద్దారు. ఈ ఏడాది 700 ఉలెన్ బాల్స్‌తో గణాధ్యక్షుడిని రూపొందించడమే కాకుండా 90 కేజీల డాల్డాతో బలరామ్, సుభద్రలతో పాటు వినాయకుని రూపంలో శ్రీకృష్ణుడి ప్రతిమలను తీర్చిదిద్ది వావ్ అనిపించారు. స్వతహాగా చిత్రకారిణి అయిన ఆమె అప్పుడప్పుడు చక్కని చిత్రాలకు సైతం జీవం పోస్తున్నారు.

అభినందనలే ఆలంబనగా..



విభిన్న రూపాల్లో గణేషులను తయారు చేయడం ఓ హాబీగా మారింది. అభినందనలే ఆలంబనగా.. ఎనిమిదేళ్ల నుంచి కళా నైపుణ్యానికి పదునుపెడుతున్నా. నేను చేసిన గణేషుని రూపాలను స్కూళ్లు, కళాశాలల్లో ప్రదర్శిస్తున్నారు. అంతే కాకుండా మండపాల్లో పెట్టడంతో అందరి ప్రశంసలూ పొందుతున్నాను. - దీపాల గాయత్రి, వనస్థలిపురం

గవర్నర్ మిలాద్-ఉన్- నబీ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన కరుణ, సహనం, సమైక్యత, సామరస్యం, విశ్వ మానవ సోదర భావం.. నిత్యం మనందరిలో స్ఫూర్తిని నింపుతూ ఉంటాయని, అందరి మేలు కోసం పని చేసేలా ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

ప్రవక్త బోధనలతో ధర్మబద్ధ జీవనం : సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'మిలాద్-ఉన్-నబీ' పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని పేర్కొన్నారు. శాంతి, సోదర భావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటి చెప్పే ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి దిక్సూచి లాంటివని సీఎం తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు.

హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఇంజనీర్స్ డే వేడుకల్లో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. వందేళ్ల క్రితం హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తాయని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పక్కా మాస్టర్ ప్లాన్ దిశగా హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ '1908లో భారీ వరదలు వచ్చి హైదరాబాద్ నిండా మునిగింది. ఆ సమయంలో నిజాం నవాబు విశ్వేశ్వరయ్య గురించి తెలుసుకొని హైదరాబాద్‌కు ఆహ్వానించి హైదరాబాద్‌లో ఫ్లడ్ ప్రొటెక్షన్ అండ్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు గురించి చెప్పగా, హైదరాబాద్ భౌగోళిక స్థితిగతులపై పూర్తిగా అధ్యయనం చేసిన విశ్వేశ్వరయ్య నగరం పైభాగంలో ఉన్న 788 చెరువులకుగాను వరదల కారణంగా 221 చెరువులు పూర్తిగా ధ్వంసమయ్యాయని గుర్తించారు. వరదలను తట్టుకోవాలంటే నగరానికి పై భాగంలో ఓ పెద్ద రిజర్వాయర్ కట్టాలని ప్రపోజ్ చేశారు. అందులో భాగంగానే మూసీకి ఉపనది అయిన ఇప్పుడున్న హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేశారు' అని తెలిపారు. అనంతరం పలువురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐఈఐ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, మాజీ చైర్మన్ రమణానాయక్, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ మోయినుద్దీన్ పాల్గొన్నారు.

కూ.. చుక్.. చెక్..

రైలు ప్రమాదాల నివారణకు ఏఐ కెమెరాలతో నిఘా



భద్రత విషయంలో రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా రైళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిఘా కెమెరాలను ఏర్పాటు చేయనుంది. పట్టాలపై ప్రమాదకరమైన వస్తువులను దూరం నుంచే గుర్తించి లోకో పైలెట్లను అప్రమత్తం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రైళ్లు పట్టాలు తప్పడాన్ని నివారించడంతోపాటు ఉగ్రవాద, అసాంఘిక శక్తుల కుట్రలను తిప్పికొట్టే లక్ష్యంతో రైల్వేశాఖ వీటిని ఏర్పాటుచేయనుంది. ఇప్పటికే దేశంలోని అన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో సీసీటీవీ కెమెరాల నిఘా కొనసాగుతుండగా.. నడుస్తున్న రైళ్లను మాత్రం ఆర్ఎఫ్ఐడీ (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) పరిజ్ఞానం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. కానీ, నడిచే రైళ్లు ప్రమాదాలకు గురికాకుండా ముందుగానే అప్రమత్తంచేసే వ్యవస్థ ఇప్పటివరకు అందుబాటులో లేదు.

-సాక్షి, అమరావతి

మూడేళ్లలో 97 ప్రమాదాలు..

ఇటీవలి కాలంలో దేశంలో రైళ్లు పట్టాలు తప్పి ప్రమాదాలకు గురవుతున్న దుర్ఘటనలు గణనీయంగా పెరిగాయి. 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఈ ప్రమాదాలు 97 సంభవించాయి. కొన్నిచోట్ల విద్రోహశక్తులు రైలుపట్టాలపై ప్రమాదకరమైన వస్తువులను ఉంచి కుట్రలు పన్నిన ఉదంతాలూ ఉన్నాయి. దీంతో రైలు పట్టాలపై ఈ తరహా వస్తువులను ముందుగానే గుర్తించి ప్రమాదాలు నివారించేందుకు రైళ్లలో ఏఐ కెమెరాలను ఏర్పాటుచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

రూ.15 వేల కోట్లతో 75,000 ఏఐ కెమెరాలు..

ఈ నేపథ్యంలో.. రూ.15 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో 75 వేల ఏఐ కెమెరాలను ఏర్పాటుచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. 40 వేల బోగీలు, 14 వేల లోకోమోటివ్‌లు (ఇంజిన్‌లు), 6 వేల ఈఎంయూలలో ఈ కెమెరాలను ఏర్పాటుచేస్తారు. ప్రతి బోగీకి ఆరు కెమెరాలు, ప్రతి లోకోమోటివ్‌కు నాలుగు కెమెరాలను అమరుస్తారు. అక్టోబరు నుంచి ఏడాదిలోగా దశలవారీగా అన్ని రైళ్లలో ఏఐ కెమెరాల ఏర్పాటు పూర్తిచేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పలు కంపెనీలకు టెండర్లు అప్పగిస్తోంది.

సాగర్ ఎడమకాల్వ వారంలోగా పునరుద్ధరణ

▶ మొదటి పేజీ తరువాయి

ముక్త్యాల బ్రాంచి కాల్వకు పడిన భారీ గండ్లు, వాటి మరమ్మతులకు జరుగుతున్న పనులను పరిశీలించారు. మరమ్మతులను పూర్తి చేసి వారంలోగా ఎడమ కాల్వకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు సూచించారు. రెడ్లకుంట మేజర్ కాల్వకు 5 రోజుల్లో, ముక్త్యాల బ్రాంచి కాల్వకు 3 రోజుల్లోగా మరమ్మతులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కాగితం రామచంద్రాపురం దిగువన కుడికాల్వ కింద 2లక్షల ఎకరాలు, రెడ్లకుంట మేజర్ కాల్వ కింద 20వేల ఎకరాలు, ముక్త్యాల బ్రాంచి కాల్వ కింద 1.01 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు అవుతోందని, నీళ్ల కోసం రైతుల నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రింబవళ్లు పనులు నిర్వహించాలని ఆదేశించారు.

పునరుద్ధరణలో ఇంత వేగం ఎన్నడూ చూడలేదు..

ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు రాష్ట్రంలో ఎన్నడూ లేని రీతిలో భారీ వర్షాలు కురిసి వరదలు పోటెత్తగా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ పనులకు అంచనాలు తయారు చేశామని, అత్యవసరంగా షార్ట్ టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న వరద సహాయక చర్యల వేగాన్ని తన రాజకీయ జీవితంలో మరెన్నడూ చూడలేదన్నారు. సాగర్ కుడికాల్వకు పడిన గండిని పూడ్చడానికి సాధారణంగా నెల రోజుల సమయం పడుతుందని, వచ్చే ఆదివారంలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.



చిలుకూరు మండలంలో ఆర్లెగూడెం వద్ద పడిన గండి వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నష్టపోయాం.. మమ్మల్ని ఆదుకోండి..

కాగితం రామచంద్రాపురం, ఆర్లగూడెం, కరక్కాయలగూడెం పర్యటన సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు మంత్రి ఉత్తమ్‌ను కలిసి తమను ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు. వరదల్లో పంటలు దెబ్బ తినడమే కాకుండా పొలాల్లో నాలుగైదు అడుగుల మేర ఇసుక మేటలు వేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.16,500 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఇళ్లు నష్టపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మానుకోండి



ఏపీ సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి.. అవసరం లేదంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసే బృహత్తర యజ్ఞానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తన చేతులతో తానే భంగం కలిగించడం అత్యంత హేయం, దుర్మార్గమని మండి పడ్డారు. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితుల్లో మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం అని చంద్రబాబును నిలదీశారు. 'ఇకనైనా కళ్లు తెరవండి.. వెంటనే ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కు తీసుకోండి. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోండి' అని హితవు పలికారు. మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి, పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'మీకు చేతనైనంత మీరు ఖర్చు చేస్తూ వెళ్లండి.. మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తి చేస్తాం. అంతేకానీ ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం మాటున స్కామ్‌లు చేయడం మానుకోండి. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని గుర్తించుకోండి' అని చంద్రబాబును హెచ్చరించారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వ తీరును తూర్పారపడుతూ ఆదివారం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

రెడ్‌బుక్ కుట్ర.. ఐపీఎస్‌లపై కక్ష సాధింపు

- పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీలపై ఏపీ సర్కారు వేటు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరుతున్నాయి. ఇందుకోసం పోలీసు వ్యవస్థనే భ్రష్టుపట్టించేందుకు బరితెగిస్తోంది. అందులో భాగంగానే ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి. కాంతి రాణా, విశాల్‌గున్నీలను సస్పెండ్ చేస్తూ ఆదివారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. 'వలపు వల(హనీ ట్రాప్) వేసి బడా బాబులను బురిడీ కొట్టించే కేసుల్లో నిందితురాలు కాదంబరి జత్వానీని అడ్డంపెట్టుకుని చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు తెరతీశారు. చంద్రబాబు ప్రభుత్వ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంతో సాగిన ఈ కక్ష సాధింపు కుట్ర కోసం ఏకంగా న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేయడమే కాదు.. నిబంధనలనూ తుంగలో తొక్కారు. ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా చూపించకుండానే వారిని సస్పెండ్ చేయడంపట్ల పోలీసువర్గాలు విభ్రాంతి వ్యక్తంచేస్తున్నాయి.

విచారణ అధికారిగా జూనియర్ అధికారి..

సాధారణంగా.. ప్రభుత్వ అధికారులపై ఫిర్యాదులు వస్తే విచారణకు పాటించాల్సిన నిబంధనలను నిర్భీతిగా చంద్రబాబు సర్కారు ఉల్లంఘించింది. సస్పెన్షన్‌కు గురైన ముగ్గురిలో పీఎస్ఆర్ ఆంజనేయుడు డీజీ స్థాయి, కాంతిరాణ ఐజీ స్థాయి, విశాల్ గున్నీ డీఐజీ స్థాయి అధికారులు. వారిపై ఫిర్యాదులొస్తే వారికంటే ఉన్నతస్థాయి అధికారినిగానీ సమాన స్థాయి అధికారికిగానీ విచారణ బాధ్యతలు అప్పగించాలి. కానీ, వారికంటే జూనియర్ అయిన ఎస్పీ స్థాయి అధికారిగా ఉన్న విజయవాడ డీసీపీ స్రవంతి రాయ్‌ను విచారణాధికారిగా నియమించడం గమనార్హం. ఆమె కూడా నిబంధనలను పాటించకుండానే విచారణ తంతు ముగించారు. ఫిర్యాదు వచ్చిన ముగ్గురు పోలీసు అధికారులను ఆమె కనీసం సంప్రదించనే లేదు. పైగా వారి నుంచి వివరాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. ఇక పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీ వాంగ్మూలాలు నమోదుచేయాలన్న కనీస నిబంధనను కూడా పాటించకపోవడం విడ్డూరం. మరి స్రవంతి ఏ ప్రాతిపదికన విచారణ నిర్వహించారన్నది అంతుబట్టడమే లేదు. ప్రభుత్వ పెద్దలు ఆదేశించినట్లుగానే ఆమె ఏకపక్షంగా నివేదిక సమర్పించారని పోలీసు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు కనుసన్నల్లోనే సాగినట్లు స్పష్టమవుతోంది. విచారణ ప్రక్రియ సక్రమంగా నిర్వహించారా లేదా అన్నది డీజీపీ కూడా పరిశీలించనే లేదు. ప్రభుత్వ 'ముఖ్యనేత' ఆదేశాల ప్రకారం ఈ ముగ్గుర్ని ఏకపక్షంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇదే కేసులో ఏసీపీ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణలను కొన్నిరోజుల క్రితమే సస్పెండ్ చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏకపక్షంగా సస్పెన్షన్ ఉత్తర్వులు..

పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీలను సస్పెండ్ చేస్తూ జారీచేసిన ఉత్తర్వుల్లో అందుకు ఒక్క ఆధారాన్ని కూడా ప్రభుత్వం చూపించలేదు. ముంబై నటి కాదంబరి జత్వానీని నిబంధనలకు విరుద్ధంగా అరెస్టుచేసినందునే సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. కానీ, ఆమె అరెస్టు ఎలా అక్రమం అనేందుకు ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేదు. ఎందుకంటే కాదంబరి జత్వానీ అరెస్టు అంశంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి విజయవాడ పోలీసు అధికారులు నిబంధనల మేరకే వ్యవహరించారు. అదెలాగంటే..

- విజయవాడ న్యాయస్థానం నుంచి సెర్చ్ వారంట్ తీసుకుని మరీ పోలీసులు ముంబై వెళ్లారు.
- కాదంబరి జత్వానీని అరెస్టుచేసే విషయాన్ని ముంబై పోలీసులకు ముందుగానే తెలిపారు. వారి సహకారంతో వారి సమక్షంలోనే ఆమెను అరెస్టుచేశారు. • అనంతరం కాదంబరి జత్వానీ అరెస్టుకు సంబంధించిన పంచనామా నివేదికను ముంబై న్యాయస్థానానికి సమర్పించారు. • దాంతో ఆమె అరెస్టు సక్రమమేనని ముంబై న్యాయస్థానం నిర్ధారించి ఆమెను విజయవాడ తీసుకువెళ్లేందుకు అనుమతినిస్తూ పీటీ వారంట్ జారీ చేసింది. అనంతరం.. కాదంబరి జత్వానీని విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆమె అరెస్టు సక్రమమేనని విజయవాడ న్యాయస్థానం సైతం నిర్ధారించి.. ఆమెపై పోలీసులు నమోదు చేసిన అభియోగాలకు బలం చేకూర్చే సాక్ష్యాధారాలతో సంతృప్తి చెందింది. అందుకే ఆమెకు రిమాండ్ విధించింది.

..ఇలా కాదంబరి జత్వానీ అరెస్టు ప్రక్రియలో అప్పటి విజయవాడ పోలీసులు ఇంతగా నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే.. అసలు ఆమె అరెస్టు అక్రమమని టీడీపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటం విడ్డూరంగా ఉంది. ఒక్క ఆధారం చూపించకుండానే అక్రమ అరెస్టని ఏకపక్షంగా ప్రకటించడం ప్రభుత్వ కక్షసాధింపు చర్య తప్పా మరొకటి కాదని పోలీసు వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా తమను సస్పెండ్ చేయడంపై పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించాలని పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీ భావిస్తున్నట్లు సమాచారం.

ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

ప్రాజెక్టు వద్దనుకుంటే రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ ప్రాజెక్టును ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైకోర్టు సైతం ఈ విషయంలో స్పష్టత కోరిందని, తక్షణమే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించే లక్ష్యంతో ఫార్మా సిటీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ఆలోచన చేశామన్నారు. భూ సేకరణను సైతం పూర్తి చేశామని తెలిపారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గందరగోళం నెలకొందన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లుగా సీఎం ప్రకటించటంతో ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఫార్మా సిటీ వస్తే ఉద్యోగాలొస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడతాయని భూములు ఇచ్చిన రైతుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామంటే కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మొండి పట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని కోరారు. ప్రాజెక్టును రద్దు చేయాలని భావిస్తే రైతుల భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. భూములను ఇతర అవసరాలకు వాడతామంటే రైతులతో పాటు బీఆర్ఎస్ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు: 'అసలు పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆ తర్వాత పదవులు పోతాయన్న భయంతో ఈ నాటకాలెందుకు?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'సిగ్గులేకుండా ఇంత నీతిమాలిన రాజకీయం ఎందుకు? మీరు ప్రలోభపెట్టి చేర్చుకున్న వాళ్లను మా వాళ్లు అని చెప్పుకోలేని మీ బాధను చూస్తే జాలి కలుగుతోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయండి

మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే మాదిగల మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం మేలుకొలుపు యాత్ర కరపత్రాన్ని చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి విడుదల చేశారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై కమిటీ వేయడం హర్షణీయమన్నారు. పిడమర్తి రవి మాట్లాడుతూ, మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణతో తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భుదాల బాబూరావు, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓక్కల గద్ద చంద్రశేఖర్, తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రమళ్ళ మొగులయ్య, జేఏసీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు నక్క మహేశ్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెరిపోతుల సాయి మాదిగ పాల్గొన్నారు.

మంచిమాట

ప్రేమించు... జీవించు...

ఈ సృష్టి సమస్తం ప్రేమ మయం.. సృష్టిలో సమస్త జీవరాశుల పట్ల ప్రేమ కలిగి ఉండటమే అత్యుత్తమమైన ఆధ్యాత్మిక సాధన అని మహాభారతం చెబుతోంది. 'ప్రాణం పోసే మహత్తర శక్తి ప్రేమకు ఉంది. శారీరక, మానసిక, నైతిక ఆరోగ్యాలకు ప్రేమ ఎంతో అవసరం. ప్రేమకు కొలతలు లేవు. తరతమ భేదాలు లేవు. అది అనంతమైనది. విశ్వవ్యాప్తమైనది..



మనిషి సంఘజీవి. ఏకాకిగా అతడు సంఘంలో ఎక్కువ కాలం ఉండ లేడు. అతడు జీవించాలంటే ప్రేమ కావాలి. ప్రేమ లేనిదే మనిషి జీవితం వ్యర్థం. మనిషి మనుగ డకు మూలం ప్రేమ. మానవ సంబంధాలు నిలబడేది, కొనసాగేది ప్రేమ పునాది పైనే. అయితే ప్రేమ అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చేది యువతీయువకుల మధ్య ఉండే ప్రేమ.. కేవలం యువ తీయువకులదే కాదు ఇరుగు పొరుగు వారిది, తల్లిదండ్రులది, పిల్లలది, స్నేహితుల మధ్యన ఉండేది కూడా ప్రేమే. సమస్త మానవాళిలో ఉన్న ప్రేమను అవ గతం చేసుకుంటే అది మానవ జీవితానికి పరిపక్వతని స్తుంది. ప్రేమ గురించి సంపూర్ణంగా తెలిసినవారే, దాన్ని ఆస్వాదిస్తారు. ఇతరులకు పంచగలుగుతారు. ప్రేమ మనిషిని దైవంగా మారుస్తుంది.. ఆ దైవత్వం తోనే మనిషి ఎలాంటి కార్యాలనైనా సాధించగలుగు తాడు.. ప్రేమ గురించి , దాని శక్తి గురించి స్వామి వివే కానంద, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్ట్ లాంటి ఎం దరో మహనీయులు ఈ లోకానికి తెలియ చేశారు. ఈ క్రమంలో ప్రేమతత్వం ద్వారా కోట్ల మందిని ప్రభా వితం చేశారు. ప్రేమలో నిర్భయత్వాన్ని, ఆనందాన్ని సాధించే మార్గాలను వారు ఈ లోకానికి అందించారు.

అయితే ప్రేమ అనేది కేవలం మనుషుల మధ్యనే కాదు అది సమస్త జీవరాశుల మీదా ఉండాలి. అలాంట ప్పుడే ఈ ప్రకతి అంతా ప్రేమ మయంగా అందంగా, ఆహ్లాదంగా కనిపిస్తుంది. బొం దితో స్వర్గానికి వెళ్ళే అర్హత ధర్మరాజుకు ఉంది. ఆయన స్వర్గానికి వెళ్ళే సమయం లో ఓ కుక్క అతని వెంట పడుతుంది. ఆ కుక్కను ప్రేమగా చూసిన ధర్మరాజు కుక్కను వదిలి స్వర్గానికి వెళ్ళడానికి అం గీకరించడు. ఇలా చివరి క్షణంలో సైతం కుక్క మీద ప్రేమ కురిపించి మూగజీ వాల పట్ల తన దయాగుణాన్ని చాటుకు న్నాడు. సాక్షాత్తు శిరిడీ సాయి నాథుడు ఎప్పుడూ ప్రజలతో పాటు మూగ జీవా లను కూడా ఎంతగానో ప్రేమించే వారు. అలాగే రమణ మహర్షితో పాటు ఇంకా అనేక మంది యోగులు, మునులు, సిద్ధులు తమ ప్రేమను జంతు జీవాలపై కురి పించి విశ్వ మానవ ప్రేమను చాటుకు న్నారు...ఇలా ఆప దలో ఉన్నవారిని, రోగ గ్రస్తులను మాత్రమే కాదు ఈ సృ ష్టిలో ఉన్న సమస్త జీవ రాశులను ప్రేమించిననాడే మానవ జీవితానికి పరిపక్వత సిద్ధిస్తుంది. ప్రేమ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో తారసపడుతుంది. జీవితంలో ప్రతి మనిషి తన స్నేహితులను, తల్లితం డ్రులను, పిల్లలనూ ప్రేమిస్తూనే ఉం టాడు. అలాగే సుందరమైన నదులు, కొండలపై జారు జలపాతాలు, ఇసుకతో కూడిన ఎడారులు, ప్రకతి శోభ, చెట్టు చేమ, జంతువులు, పక్షుల, వింతగా కని పించే మబ్బులు, మిణుకు మిణుకుమనే నక్షత్ర సముదాయం, రోదసి, అందం, సుందరం, బుజ్జి పాపాయి అమాయక నవ్వు, మనుషుల స్నేహం, అభిమానం , వీటి అన్నింటిలో కూడా ప్రేమ కనిపి స్తుంది. వికసిస్తుంది. ప్రేమ మనకు ప్రకృతి ఇచ్చిన వరం.

మనిషి మౌలికంగా దైవస్వరూపు డని, శరీరంలో నివసించే ఆత్మే దైవ మని అనేక మంది మహనీయులు సెలవి చ్చారు. జ్ఞానం పెరిగే కొద్దీ ఆధ్యాత్మికత వికసి స్తుంది. అలా వికసించినపుడే అన్ని భేదాలు అంత రించి ప్రేమతత్వం సాధ్యపడుతుంది. ఏవిధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా, మంచి మన సుతో మనం ఒకరి పట్ల చూపే నిస్వార్థమైన ఆదరణే ప్రేమ'. ఇది ఒక ఉన్నతమైన, పవిత్రమైన, గొప్పదైన భావన.


– దాసరి దుర్గాప్రసాద్

సమాజంలో అశాంతి ప్రబలి, మానవులు వక్రమార్గం పట్టినప్పుడు, వారిని సన్మార్గపథాన నడిపించడానికి అనేకమంది సంస్కర్తలు, మహాపురుషులు ఈ పుడమిపై జన్మిం చారు. ఆ పరంపరలో చివరి ప్రవక్త ముహమ్మద్ (స). ఆ మహనీయుని జన్మదినమే 'మిలాదున్నబి'.

ఇస్లాం ధర్మం

చరిత్ర పుటలపై చెరగని సంతకం

మహా ప్రవక్త జననం



క్రీ. శ. 571 ఏప్రిల్ నెల ఇరవయ్యోతేదీన అరేబియా దేశంలోని మక్కా నగరంలో ముహమ్మద్ ప్రవక్త(స)జన్మించారు. తల్లి దం డ్రులు ఆమినా, అబ్దుల్లాహ్. ఈ మహనీ యుడు జన్మించకముందే తండ్రినీ, ఆరేళ్ళ ప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. అనాథ అయిన ఆరేళ్ళ బాబును తాతయ్య అక్కున చేర్చుకున్నారు. నీతి, నిజాయితీ, సేవాతత్ప రత, సత్యసంధత, విశ్వసనీయత ఆయనకు ఉగ్గుపాలతోనే అలవడ్డాయి. ఈ కారణంగానే ఆయన ప్రజల మనసులు చూరగొని 'సాదిఖ్'గా, 'అమీన్ ' గా పిలవబడ్డారు. ముహమ్మ ద్‌కు చదవడం, రాయడం రాదు. అయినా ఆయన బోధలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. నాటి యావత్ అరే బియా ద్వీపకల్పమంతా ఆయన బోధన లకు ఆకర్షితమైంది. ఫలితంగా సమస్త దుర్మార్గాలూ అంతమయ్యాయి. అసత్యం, అవినీతి, అక్రమాలు, దోపిడి, సారాయి, జూదం, వడ్డీ, అంటరానితనం, హత్యలు, అత్యాచారాలు అన్నీ సమసిపో యాయి. స్త్రీ అం గడి సరుకు అన్న భావన నుంచి, స్త్రీని గౌరవిం చనిదే దైవప్రసన్నత దుర్ల భమన్న విశ్వాసం వేళ్ళూ నుకుంది. అన్నిరకాల చెడులు, అసమానతలు అంతమై పొయ్యాయి. బడుగులు, బలహీనుల హక్కులు పరిరక్షించబ డ్డాయి. మానవ సమాజం లో అన్ని విధాలా శాంతి, సౌభాగ్యాలు పరిఢవిల్లాయి. అందుకే, ధర్మబోధకులందరిలో అత్యధికంగా సాఫల్యాన్ని పొందిన ప్రవక్త 'ముహమ్మద్ ' మాత్రమేనని ఎన్ సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా ఘనంగా కీర్తించింది. అంతేకాదు, ప్రారంభకాలపు మూల గ్రంథాలన్నీ ఆయన్ని విశ్వసనీయమైన వ్యక్తిగా, సత్యసంధుడైన మని షిగా పరిచయం చేస్తాయని ప్రకటించింది. ప్రపంచ చరిత్రను ప్రభావితం చేసిన మహా పురుషులను గురించి మైకేల్ హెచ్.హార్ట్ ఒక పుస్తకం రాశారు. అందులో రాసిన వందమంది మహాపురుషుల జాబితాలో 'ముహమ్మద్ ' ప్రవక్త పేరు అందరికన్నా అగ్రస్థానంలో మనకు కనిపిస్తుంది. ఇంతమంది ఇన్నిరకాలుగా ప్రశం సించిన ఆమహనీయులు నేడు మనమధ్యలేరు.

కాని ఆయన బోధనలు మనవద్ద సురక్షి తంగా ఉన్నాయి. మనం వాటిని ఆచరించ గలిగితే చాలు. ఎందుకంటే, నేటి మన సమాజం అన్నిరకాల అవలక్షణాలతో సతమత మవుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం ఎంతప్రగతి సాధించినా, నైతిక, ధార్మిక, మాన వీయ రంగాల్లోమాత్రం తిరోగమనంలోనే ఉన్నా మన్నది నిజం. నేటి మన సమాజంలో ఏరం గమూ సంతృప్తికరంగాలేదు. ఎంత ప్రగతిప థంలో పయనిస్తున్నా, నేటికీ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉంది. స్త్రీలకు రక్ష ణలేని పరిస్థితి. అవినీతి, అక్రమాలకు కొదవే లేదు. మద్యపానం, జూదం, అశ్లీలం, అంటరానితనం, నిరక్షరాస్యత, ఆడసంతానం హత్యలు, అత్యాచారాలు, హత్యా రాజకీ యాలు నిరాఘాటంగా సాగిపోతూనే ఉన్నాయి. ఇవన్నీ సమసిపోవాలం టే, సమాజం నుండి ఈ దుర్మా ర్గాలు అంతం కావాలంటే, నీతి, నిజాయితీలతో కూడిన, ఎలాంటి వివక్ష, తారతమ్యా లకు తావులేని, ఉన్నత మానవీయ విలువలతో నిండిన సుందర సౌభాగ్య వంతమైన సమాజం పునర్ నిర్మాణం కావాలంటే ఈ అమృత బోధనలను అధ్యయనం చేయాల్సిన, ఆచ రించాల్సిన అవసరం ఉంది.

అజ్ఞానతిమిరంలో తచ్చాడే మానవజాతికి జ్ఞానకాంతులతో సన్మార్గం చూపిన మహాత్ముడు ఇహలోకం వీడి దాదాపు 1450 సంవత్సరాలు అవుతున్నా ఆ మహనీయుని బోధలు మనవద్ద సురక్షితంగా ఉన్నాయి. వాటిని గనక మనం ఆచరించగలిగితే, నేడు సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ అధిగమించి ఓ సుందర సత్సమాజాన్ని ఆవిష్కరిం చుకోవచ్చు. నేటి పరిస్థితుల నేపథ్యంలో ముహమ్మద్ ప్రవక్త(స) బోధనల పట్ల దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

(నేడు ప్రవక్త జయంతి 'మిలాదున్నబీ')

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పంచ మహాయజ్ఞం

పంచమహా యజ్ఞం అని ఐదు యజ్ఞాలు నిరంతరం జరిగే ప్రదేశం గృహస్థాశ్రమం. గృహస్థాశ్రమ ప్రవేశం చేసినవారు ఈ ఐదింటిమీద శ్రద్ధపెట్టి ఉండాలి. అందుకే దీనిని యజ్ఞం అని వదిలేయకుండా మహాయజ్ఞం అని అన్నారు. సాధారణంగా యజ్ఞం అంటే అగ్నిముఖంగా హవిస్సును ఇవ్వడం ఉంటుంది. స్వాహాకారంతో అగ్నిహోత్రు డిని పిలిచి ఇచ్చిన హవిష్యాన్నం దేవత లకు అందచేయడానికి ..అని యజమాని సంకల్పం చేస్తాడు. కానీ అగ్ని ఆరాధనం పంచ యజ్ఞాలలో అంతర్భాగం అయిన ప్పటికీ ... మిగిలిన నాలుగింటినీ కూడా యజ్ఞాలనే పిలిచారు. వీటినే మహాయజ్ఞా లని అన్నారు. అలా అనడానికి కూడా ఒక కారణం ఉంది. దీనికి ప్రత్యేకంగా హోమశా లకానీ, ప్రత్యేకంగా మంత్రభాగం కానీ అవ సరం లేకుండా ప్రతివారు కూడా శ్రద్ధతో అనుస రించాల్సిన విష యాలు ఈ ఐదింటిలో అంతర్లీనంగా ఉంటాయి. ''నేను ఈ గృహస్థాశ్రమంలో ప్రవేశించినందుకు దీనిని ధన్యం చేసుకుని తరించడానికి ఈ ఐదు ఆలంబ నాలు. వీటిని ఊతంగా చేసుకుని తరించాలి'' అని గృ హస్థు భావిస్తాడు. అందుకే ఇవి గృహస్థాశ్రమంలోనే నడుస్తాయి.

వీటిలో మొదటిది – అధ్యాపనం బ్రహ్మయజ్ఞః– అంటారు. అధ్యాపనం అంటే బోధ చేయడం. బోధ చేయడాన్నే బ్రహ్మ విద్య.. అంటారు. బోధ దేనికి! మనిషి తరించడానికి ఇది మార్గాన్ని చెబుతుంది. సనా తన ధర్మం గొప్పతనం ఏమిటంటే.. అది ఏది పట్టుకోవాలో చెబుతుంది, ఏది పట్టుకోకూడదో చెబుతుంది. పట్టుకోకూడదన్నంత మాత్రం చేత అదంత సులభసాధ్యం కాదు కాబట్టి పట్టుకోకుండా ఉండడానికి ఎటువం టి మనస్తత్వాన్ని సాధించుకోవాలో ఇది బోధ చేస్తుంది. అది మన రుషుల ప్రత్యేకత.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మనకు సంవ త్సరం ఆరంభంలో అంటే సంవత్సరాది నాడు చేదుపచ్చడి తినిపిస్తారు. సంవ త్సరం పూర్తి ఎప్పుడు.. అంటే చాం ద్రమానంలో కాదు, ఫాల్గుణ మాసంలో వచ్చే అమావాస్య కాదు, సౌరమా నంలో వచ్చే భోగి పండగను ప్రమాణం చేస్తారు. భీష్మ ఏకాదశి, కష్టాష్టమి, మహా శివరాత్రి, శ్రీరామనవమిల లాగా తిథు లతో కూడుకుని రాదు. భోగికి తిథి ఉం డదు. దక్షిణాయనానికి చిట్టచివర వచ్చేది.. భోగిపండగ అవుతుంది. దక్షిణా యనం ఉపాసనా కాలం. ఉపాసన కష్టం గా ఉంటుంది. పరిశ్రమ చేయడానికి, ఉపాసన చేయడానికి సిద్ధపడితే అది చేదు తినడం.. కష్టపడాలి కాబట్టి ఉగాది పచ్చడిని ప్రారంభంలో తినిపిస్తారు. కష్టప డడం దేనికి! తరించడానికి అవకాశం రావాలంటే ముందుగా ఈశ్వరుడు పెట్టుబ డిగా ఇచ్చిన శరీరాన్ని సాధన ద్వారా సిద్ధపర చాల్సి ఉంటుంది.



ఎవరు కష్టపడ్డారో, ఎవరు ఉగాదినాడు చేదు పచ్చడి తిన్నారో, వారు భోగినాడు పొం గల్.. మధుర పదార్థం తింటారు. అంటే భోగం అనుభవించే అర్హత పొం దుతారు. ఏ ఉపాసన చేయకుండా, ఏ శాస్త్రానీ్న పాటించకుండా, ఏ ఆశ్రమంలో ఉన్నారో దాన్ని ధన్యం చేసుకోకుండా భాగ్యం కావాలంటే సాధ్యం కాదు. ఇవన్నీ బోధించి గృహస్థాశ్రమ ప్రవేశం చేయించి, అక్కడ విధివిధానాలు సక్రమంగా నిర్వర్తిం చేటట్లు బోధించడమే ..అధ్యాపన యజ్ఞం. అంటే ఒక రికి చెప్పడం.. అదెప్పుడు సాధ్యం. ముందుగా మన చదివి ఉంటేనే కదా.. దేనికోసం చదవాలి....అంటే ఇది మన కర్తవ్యం ఏమిటో మనం తెలుసుకోవడం కోసం ఉపయోగపడేది.

కసవు చీర... కాటుక కళ్లు...

ఓనమ్ స్పెషల్



అనుపమ



కాళిదాస్ జయరాం



భర్త, కుమారుడితో అమలా పాల్



కల్యాణీ ప్రియదర్శన్



భర్త గౌతమ్ కార్తీక్‌తో మంజిమా

ఓనమ్ పండగకి కళకళలాడిపోయారు తారలు. పండగ ప్రత్యేకమైన కసవు చీర కట్టుకుని, సంప్రదాయ నగలు పెట్టుకుని, కళ్లకు కాటుక పెట్టుకుని మెరిసిపోయారు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. అమ్మ చీర కట్టుకుని, కొప్పున పువ్వులు పెట్టుకుని అందంగా ముస్తాబైన అనుపమా పరమేశ్వరన్ 'ఇవాళ ఓనమ్ పెన్నే...' అంటూ పలు ఫొటోలను షేర్ చేశారు. భర్త జగత్ దేశాయ్, కుమారుడు ఇలయ్‌తో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు అమలా పాల్. 'ఇవాళ ఓనమ్ థీమ్ ఏంటంటే పాయస మ్' అంటూ చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను షేర్ చేశారు కల్యాణీ ప్రియదర్శన్. భర్త, హీరో గౌతమ్ కార్తీక్‌తో కలిసి పండగ చేసుకున్నారు మంజిమా మోహన్. ఓనమ్ పండగకి అంబారీ స్వారీ చేయకపోతే ఎలా అంటూ నటుడు కాళిదాస్ జయరాం సందడి చేశారు. చేతిలో కలువ పువ్వు పట్టుకుని అనిఖా సురేంద్రన్, మియా జార్జ్ కనువిందు చేశారు. జడకు తామర పువ్వు పెట్టుకుని ప్రెట్టీగా అన్నా బెన్, జుత్తుకి మల్లెలు చుట్టి బ్యూటిఫుల్‌గా మిర్నా మీనన్, అరిటాకులో పువ్వులు పెట్టి చిరునవ్వుతో అందంగా మహిమా నంబియార్, సింపుల్‌గా స్టైల్ ఇచ్చినా సూపర్‌గా కనిపించిన అతుల్యా రవి, అంతే అందం గా కనిపిం చిన అనంతికా సనీల్‌కుమార్, నవ్యా నాయర్... ఇలా ఎవరికి వారు చక్కగా రెడీ అయి, 'ఓనమ్ శుభాకాంక్షలు' తెలిపారు.



అనిఖా సురేంద్రన్



అతుల్యా రవి



మహిమా నంబియార్



మియా జార్జ్



అన్నా బెన్



అనంతిక



నవ్యా నాయర్



మిర్నా మీనన్

సినిమా

పీరియాడికల్ ఫిల్మ్‌లో...




కార్తీ

కార్తీ హీరోగా నటించనున్న కొత్త సినిమా ప్రకటన ఆదివారం వెలువడింది. ఈ భారీ పీరియాడికల్ ఫిల్మ్‌కు 'టానాక్కారన్' ఫేమ్ తమిళ్ దర్శకత్వం వహించనున్నారు. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు, ఇషాన్ సక్సేనా, సునీల్ షా, రాజా సుబ్రమణియన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. కార్తీ కెరీర్‌లో 29వ చిత్రంగా ఈ సినిమా తెరకెక్కనుం ది. ''భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం. 2025లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఈ చిత్రానికి చెందిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ప్రేమలో పడ్డాక...

నిజ జీవిత ఘటనల మేళవింపుతో రూపొందుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'శారీ'. సత్య యాదు, ఆరాధ్య దేవి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. గిరి కృష్ణకమల్ దర్శకత్వం లో ఆర్‌జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌గోపాల్‌వర్మ, రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నవంబర్లో విడు దల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ''ఉత్తరప్రదేశ్‌లో ఎంతోమంది అమాయకమైన మహిళలను హత్యా చారం చేసిన ఓ శారీ కిల్లర్ ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. చీరలో ఉన్న అమ్మాయిని చూసి, ఆమెతో ప్రేమలో పడిన తర్వాత ఓ అబ్బాయి జీవితం ఎలా భయానకంగా మారింది అన్నదే ఈ చిత్రకథాంశం'' అని యూనిట్ పేర్కొంది.



ఆరాధ్య దేవి, సత్య యాదు



సాయి విష్ణుతో కలిసి మేఘా ఆకాశ్ ఏడడుగులు వేశారు. ఆదివారం చెన్నైలో వీరి వివాహం ఘనంగా జరిగింది. రాజకీయ కుటుంబానికి చెందిన సాయి విష్ణు, హీరోయిన్ మేఘా ఆకాశ్‌లది ప్రేమ వివాహం. కుటుంబ సభ్యులు వీరి ప్రేమను ఆమోదించడంతో ఆ మధ్య నిశ్చితార్థం జరిగింది. ఇక పెళ్లి వేడుకల్లో భాగంగా గడచిన మూడు నాలుగు రోజుల్లో మెహందీ, సంగీత్ వంటివి జరిగిన అనంతరం వివాహ రిసెప్షన్‌ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వివాహ వేడుక జరిగిం ది. వివాహ రిసెప్షన్‌కి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం. స్టాలిన్‌తో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. పెళ్లికి కూడా ఈ రెండు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అక్టోబరులో లగ్గం

సాయి రోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిం చిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్, రోహిణి ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు రమేష్ చెప్పాల దర్శకత్వం వహించగా, వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 18న రిలీజ్ కానుంది. ''కుటుంబసభ్యులందరూ కలిసి చూడదగ్గ సినిమాగా 'లగ్గం' ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు రాజేంద్రప్రసాద్. ''తెలంగాణ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. మనుషుల భావోద్వేగాలు, కుటుంబ విలువలు వంటి అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అన్నారు వేణుగోపాల్ రెడ్డి. ఎల్బీ శ్రీరామ్, సప్తగిరి, రఘుబాబు తదితరులు నటించిన ఈ సినిమాకు చరణ్ అర్జున్ సంగీతం అందించగా, మణిశర్మ నేపథ్య సంగీతం అందించారు.



ప్రగ్యా, సాయి రోనక్

ధర్మాన్ని ఎలా కాపాడాలి?

ప్రవీణ్ కేవీ, యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మహీష'. దర్శకుడు ప్రవీణ్ కేవీ రూపొందించిన ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో దర్శకుడు కొండా విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, టీజర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''మహిళలపై జరుగుతున్న దాడులు ఎలా ఆపగలం? అనే కాన్సెప్ట్‌తో చేసిన చిత్రమిది. ఈ చిత్రం మంచి విజయం సాధించి, హీరో–దర్శకుడు ప్రవీణ్‌తో పాటు యూనిట్ అందరికీ మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ధర్మాన్ని ఎలా కాపాడాలన్నది ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'యదా యదా హి ధర్మస్య' అనే సినిమా చేస్తాం'' అన్నారు నటుడు–దర్శకుడు ప్రవీణ్ కేవీ.



ప్రవీణ్ కేవీ, యషిక



ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య చివరి టి20 రద్దు

భారీ వర్షం కారణంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం మాంచెస్టర్‌లో జరగాల్సిన చివరి టి20 మ్యాచ్ రద్దయింది. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా ఆట సాధ్యం కాలేదు. దాంతో టాస్ కూడా వేయకుండా నిర్ణీత సమయానికి రెండు గంటల తర్వాత మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దాంతో మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ 1–1తో సమంగా ముగిసింది. ఈ నెల 19 నుంచి ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌లతో కూడిన వన్డే సిరీస్ జరుగుతుంది.

రన్నరప్ సహజ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో సహజ (భారత్)–జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్) జోడీ 1–6, 7–5, 8–10తో అరియానా–కేలా క్రాస్ (కెనడా) జంట చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది ఐటీఎఫ్ టోర్నీలో సహజ రన్నరప్‌గా నిలువడం ఇది రెండోసారి. జూలైలో ఇండియానాలో జరిగిన ఇవాన్స్‌విల్లె టోర్నీలో సహజ–హిరోకో (జపాన్) ద్వయం ఫైనల్లో ఓడిపోయింది.





స్వీడన్ చేతిలో భారత్ ఆరో‘సారీ’

- దేవిస్‌కప్ టెన్నిస్ టోర్నీలో ఓటమి
- ఇక వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్‌లో పోటీ

స్టాక్‌హోమ్: అగ్రశ్రేణి క్రీడాకారులు సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ లేకుండానే డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్–1లో పోటీపడ్డ భారత జట్టుకు నిరాశాజనక ఫలితం ఎదురైంది. స్వీడన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారతజట్టు 0–4తో ఓడిపోయింది. డేవిస్‌కప్ టోర్నీ చరిత్రలో స్వీడన్ జట్టు చేతిలో భారత జట్టుకిది వరుసగా ఆరో పరాజయం కావడం గమనార్హం. స్వీడన్‌తో పోటీపడ్డ ఆరుసార్లూ భారత జట్టు ఓడిపోయింది. ఈసారి మాత్రం భారత ఆటగాళ్లు నాలుగు మ్యాచ్‌లు ఆడినా కనీసం ఒక్క సెట్ కూడా గెలవలేకపోయారు. తొలి రోజు శనివారం రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో భారత క్రీడాకారులు ఓడిపోయారు. ఫలితంగా తదుపరి దశకు అర్హత పొందాలంటే ఆదివారం మూడు మ్యాచ్‌ల్లోనూ (డబుల్స్, రెండు రివర్స్ సింగిల్స్) భారత ప్లేయర్లు తప్పనిసరిగా గెలవాలి. అయితే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ–రామ్‌కుమార్ రామనాథన్ జోడీ 3–6, 4–6తో ఆండ్రీ గొరాన్సన్–ఫిలిప్ బెర్గెవి జంట చేతిలో ఓటమి పాలైంది. దాంతో స్వీడన్ జట్టు 3–0తో విజయాన్ని ఖరారు చేసుకొని వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత పొందింది. ఫలితం తేలిపోవడంతో నాలుగో మ్యాచ్‌గా జరిగిన నామమాత్రమైన సింగిల్స్‌లో జాతీయ మాజీ చాంపియన్ సిద్ధార్థ్ విశ్వకర్మను బరిలోకి దించారు. డేవిస్‌కప్‌లో తొలిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధార్థ్ 2–6, 2–6తో ఇలియాస్ యామెర్ చేతిలో ఓడిపోయాడు. ఈ పరాజయంతో భారత జట్టు వచ్చే ఏడాది డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1లో చోటు సంపాదించేందుకు ప్లే ఆఫ్ దశ మ్యాచ్‌లు ఆడుతుంది.


ఇలియాస్ యామెర్

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

- నేడు దక్షిణ కొరియాతో భారత హాకీ జట్టు సెమీఫైనల్ పోరు
- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి సోనీ స్పోర్ట్స్ టెన్–1 చానెల్‌లో, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



హులున్‌బుయిర్ (చైనా): ఆసియా పురుషుల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు లీగ్ దశలో అజేయంగా నిలిచింది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నాకౌట్ దశలోనూ తమ జోరు కొనసాగించాలనే లక్ష్యంతో నేడు జరిగే సెమీఫైనల్లో దక్షిణ కొరియాతో టీమిండియా తలపడనుంది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు లీగ్ దశలో 21 గోల్స్ సాధించి కేవలం నాలుగు గోల్స్ సమర్పించుకుంది. ఆతిథ్య చైనా జట్టుపై 3–0తో గెలిచి ఈ టోర్నీలో శుభారంభం చేసిన భారత జట్టు ఆ తర్వాత జపాన్‌పై 5–1తో, మలేసియాపై 8–1తో గెలిచింది. అనంతరం దక్షిణ కొరియాపై 3–1తో, చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 2–1తో విజయం సాధించిన భారత జట్టు ఈ టోర్నీలో అన్ని విభాగాల్లోనూ ఆకట్టుకుంది. ఫార్వర్డ్ శ్రేణిలో, మిడ్ ఫీల్డ్‌లో, డిఫెన్స్‌లో భారత ఆటగాళ్లు సమష్టిగా రాణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన స్ట్రయికర్లు ఈ టోర్నీలో మాత్రం మెరిశారు. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ్ సింగ్, గుర్జోత్‌సింగ్, అరిజిత్ సింగ్ అంచనాలకు మించి రాణించారు. యువ మిడ్ ఫీల్డర్ రాజ్‌కుమార్ పాల్ మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో ‘హ్యాట్రిక్’ సాధించాడు. మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్, వైస్ కెప్టెన్ వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ మిడ్ ఫీల్డ్‌లో చురుకుగా కదులుతూ ఫార్వర్డ్ శ్రేణి ఆటగాళ్లకు పాస్‌లు అందించారు. దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ రిటైర్మెంట్ తర్వాత పాల్గొంటున్న తొలి టోర్నీలో గోల్ కీపర్లు కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ అడ్డుగోడలా నిలబడ్డారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ షాట్‌లతో ఆకట్టుకొని ఐదు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాడు. అయితే లీగ్ దశలో కొరియాను అలవోకగా ఓడించిన భారత జట్టు నాకౌట్ మ్యాచ్‌లో కొరియాను తేలిగ్గా తీసుకోకుండా పక్కా వ్యూహంతో ఆడాల్సిన అవసరం ఉంది. కొరియా జట్టుకు ఎక్కువ పెనాల్టీ కార్నర్‌లు రాకుండా జాగ్రత్త పడాలి. కొరియా డ్రాగ్ ఫ్లికర్ జిహూన్ యాంగ్ ఈ టోర్నీలో ఏడు గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. యాంగ్‌ను నిలువరిస్తే కొరియా జోరుకు అడ్డుకట్ట వేసినట్టే. ‘పారిస్ ఒలింపిక్స్ తర్వాత తక్కువ సమయం విశ్రాంతి తీసుకొని చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు వచ్చాం. భారత జట్టు ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాను. కొరియా క్లిష్టమైన ప్రత్యర్థి. డిఫెన్స్‌తోపాటు అటాకింగ్‌లో కొరియాకు మంచి పేరుంది’ అని హర్మన్ వ్యాఖ్యానించాడు. మరో సెమీఫైనల్లో చైనాతో పాకిస్తాన్ ఆడుతుంది.

38 భారత్, దక్షిణ కొరియా జట్లు ఇప్పటి వరకు ముఖాముఖిగా 61 సార్లు తలపడ్డాయి. 38 సార్లు భారత్ గెలుపొందగా... 11 సార్లు కొరియాను విజయం వరించింది. 12 మ్యాచ్‌లు ‘డ్రా’గా ముగిశాయి.

7 ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు జరిగింది. భారత జట్టు ఏడు సార్లు సెమీఫైనల్ దశకు చేరుకుంది. 2013లో మాత్రం భారత జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది.


అర్జున్


గుకేశ్

భారత జట్ల దూకుడు

చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా ఐదో విజయం

బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల, పురుషుల జట్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. ఈ మెగా ఈవెంట్‌లో భారత జట్లు వరుసగా ఐదో విజయం నమోదు చేశాయి. ఆదివారం జరిగిన ఐదో రౌండ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 2.5–1.5తో కజకిస్తాన్ జట్టుపై నెగ్గగా... భారత పురుషుల జట్టు 3–1తో అజర్‌బైజాన్ జట్టును ఓడించింది. కజకిస్తాన్‌తో జరిగిన గేముల్లో భారత స్టార్ ద్రోణవల్లి హారిక 51 ఎత్తుల్లో బిబిసారా అసయుబయేవా చేతిలో ఓడిపోయింది. అయితే భారత మూడో మహిళా గ్రాండ్‌మాస్టర్ వైశాలి 59 ఎత్తుల్లో మెరూర్ట్ కమలిదెనోవాపై, వంతిక అగర్వాల్ 51 ఎత్తుల్లో అలువా నుర్మాన్‌పై గెలిచారు. జెనియా బలబయేవాతో గేమ్‌ను ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ 43 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించి భారత విజయాన్ని ఖరారు చేసింది. తానియా సచ్‌దేవ్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. అజర్‌బైజాన్‌తో జరిగిన గేముల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ 44 ఎత్తుల్లో రవూఫ్ మమెదోవ్‌పై, దొమ్మరాజు గుకేశ్ 38 ఎత్తుల్లో అయిదిన్ సులేమాన్లిపై విజయం సాధించారు. నిజాత్ అబసోవ్‌తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 34 ఎత్తుల్లో... షఖ్రియార్ మమెదైరోవ్‌తో జరిగిన గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి 83 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకొని భారత్‌కు విజయాన్ని అందించారు. పెంటేల హరికృష్ణకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు.


వైశాలి


వంతిక

పంజాబ్ ఎఫ్‌సీ బోణీ

కొచ్చి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు శుభారంభం చేసింది. కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీతో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ ఎఫ్‌సీ 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో చివరి పది నిమిషాల్లో మూడు గోల్స్ కావడం విశేషం. పంజాబ్ తరఫున 86వ నిమిషంలో లుకా మాజ్‌సెన్ పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచాడు. ఇంజ్యూరీ సమయంలోని 90+2వ నిమిషంలో జిమెనెజ్ గోల్‌తో కేరళ జట్టు స్కోరును 1–1తో సమం చేసింది. 90+5వ నిమిషంలో ఫిలిప్ మిర్జాక్ గోల్‌తో పంజాబ్ అనూహ్య విజయాన్ని దక్కించుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌తో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టు తలపడుతుంది.



‘ఐదు రోజులకు తీసుకెళ్లాలి’

- భారత్‌తో టెస్టుల్లో ఇదే మా తొలి లక్ష్యం
- బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ వ్యాఖ్య
- చెన్నైలో అడుగు పెట్టిన బంగ్లా బృందం

చెన్నై: భారత్‌తో రెండు టెస్టులు, ఆపై మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టు భారత గడ్డపై ఆదివారం అడుగు పెట్టింది. ఢాకా నుంచి ఆటగాళ్ల బృందం తొలి టెస్టు వేదిక అయిన చెన్నైకి నేరుగా చేరుకుంది. తమ దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతున్న పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ సిరీస్ కోసం భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్ జట్టుకు సెక్యూరిటీ కల్పించే విషయంలో బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది. టీమ్ బస చేస్తున్న హోటల్‌లో బోర్డు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసింది. సోమవారం నుంచి బంగ్లాదేశ్ జట్టు ప్రాక్టీస్ మొదలు పెడుతుంది. 19 నుంచి ఇరు జట్ల మధ్య ఎంఎ చిదంబరం స్టేడియంలో తొలి టెస్టు జరుగుతుంది. సీనియర్ ప్లేయర్ షకీబ్ అల్ హసన్ మినహా బంగ్లాదేశ్ ఆటగాళ్లంతా వచ్చారు. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడుతున్న షకీబ్ టెస్టు సమయానికి నేరుగా చెన్నైకి చేరుకుంటాడు. భారత్‌కు బయల్దేరడానికి ముందు బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో మీడియాతో మాట్లాడాడు. ‘పాకిస్తాన్‌పై సిరీస్ విజయంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. భారత్‌తో సిరీస్‌లో గట్టి పోటీ ఇవ్వగలం. టెస్టు మ్యాచ్‌లలో కుప్పకూలిపోకుండా ఆటను ఐదు రోజుల వరకు తీసుకెళ్లడం మా తొలి లక్ష్యం. భారత్‌తో సిరీస్ మాకు సవాల్. అందరిలాగే మేమూ అన్ని మ్యాచ్‌లు గెలవాలనే కోరుకుంటాం. మా బలానికి తగినట్లుగా ఆడటం ముఖ్యం. మా అత్యుత్తమ ప్రదర్శన కూడా ఇవ్వాలి’ అని నజ్ముల్ చెప్పాడు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్రంలో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ).. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,284.
- **విభాగాలు:** డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్/డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్–1088, తెలంగాణ వైద్య విధాన పరిషత్–183, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజనల్ క్యాన్సర్ సెంటర్–13.
- **అర్హతలు:** ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికెట్ కోర్సు/ఎంఎల్‌టీ ఒకేషనల్)/ఇంటర్మీడియెట్(ఎంఎల్‌టీ ఒకేషనల్) /బీఎస్సీ (ఎంఎల్‌టీ) /ఎంఎస్సీ(ఎంఎల్‌టీ)/డీఎంఎల్‌టీ/బీఎంఎల్‌టీ/పీజీడీ ఎంఎల్‌టీ/బీఎస్సీ మైక్రోబయాలజీ/ఎంఎస్సీ(మైక్రోబయాలజీ/మెడికల్ బయోకెమిస్ట్రీ/క్లినికల్ మైక్రో బయాలజీ/బయో కెమిస్ట్రీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 46 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్గొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.09.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.10.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 07.10.2024 నుంచి 08.10.2024 వరకు
- **పరీక్ష తేది:** 10.11.2024.
- **వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్ పోస్టులు

ఆర్మీ పబ్లిక్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దేశంలోని వివిధ కంటోన్మెంట్స్, మిలిటరీ స్టేషన్లలోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రెన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్).
- **సబ్జెక్టులు:** బయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, జాగ్రఫీ, హిస్టరీ, హిందీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్,పీజీ,డీఈఎల్‌ఈడీ, బీఈఎల్‌ఈడీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణతతోపాటు సీటెట్, టెట్ అర్హత తప్పనిసరిగా ఉండాలి.
- **వయసు:** 01.04.2024 నాటికి ఫ్రెషర్స్ 40 ఏళ్లలోపు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు 57 ఏళ్లలోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యం, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.09.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.10.2024.
- **పరీక్ష తేదీలు:** 23.11.2024, 24.11.2024.
- **ఫలితాల వెల్లడి తేది:** 10.12.2024.
- **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.
- **తెలుగు రాష్ట్రాల్లో ఆర్మీ పబ్లిక్ స్కూళ్లున్న ప్రాంతాలు:** సికింద్రాబాద్(ఆర్‌కేపీ), సికింద్రాబాద్(బొల్లారం), గోల్కొండ.
- **వెబ్‌సైట్:** https://awesindia.com

బీఐఎస్, న్యూఢిల్లీలో 97 పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 97.
- **పోస్టుల వివరాలు:** ఆయుష్–02, సివిల్ ఇంజనీరింగ్–12, కెమికల్–07, ఫుడ్ అండ్ అగ్రికల్చరల్–06, ఎలక్ట్రోటెక్నికల్–10, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్–08, మెకానికల్ ఇంజనీరింగ్–05, మెడికల్ ఎక్విప్‌మెంట్ అండ్ హాస్పిటల్ ప్లానింగ్–06, మేనేజ్‌మెంట్ అండ్ సిస్టమ్స్–02, మెటర్జికల్ ఇంజనీరింగ్–06, పెట్రోలియం కోల్ అండ్ రిలేటెడ్ ప్రొడక్ట్స్–06, ప్రొడక్షన్ అండ్ జనరల్ ఇంజనీరింగ్–06, సర్వీస్ సెక్టార్–04, టెక్స్‌టైల్–03, ట్రాన్స్‌పోర్ట్ ఇంజనీరింగ్–06, వాటర్ రిసోర్సెస్–02, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎకాలజీ–06.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్), పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 65 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.75,000.
- **ఎంపిక విధానం:** ప్రాక్టికల్ అసెస్‌మెంట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.09.2024.
- **పని ప్రదేశం:** ఎన్‌సీఆర్, ఢిల్లీ.
- **వెబ్‌సైట్:** https://www.bis.gov.in

పదితోనే కేంద్ర కొలువు

యూనిఫార్మ్ సర్వీస్ అభ్యర్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కొలువుల పిలుపు! పదో తరగతి అర్హతతోనే.. కేంద్ర సాయుధ దళాల్లో.. కానిస్టేబుల్‌గా అడుగుపెట్టే అవకాశం! స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) తాజాగా కేంద్ర బలగాల్లో.. మొత్తం 39,481 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష మొదలు ఫిజికల్ ఫిట్‌నెస్ వరకూ.. వివిధ దశల్లో జరిగే ఎంపిక ప్రక్రియలో సత్తా చూపితే కేంద్ర బలగాల్లో కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ నోటిఫికేషన్ సమాచారం, పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, ప్రిపరేషన్ తదితర వివరాలు...

- 39,481 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
- పదో తరగతి అర్హతతోనే ఈ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం
- రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లలో ప్రతిభ ఆధారంగా ఎంపిక


పోలీస్ జాబ్స్

ఎనిమిది దళాల్లో 39,481 ఖాళీలు

ఆయా విభాగాల్లో పురుషులు, మహిళలకు కలిపి మొత్తం 39,481 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 13,306 ఖాళీలు; సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 6,430; సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో 11,299; సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ)లో 819; ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో 2,564; అస్సాం రైఫిల్స్ (రైఫిల్‌మెన్)లో 1,148; సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్)లో 35; నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(సిపాయి)లో 11 ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా మహిళలకు అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్య 3,869.

అర్హతలు

- జనవరి 1, 2025 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** జనవరి 1, 2025 నాటికి 18–23 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనం

ఎంపికై ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు ప్రారంభం నుంచే పే లెవల్–1(రూ. 18,000 –56,900), పే లెవల్–3 (రూ.21,700–69,100)తో నెల వేతనం అందుకోవచ్చు.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) నియామక ప్రక్రియను మూడు దశల్లో నిర్వహిస్తారు. ఆ వివరాలు.. రాత పరీక్ష; ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్; ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఈ మూడు దశల తర్వాత డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్‌లు కూడా ఉంటాయి.

రాత పరీక్ష ఇలా

కానిస్టేబుల్ నియామక ప్రక్రియ తొలి దశలో నిర్వహించే రాత పరీక్ష నాలుగు విభాగాల్లో 80 ప్రశ్నలు–160 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 20 ప్రశ్నలు–40 మార్కులకు,జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–40 మార్కులకు,ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు–40 మార్కులకు, ఇంగ్లిష్/హిందీ 20 ప్రశ్నలు–40 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు.

ప్రాంతీయ భాషల్లో పరీక్ష

కానిస్టేబుల్ రాత పరీక్షను ప్రాంతీయ భాషల్లో రాసే అవకాశాన్ని కూడా ఎస్ఎస్‌సీ కల్పిస్తోంది. ఇంగ్లిష్, హిందీతోపాటు మరో 13 ప్రాంతీయ భాషల్లో (అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ) నిర్వహించనున్నారు. పరీక్షలోని పార్ట్–డిని మాత్రం ఇంగ్లిష్ లేదా హిందీలోనే నిర్వహిస్తారు. మిగతా మూడు విభాగాలకు అభ్యర్థులు తమ మీడియం ప్రాథమ్యాన్ని దరఖాస్తు సమయంలో తెలియజేయాల్సి ఉంటుంది.

రెండో దశ.. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

- తొలిదశలో నిర్వహించే రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులకు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌కు చెందిన కేంద్రాల్లో రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఉంటుంది. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌కు అర్హత పొందాలంటే.. రాత పరీక్షలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 25 శాతం మార్కులు, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు పొందాలి.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా పురుష అభ్యర్థులు అయిదు కిలోమీటర్లను 24 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఎనిమిదిన్నర నిమిషాల్లో చేరుకునే విధంగా పరుగు పందెం ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లోనూ ప్రతిభ చూపిన వారికి తదుపరి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష, మహిళా అభ్యర్థులు వేర్వేరు భౌతిక ప్రామాణికాలు కలిగి ఉండాలి. పురుష అభ్యర్థులు 170 సెంటీ మీటర్లు, మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. పురుష అభ్యర్థులకు కనీస ఛాతి కొలత 80 సెంటీ మీటర్లు, శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.

తుది ఎంపిక ఇలా

రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లుగా సాగే అన్ని ప్రక్రియల్లోనూ అభ్యర్థులు చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, ఇతర రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు. అదే విధంగా మొత్తం నాలుగు దశల్లో కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 14.10.2024
- **దరఖాస్తు సవరణ అవకాశం:** నవంబర్ 5 నుంచి నవంబర్ 7 వరకు.
- **రాత పరీక్ష తేదీ:** 2025 జనవరి/ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం,హైదరాబాద్,కరీంనగర్,వరంగల్.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఇందులో రాణించేందుకు వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్ అండ్ జనరల్ నాలెడ్జ్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపైనా దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

నాలుగో విభాగంలో ఉండే ఇంగ్లిష్/హిందీ సబ్జెక్టుకు సంబంధించి అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న భాషను ఎంచుకోవచ్చు. అధిక శాతం మంది ఇంగ్లిష్‌నే ఎంచుకుంటున్నారు. ఈ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**
సోమవారం
16-9-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	72	82,891
నిఫ్టీ ▽	32	25,357

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,684	△	114
డోజోన్స్	41,394	△	297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,273	△	32
డాక్స్	18,699	△	181
షాంఘై	2,704	▽	13
నికాయ్	36,582	▽	252

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.05	85.73
£	బ్రిటన్ పౌండ్	107.85	112.79
€	యూరో	90.84	95.34
¥	జపాన్ ఎన్ (100)	48.00	70.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.96	58.83
S$	సింగపూర్ డాలర్	62.31	67.01
SAR	సౌదీ రియాల్	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	21.95	23.73
¥	చైనా యువాన్	10.95	12.79

ఎక్కువ ఖాతాలున్నా.. ప్రయోజనాలు సున్నా

చిన్న మొత్తాల పొదుపుల్లో కీలక మార్పులు..

- ఒకరికి ఒక్కటే పీపీఎఫ్ ఖాతా
- అంతకుమించి ఉంటే సున్నా వడ్డీయే
- పిల్లల పేరుతో పీపీఎఫ్ ఖాతాలు
- అన్నింటికీ పన్ను ప్రయోజనం రూ.1.5 లక్షలే
- అక్రమ ఖాతాలు ఇక చెల్లవ్
- ఎన్‌ఆర్‌ఐలు తమ హోదా వెల్లడించాలి
- సుకన్య సమృద్ధిలోనూ సంరక్షకులకే హక్కు



ఈక్విటీలు మెరుగైన రాబడులు ఇస్తున్నా కానీ, ఇతర పెట్టుబడి సాధనాల ప్రాధాన్యాన్ని విస్మరించలేం. పెట్టుబడులు అన్నింటినీ ఒక్క చోటే పెట్టేయడం రిస్క్ పరంగా అనుకూలం కాదు. వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవాలి. అప్పుడే రిస్క్ తగ్గించుకుని, మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుంది. అందుకే ఒకవైపు ఈక్విటీల్లోకి పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తున్నప్పటికీ.. మరోవైపు చిన్న మొత్తాల పొదుపు పథకాలు ఇప్పటికీ ఎంతో మందికి ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాలుగా కొనసాగుతున్నాయి. రిస్క్‌లేని హామీతో కూడిన ఈ పథకాలు ముఖ్యమైన జీవిత లక్ష్యాలకు చేదోడుగా నిలుస్తాయనడంలో అతిశయం లేదు. అయితే ఇందులో పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఎన్ఎస్‌సీ పరంగా కొన్ని కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. వీటికి సంబంధించిన వివరాలే ఈ వారం ప్రాఫిట్‌ప్లస్ కథనం. **–సాక్షి, బిజినెస్ డెస్క్**

పీపీఎఫ్ ఒక్కటే

ఎక్కువ మంది ఎంపిక చేసుకునే ఆర్థిక సాధనాల్లో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఒకటి. ఇందులో ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోగలరు. ఈ మొత్తంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. 15 ఏళ్ల కాల వ్యవధి ముగిసిన తర్వాత మరో ఐదేళ్ల పాటు గడువును పొడిగించుకోవచ్చు. ఇందులో పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపే కాకుండా, గడువు ముగిసిన తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపైనా పన్ను మినహాయింపు ఉంది. ఈ ప్రయోజనమే ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. ఇది చూసే కొంత మంది ఒకటికి మించిన పీపీఎఫ్ ఖాతాలను తెరిచి ఇన్వెస్ట్ చేస్తున్నారు. పోస్టాఫీస్‌లో ఒకటి, బ్యాంక్‌లో ఒకటి తెరుస్తున్నారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం. ఒకరి పేరిట ఒక పీపీఎఫ్ ఖాతానే ప్రారంభించడం లేదా కొనసాగించడం చేయగలరని కేంద్ర ఆర్థిక శాఖ జూలై 12న ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ఒకటికి మించిన ఖాతాలను గుర్తించినట్టయితే అందులో ఒక దానిని ప్రాథమిక ఖాతాగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రెండో ఖాతాలో జమలపై ఎలాంటి వడ్డీ రాదన్నది తాజా ఉత్తర్వుల సారాంశం. ఒకవేళ రెండు ఖాతాలున్నట్టు తేలితే రెండో ఖాతాలోని జమలను మొదటి ఖాతాకు బదిలీ చేస్తారు. ఒక ఆర్థిక సంత్సరంలో గరిష్ఠ పెట్టుబడి రూ.1.5 లక్షలకు మించి జమ చేసినట్టయితే, అదనంగా ఉన్న మొత్తాన్ని ఎలాంటి వడ్డీ లేకుండా వెనక్కిచ్చేస్తారు. రెండు కంటే ఎక్కువ ఖాతాలున్నట్టు తేలితే అప్పుడు ప్రారంభించిన తేదీ నుంచి సున్నా వడ్డీయే లభిస్తుంది.

పిల్లల పేరిట పీపీఎఫ్ ఖాతాలు...

కొంత మంది పిల్లల పేరుతోనూ ఒకటికి మించిన పీపీఎఫ్ ఖాతాలను తెరుస్తున్నారు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లల పేరిట పీపీఎఫ్ ఖాతాను ప్రారంభించొచ్చు. ఒక మైనర్ (బాలుడు/బాలిక) పేరిట ఒక పీపీఎఫ్ ఖాతాకే పరిమితం కావాలి. ఇలా ఒక మైనర్ పేరిట ఒకటికి మించి ఉన్న ఖాతాలను ఇరెగ్యులర్ (అక్రమం) అకౌంట్‌లుగా గుర్తిస్తారు. అప్పుడు మైనర్ పేరిట ఉన్న ఖాతాల్లో ఒకదానిని మెయిన్ అకౌంట్‌గా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు ఆ ఖాతాకు నిబంధనల మేరకు ప్రస్తుత వడ్డీ రేటు అమలవుతుంది. ఒకటికి మించి అదనంగా ఉన్న ఖాతాల్లోని జమలకు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటు 4 శాతం చొప్పున 18 ఏళ్లు వచ్చే వరకు చెల్లిస్తారు. 18 ఏళ్లు నిండగానే మేజర్ అయిన తర్వాత సాధారణ పీపీఎఫ్ ఖాతా కింద దాన్ని పరిగణిస్తారు. అప్పటి నిబంధనల ప్రకారం ఆ ఖాతాపై చర్యలు ఉంటాయి. నిబంధనల ప్రకారం పీపీఎఫ్ ఖాతాలో ఒక ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ.500 నుంచి, గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. నిజానికి ఇద్దరు పిల్లలు ఉంటే విడిగా ఇద్దరి పేరిట రెండు ఖాతాలు తెరిచి నిర్వహించుకోవచ్చు. అయినప్పటికీ, తన పేరుతో, తన పిల్లల పేరుతో ఇలా అన్నింటిలోనూ గరిష్ఠ పరిమితి రూ.1.5 లక్షలకు మించి ఇన్వెస్ట్ చేసుకోరాదు. పీపీఎఫ్ ఖాతాను తాత, బామ్మ, అమ్మమ్మలు (గ్రాండ్ పేరెంట్స్) నిర్వహించరాదు. కేవలం తల్లిదండ్రులు మరణించి, పిల్లలకు ఆధారంగా మారిన వారే చట్టబద్ధ సంరక్షకులుగా వ్యవహరించడానికి అనుమతి ఉంటుంది.




మార్గం ఉంది..

పీపీఎఫ్‌లో పెట్టుబడులు, రాబడులపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలంటే.. అప్పుడు దంపతులు ఇద్దరూ తమ పేరిట పీపీఎఫ్ ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇద్దరు పిల్లలు ఉంటే భార్య, భర్త చెరొక పీపీఎఫ్ ఖాతా తెరిచి గరిష్ఠ పరిమితి మేరకు ఒక్కో ఖాతాలో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పిల్లల పేరిట తెరిచిన పీపీఎఫ్ ఖాతాను ఐదేళ్లు నిండిన తర్వాత వైద్య పరమైన అవసరాల కోసం మూసివేసేందుకు అనుమతి ఉంటుంది.

ఎన్‌ఆర్‌ఐలు అలా చేయడం కుదరదు..

ఎన్‌ఆర్‌ఐ హోదాను వెల్లడించకుండా పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడం చెల్లదు. అలాంటి ఖాతాల్లోని జమలకు పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ రేటు 4 శాతమే అమలవుతుంది. అది కూడా 2024 సెప్టెంబర్ 30 వరకే. ఆ తర్వాత నుంచి బ్యాలన్స్‌పై వడ్డీ రాదు. నిబంధనల ప్రకారం ఎన్‌ఆర్‌ఐలు పీపీఎఫ్ ఖాతా తెరవడానికి అనుమతి లేదు. "భారత్‌లో పీపీఎఫ్ ఖాతా తెరిచిన తర్వాత విదేశాలకు వెళ్లి ఎన్‌ఆర్‌ఐగా మారితే 15 ఏళ్ల గడువు ముగిసేంత వరకు ఆ ఖాతాను కొనసాగించొచ్చు. అందులో చేసే పెట్టుబడులకు ఇతరులకు మాదిరే వడ్డీ రేటు వర్తిస్తుంది. అయితే, నాన్ రీపాట్రియేషన్ నిబంధనల కిందే వీరు పీపీఎఫ్ ఖాతాను కొనసాగించుకోగలరు. అంటే గడువు ముగిసిన తర్వాత వచ్చే మెచ్యూరిటీని ఎన్‌ఆర్‌ఐ తన విదేశీ ఖాతాకు బదిలీ చేసుకోవడం కుదరదు. లేదా విదేశీ కరెన్సీలోకి మార్చుకోవడం కుదరదు. తన నివాస హోదాలో మార్పు చోటుచేసుకున్న వెంటనే సంబంధిత వ్యక్తి బ్యాంక్ లేదా పోస్టాఫీస్‌కు తెలియజేయడం తప్పనిసరి" అని స్టెబుల్ ఇన్వెస్టర్ వ్యవస్థాపకుడు దేవ్ ఆశిష్ తెలిపారు.





నేషనల్ సేవింగ్స్ స్కీమ్...

ఎంతో పాపులర్ అయిన చిన్న మొత్తాల పొదుపు పథకం ఇది. గతంలో ఏదైనా పోస్టాఫీస్ శాఖలో నేషనల్ సేవింగ్స్ స్కీమ్ ప్రారంభించేందుకు అవకాశం ఉండేది. దీన్ని 2002 నుంచి నిలిపివేశారు. కాకపోతే అప్పటికే తెరిచిన ఖాతాలను కొనసాగించేందుకు అనుమతించారు. 1990 ఏప్రిల్ 2కు ముందు తెరిచిన మొదటి ఖాతాకు ప్రస్తుత పథకం రేటు, రెండో ఖాతాకు పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతా రేటు (4 శాతం)కు అదనంగా 2 శాతం చెల్లిస్తారు. అక్టోబర్ 1 నుంచి ఈ రెండు ఖాతాలకు ఎలాంటి వడ్డీ రాదు. 1990 ఏప్రిల్ 2 తర్వాత తెరిచిన నేషనల్ సేవింగ్స్ స్కీమ్ ఖాతాలకు సైతం అక్టోబర్ నుంచి ఎలాంటి వడ్డీ చెల్లించరు. దీంతో ఈ ఖాతాలను మూసివేసుకోవడమే మంచి నిర్ణయం అవుతుంది.

సుకన్య సమృద్ధి యోజన...

సుకన్య సమృద్ధి యోజన ఎంతో ప్రాచుర్యం పొందిన పథకం. రోజుల శిశువు నుంచి పదేళ్లలోపు కుమార్తెల పేరిట ఖాతా తెరిచి ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బాలికకు 18 ఏళ్లు నిండే వరకు ఇది కొనసాగుతుంది. ఇందులో ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఖాతాకు 8.2 శాతం వడ్డీ రేటు అమలవుతోంది. ఇందులో చేసే పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. అలాగే, ఇందులో రాబడులపైనా పన్ను లేదు. ఒక కుటుంబం తరఫున గరిష్ఠంగా ఇద్దరు కుమార్తెల పేరిటే సుకన్య సమృద్ధి ఖాతాను తెరవడానికి ఉంటుంది. సుకన్య సమృద్ధి యోజన ఖాతాను (ఎస్ఎస్‌ఏఎస్) బాలిక తరఫున తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తెరవడానికి అనుమతి ఉంటుంది. అయితే, కొందరు మనవరాలి పేరిట కూడా ఖాతాలను తెరిచి ఇన్వెస్ట్ చేస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. దీంతో పిల్లలకు సహజ సంరక్షకులు అయిన తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకులు అయిన వారే సుకన్య సమృద్ధి యోజన ఖాతాను తెరవడానికి ఉంటుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఒకవేళ మనవరాలి పేరిట తాత, అమ్మమ్మ, బామ్మలు తెరిచినట్టు గుర్తించినట్టయితే అప్పుడు సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులకు బదిలీ అవుతుంది. ఒక కుటుంబానికి రెండుకు మించి ఖాతాలున్నట్టు తేలితే అదనంగా ఉన్న వాటిని మూసివేస్తారు. వాటిలో జమ చేసే మొత్తాలపై వడ్డీ రాదు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2024	
విశాఖ	540-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	535-00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00

తెలుగు రాష్ట్రాల పాలసీదార్లకు ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్ప్‌డెస్క్

తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్సంతో నష్టపోయిన పాలసీదారులకు సత్వరం సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వారి కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇది ప్రతి రోజూ, ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులో ఉంటుందని వివరించింది. పాలసీదారులు టోల్ ఫ్రీ నంబరు 1800-2666 ద్వారా లేదా customersupport@icicilombard. com ద్వారా కాంటాక్ట్ చేయొచ్చు.

ఇన్వెస్కో నుంచి ఇండియా టెక్నాలజీ ఫండ్



ఇన్వెస్కో మ్యుచువల్ ఫండ్ కొత్తగా ఇన్వెస్కో ఇండియా టెక్నాలజీ ఫండ్‌ను ప్రారంభించింది. సెప్టెంబర్ 17తో ఈ ఫండ్ ముగుస్తుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇది టెక్నాలజీ, అలాగే టెక్నాలజీ సంబంధ రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ప్రధానంగా సాంకేతికత, ఆటోమేషన్, రోబోటిక్స్, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ వినియోగంతో లబ్ధి పొందే ఇతర సాంకేతిక కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. దీనికి నిఫ్టీ ఐటీ టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. డిజిటలైజేషన్, ప్రభుత్వ కార్యక్రమాలు మొదలైన సానుకూలాంశాలతో వృద్ధి చెందుతున్న టెక్నాలజీ స్టాక్స్ సముచిత వేల్యుయేషన్స్‌లో లభిస్తున్నట్లు సంస్థ ఫండ్ మేనేజర్ హితేన్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో వాటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆరోగ్యం, జీవిత బీమాపై సమీక్షకు జీఎస్‌టీ కమిటీ




న్యూఢిల్లీ: ఆరోగ్య– జీవిత బీమాకు సంబంధించి వివిధ ప్రొడక్టుల ప్రీమియంలపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రేటును సూచించడానికి అత్యున్నత స్థాయి మండలి (జీఎస్‌టీ కౌన్సిల్) 13 మంది సభ్యుల మంత్రిత్వ స్థాయి గ్రూపును ఏర్పాటు చేసింది. అక్టోబర్ 30 లోపు ఈ గ్రూప్ తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. సెప్టెంబరు 9న జరిగిన 54వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం జీవిత, వైద్య బీమాపై ప్రస్తుత పన్ను విధానాన్ని పరిశీలించడానికి, సమీక్షించడానికి ఒక మంత్రిత్వ స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్ చూపు అమెరికన్ ఫెడ్ వైపు..
మెటాకు కీలక మార్కెట్‌గా భారత్

స్మార్ట్ సిప్ ఎంపిక సరైనదేనా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఈక్విటీ మార్కెట్ ఎప్పటికప్పుడు నూతన గరిష్టాలను నమోదు చేస్తోంది. కనుక స్మార్ట్ సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– నియతి దూబే

రెగ్యులర్ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)కు వినూత్నమైనవే స్మార్ట్ సిప్‌లు. ఇవి ఎలా స్మార్ట్ అంటే.. ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయడం కాకుండా మార్కెట్ తీరు ఆధారంగా వ్యవహరిస్తాయి. కొన్ని అంశాల ఆధారంగా మార్కెట్లు ఖరీదుగా ఉన్నాయా? లేక చౌకగా ఉన్నాయా..?ఎలా ఉన్నాయన్నది చెప్పే అల్గోరిథమ్ (సాఫ్ట్‌వేర్) వాటికి ఉంటుంది. మార్కెట్ల విలువ చాలా ఖరీదుగా ఉన్నట్టు ఆల్గోరిథమ్ భావిస్తే ఇన్వెస్టర్ నుంచి వచ్చే సిప్ మొత్తాన్ని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయకుండా, కొంత మొత్తాన్నే కేటాయిస్తాయి. ఉదాహరణకు ప్రతి నెలా ఒక ఇన్వెస్టర్ నుంచి రూ.1,000 సిప్ రూపంలో వస్తుంటే, అందులో కొంత స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసి, మిగిలిన మొత్తాన్ని లిక్విడ్ ఫండ్ (డెట్ ఫండ్)లోకి మళ్లిస్తాయి. మళ్లీ స్టాక్స్ విలువలు దిగొచ్చినప్పుడు తిరిగి ఎక్కువ మొత్తాన్ని స్టాక్స్‌కు, తక్కువ మొత్తాన్ని లిక్విడ్ ఫండ్‌కు కేటాయిస్తుంటాయి. స్మార్ట్ సిప్‌లు అంటే ఈక్విటీ, డెట్ పెట్టుబడుల కలబోతగా ఉంటాయి. స్మార్ట్ సిప్‌లు ఇలానే పనిచేస్తుంటాయి. ఇది విజయాన్నిచ్చే విధానం. ఈక్విటీలు ఖరీదుగా ఉన్నప్పుడు తక్కువ మొత్తం ఇన్వెస్ట్ చేసి, ఎక్కువ మొత్తాన్ని డెట్ ఫండ్ రూపంలో ఉంచుకోవడం, మార్కెట్లు చౌకగా మారినప్పుడు దీనికి విరుద్ధంగా వ్యవహరించడం ఇందులో కనిపిస్తుంది. కానీ వాస్తవికంగా చూస్తే మార్కెట్లు ఎప్పుడు ఎలా వ్యవహరిస్తాయో కచ్చితంగా అంచనా వేయడం కష్టం. ఎవరూ కూడా నిరాటంకంగా ఈ విషయంలో కచ్చితత్వంతో వ్యవహరించలేరు. మార్కెట్ల గమనాన్ని కచ్చితంగా అంచనా వేయలేని పరిస్థితికి ముందు నుంచి ఉన్న సిప్ నిజానికి ఒక పరిష్కారం. ఈ విధానంలో మార్కెట్లు ఖరీదుగా ఉన్నా, చౌకగా ఉన్నా సరే ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఖరీదుగా ఉన్నప్పుడు కొన్ని యూనిట్లు వస్తే, మార్కెట్లు పడిపోయినప్పుడు అంతే సిప్‌తో ఎక్కువ యూనిట్లు లభిస్తాయి. మార్కెట్ల గమనం, అంచనా రిస్క్‌ను అధిగమించేందుకు ఇదే మెరుగైన పరిష్కారం. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకుంటూ, దీర్ఘకాలంలో సంపద సృష్టించుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది. కనుక రెగ్యులర్ సిప్‌లను ఎంపిక చేసుకోవాలన్నదే మా సూచన.



ఇండెక్స్ ఫండ్ ఎంపిక చేసుకునే విషయంలో ఎలాంటి అంశాలను పరిశీలించాలి?

– లలావత్ రాములు

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవడం సులభమే. ఎక్స్‌పెన్స్ రేషియో, ట్రాకింగ్ ఎర్రర్ ఈ రెండు అంశాలపై దృష్టి సారించాలి. ఇందులో ఎక్స్‌పెన్స్ రేషియో కీలకమైనది. ఇది ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ నుంచి వసూలు చేసే నిర్ణీత చార్జీ. ఇది తక్కువగా ఉంటే దీర్ఘకాలంలో ఎక్కువ రాబడులకు వీలుంటుంది. ఉదాహరణకు ఒక ఫండ్ 0.10 శాతం, మరో ఫండ్ 0.25 శాతం వసూలు చేస్తుంటే.. ఈ రెండింటిలో మొదటి పథకంలో ఎక్కువ రాబడులు వస్తాయి. ట్రాకింగ్ ఎర్రర్ అనేది ఒక పథకం పనితీరుకు, బెంచ్‌మార్క్ సూచీ రాబడులను మధ్య ఉన్న వ్యత్యాసం. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉంటే, పథకం పనితీరు సూచీలకు తగిన స్థాయిలోనే ఉందని అర్థం. అలాంటి పథకం ఇన్వెస్టర్లకు అనుకూలం. ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో, పరిమిత ట్రాకింగ్ ఎర్రర్ ఉన్న పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఎక్కువ రాబడులకు అవకాశం ఉంటుంది.

సీసీఎల్ ప్రొడక్ట్స్ | బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 730 **టార్గెట్:** రూ. 1,221

ఎందుకంటే: దేశీయంగా ఇన్‌స్టెంట్ కాఫీ తయారీ, ఎగుమతులకు అతిపెద్ద సంస్థగా నిలుస్తున్న సీసీఎల్ ప్రొడక్ట్స్.. ప్రపంచస్థాయిలోనూ ఇన్‌స్టెంట్ కాఫీ ప్రయివేట్ లేబుల్(కాంట్రాక్ట్ తయారీ)కు అతిపెద్ద కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. విభిన్నతరహా కాఫీ ప్రొడక్టుల తయారీలో ప్రత్యేకతను కలిగి ఉంది. నాలుగు తయారీ యూనిట్ల ద్వారా వార్షికంగా 60,000 మెట్రిక్ టన్నుల స్ప్రే డ్రైడ్ కాఫీ(ఎస్‌డీసీ) సామర్థ్యాన్ని అందుకుంది. అంతేకాకుండా ఏడాదికి 11,000 మెట్రిక్ టన్నుల ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ(ఎఫ్‌డీసీ) సామర్థ్యాన్ని సైతం కలిగి ఉంది. అత్యంత ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా 900కుపైగా కాఫీ బ్లెండ్స్‌ను రూపొందిస్తోంది. వెరసి 100 దేశాలలోని కస్టమర్లకు ప్రయివేట్ లేబుల్ కాఫీ ప్రొడక్టులను సమకూర్చుతోంది. మరోపక్క కంపెనీ సొంత బ్రాండ్ కాంటినెంటల్ ద్వారా బ్రాండెడ్ బిజినెస్ విస్తరణకు ప్రణాళికలు అమలు చేస్తోంది. సొంత తయారీ(ఇన్‌హౌస్)లో భాగంగా పలు రకాల కాఫీ ప్రొడక్టులను ఆఫర్ చేస్తోంది. ఈ ప్రొడక్టులను వివిధ మార్గాల(చానళ్ల) ద్వారా పంపిణీ చేస్తోంది. రిటైల్ స్టోర్లు, సూపర్ మార్కెట్లు, విమానయాన సంస్థలు, హోటళ్లు, వెండింగ్ మెషీన్లు తదితరాలను ఇందుకు వినియోగించుకుంటోంది. దీంతో పలు ప్రపంచ మార్కెట్లలో విస్తరించడంతోపాటు.. అమ్మకాలను పెంచుకుంటోంది. ఇన్‌స్టెంట్ కాఫీ మార్కెట్‌లో కంపెనీకున్న ఆధిపత్య స్థాయి, బ్రాండెడ్ బిజినెస్‌పై పెడుతున్న ప్రత్యేక దృష్టి సానుకూల అంశాలుగా పరిగణించవచ్చు. వెరసి రానున్న మూడేళ్లలో కంపెనీ అమ్మకాల పరిమాణం వార్షికంగా సగటున 15 శాతం చొప్పున పుంజుకోగలదని భావిస్తున్నాం. ఫ్రీజ్ డ్రైడ్ అమ్మకాలు ఊపందుకోనుండటం, బ్రాండెడ్ బిజినెస్, చిన్న పరిమాణపు ప్యాక్‌లకు పెరగనున్న డిమాండ్ నేపథ్యంలో మార్జిన్లు మెరుగుపడే అవకాశముంది.




ప్రొటీన్ ఈ-గవ్ టెక్ | బ్రోకరేజ్: ఏయూఎం క్యాపిటల్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 2,052 **టార్గెట్:** రూ. 2,647

ఎందుకంటే: వివిధ ప్రభుత్వ రంగ విభాగాలకు విభిన్న ఐటీ సర్వీసులందిస్తున్న ప్రొటీన్ ఈ–గవ్ టెక్నాలజీస్ ఇకపై మరింత వృద్ధి పథంలో సాగనుంది. ప్రజాసంబంధ(సిటిజన్) సర్వీసులు, ఎలక్ట్రానిక్ పాలన(ఈ–గవర్నెన్స్) సొల్యూషన్లు, సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, బిజినెస్ ప్రాసెస్ రీఇంజినీరింగ్, డేటా సెంటర్ కోలొకేషన్, ప్రజలకు, కార్పొరేట్లకు, ప్రభుత్వానికి ఐటీ కన్సల్టింగ్ సర్వీసులు తదితరాలను సమకూర్చుతోంది. ప్రధానంగా దేశంలోని అత్యధిక శాతం ప్రజలను ఆర్థిక వృద్ధిలో భాగస్వాములను చేయడానికి(ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) తోడ్పాటునిస్తూ కీలకపాత్రను పోషిస్తోంది. ఈగవర్నెన్స్ సర్వీసులందించడంలో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది. టీఐఎన్(టిన్) మేనేజ్‌మెంట్, పీఏఎన్(పాన్) ప్రాసెసింగ్, జాతీయ పింఛను పథకం(ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన తదితర సర్వీసులలో ప్రధాన కంపెనీగా నిలుస్తోంది. కంపెనీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాక దేశవ్యాప్తంగా ఏడు మంత్రిత్వ శాఖలకు చెందిన 19 ప్రాజెక్టుల అభివృద్ధి, ఆచరణకు సహకారమందించింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ ఇండియా కార్యక్రమాల అమలులో కీలక భాగస్వామిగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా 5జీ టెక్నాలజీ తదితర ఆధునిక మౌలికసదుపాయాలు విస్తరిస్తున్న నేపథ్యంలో కంపెనీ సర్వీసుల పరిధిలోకి మరింతమంది ప్రజలు చేరే అవకాశముంది. మరిన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను పెంచుకునే ప్రణాళికలు అమలు చేయనున్న కంపెనీ కొత్తతరం మౌలిక సదుపాయల విస్తరణతో భారీగా లబ్ధిని పొందే అవకాశముంది. పారిశ్రామిక, సాంకేతిక వ్యూహాలకు తెరతీయడం, ఐవోటీ ఆధారిత సొల్యూషన్లు ప్రవేశపెట్టడం, బ్లాక్ చైన్, ఏఐ టెక్నాలజీలను వినియోగించుకోవడం, బిజినెస్ ప్రాసెస్ డిజిటైజేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కంపెనీ మరింత వృద్ధిని అందుకునే వీలుంది.



టుడేస్ గ్రాఫిక్





ఇంతకీ ఏంటిది? ఏదైనా టైల్ డిజైనా.. లేక మరేంటి? తెలియడం లేదు కదూ.. ఇది సొరచేప కన్ను. జూలియస్ అనే ఫొటోగ్రాఫర్ దాని కన్నును ఇలా దగ్గరగా తీశారు. ఈ చిత్రం ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో 'ఫైన్ ఆర్ట్' విభాగంలో రెండో బహుమతిని గెలుచుకుంది.

చూడగానే ఏదో పక్షుల గుంపు ఎగురుతూ వెళ్తున్నట్లు కనిపిస్తోంది కదూ.. నిజానికివి పక్షులు కావు. మాబ్యూలా రేలు. వీటి గుంపు సముద్రంలో ఈదుతూ వెళ్తున్నప్పుడు ఫిలిప్పో అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు. ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో ఓషన్ పోర్ట్‌ఫోలియో విభాగంలో ఈ చిత్రం మూడో స్థానంలో నిలిచింది.



ఖైరతాబాద్ గణపతి ప్రాంగణంలో మహిళలతో అసభ్య ప్రవర్తన

285 మందిని పట్టుకున్న షీ టీమ్స్



ఖైరతాబాద్: వారం రోజులుగా ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే మహిళాభక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 285 మందిని షీ టీమ్స్ పట్టుకున్నాయి. వీరంతా బహిరంగ ప్రదేశాల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చేష్టలకు గాను వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచనున్నారు. హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనే పౌరులు, ప్రత్యేకించి మహిళల భద్రత పట్ల షీ టీమ్స్ 24/7 పనిచేస్తుంది. బహిరంగంగా ఎలాంటి అనుచిత ప్రవర్తనను సహించేది లేదని, వెంటనే షీ టీమ్స్, పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డయల్ 100 లేదా వాట్సాప్ 94906 16555 నంబర్‌లో తెలియజేయవచ్చని తెలిపారు.

పక్షవాతానికి మత్తు లేకుండానే చికిత్స

మేజర్ డిప్రెషన్ డిజార్డర్‌కి కూడా.. నిమ్స్‌లో అందుబాటులోకి టీఎంఎస్ ట్రీట్‌మెంట్ ల్యాబ్



లక్డీకాపూల్ (హైదరాబాద్): సంక్లిష్టమైన సమస్యలకు సునాయాసంగా శస్త్రచికిత్సల ద్వారా ప్రాణదానం చేస్తున్న నిమ్స్.. ఎప్పటికప్పుడు అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తెస్తోంది. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న నిమ్స్ తాజాగా మైగ్రేన్, తీవ్ర కుంగుబాటు, పక్షవాత సమస్యలకు ట్రాన్స్‌క్రనియల్ మ్యాగ్నెటిక్ స్టిమ్యులేషన్ (టీఎంఎస్) థెరపీతో మెరుగైన ఫలితాలను అందించేందుకు సమాయత్తమైంది. అందులోనూ అధిక ఖర్చుతో కూడిన ఈ చికిత్సను నిమ్స్ న్యూరాలజీ వైద్యులు నామమాత్రపు వ్యయంతో అందించనున్నారు. మేజర్ డిప్రెషన్ డిజార్డర్ (ఎండీడీ)కు ఎలాంటి మత్తుమందు (అనస్తీషియా) అవసరం లేకుండానే టీఎంఎస్ థెరపీతో వైద్యసేవలు అందించనున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి దశల వారీగా థెరపీ చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రోగులు యాంటీ డిప్రెషన్ మందులు వాడినా వ్యాధి నయంకాని పరిస్థితి. కొన్నిసార్లు ఆ మందుల వల్ల ఇతర సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం లేకపోలేదు. అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా టీఎంఎస్ ద్వారా వ్యాధి నుంచి రోగికి ఉపశమనం కలిగించవచ్చని వైద్యులు చెప్పారు. అధిక రక్తపోటుతో మెదడులోని నరాల్లో రక్తం గడ్డకట్టడం లేదా చిట్లిపోవడం వల్ల పక్షవాతానికి దారితీస్తుంది. ఈ పరిస్థితుల్లో బ్రెయిన్ సర్జరీ చేయాల్సి ఉంటుంది. శస్త్రచికిత్స ఆలస్యమైతే పక్షవాతం నయం కావడం కష్టమవుతుంది. ఈ పరిస్థితుల్లో టీఎంఎస్ ల్యాబ్ రోగికి చక్కటి పరిష్కారం చూపిస్తుందని నిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. ఇటీవల టీఎంఎంస్ పనితీరును అధ్యయనం చేయడమే కాకుండా ఇప్పటికే 20 మందికిపైగా పక్షవాతం రోగులకు చికిత్స అందించామని చెప్పారు. రోగుల పరిస్థితిని బట్టి 4–6 వారాలపాటు థెరపీ చేయాల్సి ఉంటుందన్నారు. డిప్రెషన్‌తోపాటు ఫైబ్రోమయాల్జియా, నరాల వ్యాధి వంటి సమస్యలకూ ఈ థెరపీ ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. దీంతో మెదడు పనితీరును కూడా విశ్లేషించవచ్చని వెల్లడించారు.

సత్తా చాటిన టీజీ, ఏపీ ఎన్‌సీసీ కేడెట్లు

- ఆల్ ఇండియా తల్‌సేన బాలికల పోటీల్లో రెండు ట్రోఫీలు, పది బంగారు పతకాలు
- కేడెట్లను అభినందించిన ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన ఆల్ ఇండియా తల్‌సేన గర్ల్స్ కాంపిటీషన్–2024లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మొత్తం 91 మంది కేడెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరు రెండు ఆల్ ఇండియా ట్రోఫీలతోపాటు వ్యక్తిగతంగా పది బంగారు పతకాలు, తొమ్మిది రజత పతకాలు సాధించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మొత్తం 17 బృందాల నుంచి గట్టి పోటీని ఎదుర్కొని ఆల్ ఇండియా తల్‌సైనిక్ క్యాంపు–బాలికల విభాగంలోనూ మొదటిస్థానంలో నిలిచారు. అదేవిధంగా బాలుర కేటగిరిలో నాలుగో స్థానాన్ని సాధించారు. ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ కేడెట్లలో బాలురు, బాలికల బృందాలు ఆరోగ్యం, పరిశుభ్రత, మ్యాప్ రీడింగ్ పోటీల్లో బహుమతులు సాధించారు. జూనియర్ వింగ్ నుంచి కేడెట్ హన్షిత, సీనియర్ డివిజన్ బాలుర విభాగంలో కేడెట్ సాయి చందు రజత పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఏపీ, టీజీ ఎన్‌సీసీ కేడెట్ల బృందాలను ఎన్‌సీసీ డైరెక్టరేట్ (ఏపీ, తెలంగాణ)డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి అభినందించారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విజేతలను కలుసుకున్నారు. అత్యుత్తమ శిక్షణ కారణంగానే కేడెట్లు విజయాలు సాధిస్తున్నారని వీఎం రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. పతకాల విజేతలతోపాటు ఎన్‌సీసీ అధికారులు, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు.

ఈఈఎస్‌ఎల్‌కు సీఐఐ పురస్కారం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అందజేసింది. సీఐఐ 25వ రజతోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు.

భద్రాద్రి రామయ్య ఫొటోతో రూ.కోటి వసూలు

దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆలయ ఈవో ఫిర్యాదు



భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి సంబంధం లేకుండా, స్వామి వారి కల్యాణం పేరుతో భద్రాద్రి రామయ్య మూలవిరాట్ ఫొటో ప్రచురించిన కరపత్రాలతో కొందరు రూ.కోటి వరకు విరాళాలు సేకరించారని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రామాలయానికి ఎలాంటి సంబంధం లేని శ్రీరామ టెంపుల్ అంటూ యూఎస్ఏకు చెందిన ఆలయ నిర్వాహకులు ఖగోళయాత్ర పేరుతో పర్యటించారని, ఈనెల 17న భద్రాచలంలో భద్రాద్రి రామయ్య కల్యాణం నిర్వహిస్తున్నామంటూ సుమారు రూ.కోటి వరకు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు యూఎస్ఏ ఆలయ నిర్వాహకులపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భద్రాద్రి ఆలయం పేరుతో విరాళాలు సేకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం। 16-9-2024



బెయిల్ కాదు.. జైలు

విచారణ ఖైదీలుగా ఏళ్లుగా కటకటాల్లోనే..

- బెయిల్ ఇచ్చేవారు లేక..రాక ఇబ్బందులు
- వచ్చినా పూచీకత్తు ఇచ్చేవారూ లేని జైలు పక్షులు
- శిక్ష పడిన వారి కంటే విచారణ ఖైదీలే అధికం

సాక్షి, హైదరాబాద్: 'జైలు కాదు.. బెయిల్'అన్న సుప్రీంకోర్టు న్యాయసూత్రం ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. దేశంలోని జైళ్లలో మగ్గుతున్న వారిలో రెండింట మూడో వంతు విచారణ ఖైదీలే. బెయిల్ లాంటి అంశాల్లో సత్వర విచారణ జరపాలని న్యాయ కోవిదులు చెబుతున్నా అమలు మాత్రం ఆమడ దూరం అన్నట్టుగానే ఉంది. బెయిల్ వచ్చినా ఆర్థిక స్తోమత లేక, పూచీకత్తు ఇచ్చేవారు లేక విడుదలకు నోచుకోని వారు కూడా ఉండటం మరింత దారుణం. విచారణ జరిగి శిక్షపడే నాటికి.. వారికి పడే శిక్షాకాలం కూడా పూర్తవుతున్న వారు కొందరు ఉండగా, ఆ తర్వాత నిర్దోషులుగా విడుదలవుతున్న వారు మరికొందరు. అంటే నేరం చేయకున్నా కొందరు జైళ్లలో మగ్గుతున్నారన్న మాట. ఏళ్లుగా జైళ్లలో ఉండి ఆ తర్వాత నిర్దోషులుగా విడుదలైనా.. వారి జీవితం, కుటుంబాలు ఆగమైనట్టే కదా అనేది బాధితుల వాదన. మరి ఈ విచారణ ఖైదీల సమస్యకు పరిష్కారం ఎప్పుడు.. ఎలా.. అన్నది ప్రశ్నార్థకం. అయితే గత నెల జైలు అధికారులకు సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలు కొంత ఉపశమనం కలిగించనున్నాయి.

యువతే అధికం...

విచారణ ఖైదీల్లో అత్యధికం యువతే. 2022 గణాంకాలను పరిశీలిస్తే.. 18-30 ఏళ్ల మధ్య ఖైదీలు 2,15,471 మంది ఉండగా, 30-50 ఏళ్ల మధ్య 1,73,876 మంది ఉన్నారు. మొత్తం 4,34,302 విచారణ ఖైదీల్లో రెండింట మూడోవంతు (66శాతం) యువతే ఉండటం గమనార్హం.

తెలంగాణ... 2023

	దోషులు	విచారణ ఖైదీలు	ఇతరులు	మొత్తం
తెలంగాణ	1,997	3,778	50	5,825

విచారణా ఖైదీల హక్కులు..

- సత్వర విచారణ పొందేందుకు అర్హులు
- హింస, అమానవీయ ప్రవర్తనకు గురికాకుండా హక్కు ఉంటుంది
- సరైన కారణాలను అందించకపోతే జైలు నుంచి కోర్టుకు తరలించేటప్పుడు సంకెళ్లు వేయడానికి వీలులేదు.
- కేసు విషయంలో కోర్టుకు దరఖాస్తు చేసుకొని ఉచిత న్యాయ సేవలు పొందవచ్చు.
- అరెస్టు చేసే సమయంలో వారి కుటుంబ సభ్యుడు లేదా స్నేహితుడికి తెలియజేయాలి.
- నిర్దిష్ట భద్రతా ప్రమాణాలకు లోబడి కుటుంబ సభ్యులకు ఖైదీని సందర్శించే అవకాశం.

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

2023లో, అంతకుముందు..

'జైలు కాదు.. బెయిల్'అనే సూత్రం ప్రమాణంగా విచారణ సాగాలి. విచారణ ఖైదీలతో జైళ్లు కిక్కిరిసిపోవడం న్యాయ సూత్రాలకు విరుద్ధం. ఒక వ్యక్తిని కోర్టులో నిలబెట్టి, దోషిగా నిరూపించాలని పోలీసులు ఎక్కువగా భావిస్తున్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయం ప్రమాదకరం. ఇది పేద, బలహీన వర్గాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బెయిల్ పొందినా ఆర్థిక స్తోమత, పూచీకత్తు ఇచ్చేవారు లేక చాలా మంది జైళ్లలోనే మగ్గుతున్నారు. ఈ కారణాలతో జైళ్లలో సంఖ్య పెరిగిపోతోంది.

2024, ఆగస్టులో...

దేశవ్యాప్తంగా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతున్న అండర్ ట్రయల్ ఖైదీలను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని జైళ్ల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం. కొత్త క్రిమినల్ న్యాయచట్టం భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 479 ప్రకారం సాధ్యమైనంత త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి. మూడు నెలల్లోగా అండర్ ట్రయల్ ఖైదీల దరఖాస్తులను ప్రాసెస్ చేయాలి. అయితే, ఈ నిబంధన మరణశిక్ష లేదా జీవిత ఖైదు వంటి ఘోరమైన నేరాలకు పాల్పడిన అండర్ ట్రయల్‌లకు వర్తించదు.

– సుప్రీంకోర్టు

అండర్ ట్రయల్ ఖైదీలకు లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ ద్వారా న్యాయ సాయం అందిస్తాం. దీని కోసం జైళ్లకు కూడా వెళతాం. న్యాయ సాయం కావాల్సిన వారికి న్యాయవాదులను ఏర్పాటు చేస్తాం. బెయిల్ వచ్చిన తర్వాత ఒకవేళ పెద్ద మొత్తంలో షూరిటీలు చెల్లించలేని వారు ఉంటే.. కోర్టును సంప్రదించి ఆ మొత్తాన్ని తగ్గించేలా తోడ్పాటునందిస్తాం.

-తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ

విచారణ ఖైదీలే అత్యధికం..

సంవత్సరం	దోషులు	విచారణ ఖైదీలు	నిర్బంధం	ఇతరులు	మొత్తం
2020	1,12,589	3,71,848	3,590	484	4,88,511
2021	1,22,852	4,27,165	3,470	547	5,54,034
2022	1,33,415	4,34,302	4,324	1,179	5,73,220

తెలుగు రాష్ట్రాల్లో జైళ్లలో సంఖ్య ఇలా.. (డిసెంబర్-2022 ప్రకారం)

	దోషులు	విచారణ ఖైదీలు	ఇతరులు	మొత్తం
తెలంగాణ	2,102	4,221	174	6,497
ఆంధ్రప్రదేశ్	1,988	5,123	143	7,254

లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి న్యాయసాయం పొందిన వారు..

2021	2022	2023
1,958	4,365	4,636



నాగార్జునకొండలోని మ్యూజియంలో కుటుంబ సమేతంగా న్యాయమూర్తి జస్టిస్ సుజన

నాగార్జునకొండలో హైకోర్టు న్యాయమూర్తి

నాగార్జునసాగర్: బౌద్ధం పరిఢవిల్లిన నాగార్జునకొండను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. పురావస్తు మ్యూజియం, బుద్ధుడి శిల్పాలను తిలకించారు. అనంతరం కొండపైన సింహాల విహారం, మహాస్థూపం, అశ్వమేధ యజ్ఞశాల తదితర ప్రాచీన పునర్నిర్మిత కట్టడాలను సందర్శించారు. వీరికి గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు.



బుద్ధుడి విగ్రహం వద్ద న్యాయమూర్తి జస్టిస్ సుజన ఫ్యామిలీ

38 నెలలు.. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్

- సీఎంగా నియామకమైన తర్వాత కూడా 9 నెలలపాటు పార్టీ బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధిష్టానం జూన్ 26, 2021న రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. జూలై 7న ఆయన గాంధీ భవన్‌లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అంత బలంగా లేదు. ఒకవైపు అధికార బీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో.. మరోవైపు ప్రత్యామ్నాయ స్థానం కోసం బీజేపీ సవాలు విసురుతున్న పరిస్థితుల్లో రేవంత్ పార్టీ పగ్గాలు స్వీకరించారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చారు.

తొలి పరీక్ష.. హుజూరాబాద్

బాధ్యతలు స్వీకరించిన వెంటనే హుజూరాబాద్ ఉప ఎన్నిక రేవంత్ రెడ్డికి తొలి సవాల్‌గా నిలిచింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 3,014 (1.5 శాతం) ఓట్లు మాత్రమే సాధించి మూడో స్థానంలో నిలిచింది. అంతలోనే మునుగోడు ఉపఎన్నిక వచ్చింది. అదే సమయంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలోకి ప్రవేశించింది. ఇటువంటి పరిస్థితుల్లో అటు మునుగోడు ఉప ఎన్నిక, భారత్ జోడో యాత్రను సమన్వయం చేసుకుంటూ ఆయన ముందుకు సాగారు. ఈ ఎన్నికల్లోనూ పార్టీకి పరాజయమే మిగిలింది. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో రేవంత్ 2023, ఫిబ్రవరి 6 నుంచి మార్చి 20 వరకు 33 రోజులపాటు చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి ఉత్సాహాన్ని తెచ్చింది. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహాలు సఫలీకృతమై 64 అసెంబ్లీ స్థానాలు గెలుచుకొని కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టగలిగింది. రేవంత్ సీఎం, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. 8 పార్లమెంటు స్థానా ల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా రేవంత్ పార్టీని నడిపించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా దాదాపు 9 నెలలపాటు ఆయన పీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు. ఆదివారం టీపీసీసీ కొత్త అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించడంతో రేవంత్ రెడ్డి 38 నెలల పీసీసీ అధ్యక్ష ప్రస్థానానికి ముగింపు పలికినట్టు అయింది.



అస్సాంలోని తముల్ పూర్‌లో మొక్క నాటుతున్న సంతోష్‌కుమార్, జాదవ్ పాయెంగ్ తదితరులు

అస్సాంలో గ్రీన్ ఇండియా చాలెంజ్

- 2030 కల్లా అస్సాంలో కోటి మొక్కలు నాటే లక్ష్యం
- ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విస్తరణ

సాక్షి, హైదరాబాద్: ప్రకృతిని కాపాడేందుకు పర్యావరణ విద్యను తప్పనిసరిగా పాఠ్యాంశాల్లో చేర్చాలని పద్మశ్రీ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పాయెంగ్ వ్యాఖ్యానించారు. ప్రకృతి విధ్వంసం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు, తద్వారా మానవాళికి పొంచి ఉన్న ముప్పు చాలామందికి అర్థం కావడం లేదని, ఆ దిశగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు మేల్కొనాలని ఆయన పిలుపునిచ్చారు. అస్సాంలోని తముల్ పూర్‌లో గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోలెన్ దోయినరీ పౌరులతో కలిసి వందలాది మొక్కలు నాటారు. విస్తృతంగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అవసరమైనటువంటి విషయాలను జాగృతం చేసే దిశగా గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఎంతగానో కృషిచేస్తున్నారని జాదవ్ కొనియాడారు. పర్యావరణ మార్పుల వల్ల ఈశాన్య హిమాలయాలకు ముంపు పొంచి ఉందని, హిమానీ నదులు కరగటం వల్ల రానున్న రోజుల్లో సముద్ర మట్టం పెరిగి తీర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఒకప్పుడు పర్యావరణపరంగా మంచి సమతుల్యత ఉన్న అస్సాంలో క్రమంగా అటవీ విస్తీర్ణం ప్రమాదకర స్థాయిలో తగ్గుతోందని, అందువల్ల అడవుల నరికివేతను అడ్డుకోవడంతో పాటు, ప్రకృతి పునరుద్ధరణ కోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం జోగినిపల్లి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తామని, స్థానిక సంస్థలు, ఎన్జీవోల సహకారంతో 2030 కల్లా అస్సాంలో కోటి మొక్కలు నాటుతామని వెల్లడించారు. గతేడాది మొదలైన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 2.5 లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. మజులీ ప్రాంతంలో జాదవ్ మొక్కలు నాటి అభివృద్ధి చేసిన మలైకోతాని తరహాలో మియావాకి విధానంలో చిక్కటి అడవుల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గ్రీన్ ఇండియా చాలెంజ్ మద్దతును ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తముల్ పూర్ జిల్లా కలెక్టర్ బి.బికాస్ భగవత్, ఇగ్నైటింగ్ మైండ్స్ నుంచి రీతు రాజ్ పుకాన్, నవోదయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు వివిధ ప్రాంతాల్లో వినాయకుడిని నిమజ్జనం చేసిన భక్తులు యాదాద్రి క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మండపాలు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాలు కిటకిటలాడాయి. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.40,0,735 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

-యాదగిరిగుట్ట

రూ.500 సిలిండర్‌కు అర్హులు 42.90 లక్షలేనా?

- ప్రజాపాలనలో గుర్తించిన అర్హులు 89.21 లక్షలు
- రాష్ట్రంలో ఉన్న రేషన్‌కార్డులు 90 లక్షలు
- కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు లబ్ధిదారులు పెరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రూ.500 లకే గ్యాస్ సిలిండర్ రాష్ట్రవ్యాప్తంగా కేవలం 42,90,246 కుటుంబాలకే అందుతోంది. మొదటివిడత ప్రజాపాలనలో భాగంగా అన్ని జిల్లాల్లో కోటి ఐదు లక్షల దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. ఇందులో 89,21,269 దరఖాస్తులను కంప్యూటరైజ్ చేశారు. కానీ ఇందులో సగానికన్నా తక్కువ 42.90 లక్షల కుటుంబాలను మాత్రమే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌కు అర్హులుగా ఎంపిక చేశారు. వీరికి గత ఏప్రిల్ నుంచి ఆగస్టు 15 వరకు 56,46,808 గ్యాస్ సిలిండర్లకు ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని భరించింది. ఈ మేరకు ఆయిల్ కంపెనీలకు రూ.168.17 కోట్లు చెల్లించింది. రేషన్‌కార్డు (ఆహారభద్రత కార్డు) ఉన్న ప్రతీ కుటుంబానికి మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని తొలుత ప్రభుత్వం చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలనే తొందరలో లబ్ధిదారుల ఎంపికలో సరైన ప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలు వచ్చాయి.

రేషన్‌కార్డు ఉన్నా...


రాష్ట్రంలో భారత్, ఇండేన్, హెచ్‌పీలకు చెందిన కోటి 30 లక్షలకు పైగా గృహావసర (డొమెస్టిక్) గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. 33 జిల్లాల్లో 90 లక్షలకు పైగా రేషన్‌కార్డులు ఉన్నాయి. అత్యంత పేదరికం అనుభవిస్తున్నవారు, అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి మినహా రేషన్‌కార్డులు ఉన్న వారందరికీ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ లెక్కన రేషన్‌కార్డులు ఉన్న వారంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలే అని ప్రభుత్వం భావిస్తే మహాలక్ష్మి పథకం కనీసం 70 లక్షల కుటుంబాలకైనా వర్తించాలి. కానీ ప్రస్తుతం కేవలం 42.90 లక్షల కుటుంబాలకు మాత్రమే రూ.500కు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుండడాన్ని బట్టి మహాలక్ష్మి పథకానికి రేషన్‌కార్డుతో పాటు ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారని స్పష్టమవుతోంది.ఈ నేపథ్యంలో తమకు కూడా రూ.500 సిలిండర్ పథకాన్ని వర్తింపజేయాలని రేషన్‌కార్డుదారులంతా కోరుతున్నారు. కాగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తే లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగి అవకాశముంది.

'ప్రజాపాలన' కాదు.. 'విమోచన' నిర్వహించాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని, మహారాష్ట్ర, కర్ణాటకలో నిర్వహిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న నిరంకుశ నిజాం పాలన అంతమై తెలంగాణ స్వేచ్ఛ పొందిందని, ఎందరో త్యాగాలు చేసి నిజాం పాలనను అంతం చేశారని, అందుకే అమరుల త్యాగాలను స్మరిస్తూ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని అన్నారు. గత ప్రభుత్వం జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట రెండేళ్లు కార్యక్రమాలు నిర్వహించిందని, ఇప్పుడున్న ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం అని కొత్త పేరుతో చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాపాలన ఉత్సవాలు అనడం రాజ్యాంగబద్ధమైనది కాదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థాన ప్రజలు పోరాటాలు చేశారని, భరతమాతకు తగిలిన గాయాలను మాన్పేందుకు సర్దార్ పటేల్ ఆపరేషన్ పోలోతో హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో కలిపేలా కృషిచేశారని అన్నారు. అన్ని వర్గాల పోరాటంతోపాటు ఆపరేషన్ పోలోతో సెప్టెంబర్ 17, 1948న తెలంగాణకు అసలైన స్వాతంత్ర్యం లభించిందని, ఆ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకునేలా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.




ఆదివారం హైదరాబాద్‌లో మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ్‌శంకర్‌తో మర్యాద పూర్వకంగా సమావేశమైన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



తెలంగాణ విమోచన దినోత్సవం నేపథ్యంలో ఆదివారం పరేడ్‌గ్రౌండ్స్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్



కృష్ణా నదికి భారీ వరద వస్తున్న సమయంలో నీరు లేక ఖాళీగా పోతిరెడ్డిపాడు కెనాల్



ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలో కలుస్తున్న వరద నీరు

అటు ఎండబెట్టి.. ఇటు ముంచేసి..

కృష్ణా వరదల నియంత్రణలో చంద్రబాబు ప్రభుత్వం ఘోర వైఫల్యం

- ఈ సీజన్‌లో ఇప్పటిదాకా శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,016.19 టీఎంసీల ప్రవాహం
- స్పిల్ వే గేట్లు, కుడి, ఎడమ విద్యుత్కేంద్రాల ద్వారా 858.72 టీఎంసీలు సాగర్‌కు విడుదల
- ప్రకాశం బ్యారేజీ నుంచి ఇప్పటిదాకా 647.16 టీఎంసీలు సముద్రంలోకి..
- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 93.21, హంద్రీ–నీవా ద్వారా 4.24 టీఎంసీలే రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు తరలింపు
- పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం
- ఈ సీజన్‌లో ఏ ఒక్కరోజూ అలా విడుదల చేయని సర్కారు
- తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీ ప్రాజెక్టులు నిండాలంటే ఇంకా 125.29 టీఎంసీలు అవసరం
- హంద్రీ–నీవా ప్రాజెక్టులు నిండాలంటే 36 టీఎంసీలు కావాలి
- వరద రోజుల్లో శ్రీశైలంలో విద్యుదుత్పత్తిలోనూ తెలంగాణ కంటే వెనుకబడిన ఏపీ
- వరద రోజుల్లో పోతిరెడ్డిపాడు ద్వారా పూర్తిస్థాయిలో నీటిని తరలించి ఉంటే ఈ ప్రాజెక్టులన్నీ నిండేవి
- విజయవాడతోపాటు ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ముంపు ముప్పు తప్పేది
- ప్రాణ, ఆస్తి నష్టానికి అవకాశమే ఉండేది కాదంటున్న అధికారులు, నిపుణులు


కృష్ణా వరద నియంత్రణలో చంద్రబాబు ప్రభుత్వం ఘోర వైఫల్యమే విజయవాడతోపాటు కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో జల ప్రళయం సంభవించడానికి.. అపార ప్రాణ, ఆస్తి నష్టానికి దారితీసిందని జలవనరుల శాఖ అధికార వర్గాలు, సాగునీటిరంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదను శ్రీశైలం ప్రాజెక్టులో నియంత్రించేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులకు మళ్లించి.. గేట్లు, విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా దిగువకు విడుదలచేసి ఫ్లడ్ కుషన్ ఉంచుకుని ఉంటే జలప్రళయం సంభవించే అవకాశమే ఉండేది కాదని వారు తేల్చిచెబుతున్నారు. ఈ సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టులోకి జూన్ 1 నుంచి శుక్రవారం ఉ.6 గంటల వరకూ 1,016.19 టీఎంసీల ప్రవాహం వస్తే.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేవలం 93.21 టీఎంసీలే మళ్లించారు. ఆ రెగ్యులేటర్‌పై ఆధారపడ్డ ప్రాజెక్టులు నిండాలంటే ఇంకా 125.29 టీఎంసీలు అవసరం. నిజానికి.. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల గేట్లు ఎత్తేసి.. ప్రకాశం బ్యారేజీ ద్వారా జలాలు సముద్రంలో కలుస్తున్నప్పుడు ఎగువన ఇరు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత మళ్లించినా ఆ నీటిని కోటాలో కలపకూడదని 2019లో కృష్ణా బోర్డు సమావేశంలో రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఈ నేపథ్యంలో.. వరదల సమయంలో గరిష్ఠస్థాయిలో పోతిరెడ్డిపాడు ద్వారా ఒడిసి పట్టి ఉంటే.. రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులు నిండి ఆ ప్రాంతాలు సస్యశ్యామలమయ్యేవని.. ప్రకాశం బ్యారేజీ దిగువన ముంపు ముప్పు తప్పేదని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టానికి జరిగేది కాదని వారు స్పష్టంచేస్తున్నారు. 2019, 2020, 2021, 2022లలో కృష్ణా వరదను ప్రభుత్వం ఇదే రీతిలో నియంత్రించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిందని వారు గుర్తుచేస్తున్నారు.

– ఆలమూరు రాంగోపాల్‌రెడ్డి, సాక్షి ప్రతినిధి

శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ, ప్రవాహాలు, దిగువకు విడుదల చేసిన ప్రవాహాలు ఇవీ..

తేదీ	నీటి మట్టం (అడుగుల్లో)	నీటి నిల్వ (టీఎంసీల్లో)	ప్రాజెక్టులోకి ప్రవాహం(క్యూ.సె)	పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల(క్యూ.సె)	గేట్ల ద్వారా దిగువకు (క్యూ.సె)	విద్యుత్కేంద్రాల ద్వారా దిగువకు (క్యూసెక్కుల్లో)
28.08.2024	885	215.81	1,69,303	30,000	--	68,398
29.08.2024	885	215.81	2,13,395	30,000	1,11,251	68,093
30.08.2024	884.7	213.88	3,43,145	30,000	2,63,530	67,860
31.08.2024	885	215.81	3,93,177	30,000	2,68,861	68,152
01.09.2024	884	212.92	4,05,897	26,042	3,43,706	66,389
02.09.2024	884.8	212.43	5,16,179	16,417	4,38,957	64,806
03.09.2024	883.7	208.24	4,86,608	12,000	4,53,931	67,301

శ్రీశైలంలోకి ప్రవాహాలు ఇలా..



- ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఈ నెల 13 వరకు శ్రీశైలానికి వచ్చిన ప్రవాహం : **1,016.19** టీఎంసీలు
- ఇందులో జూరాల నుంచి వచ్చింది : **797.68** టీఎంసీలు
- సుంకేశుల నుంచి వచ్చింది : **217.51** టీఎంసీలు
- హంద్రీ నుంచి వచ్చింది : **1.00** టీఎంసీ

శ్రీశైలం నుంచి విడుదల చేసింది ఇలా..

ఆంధ్రప్రదేశ్..
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ : 93.21 టీఎంసీలు
- హంద్రీ–నీవా : 4.24 టీఎంసీలు
- కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం : 101.45 టీఎంసీలు

తెలంగాణ..
- కల్వకుర్తి ఎత్తిపోతల : 9.91 టీఎంసీలు
- ఎడమ గట్టు విద్యుదుత్పత్తి కేంద్రం : 152.74 టీఎంసీలు
- గేట్ల ద్వారా నదిలోకి విడుదల : 604.53 టీఎంసీలు

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌పై ఆధారపడ్డ ప్రాజెక్టుల్లో నీటి నిల్వల పరిస్థితి ఇదీ.. (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తి నిల్వ	ప్రస్తుత నిల్వ	నిండటానికి అవసరం
తెలుగుగంగ :			
వెలిగోడు	16.95	14.58	2.37
బ్రహ్మంసాగర్	17.74	3.79	13.95
సోమశిల	78	49	29
కండలేరు	68.03	11.62	56.41
ఎస్సార్-1	2.13	1.68	0.45
ఎస్సార్-2	2.44	1.89	0.55
ఎస్సార్బీసీ :			
గోరకల్లు	12.44	8.38	4.06
అవుకు	4.15	2.9	1.25
గాలేరు-నగరి			
గండికోట	26.85	24.89	1.96
మైలవరం	9.98	4.54	5.44
పైడిపాలెం	6	4.21	1.79
వామికొండ	1.6	0.75	0.85
సర్వారాయ	3.06	0.81	2.25
సీబీఆర్	10	5.04	4.96
మొత్తం :			125.29

వరద నియంత్రణ చేసేది ఇలాగేనా..

- కృష్ణా నది చరిత్రలో శ్రీశైలం ప్రాజెక్టులోకి 2009, సెప్టెంబరు 2న గరిష్ఠంగా 25.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. అప్పట్లో ఈ వరదను సమర్థవంతంగా నియంత్రించడంవల్ల ప్రకాశం బ్యారేజీలోకి వచ్చే ప్రవాహాన్ని గరిష్ఠంగా 11.10 లక్షలకు పరిమితం చేశారు.
- కృష్ణా బేసిన్‌లో ఈ ఆగస్టు 30, 31.. సెప్టెంబరు 1 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఆగస్టు 28నే హెచ్చరించింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి ఆగస్టు 28న 1,69,303 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు 885 అడుగుల్లో 215.81 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. దిగువన నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి. కానీ, ఆ రోజున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేవలం 30 వేల క్యూసెక్కులను మాత్రమే వదిలారు. ఆ తర్వాత శ్రీశైలంలోకి ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగినా ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో 30 వేల క్యూసెక్కుల చొప్పున.. సెప్టెంబరు 1న 26,042 క్యూసెక్కులను మాత్రమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా మళ్లిస్తూ వచ్చిన వరదను వచ్చినట్లు సాగర్, పులిచింతల ద్వారా దిగువకు వదిలేశారు.
- దీంతో ప్రకాశం బ్యారేజీని కృష్ణా వరద ముంచెత్తింది. బ్యారేజీ చరిత్రలో ఎన్నడూలేని రీతిలో సెప్టెంబరు 2న గరిష్ఠంగా 11,43,201 క్యూసెక్కుల వరద రావడానికి దారితీసింది. ఆ రోజున కూడా పోతిరెడ్డిపాడు ద్వారా కేవలం 16,417 క్యూసెక్కులు.. సెప్టెంబరు 3న 12 వేల క్యూసెక్కులు మాత్రమే మళ్లించారు.

రాష్ట్ర ప్రయోజనాలు 'కృష్ణా'ర్పణం..

- వరద నియంత్రణలో ప్రభుత్వ ఘోర వైఫల్యంవల్ల ప్రకాశం బ్యారేజీ నుంచి ఇప్పటికే 647.16 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ప్రభుత్వం ముందుచూపుతో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా పూర్తి సామర్థ్యం మేరకు నీటిని మళ్లించి ఉంటే.. కడలిలో కలిసిన జలాల్లో కనీసం 100 టీఎంసీలు రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు దక్కి ఉండేవని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఒకరు 'సాక్షి'కి చెప్పారు. ఈ సీజన్‌లో ఏ ఒక్కరోజూ 'పోతిరెడ్డిపాడు' సామర్థ్యం మేరకు 44 వేల క్యూసెక్కులు తరలించకపోవడాన్ని ఆయన గుర్తుచేశారు.
- ఇక హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం ద్వారా రోజుకు 3,850 క్యూసెక్కుల చొప్పున తరలిస్తేనే 120 రోజుల్లో ప్రస్తుత డిజైన్ మేరకు 40 టీఎంసీలు రాయలసీమకు అందించవచ్చు. కానీ, ఇప్పటికి కేవలం 4.24 టీఎంసీలే తరలించారు. ఈ సీజన్‌లో గరిష్ఠంగా 1,688 క్యూసెక్కులను మాత్రమే ఎత్తిపోశారు.
- వరద రోజుల్లో మళ్లించిన జలాలను కృష్ణా బోర్డు కోటాలో కలిపేది కాదు.. దీనివల్ల రాష్ట్ర కోటా 512 టీఎంసీల కంటే అధికంగా వాడుకునే అవకాశం ఉండేది. ఇది రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి దారితీసేది.
- ఇక శ్రీశైలంలో విద్యుదుత్పత్తికి చెరి సగం నీటిని వాడుకోవాలి. కానీ, తెలంగాణ జెన్‌కో కంటే ఏపీ జెన్‌కో తక్కువ విద్యుదుత్పత్తి చేసింది.

గంగమ్మ ఒడికి గణనాథుడు



తొమ్మిది రోజుల పాటు మంటపాల్లో పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. ఆదివారం విశాఖలోని వైఎంసీఏ బీచ్‌లో భక్తులు గణేశుని నిమజ్జనం దృశ్యం

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బంకర్ బైటపడింది



వాతావరణ మార్పుల కారణంగా విశాఖ తీరంలో సముద్రం వెనక్కి వెళ్లడంతో పురాతన బంకర్ బయటపడింది. సందర్శకులను ఈ బంకర్ విశేషంగా ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రైతే కాడెద్దయి..



బెండ పంటలో కలుపు తీసేందుకు ఓ రైతు తానే కాడెద్దుగా మారాడు. కాడెద్దుల కూలీ ఎకరాకు రూ. 1500 అడగడంతో అనంతపురం రూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన రైతు మచ్చ ఆదిశేషారెడ్డి తానే కాడెద్దుగా మారి భార్య సహాయంతో దంతకుంటుకతో కలుపు తీస్తున్న దృశ్యం

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి పెరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరుకు వరద నేపథ్యంలో కొన్ని రోజులుగా భక్తుల రద్దీ బాగా తగ్గింది. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అమ్మవారి సన్నిధిలో భక్తుల తాకిడి కనిపించింది. సర్వదర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లు కిటకిటలాడాయి.

వైభవంగా జైనుల శోభాయాత్ర



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యూషన్ పర్వదినాలు పురస్కరించుకొని ఆదివారం విజయవాడ నగరంలోని జైనులు నిర్వహించిన శోభయాత్ర వైభవంగా జరిగింది. మహావీర్ భగవానుని స్మరిస్తూ జైనులు శోభయాత్రలో పాల్గొన్నారు. శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ శోభయాత్రను నిర్వహించారు. గుర్రపు బగ్గీని పూలతో అలంకరించి అందులో మహావీరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగించారు. అధిక రోజులు ఉపవాసదీక్షలు పాటించిన కుటుంబాలను గుర్రపుబగ్గీల్లో ఊరేగించారు.

హనుమద్వాహనంపై రంగనాథస్వామి



పులివెందుల టౌన్: వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని రంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల సందర్భంగా ఆదివారం సతీ సమేత రంగనాథస్వామి హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

మద్దిలో ముగిసిన పవిత్రోత్సవాలు



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాపూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు. స్వామి వారికి అలంకరణ చేసే పవిత్రాలతో క్షేత్రంలో వేద మంత్రోచ్చారణలతో పూర్ణాహుతి హోమగుండ యాగశాల వద్దకు తీసుకొచ్చారు. పవిత్ర విసర్జన, దీక్షా విరమణ, మహదాశీర్వచనం, పండిత సత్కారం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పవిత్రోత్సవాలు నేటితో ముగియడంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్వామి వారి గర్భాలయ దర్శనాన్ని పునః ప్రారంభించారు.

ప్రారంభమైన ఉరుసు ఉత్సవం

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా పాత రాయచోటిలో వెలసివున్న హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీ ఆదివారం రాత్రి గంధం ఊరేగింపుతో ఉరుసు ప్రారంభమైంది. అదే విధంగా ఈ నెల 16న మధ్యాహ్నం దర్గా ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం, అదే రోజు సాయంత్రం ఉరుసు మహోత్సవం జరగనుంది. 17న తహలీల్ ఫతేహాతో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నాయి.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధిని విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

శ్రీ అర్ధనారీశ్వర గణపతిగా సంపత్ వినాయగర్



సీతమ్మధార: ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి ఆదివారం శ్రీ అర్ధనారీశ్వర గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి



అన్నవరం: వరుస సెలవులు రావడంతో ఆదివారం వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి కిటకిటలాడింది. శనివారం నుంచి సోమవారం వరకు వరుస సెలవులు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా రెండు వేల వ్రతాలు జరిగాయి. సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది.

నేడు సమగ్ర శిక్ష ఉద్యోగుల సదస్సు



బంగారుపాళెం (చిత్తూరు జిల్లా): సమగ్ర శిక్ష ఉద్యోగుల సదస్సు సోమవారం తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్ట్ కాంట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ నాయకులు విల్వనాథన్, కృష్ణమూర్తి తెలిపారు. దీనికి ఉద్యోగులందరూ తప్పక హాజరు కావాలని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సుకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.




పర్యాటకంపై వీడియో-రీల్స్ పోటీలు

తిరుపతి(అలిపిరి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీన జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలియజేస్తూ వీడియో-రీల్స్' పోటీలు నిర్వహించనున్నట్లు టూరిజం ఈడీ రమణ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 24వ తేదీలోపు వీడియోలు-రీల్స్ పంపాలని కోరారు.వివరాలకు 9154989719, 6309942027 నంబర్లు, https:/tirupati.ap.gov.in/https:/tirupati.ap.gov.in/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.


తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: తమిళనాడులోని తిరుఅణ్ణామలైకి మంగళవారం వేకువజామున 4 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఏసీ సర్వీసులతోపాటు సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, పుత్తూరు డిపోల నుంచి సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఇతర వివరాల కోసం 9959225686, 9959225684 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.





● సిటీ ప్యాలెస్



రాణాల ప్రతాపానికి ప్రతీక

రాజ్ మహల్... తాజ్ మహల్ కాదు, రాజ్ మహలే. రాజస్థాన్‌లో చల్లటి నగరం ఉదయ్‌పూర్‌లో ఉందీ రాజ్‌మహల్. రాజస్థాన్ అనగానే విస్తారమైన ఎడారి, ఇసుక తిన్నెలు, ఎండకు మిలమిల మెరుస్తున్న ఇసుకలో సుదూర ప్రయాణం చేస్తున్న ఒంటె అడుగు జాడలు గుర్తొస్తాయి. దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది ఉదయ్‌పూర్. నగరంలో ఎటు వెళ్లినా ఒక వాటర్ బాడీ కనిపిస్తుంది. కనుచూపు మేరలో ఆరావళి పర్వతాలు పచ్చగా ఉంటాయి. ఆ పచ్చదనానికి దీటుగా నగరంలో కోటలోపల ప్యాలెస్‌ల మీద కూడా చెట్లు ఉంటాయి. వాటిని చెట్లు అనకూడదు, మహావృక్షాలవి. కొండ శిఖరం, వాలును ఆసరాగా చేసుకుని నిర్మించిన ప్యాలెస్‌లో చెట్ల మొదళ్లు మూడో అంతస్తులో ఉంటాయి. రాజ్‌మహల్ పేరుతో నిర్మించినప్పటికీ సిటీప్యాలెస్‌గా వ్యవహారంలోకి వచ్చింది. ఈ ప్యాలెస్ గురించి చెప్పుకునే ముందు పద్మావత్ సినిమాలో చూసిన చిత్తోర్‌గఢ్‌ను గుర్తు చేసుకోవాలి. మహారాణా ఉదయ్ సింగ్ (రాణా ప్రతాప్ తండ్రి) పుట్టిన కోట అది. అది అన్యాక్రాంతమైన తర్వాత ఉదయ్‌సింగ్ ఈ నగరాన్ని నిర్మించి ఇక్కడి నుంచే పాలన కొనసాగించాడు. నగరం శత్రుదుర్భేద్యంగా ఉండాలి, అదే సమయంలో నీటికి ఇబ్బంది లేకుండానూ ఉండాలనే ఉద్దేశంతో కొండలు, సరస్సుల మధ్య నిర్మించాడు. అందుకే దీనిని లేక్ సిటీ, కశ్మీర్ ఆఫ్ రాజస్థాన్ అంటారు.

వంట పాత్రలు... ఇనుప కవచాలు

సిటీ ప్యాలెస్... పిచోలా సరస్సు ఒడ్డున ఉంది. సిటీ ప్యాలెస్ ఎక్స్‌టీరియర్ వ్యూ అది కూడా ఒక వైపు కవర్ చేయాలంటే పిచోలా లేక్‌లో బోట్ షికారు చేయాలి. రాణి వంట గది ప్యాలెస్ లోపల ఉంటుంది. సిసోడియా రాజ వంశీయులు సూర్యుడిని ఆరాధిస్తారు. రోజూ సూర్యుడికి నైవేద్యం పెట్టిన తర్వాత మాత్రమే భోజనం చేస్తారు. ప్యాలెస్‌లోపల అనేక చోట్ల సూర్యుడి లోహపు రూపాలుంటాయి. శీతాకాలంలో మబ్బు పట్టి సూర్యుడు కనిపించని రోజుల్లో లేత కిరణాలు ఆ లోహపు సూర్యుడి ప్రతిమ మీద ప్రతిబింబిస్తాయి. ఆ ప్రతిబింబానికి నమస్కారం చేసి వంటకాలు నివేదన చేస్తారు. సూర్యుడికి నివేదించే వంటలను ప్యాలెస్ లోపలి వంటగదిలో రాణి స్వయంగా చేయడం ఆనవాయితీ. ప్యాలెస్ ద్వారాలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయా అనిపిస్తాయి. తల పైకెత్తి చూడాలి. కొన్ని గదుల్లోకి మాత్రం నడుము వరకు వంగి వెళ్లాలి. శత్రువులు దాడి చేసినప్పుడు రక్షణ కోసం ఆ ఏర్పాటు. కొన్ని గదుల్లో యుద్ధ సామగ్రి ఉంటుంది. మహారాణా ప్రతాప్ భుజాల నుంచి మోకాళ్ల వరకు ధరించిన ఇనుప కవచం మన ఎత్తు ఉంటుంది. దానిని చూస్తూ ఆశ్చర్యపోయే లోపు గైడ్ పక్కనే ఉన్న గుర్రాన్ని చూపిస్తాడు. అది చేతక్ నమూనా. మహారాణా ప్రతాప్ సింగ్ గుర్రం పేరు చేతక్. తెల్లగా ఉంటుంది. ఆ గుర్రం నమూనా తయారు చేసి చేతక్ ధరించిన కవచాన్ని ధరింపచేశారు. రాజు ఒక్క ఉదుటున ఆ గుర్రం మీదకు ఎక్కాలంటే రాజు ఎత్తు ఎంత ఉంటుంది! అనే సందేహాన్ని ఎదురుగా ఉన్న కవచం నివృత్తి చేస్తుంది. ప్యాలెస్‌లో రాణి గది ఎదురుగా పాలరాతి బెంచ్ ఉంటుంది. రాజు మందిరానికి వచ్చినప్పటికి రాణి అలంకరణ పూర్తి కాకపోతే, అలంకరణ పూర్తయ్యే వరకు రాజు ఆ ఆసనం మీద కూర్చుని ఎదురు చేసేవాడని గైడ్ చెప్పినప్పుడు పర్యాటకుల పెదవుల మీద ఓ చిరునవ్వు విరుస్తుంది. ప్యాలెస్ లోపల కొంత భాగంలో రాజకుటుంబం నివసిస్తోంది. కొంత భాగంలోనే పర్యాటకులను అనుమతిస్తారు.



● ఏనుగు చిత్రలేఖనంలో శాలువా మీద రాజ్యచిహ్నం సూర్యుడిబొమ్మ

- వాకా మంజులారెడ్డి

మస్కట్ పిలుస్తోంది!

సెప్టెంబర్ నెలలో రాజధాని నగరం మస్కట్ నగరంలో విహరించమని పర్యాటకులకు ఆహ్వానం పలుకుతోంది ఒమన్ దేశం. చల్లటి వాతావరణంలో టూరిస్టుల తాకిడి తక్కువగా ఉన్న సమయం షాపింగ్‌కి అనువైన కాలం అంటూ ఈ వీసా సౌకర్యం కల్పిస్తోంది ఒమన్ టూరిజం. ఇక్కడ ఏమేమి చూడవచ్చు, ఏమేమి కొనవచ్చు! ఓ లుక్ వేద్దాం. మస్కట్ నగరంలో పురాతన కోటలున్నాయి, అద్భుతంగా నిర్మించిన మసీదులున్నాయి, కనువిందు చేసే పార్కులు, సంస్కృతి సంప్రదాయాలు చరిత్రకు ఆలవాలంగా భారీ మ్యూజియాలున్నాయి. అల్ జలాయ్ ఫోర్ట్‌ను చూడాలి. 16వ శతాబ్దంలో పోర్చుగీసు స్వాధీనంలోకి వెళ్లిన అరబ్బుల కోట ఒమన్ చరిత్రకు ప్రతిబింబం. ఇక ప్రార్థన మందిరాలను చూడాలంటే సుల్తాన్ ఖాబూస్ గ్రాండ్ మాస్క్. ఇది ఎంత పెద్దదంటే ఒకేసారి ఇరవై వేల మంది ప్రార్థనలు చేసుకోవచ్చన్నమాట. ఇక షాపింగ్ చేయాలంటే ముత్రాహ్ సౌక్‌ను తప్పకుండా చూడాలి. అరబిక్ సంప్రదాయం కళ్ల ముందు ప్రత్యక్షమైనట్లు ఉంటుంది. ముండూస్ (ఆభరణాల పెట్టె), టర్కీ కార్పెట్, ఫ్రిడ్జ్ మ్యాగ్నెట్, పోస్ట్ కార్డ్, పెర్ఫ్యూమ్, కర్జూరాలను కొనుక్కోవచ్చు. కశ్మీర్ కార్పెట్‌లు ఈ మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణ.






మ్యూజియం చేసే మ్యాజిక్: నేషనల్ మ్యూజియంలోకి వెళ్లిన తర్వాత మనకు తెలియకుండానే టైమ్ మెషీన్‌లోకి వెళ్లిపోతాం. ఎన్ని గంటలకు బయటకు వస్తామో చెప్పలేం. ఇక ముఖ్యంగా చెప్పుకోవలసింది బైట్ అల్ జుబైర్ గురించి. ఇది ఓమన్ సంప్రదాయ వాస్తుశైలి నిర్మాణం. ఫర్నిచర్, హస్తకళాకృతులు, స్టాంపులు, నాణేల సుమహారం. ఇదీ సింపుల్‌గా మస్కట్ నగరం. ముంబయి నుంచి డైరెక్ట్ ఫ్లయిట్ ఉంది. రెండున్నర గంటల ప్రయాణం.



● శనివార్ వాడా

బాజీరావు ఇల్లు







రణవీర్ సింగ్, దీపికా పడుకోన్ నటించిన బాజీరావ్ మస్తానీ సినిమా గుర్తుందా? ఆ సినిమాలో బాజీరావు ఇల్లు శనివార్ వాడా కళ్ల ముందు మెదులుతోందా? ఆ శనివార్ వాడా ఉన్నది పూణేకి సమీపంలోనే. ఆ సినిమాలో అనేక ప్రధానమైన సన్నివేశాల చిత్రీకరణ ఈ కోటలోనే జరిగింది. పూణేకి వెళ్లాల్సిన పని పడితే తప్పకుండా చూడండి. కోట ప్రధానద్వారం భారీ రాతి నిర్మాణం. ఏడంతస్తుల నిర్మాణంలో ఒక అంతస్తు మాత్రమే రాతి కట్టడం, ఆ తర్వాత ఇటుకలతో నిర్మించారు. కోటలోపల ప్రతి అంగుళమూ మరాఠాల విశ్వాసాలను, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంటుంది. 18వ శతాబ్దం నాటి ఈ నిర్మాణం భారత జాతీయ రాజకీయ క్లిష్టతలను కూడా ఎదుర్కొంది. 19వ శతాబ్దంలో కొంత భాగం అగ్నికి ఆహుతైపోయింది.

నిర్మాణపరంగా, చరిత్ర పరంగా గొప్ప నేపథ్యం కలిగిన ఈ కోట పర్యాటకుల దృష్టిని పెద్దగా ఆకర్షించలేదు. బాజీరావు మస్తానీ సినిమా తర్వాత పలువురి దృష్టి దీని మీదకు మళ్లింది. మహారాష్ట్ర టూరిజమ్ గార్డెన్‌లను మెయింటెయిన్ చేస్తోంది. కానీ పెరుగుతున్న పర్యాటకులకు తగినట్లు పార్కింగ్, రెస్టారెంట్ సౌకర్యం లేదు. ఈ కోటలో కాశీబాయ్ ప్యాలెస్, అద్దాల మహల్ పిల్లలను ఆకట్టుకుంటాయి. ఈ కోట లోపల తిరుగుతూ ఉంటే సినిమా దృశ్యాలు కళ్ల ముందు మెదులుతూ మనమూ అందులో భాగమైన భావన కలుగుతుంది. టీనేజ్ పిల్లలకు ఈ నిర్మాణాన్ని చూపించి తీరాలి.

ఆర్ట్

అంతర్జాతీయ స్థాయిలో

టెర్రకోట కళ

సంప్రదాయ టెర్రకోట కళను ప్రోత్సహించి కళాకారులను ఆదుకునేందుకు ఉత్తర్‌ప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ సర్కార్ సిద్ధమయ్యింది. గోరఖ్ పూర్ ప్రాంతానికి చెందిన ఈ అరుదైన కళను కాపాడటమే కాదు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు యూపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో నాలుగు ప్రత్యేక స్టాల్స్‌లో కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. సెప్టెంబర్ 25-29 వరకు జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా టెర్రకోట కళను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నం చేస్తోంది యూపీ సర్కార్.









టెర్రకోట కళను ప్రోత్సహించే దిశగా 2018 లోనే సీఎం యోగి ఆదిత్యనాథ్ చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయమే టెర్రకోట పరిశ్రమను పూర్తిగా మార్చేసిందని జాతీయ అవార్డు గ్రహీత, టెర్రకోట కళాకారుడు రాజన్ ప్రజాపతి అన్నారు. 2017కి ముందు కష్టాల్లో ఉన్న ఈ కళ ఇప్పుడు కొత్త ఎత్తుకు చేరుకుందని, ఈ ఒక్క ఏడాదే వివిధ రాష్ట్రాల నుండి రూ.7 కోట్లకు పైగా ఆర్డర్లు వచ్చాయని తెలియజేశారు.

ప్రపంచ మార్కెట్‌లోకి...

త్వరలో జరగనున్న వాణిజ్య ప్రదర్శనలో విభిన్న రకాల టెర్రకోట ఉత్పత్తులను ప్రదర్శిస్తారు, ఇది ప్రపంచ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి కళాకారులకు అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. సిఎం యోగి ఆదిత్యనాథ్ ఈ కళను బ్రతికించేందుకు, కళాకారులను ఆదుకునేందుకు నిరంతర బ్రాండింగ్ ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రయత్నాలూ కళకు చేదోడు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ గోరఖ్‌పూర్ పర్యటన సందర్భంగా సిఎం యోగి టెర్రకోట గణేష్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. 2022లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు టెర్రకోట విగ్రహాలను అందజేశారు. ఇలా ఈ కళకు ప్రచారం కల్పించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నది అక్కడి ప్రభుత్వం. ప్రభుత్వ ప్రయత్నాలు కళను ప్రోత్సహించడమే కాకుండా దాని నాణ్యత, ఆకర్షణను కూడా నిర్ధారించాయి. దీని ఫలితంగా ప్రముఖులు, వారి సిబ్బంది గణనీయమైన కొనుగోళ్లు చేశారు. ప్రపంచ మార్కెట్ ఇప్పుడు అందుబాటులోకి రావడంతో గోరఖ్‌పూర్ టెర్రకోట క్రాఫ్ట్ అపూర్వమైన ప్రఖ్యాతిని సొంతం చేసుకుంటోంది.



కేరళ: స్పెషల్

పులికలి... జానపద నృత్యం

కేరళలో ఓనమ్ పది రోజుల పంట పండుగ. ఈ సందర్భంగా సద్య తాళిని ఆస్వాదించడానికి, పూల అలంకరణలు చేయడానికి, పడవ పందాలను చూడటానికి, ఆటలు ఆడటానికి, దయగల, ఎంతో ప్రియమైన రాక్షస రాజు మహాబలి స్వదేశానికి రావడాన్ని గౌరవించే వేడుక ఓనమ్. ఈ వేడుకలలో నాల్గవ రోజున కేరళలోని అత్యంత అద్భుతమైన దేశీయ కళారూపాలలో పులికలిను ప్రదర్శించారు. కొన్ని ప్రదేశాలలో దీనిని కడువాకలి అని కూడా పిలుస్తారు. ఇక్కడ కళాకారులు పులి వేషం వేసి, నృత్యాలు చేస్తారు.

ఓనం రోజుల్లో పులికొట్టు లేదా డ్యాన్స్‌తో పాటు వేసే దరువులు త్రిస్సూర్‌లో ప్రతిధ్వనిస్తాయి. త్రిస్సూర్‌లోని పులికలి తప్ప మరే ఇతర ప్రదేశంలోనూ ఈ ప్రత్యేక లయ లేదని చెప్పుకోవచ్చు. పులికలిక్కర్లు వారి నడుముకు గంటలు జోడించి ప్రత్యేకంగా ఆకర్షణీయంగా ఉండే ఈ అసుర లయకు అనుగుణంగా నృత్యం చేస్తారు.

వందల ఏళ్ళ నృత్యం

పులికలి 200 ఏళ్లనాటిది. అప్పటి కొచ్చిన్ మహారాజా రామవర్మ శక్తన్ థంపురాన్ దీనిని ప్రవేశపెట్టినట్లు చెబుతారు. సహజసిద్ధమైన రంగులను శరీరానికి పూసుకుని, కదులుతున్న పులుల వలె అలంకరింపబడిన పులికెత్తికళి ప్రదర్శనను స్థానికులు ఎంతగానో ఆస్వాదిస్తారు. త్రిస్సూర్‌లో ఈనాటికీ పురాతనమైన నృత్య శైలి మనుగడలో ఉంది. పులి వేషంలో నృత్యం చేసే కళాకారులను పులికలిక్కర్ అంటారు. వాద్యమేళం (కేరళకు చెందిన ఆర్కెస్ట్రా) లయకు అనుగుణంగా నృత్యం చేస్తారు. పులికలిక్కర్ పెయింటింగ్‌లో చారలు ముదురు పసుపు, నలుపు రంగులో ఉంటాయి. పులిని పోలి ఉండేలా శరీరం మొత్తం పెద్ద మచ్చలతో ఈ ఆర్ట్ వేస్తారు.

అట్టముక్కలు, సైకిల్ ట్యూబ్‌లు

'కళాకారులు ఓనమ్‌కి రెండు లేదా మూడు నెలల ముందే పులికాలి సన్నాహాలు ప్రారంభిస్తారు. బాగా తిని, పొట్టను సిద్ధం చేసుకుంటారు. దీని వల్ల కళలో వారు మంచి ప్రదర్శనను ఇవ్వగలుగుతారు' అని చెబుతారు. ఆరు రకాల చారలతో శరీరం అంతా పెయింట్ చేస్తారు. నేడు కళాకారులు ఫేస్ మాస్క్‌లతో మరింత నూతనంగా డిజైన్ చేస్తున్నారు. ఫేస్ మాస్క్ కోసం కాగితపు అట్టలను కత్తిరించి, దంతాలగా అటాచ్ చేయడానికి జిగురును ఉపయోగిస్తారు. నాలుకను సైకిల్ ట్యూబ్‌ను కత్తిరించి తయారు చేస్తారు. చివరి టచ్-అప్ ముఖానికి సాంప్రదాయక రంగులతో తగిన షేడ్స్‌ను సృష్టిస్తారు.

ప్రాచీన నృత్యాలు

రంగుల ముసుగు నృత్యం త్రిసూర్, పాలక్కాడ్ జిల్లా, దక్షిణ మలబార్‌లోని కొన్ని ప్రాంతాలలో జరుగుతుంది. మొదటి రోజు నుండి ఓనమ్ నాల్గవ రోజు వరకు ప్రదర్శకులు ఇంటింటికీ వెళతారు. శరీరమంతా కప్పి ఉంచేలా పర్వటక గడ్డితో దుస్తులు సిద్ధం చేస్తారు. దేవతలు, మానవులు, జంతువులు కుమ్మట్టికలి లో కనిపిస్తాయి. కళాకారులు ధరించే పాత్రలు, ముఖాలలో శివుడు, బ్రహ్మ, రాముడు, కృష్ణుడు, గణేశుడు, కాళి మొదలైనవారు ఉంటారు. ముసుగు వేసుకున్న కుమ్మట్టి (మాతృమూర్తి) నటన కళ్లారా చూడాల్సిందే.

ఇతర నృత్యాలు

స్త్రీలు చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి చేసే ప్రత్యేకమైన నృత్యం. అలంకరించిన ముగ్గు, మధ్యన సంప్రదాయ దీపం.. దాని చుట్టూ మహిళలు చేరి నృత్యం చేస్తారు. నీటితో నిండిన పాత్ర , బియ్యం పాత్ర.. వంటివి కూడా ఉంచుతారు.

వారసత్వ సంపద

రూట్ బ్రిడ్జ్ యునెస్కో జాబితాలో...







మేఘాలయ రాష్ట్రంలో సర్వసాధారణంగా కనిపించే లివింగ్ రూట్ బ్రిడ్జీల గురించి మనకు తెలిసిందే. ఆ రాష్ట్రానికే మన దేశానికీ ప్రకృతి పరంగా గుర్తింపు తెచ్చిన ఈ రూట్ బ్రిడ్జ్‌లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా ఇవ్వడం కోసం ప్రతినిధుల బృందం తరలి వచ్చింది. ప్రస్తుతం యునెస్కో తాత్కాలిక జాబితాలో ఉన్న లివింగ్ రూట్ బ్రిడ్జ్‌లను ప్రపంచ ప్రసిద్ధ వారసత్వ జాబితాలోకి చేరనుందని మేఘాలయ పర్యాటక మంత్రి పాల్ తెలియజేస్తున్నారు. 42వ యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్, రొమేనియా రాయబారి అయిన సిమోనా-మిరేలా మికులేస్కుతో లింగ్డో, జింగ్‌కీంగ్ జ్రీ లివింగ్ రూట్ బ్రిడ్జెస్‌ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలలో గుర్తించడం కోసం సమావేశం జరిపారు. ఈ సమావేశంలో యునెస్కో భారత రాయబారి, శాశ్వత ప్రతినిధి కూడా ఉన్నారు.



కఠినమైన పని చేయడానికి నేను ఒక సోమరిని ఎన్నుకుంటాను.
అతను సులభమైన మార్గాన్ని కచ్చితంగా కనుగొంటాడు..
-బిల్ గేట్స్, మైక్రోసాఫ్ట్ మాజీ సీఈవో

సాక్షి ప్లస్
సోమవారం। 16-9-2024

బిజినెస్ రీల్

అదానీ పవర్‌కు భారీ కాంట్రాక్ట్

6,600 మెగావాట్ల విద్యుత్ సరఫరా బిడ్‌కు ఓకే

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అటు పునరుత్పాదక(రెనెవబుల్), ఇటు బొగ్గుఆధారిత(థర్మల్) విద్యుత్ సరఫరాకు భారీ కాంట్రాక్టును పొందింది. దీనిలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వానికి 6,600 మెగావాట్ల రెనెవబుల్, థర్మల్ విద్యుత్‌ను సరఫరా చేయనుంది. ఇందుకు వేసిన బిడ్ గెలుపొందినట్లు అదానీ గ్రూప్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ బాటలో యూనిట్‌కు కోట్ చేసిన రూ. 4.08 ధర ద్వారా జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, టొరెంట్ పవర్‌లను అధిగమించింది. వెరసి రెనెవబుల్, థర్మల్ మిక్స్ ద్వారా 25ఏళ్ల దీర్ఘకాలానికి విద్యుత్‌ను సరఫరా చేయనుంది. ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ఎలక్ట్రిసిటీ ధరతో పోలిస్తే అదానీ గ్రూప్ యూనిట్‌కు దాదాపు రూపాయి తక్కువగా కోట్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎల్‌వోఐ జారీ అయిన తేదీ నుంచి రెండు రోజుల్లోగా సరఫరాలు ప్రారంభంకానున్నట్లు తెలుస్తోంది. కాగా.. మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ పంపిణీ సంస్థ(ఎంఎస్ఈడీసీఎల్) 6,600 మెగావాట్ల విద్యుత్ కోసం ఎల్‌వోఐను జారీ చేసినట్లు అదానీ పవర్ తాజాగా వెల్లడించింది. దీనిలో భాగంగా అదానీ పవర్ కొత్తగా ఏర్పాటు చేసిన 1,600 మెగావాట్ల అల్ట్రాసూపర్‌క్రిటికల్ సామర్థ్యం నుంచి 1,496 మెగావాట్ల థర్మల్ పవర్‌ను సరఫరా చేయనుంది. సహచర సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ గుజరాత్, కచ్‌లోని ఖావ్డా రెనెవబుల్ ఎనర్జీ పార్క్ నుంచి 5 గిగావాట్ల(5,000 మెగావాట్లు) సోలార్ పవర్‌ను సరఫరా చేయనుంది. బిడ్ ప్రకారం అదానీ గ్రీన్ యూనిట్‌కు రూ. 2.70 ఫిక్స్‌డ్ ధరలో సోలార్ పవర్‌ను కాంట్రాక్ట్ కాలంలో సరఫరా చేయనుంది.

స్టార్టప్‌ల పురోగతే లక్ష్యంగా నేడు ‘భాస్కర్’ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: భారత్ స్టార్టప్ నాలెడ్జ్ యాక్సెస్ రిజిస్ట్రీని (భాస్కర్) వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రారంభించనున్నారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, సర్వీస్ ప్రొవైడర్లు, ప్రభుత్వ సంస్థలు కలిసి పరస్పరం సహకరించుకోడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ చొరవ దోహదపడనుందని ఒక అధికార ప్రకటన తెలిపింది. అధికారిక ప్రకటన ప్రకారం ‘భాస్కర్’.. వినూత్న స్థాయిలో స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, సర్వీస్ ప్రొవైడర్లు ప్రభుత్వ సంస్థలతో సహా వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలోని కీలక వాటాదారుల మధ్య సహకారాన్ని కూడా మెరుగుపరుస్తుంది. స్టార్టప్ వ్యవస్థలో వాటాదారుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ రిజిస్ట్రీని నిర్మించడం భాస్కర్ ప్రాథమిక లక్ష్యమని ప్రకటన వివరించింది. లక్ష్య సాధనలో భాగంగా ఈ ప్లాట్‌ఫామ్ నెట్‌వర్కింగ్, సహకారం వంటి అనేక కీలక ఫీచర్లను అందిస్తుంది. సంబంధిత వనరుల విషయమై కేంద్రీకృత వ్యవస్థ సౌలభ్యత, భారత్ గ్లోబల్ బ్రాండ్‌కు మద్దతు వంటి కీలక అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ సేవలను వినియోగించుకోడానికి ప్రతి వాటాదారునికి ప్రత్యేక ‘భాస్కర్ ఐడీ’ని కేటాయించడం జరుగుతుంది. 1,46,000 పైగా ప్రభుత్వ–గుర్తింపు పొందిన స్టార్టప్‌లకు భారత్ నిలయంగా ఉంది. తద్వారా ఇందుకు సంబంధించి ప్రపంచంలోని అత్యంత డైనమిక్ స్టార్టప్ హబ్‌లలో ఒకటిగా వేగంగా పురోగమిస్తోంది.

మెటాకు కీలక మార్కెట్‌గా భారత్

సంస్థ ఇండియా వీపీ సంధ్య

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా తమకు కీలకమైన మార్కెట్లలో భారత్ కూడా ఒకటని సోషల్ మీడియా దిగ్గజం మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్య దేవనాథన్ తెలిపారు. దేశీయంగా రీల్స్, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాధనాలకు గణనీయంగా ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తి రీల్స్‌కి ఉందని గుర్తించిన బ్రాండ్లు, కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు తమ ప్రచార కార్యక్రమాల్లో వాటిని తొలినాళ్ల నుంచే వినియోగించడం ప్రారంభించాయని సంధ్య చెప్పారు. పేరెంటింగ్ టిప్స్ నుంచి ఓనమ్ వరకు వివిధ అంశాల గురించి సమాచారం కోసం భారతీయ యూజర్లు ఏఐ ఆధారిత చాట్‌బాట్ వైపు మళ్లుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో దేశీయంగా వ్యాపారావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, మరింతగా పెట్టుబడులు పెట్టడాన్ని కంపెనీ కొనసాగిస్తుందని ఆమె చెప్పారు. జెన్ జడ్, యువ జనాభా, ప్రైవేట్ రంగం పుంజుకోవడం, పటిష్టమైన వృద్ధి అవకాశాలు, నవకల్పనలు, స్టార్టప్ వ్యవస్థ, పటిష్టమైన క్యాపిటల్ మార్కెట్లు మొదలైనవి భారత మార్కెట్‌కి సానుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. పరిశ్రమ వర్గాల్లోనూ ఆశాభావం నెలకొందని సంధ్య వివరించారు. ఇవన్నీ కూడా భారత్ ఒక ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న దాఖలాలను సూచిస్తున్నాయన్నారు. వాస్తవానికి చాలాకాలం క్రితమే దేశానికి ఈ హోదా దక్కాల్సిందని ఆమె అభిప్రాయపడ్డారు.

మార్కెట్ చూపు ఫెడ్ వైపు

స్థూల ఆర్థిక గణాంకాలూ కీలకమే

- ఎఫ్ఐఐల క్రయ, విక్రయాలపై దృష్టి
- మార్కెట్ గమనంపై నిపుణుల అంచనా



ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య కమిటీ విధాన నిర్ణయాలు, స్థూల ఆర్థిక గణాంకాలు ఈ వారం స్టాక్ సూచీలకు దిశానిర్దేశం చేస్తాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, యూఎస్, భారత్ బాండ్లపై రాబడులను ఇన్వెస్టర్లు పరిశీలించవచ్చంటున్నారు. వీటితో పాటు క్రూడాయిల్ కదలికలు, డాలర్ మారకంలో రూపాయి విలువ అంశాలు ట్రేడింగ్‌ను ప్రభావితం చేయోచ్చంటున్నారు. అలాగే వచ్చే వారంలో రియల్ ఎస్టేట్ సంస్థ ఆర్కేడ్ డెవలపర్స్, ఫైనాన్షియల్ సరీ్వసెస్ ప్లాట్‌ఫామ్ నార్తెర్న్ ఆర్క్ క్యాపిటల్ ఐపీఓల సబ్‌స్క్రిప్షన్‌తో పాటు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్‌పైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చు.

‘‘ఫెడ్ పాలసీ కమిటీ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడికి ముందు సూచీలు పరిమిత శ్రేణిలో ట్రేడవ్వొచ్చు. వివిధ రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు అవకాశం ఉంది. సాంకేతికంగా నిఫ్టీకి దిగువ స్థాయిలో 25,000 వద్ద తక్షణ మద్దతు ఉంది. కొనుగోళ్ల నెలకొంటే ఎగువన 25,500 వద్ద కీలక నిరోధం ఉంది. ఈ స్థాయిని ఛేదిస్తే 26,000 వద్ద మరో నిరోధం ఉంది’’ అని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ హెడ్ అజిత్ మిశ్రా తెలిపారు

ప్రథమార్ధంలో రూ.27,856 కోట్లు

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో పాటు దేశీయ మార్కెట్ స్థిర్వతం కారణంగా సెప్టెంబర్ ప్రథమార్ధం(1–15న) విదేశీ ఇన్వెస్టర్లు రూ.27,856 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. ‘‘అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనాల ఆర్థిక మందగమన భయాలతో ఎఫ్ఐఐలు తమ కేటాయింపులను పునశ్చరణ చేసుకోవచ్చు. రిస్క్ సామర్థ్యాన్ని తగ్గించుకునే వ్యూహం అమలు చేసినట్లయితే భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల తగ్గొచ్చు’’ అని మోజోపీఎంఎస్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో సునీల్ దమానియా తెలిపారు. ఇదే సమీక్షా కాలం(సెప్టెంబర్ 1–13 తేదీల)లో డెట్ మార్కెట్లో రూ.7,525 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఎఫ్ఐఐలు ఆగస్టులో రూ.7,320 కోట్లు, జూలైలో రూ.32,365 కోట్లు, జూలైలో రూ.26,565 కోట్లు చొప్పున విక్రయాలు జరిపారు.

స్థూల ఆర్థిక గణాంకాలు

దేశీయ ఆగస్టు టోకు ద్రవ్యోల్బణ డేటాను ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. అమెరికా పారిశ్రామికోత్పత్తి, ఫెడ్ కమిటీ ఆర్థిక అంచనాలు, యూఎస్ నిరుద్యోగ క్లెయిమ్స్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయోచ్చు. బ్యాంక్ ఆఫ్ జపాన్ శుక్రవారం ద్రవ్యోల్బణం డేటా శుక్రవారం విడుదల కానుంది అదే రోజున బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య పాలసీ నిర్ణయాలు వెలువడనున్నాయి.

క్రూడాయిల్ ధరలూ కీలకం

ద్రవ్యోల్బణంతో పాటు ఆయా దేశాల కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్లపై ప్రభావాన్ని చూపే క్రూడాయిల్ ధరలూ ఈ వారం కీలకం కానున్నాయి. అంతర్జాతీయంగా ప్రస్తుతం క్రూడ్ ధరలు 14 నెలల కనిష్టం వద్ద ట్రేడవుతున్నాయి. భారత్‌లో అధికంగా వినియోగించే బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 71.61 డాలర్ల దిగువకు చేరుకుంది. దీంతో చమురు దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే దేశమైన భారత్‌కు ఇది సానుకూల అంశంగా మారింది.

ఫెడ్ నిర్ణయాలపై దృష్టి

వడ్డీరేట్లపై ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయాలపైనే భారత్‌తో సహా అంతర్జాతీయ మార్కెట్ల చూపు కేంద్రీకృతమై ఉంది. వడ్డీరేట్లను 25 లేదా 50 బేసిస్ పాయింట్లు మేర ఫెడ్ తగ్గించవచ్చనేది ఆర్థికవేత్తల అంచనా. అగ్రరాజ్యం అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ పాలసీ సమావేశాలు మంగళవారం(సెప్టెంబర్ 17న) మొదలవుతాయి. భారత కాలమాన ప్రకారం బుధవారం(18న) రాత్రి ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ద్రవ్య విధాన నిర్ణయాలు వెల్లడించనున్నారు. రెండురోజుల ఫెడ్ పాలసీ సమావేశంలో ద్రవ్య కమిటీ తీసుకొనే నిర్ణయాలు భారత్‌తో సహా ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల గమనానికి అత్యంత కీలకం కానున్నాయి. అలాగే పాలసీ ప్రకటన సందర్భంగా ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలను విదేశీ ఇన్వెస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది.



మార్జిన్లను పెంచుకోవడంపై రిలయన్స్ రిటైల్ దృష్టి

స్టోర్స్‌లో ఆహారేతర ఉత్పత్తులకు మరింత స్థలం కేటాయింపు

న్యూఢిల్లీ: వచ్చే 3–4 ఏళ్లలో వ్యాపారాన్ని రెట్టింపు చేసుకునే దిశగా రిలయన్స్ రిటైల్ తాజాగా మార్జిన్లను పెంచుకోవడంపై మరింతగా దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ఆహారేతర ఉత్పత్తులు, ఇతరత్రా ప్రోడక్టులకు ఇంకా ఎక్కువ స్థలం లభించేలా నిత్యావసరాల స్టోర్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తోంది. నిత్యావసరాలు, దుస్తులకు మించి అధిక మార్జిన్లు వచ్చే ఈ ఉత్పత్తులకు దాదాపు 50 శాతం వరకు స్థలాన్ని కేటాయిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దీనితో స్మార్ట్, స్మార్ట్ బజార్ స్టోర్స్‌ను అనుసంధానించి కస్టమర్లకు విస్తృత శ్రేణిలో ఉత్పత్తులను అందించే హైపర్ లోకల్ ఈ–కామర్స్ ప్లాట్‌ఫాం జియోమార్ట్ కూడా పటిష్టం అవుతుందని వివరించాయి. ఇటీవలి జూన్ త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ ఎబిటా మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 30 బేసిస్ పాయింట్లు (0.3 శాతం) పెరిగి 8.2 శాతానికి చేరింది. 2023–23 ఆర్థిక సంవత్సరంలో ఇది 70 బేసిస్ పాయింట్లు (0.7 శాతం) పెరిగి 8.5 శాతంగా నమోదైంది. ఈ ఏడాది జూన్ 30 నాటికి రిలయన్స్ రిటైల్‌కు దేశవ్యాప్తంగా 8.13 కోట్ల చ.అ. విస్తీర్ణంలో 18,918 స్టోర్స్ ఉన్నాయి. స్టోర్స్ సంఖ్యాపరంగా కంపెనీ టాప్ 5 గ్లోబల్ రిటైల్ సంస్థల్లో ఒకటిగా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ స్థూల ఆదాయం రూ. 3.06 లక్షల కోట్లుగా నమోదైంది.

భవిష్యత్ కరెన్సీ అవసరాలకు తగ్గ ప్రణాళిక

- ఆర్‌బీఐ కరెన్సీ నిర్వహణ పునర్‌నిర్మాణం
- వచ్చే 4–5 ఏళ్లలో అమలు



న్యూఢిల్లీ: కరెన్సీ నిర్వహణ సదుపాయాలను వచ్చే 4–5 ఏళ్లలో సంపూర్ణంగా పునర్‌నిర్మించాలని ఆర్‌బీఐ ప్రణాళికతో ఉంది. ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధితో భవిష్యత్తులో ఏర్పడే కరెన్సీ అవసరాలకు అనుగుణంగా నిర్వహణ, స్టోరేజ్ (నిల్వ) వసతులు మెరుగుపరుచుకోవాలని అనుకుంటోంది. గ్రీన్‌ఫీల్డ్ కరెన్సీ నిర్వహణ కేంద్రాల ఏర్పాటు, నిల్వ కేంద్రాల ఆటోమేషన్, సెక్యూరిటీ, సర్వైలెన్స్ వ్యవస్థల ఏర్పాటు, ఇన్వెంటరీ నిర్వహణ విధానం, కేంద్రీకృత నిర్వహణ కేంద్రం ఇవన్నీ ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. ఈ మొత్తం ప్రాజెక్ట్ అమలు కాలం 4–5 ఏళ్లుగా ఉంది. కరెన్సీ నిర్వహణ వసతుల ఆధునికీకరణకు సంబంధించి కన్సల్టెన్సీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సేవల కోసం ఆర్‌బీఐ ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)లకు ఆహ్వానించింది. ఈ డాక్యుమెంట్‌ను పరిశీలించినప్పుడు ఈ వివరాలు తెలిశాయి. ‘‘గడిచిన మూడేళ్లలో చలామణిలో ఉన్న నోట్ల పెరుగుదల మోస్తరుగా ఉన్నప్పటికీ, వచ్చే దశాబ్ద కాలంలో దాని వేగం మందగించే అవకాశం ఉంది. అయినా కానీ సమీప కాలంలో వృద్ధి సానుకూలంగా ఉంటుందని విశ్లేషణ తెలియజేస్తోంది. గడిచిన రెండు దశాబ్దాల్లో చలామణిలో ఉన్న నోట్లు చెప్పుకోతగ్గ మేర పెరిగాయి. 2023 మార్చి 31 నాటికి 136.21 బిలియన్ పీసుల నోట్లుండగా, 2024 మార్చి 31 నాటికి 146.88 బిలియన్ పీసులకు పెరిగాయి. కాయిన్ల చలామణి సైతం ఇదే కాలంలో 127.92 బిలియన్ పీసుల నుంచి 132.35 బిలియన్ పీసులకు వృద్ధి చెందింది’’అని ఆర్‌బీఐ టెండర్ డాక్యుమెంట్ పేర్కొంది. ఈ పెరిగే అవసరాలకు తగ్గట్టు సదుపాయాలను మెరుగుపరుచుకునే క్రమంలో భాగంగా ఆర్‌బీఐ ఈవోఐలకు ఆహ్వానం పలికింది.

కస్టమర్ల ప్రాధాన్యతలకు తగ్గట్లుగా బ్యాంకులు మారాలి

సీఈఏ అనంత నాగేశ్వరన్ సూచన



చెన్నై: మిగతా సంస్థలతో పోటీపడాలంటే కస్టమర్ల ప్రాధాన్యతలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బ్యాంకులు మారాలని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సూచించారు. పరిశ్రమ వృద్ధికి, కొత్త ఆవిష్కరణలకు దోహదపడేలా సాంకేతికతను వినియోగించుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ సూచన చేశారు. విజ్ఞానాన్ని పంచుకోవడంలోనూ, అత్యుత్తమ పనితీరు కనపర్చడంలో ఇండియన్ బ్యాంక్ కృషి చేస్తోందని నాగేశ్వరన్ ప్రశంసించారు.

పెట్టుబడులకు షిప్‌బిల్డింగ్ ఆహ్వానం

సాంకేతికతల బదిలీపైనా కన్ను



గోవా: దేశీయంగా షిప్ బిల్డింగ్, ఓడల మరమ్మతు రంగాలకు ప్రోత్సాహాన్నివ్వాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు దక్షిణ కొరియా, జపాన్ నుంచి పెట్టుబడులతోపాటు.. టెక్నాలజీ బదిలీ కావలసి ఉన్నట్లు పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సెక్రటరీ టీకే రామచంద్రన్ పేర్కొన్నారు. షిప్ రిపేర్ క్లస్టర్లకు దన్నునివ్వడం ద్వారా షిప్పింగ్ సరఫరాను మెరుగుపరచవలసి ఉన్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం భారత్ షిప్ బిల్డింగ్ మార్కెట్లో 1 శాతానికంటే తక్కువవాటాను కలిగి ఉన్నట్లు వెల్లడించారు. ప్రపంచ షిప్‌బిల్డింగ్ మార్కెట్‌లో చైనా, దక్షిణ కొరియా, జపాన్ ఆధిపత్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెరసి దక్షిణ కొరియా, జపాన్‌వైపు పెట్టుబడులుసహా సాంకేతికతల కోసం చూస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా దేశీయంగా నౌకా నిర్మాణం, నౌకల మరమ్మతుల క్లస్టర్లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. మ్యారీటైమ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎంఎస్‌డీసీ) 20వ సదస్సుకు హాజరైన సందర్భంగా రామచంద్రన్ విలేకరులతో పలు అంశాలపై స్పందించారు. పలు రాష్ట్రాలలో విస్తరించేలా మెగా షిప్ బిల్డింగ్ పార్క్ ఏర్పాటుకు ఎంఎస్‌డీసీ యోచిస్తోంది. కాగా.. టెక్నాలజీ, పెట్టుబడులతో రావలసిందిగా ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్‌లను ఆహ్వానించినట్లు రామచంద్రన్ వెల్లడించారు. వీటి ఏర్పాటుకు వీలుగా భూమిని సమకూరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

స్థిరంగానే రూపాయి విలువ..



దేవాంగ్ షా, ఫిక్స్‌డ్ ఇన్‌కం హెడ్, యాక్సిస్ మ్యుచువల్ ఫండ్



ఇటీవల మార్కెట్లో తలెత్తిన ఒడిదుడుకులకు అనేకానేక అంశాలు కారణం. అమెరికా ఆర్థిక డేటా ఊహించిన దానికన్నా బలహీనంగా ఉండటమనేది మాంద్యం అవకాశాలపై ఆందోళనలకు ఆజ్యం పోసింది. మాంద్యం తలెత్తే అవకాశాలు 10 శాతం కన్నా తక్కువే ఉండొచ్చని ఈ ఏడాది జూన్‌లో అంచనా వేయగా ప్రస్తుతం 30–35 శాతం ఉండొచ్చన్న అభిప్రాయం నెలకొనడం ఇందుకు నిదర్శనం. ఇక బ్యాంక్ ఆఫ్ జపాన్ రేట్లు పెంచడంతో బోటు చేసుకున్న పరిణామాలు కూడా దీనికి తోడు కావడంతో మార్కెట్ మరింత అనిశ్చితికి లోనైంది. ఈ ప్రభావాలు రూపాయిపైనా పడ్డాయి. దీంతో 2022 అక్టోబర్ నాటి రికార్డు కనిష్ట స్థాయి 83.5ని (డాలరుతో పోలిస్తే) కూడా దాటేసి రూపాయి దాదాపు ఆల్‌టైం కనిష్టాన్ని తాకింది. అయితే, స్వల్పకాలికంగా రూపాయి మారకం క్షీణించినా, గత ఆరు నెలలుగా ఇతర వర్ధమాన, సంపన్న మార్కెట్ కరెన్సీలతో పోలిస్తే స్థిరత్వాన్నే కనపర్చింది. జపాన్ యెన్, చైనా యువాన్, ఇండొనేషియా రూపయా అలాగే ఇతర వర్ధమాన, సంపన్న మార్కెట్ల కరెన్సీలు ఇటీవల పతనం కావడంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు అలాగే టారిఫ్‌లపై భయాలు నెలకొన్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో రూపాయి మరింత క్షీణించే అవకాశాలు, మానిటరీ పాలసీపై దాని ప్రభావాలపై ఆందోళన నెలకొంది. కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీవ్ర ఒడిదుడుకులకు గాని క్షీణతకు గానీ గురయ్యే పెద్ద రిస్కులేమీ లేకుండా రూపాయి స్థిరంగానే కొనసాగేందుకు ఎక్కువ అవకాశం ఉంది.

పటిష్ట పరిస్థితుల దన్ను..

స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్టంగా ఉండటం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతుండటం, సర్వీసులు వృద్ధి చెందుతుండటం వంటి అంశాలు ఈ నమ్మకానికి ఊతమిస్తున్నాయి. అమెరికాలో అధిక ద్రవ్యలోటు, జీడీపీతో పోలిస్తే రుణ భారం పెరగడంవంటి బలహీన స్థూల ఆర్థిక గణాంకాలతో డాలరు మరింత క్షీణతకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో రూపాయి మారకం విలువ క్షీణించినా, ప్రతికూల ప్రభావాలు కాస్త తగ్గి, దేశీ కరెన్సీ కొంత నిలదొక్కుకునేందుకు ఆస్కారం ఉంది. అటు 675 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న విదేశీ మారక నిల్వలు సైతం భారత్‌కి ఉపయోగకరంగా ఉండనున్నాయి. సమీప భవిష్యత్తులో ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు, పెద్ద షాక్‌ల నుంచి రూపాయిని కాపాడుకునేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చు. చైనాలో భారీ సంస్కరణల ఊసు లేకపోవడం వల్ల మందగమనంతో కమోడిటీల ధరలు, ముఖ్యంగా చమురు ధరలు బలహీనపడటం భారత్‌కు సహాయకరంగా ఉండనుంది. మన దిగుమతుల బిల్లుల భారం తగ్గుతుంది కాబట్టి ఇది మన కరెన్సీకి సానుకూలంగా ఉండనుంది.

ఆర్‌బీఐ పాలసీపై కరెన్సీ ప్రభావం ...

సాధారణంగా కరెన్సీ పతనమైతే సెంట్రల్ బ్యాంకులు పాలసీని కఠినతరం చేసే అవకాశాలు ఉంటాయి. ఒకవైపు ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ మరోవైపు ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాలన్న రెండు లక్ష్యాలు వాటికి ఉండటం ఇందుకు ప్రాథమిక కారణం. కరెన్సీ బలహీనపడుతుంటే ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతాయి. దీంతో సెంట్రల్ బ్యాంకులు మరింత కఠినతరమైన ద్రవ్యపరపతి విధానాన్ని అమలు చేయాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలు సాధారణంగా బాండ్ల ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఈల్డ్‌లు పెరిగిపోతాయి. లిక్విడిటీ అలాగే ఆర్థిక పరిస్థితులను కఠినతరంగా మార్చడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ, కరెన్సీ స్థిరంగా ఉండేలా చూడాలనేది ఆర్‌బీఐ లక్ష్యంగా ఉంటుంది. అయితే, ఈ ధోరణి అనేది తాత్కాలికంగా బాండ్ మార్కెట్ ర్యాలీకి అవరోధంగా మారి, కొంత ఒడిదుడుకులకు దారి తీయొచ్చు.

రూపాయి మారకం విలువ మరింత క్షీణించకుండా, కాపాడేందుకు విదేశీ మారక నిల్వలను ఆర్‌బీఐ క్రియాశీలకంగా గణనీయ స్థాయిలో ఉపయోగిస్తోంది. అయితే, ఇలా జోక్యం చేసుకోవడమనేది బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ తగ్గిపోవడానికి దారి తీయొచ్చు. అలాగే స్వల్పకాలిక వడ్డీ రేట్లు పెరగక తప్పని పరిస్థితులు ఏర్పడవచ్చు. ఆర్‌బీఐ గత కొద్ది ట్రేడింగ్ సెషన్లలో 10–15 బిలియన్ డాలర్ల మేర నిల్వలను వినియోగించిందని ఇటీవలి డేటా ప్రకారం తెలుస్తోంది. జేపీ మోర్గాన్ సూచీల్లో భారతీయ బాండ్లను చేర్చడం వల్ల వచ్చిన లిక్విడిటీని తగ్గించే దిశగా అధిక లిక్విడిటీని సిస్టం నుంచి వెనక్కి లాగేందుకు ఆర్‌బీఐ ఓపెన్ మార్కెట్ లావాదేవీలు (ఓఎంఓ) నిర్వహించవచ్చనే అంచనాలు ఉన్నాయి. దీనికి ఒక మోస్తరు అవకాశాలే ఉన్నప్పటికీ, బాండ్ మార్కెట్లో నెలకొన్న ఉత్సాహం తాత్కాలికంగా మందగించేందుకు ఇది దారితీయొచ్చు. అయినా, బాండ్లకు సంబంధించి డిమాండ్–సరఫరా డైనమిక్స్ సానుకూలంగా ఉండటం వల్ల ఈల్డ్‌లు గణనీయంగా పెరగకుండా నివారించే అవకాశం ఉందనే అభిప్రాయం నెలకొంది.

ఎన్నారైలకూ సమన్లు వస్తాయ్..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

మొదలైంది.. ఎన్నారైలకు నోటీసుల పరంపర!! ఎన్నారైలకు విదేశాల్లో ఉన్న ఆస్తుల గురించి, ఆదాయం గురించి.. ఆదాయపు స్టేటస్ గురించి.. ఆదాయపు పన్ను వారి ఇన్వెస్టిగేషన్ యూనిట్ నుంచి నోటీసులు మొదలయ్యాయి. మీకూ తెలిసే ఉంటుంది. పన్ను భారం విధించడానికి ప్రమాణం.. మీ రెసిడెంట్ స్టేటస్. అంతేకాని ఎటువంటి సందర్భంలో పౌరసత్వంతో సంబంధం లేదు. ఒక వ్యక్తి భారతదేశంలో 182 రోజులు లేదా ఎక్కువ రోజులు నివాసం ఉంటే రెసిడెంట్ అవుతారు లేదా ఆర్థిక సంవత్సరంలో 60 రోజులు ఉండి, గత నాలుగు సంవత్సరాల్లో 365 రోజులున్నా రెసిడెంట్లు అవుతారు. మిగతా వారందరూ నాన్–రెసిడెంట్లు అవుతారు. స్థూలంగా చెప్పాలంటే పన్ను విధింపు, లెక్కింపు మొదలైన విషయాల్లో రెసిడెంట్లకు, నాన్–రెసిడెంట్లకు ఎన్నో తేడాలున్నాయి. నోటీసులో ఏయే అంశాలు అడుగుతున్నారంటే..

- విదేశాలకు ఎప్పుడు వెళ్లారు?
- ఏ సంవత్సరంలో విదేశాల్లో బ్యాంకు అకౌంటు తెరిచారు?
- ఆ అకౌంటు వివరాలు
- ఆ రోజు నుంచి రెసిడెంట్ స్టేటస్
- పాస్‌పోర్ట్‌లో రాక/పోకకి సంబంధించి ఎంట్రీలు
- బ్యాంకు అకౌంటు ఎటువంటిదైనా వివరాలు ఇవ్వాలి
- స్థిరాస్తి వివరాలు
- ఆదాయ వివరాలు
- పన్ను చెల్లింపు వివరాలు
- సంబంధిత వివరాలు

విదేశీ సంస్థల ద్వారా సమాచారం తెలుసుకుని వారికి నోటీసులు.. అవసరమైతే సమన్లు ఇస్తున్నారు. నలభై సంవత్సరాల చరిత్ర అడుగుతున్నారని కొందరు వాపోతున్నారు. ఇది అసమంజసం అని అర్జీ పెట్టుకుంటే ఆ అర్జీని కొట్టేస్తున్నారని అంటున్నారు. చట్టప్రకారం ఒకప్పుడు 16 సంవత్సరాలుగా ఉన్న కాలపరిమితిని 10 సంవత్సరాలకు తగ్గించారు. ఆ పదిని 5 సంవత్సరాలకు తగ్గించారు. ఈ కాలపరిమితిని అనుసరించి విదేశీ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కేవలం ఎన్నారైలు కానివారి దగ్గర్నుంచి.. అంటే రెసిడెంట్లు దగ్గర్నుంచి అడుగుతారు. నాన్–రెసిడెంట్లు .. వారున్న దేశం – అంటే విదేశంలోని ఆస్తుల వివరాలు ఇవ్వనవసరం లేదు. ఎటువంటి బాధ్యత లేదు. మరయితే ఎవరిపైన ఈ అస్త్రాలు అంటే.. ‘‘రెసిడెంట్ స్టేటస్‌లో ఉంటూ నాన్–రెసిడెంట్లుగా చలామణీ అవుతున్న’’ వారి మీద. మనం వాడుక భాషలో విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న వారిని ‘ఎన్నారై’లు అనేస్తాం. కానీ, చట్టప్రకారం స్టేటస్ లెక్కించాలి. అనుమానం వస్తే నోటీసుల ఇస్తారు. సమాచారం అడుగుతారు. ఇవ్వకపోతే పెనాల్టీ వేస్తారు. మీరు కోర్టులను ఆశ్రయించవచ్చు. డిపార్ట్‌మెంట్ వారు బ్లాక్‌మనీ చట్టానికి సంబంధించిన అధికార్లకు రిఫర్ చేయొచ్చు. వారు వారి పని చేస్తారు.

ఎలా బయట పడాలి?


విదేశాల్లో ఉద్యోగం నిమిత్తం/చదువు కోసం వెళ్లినవారు విధిగా అన్ని రికార్డులు నిర్వహించండి. వీలుంటే ఫ్లైట్ టికెట్లు, బోర్డింగ్ పాస్‌లు, సంబంధిత ఈమెయిల్స్, పాస్‌పోర్టులు, పాతవి, లేటెస్టువి, వీసాకు సంబంధించిన కాగితాలు, విదేశాల్లో చేసిన ఇన్వెస్ట్‌మెంట్లు, ఏ తేదీ నాడు ఎంతెంత చేశారు.. ఏమి కొన్నారు .. స్థిరాస్తులు, మొదలైనవి రెడీగా ఉంచండి. అడిగినప్పుడు సకాలంలో ఇవ్వండి. నిజాయితీగా. ఆలస్యం అవుతుందంటే ఆ విషయం చెప్పండి. గడువు తేదీ లోపల స్పందించండి.

మీరు నిజంగానే నాన్–రెసిడెంట్ అయితే, మీరు భయపడక్కర్లేదు. ఎవరినీ భయపెట్టడం లేదు. ముందు నుంచి మనం చెప్పేది ఒకటే. మీరు చేసే ఏ వ్యవహారానికైనా డాక్యుమెంట్లు తప్పనిసరి!!



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రికీ భుయ్ శతకం సరిపోలేదు



భారత్ 'డి' జట్టుకు తప్పని ఓటమి ● 186 పరుగులతో భారత్ 'ఎ' ఘన విజయం ● దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ



సాక్షి, అనంతపురం: దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో భారత 'డి' జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. భారత్ 'ఎ' జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించలేక ఆ జట్టు కుప్పకూలింది. ఆదివారం ముగిసిన ఈ పోరులో భారత్ 'ఎ' 186 పరుగుల భారీ ఆధిక్యంతో భారత్ 'డి' జట్టును చిత్తు చేసింది. గత మ్యాచ్‌లో భారత్ 'బి' చేతిలో ఓడిన 'ఎ'కు టోర్నీలో ఇది మొదటి విజయం. 488 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 'డి' జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 82.2 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బ్యాటర్ రికీ భుయ్ (195 బంతుల్లో 113; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో పోరాడినా లాభం లేకపోయింది. ఇతర బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (55 బంతుల్లో 41; 8 ఫోర్లు), సంజు సామ్సన్ (45 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రమే పరవాలేదనిపించారు. ఆఫ్ స్పిన్నర్ తనుశ్ కొటియాన్ 4 వికెట్లు పడగొట్టగా... లెఫ్టార్మ్ స్పిన్నర్ షమ్స్ ములానీకి 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో 89 పరుగులు చేయడంతో పాటు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 4 వికెట్లు పడగొట్టిన భారత 'ఎ' జట్టు ఆటగాడు షమ్స్ ములానీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. గురువారం నుంచి జరిగే తమ తర్వాతి పోరులో 'సి'తో 'ఎ' జట్టు...'బి'తో 'డి' జట్టు తలపడతాయి.


శతక భాగస్వామ్యం...

చివరి రోజు మరో 426 పరుగులు చేయాల్సిన స్థితిలో 'డి' జట్టు బరిలోకి దిగింది. ఓవర్‌నైట్ స్కోరు 62/1తో భుయ్, యశ్ దూబే (37) ఆదివారం ఆటను కొనసాగించారు. క్రీజ్‌లో నిలదొక్కుకొని చక్కటి షాట్లతో వీరిద్దరు రెండో వికెట్‌కు సరిగ్గా 100 పరుగులు జోడించారు. అయితే అనవసరపు పరుగుకు ప్రయత్నించిన యశ్ దూబే... చక్కటి ఫీల్డింగ్‌కు రనౌట్ కావడంతో పరిస్థితి మారింది. మరో మూడు పరుగులకే దేవ్‌దత్ పడిక్కల్ (1) క్లీన్‌బౌల్డయ్యాడు. ఆ తర్వాత భుయ్ ఒకవైపు జాగ్రత్తగా ఆడగా... మరోవైపు శ్రేయస్, సామ్సన్ దూకుడు ప్రదర్శించారు. భుయ్ నాలుగో వికెట్‌కు శ్రేయస్‌తో 53 పరుగులు, ఐదో వికెట్‌కు సామ్సన్‌తో 62 పరుగులు జత చేశాడు. అయితే వీరిద్దరు ములానీ బౌలింగ్‌లోనే అవుట్ కావడంతో 'డి' గెలుపు ఆశలు కోల్పోయింది. ఆ తర్వాత 'డ్రా' కోసం ప్రయత్నించినా 'ఎ' పదునైన బౌలింగ్ ముందు అది సాధ్యం కాలేదు. 170 బంతుల్లో భుయ్ 19వ ఫస్ట్ క్లాస్ సెంచరీ పూర్తయింది. ఆఖర్లో హర్షిత్ రాణా (27 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్), సౌరభ్ కుమార్ (46 బంతుల్లో 22; 3 ఫోర్లు) కొద్దిసేపు ప్రతిఘటించి 'డి' జట్టు ఓటమిని ఆలస్యం చేశారు.

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 290; భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: 183; భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: 380/3 డిక్లేర్డ్; భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్: యశ్ దూబే (రనౌట్) 37; అథర్వ తైడే (సి) ఆఖిబ్ (బి) ఖలీల్ అహ్మద్ 0; రికీ భుయ్ (సి) రియాన్ పరాగ్ (బి) తనుశ్ కొటియాన్ 113; దేవ్‌దత్ పడిక్కల్ (బి) షమ్స్ ములానీ 1; శ్రేయస్ అయ్యర్ (బి) షమ్స్ ములానీ 41; సంజు సామ్సన్ (సి) కుశాగ్ర (బి) షమ్స్ ములానీ 40; సారాంశ్ జైన్ (సి) రియాన్ పరాగ్ (బి) తనుశ్ కొటియాన్ 5; సౌరభ్ కుమార్ (బి) తనుశ్ కొటియాన్ 22; హర్షిత్ రాణా (సి) కుశాగ్ర రావత్ (బి) తనుశ్ కొటియాన్ 24; అర్ష్‌దీప్ సింగ్ (నాటౌట్) 7; విద్వత్ కావేరప్ప (సి) ప్రథమ్ (బి) రియాన్ పరాగ్ 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (82.2 ఓవర్లలో ఆలౌట్) 301. వికెట్ల పతనం:** 1–2, 2–102, 3–105, 4–158, 5–220, 6–237, 7–256, 8–279, 9–300, 10–301. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 10–4–33–1, ప్రసిధ్ కృష్ణ 12–4–37–0, షమ్స్ ములానీ 29–4–117–3, ఆఖిబ్ ఖాన్ 10–4–33–0, తనుశ్ కొటియాన్ 21–7–73–4, రియాన్ పరాగ్ 0.2–0–1–1.

నీరజ్ చోప్రాకు రెండో స్థానం



బ్రస్సెల్స్ (బెల్జియం): ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్ గ్రాండ్ ఫైనల్ ఈవెంట్‌లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో నీరజ్ జావెలిన్‌ను 87.86 మీటర్ల దూరం విసిరి రెండో స్థానాన్ని సంపాదించాడు. నీరజ్‌కు 12 వేల డాలర్లు (రూ. 10 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచిన నీరజ్ డైమండ్ లీగ్ గ్రాండ్ ఫైనల్ ఈవెంట్‌లో టాప్–3లో నిలువడం ఇది మూడోసారి. 2022 గ్రాండ్ ఫైనల్లో విజేతగా నిలిచిన నీరజ్... 2023 గ్రాండ్ ఫైనల్లో రెండో స్థానాన్ని పొందాడు. ఈసారి డైమండ్ లీగ్ ఫైనల్లో గ్రెనెడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ మాజీ చాంపియన్ అండర్సన్ పీటర్స్ విజేతగా నిలిచాడు. పీటర్స్ జావెలిన్‌ను 87.87 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. జూలియన్ వెబెర్ (జర్మనీ; 85.97 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్ మొత్తం నీరజ్ నిలకడగా రాణించాడు. ఆరు టోర్నీల్లో పోటీపడి ఐదింటిలో రెండో స్థానాన్ని, ఒక టోర్నీలో అగ్ర స్థానాన్ని పొందాడు. డైమండ్ లీగ్ మీట్‌లోనే పోటీపడ్డ మరో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే నిరాశపరిచాడు. పురుషుల 3000 స్టీపుల్‌ఛేజ్‌లో పోటీపడ్డ అవినాశ్ 8 నిమిషాల 17.09 సెకన్లలో గమ్యానికి చేరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు.


అన్షుల్

అన్షుల్ 8/69

'డ్రా'గా ముగిసిన భారత్ 'బి', భారత్ 'సి' దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: దులీప్ ట్రోఫీ తొలి రెండు రౌండ్లలో కలిపి జరిగిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో ఫలితం తేలగా మరో మ్యాచ్ మాత్రం పేలవమైన 'డ్రా'గా ముగిసింది. ఆదివారం ముగిసిన ఈ పోరులో భారత్ 'బి', భారత్ 'సి' జట్లు సమంగా నిలిచాయి. ఆట నాలుగో రోజు ఉదయం వరకు కూడా ఇరు జట్ల తొలి ఇన్నింగ్స్‌లు పూర్తి కాకపోవడంతో ఫలితానికి అవకాశం లేకుండా పోయింది. ఓవర్‌నైట్ స్కోరు 309/7తో ఆట కొనసాగించిన 'బి' తమ తొలి ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అన్షుల్ కాంబోజ్ (8/69) ప్రత్యర్థిని పడగొట్టాడు. అనంతరం మ్యాచ్ ముగిసే సమయానికి 'సి' తమ రెండో ఇన్నింగ్స్‌ను 37 ఓవర్లలో 4 వికెట్లకు 128 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ దశలో ఇరు జట్ల కెప్టెన్లు 'డ్రా'కు అంగీకరించారు. మొదటి ఇన్నింగ్స్‌లో 193 పరుగుల ఆధిక్యం సాధించిన 'సి' టీమ్‌కు 3 పాయింట్లు, 'బి' టీమ్‌కు 1 పాయింట్ లభించాయి.

రుతురాజ్ హాఫ్ సెంచరీ...

ఆదివారం భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్ ముగిసేందుకు 7 ఓవర్లు సరిపోయాయి. తమ స్కోరుకు మరో 23 పరుగులు జోడించి జట్టు మిగిలిన 3 వికెట్లు కోల్పోయింది. ఈ మూడూ పేస్ బౌలర్ అన్షుల్ కాంబోజ్ ఖాతాలోకే వెళ్లగా... కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (286 బంతుల్లో 157 నాటౌట్; 14 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. ఆ తర్వాత ఏకంగా 193 పరుగుల ఆధిక్యం ఉండి కాస్త దూకుడుగా ఆడి విజయం కోసం సవాల్ విసిరే స్థితిలో ఉన్న 'సి' టీమ్ అలాంటి ప్రయత్నం ఏమీ చేయలేదు. సాయి సుదర్శన్ (11) విఫలం కాగా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (93 బంతుల్లో 62; 8 ఫోర్లు, 1 సిక్స్) రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధ సెంచరీ చేశాడు. రుతురాజ్, రజత్ పటిదార్ (84 బంతుల్లో 42; 5 ఫోర్లు) రెండో వికెట్‌కు 96 పరుగులు జత చేశారు.


రుతురాజ్

స్కోరు వివరాలు

భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: 525; భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (నాటౌట్) 157; జగదీశన్ (సి) పొరేల్ (బి) కాంబోజ్ 70; ముషీర్ ఖాన్ (ఎల్బీ) (బి) అన్షుల్ కాంబోజ్ 1; సర్ఫరాజ్ (ఎల్బీ) (బి) అన్షుల్ కాంబోజ్ 16; రింకూ సింగ్ (సి) ఇషాన్ కిషన్ (బి) అన్షుల్ కాంబోజ్ 6; నితీశ్ కుమార్ రెడ్డి (బి) అన్షుల్ కాంబోజ్ 2; వాషింగ్టన్ సుందర్ (సి) సాయిసుదర్శన్ (బి) విజయ్ కుమార్ వైశాక్ 13; సాయికిశోర్ (ఎల్బీ) (బి) మయాంక్ మార్కండే 21; రాహుల్ చహర్ (బి) అన్షుల్ కాంబోజ్ 18; సైనీ (బి) అన్షుల్ కాంబోజ్ 0; ముకేశ్ కుమార్ (సి) సాయిసుదర్శన్ (బి) అన్షుల్ కాంబోజ్ 4; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (108 ఓవర్లలో ఆలౌట్) 332. వికెట్ల పతనం:** 1–129, 2–133, 3–175, 4–190, 5–194, 6–237, 7–283, 8–309, 9–321, 10–332. **బౌలింగ్:** సందీప్ వారియర్ 1.1–0–8–0, విజయ్ కుమార్ వైశాక్ 26–5–82–1, అన్షుల్ కాంబోజ్ 27.5–8–69–8, మయాంక్ మార్కండే 18–0–59–1, మానవ్ సుతార్ 33–4–85–0, ఇషాన్ కిషన్ 1–0–7–0, సాయి సుదర్శన్ 1–0–3–0. భారత్ 'సి' రెండో ఇన్నింగ్స్: సాయిసుదర్శన్ (బి) ముకేశ్ కుమార్ 11; రుతురాజ్ గైక్వాడ్ (ఎల్బీ) (బి) చహర్ 62; పటిదార్ (ఎల్బీ) (బి) ముషీర్ ఖాన్ 42; ఇషాన్ కిషన్ (బి) చహర్ 1; ఇంద్రజిత్ (నాటౌట్) 5; పొరేల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (37 ఓవర్లలో 4 వికెట్లకు డిక్లేర్డ్) 128. వికెట్ల పతనం: 1–17, 2–113, 3–118, 4–121. బౌలింగ్: ముకేశ్ కుమార్ 9–0–39–1, నవదీప్ సైనీ 7–2–22–0, సాయికిశోర్ 8–1–22–0, నితీశ్ కుమార్ రెడ్డి 4–0–20–0, ముషీర్ ఖాన్ 4–0–12–1, రాహుల్ చహర్ 4–0–8–2, వాషింగ్టన్ సుందర్ 1–0–4–0.

8/69 దులీప్ ట్రోఫీలో రెండో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసిన పేస్ బౌలర్‌గా కాంబోజ్ నిలిచాడు. ఈ రికార్డు దేబాశీష్ మొహంతి (10/46) పేరిట ఉంది.

ఆస్కార్ అదరహో

- అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో టైటిల్ సొంతం
- మెక్‌లారెన్ జట్టు డ్రైవర్‌కు సీజన్‌లో రెండో విజయం
- వరుసగా నాలుగో ఏడాదీ లెక్‌లెర్క్‌కు దక్కని అగ్రస్థానం

బాకు (అజర్‌బైజాన్): వరుసగా నాలుగో ఏడాది క్వాలిఫయింగ్‌లో మెరిపించిన ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ ప్రధాన రేసులో మాత్రం తడబడ్డాడు. ఆదివారం జరిగిన సీజన్‌లోని 17వ రేసు అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి విజేతగా నిలిచాడు. నిర్ణీత 51 ల్యాప్‌లను ఆస్కార్ అందరికంటే వేగంగా 1 గంట 32 నిమిషాల 58.007 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన 23 ఏళ్ల ఆస్కార్‌కు ఈ సీజన్‌లో ఇది రెండో విజయం. హంగేరి గ్రాండ్‌ప్రిలోనూ ఆస్కార్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును మొదలుపెట్టిన లెక్‌లెర్క్ 1 గంట 33 నిమిషాల 08.917 సెకన్ల సమయంతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 20వ ల్యాప్‌లో అప్పటి వరకు నంబర్‌వన్ స్థానంలో ఉన్న లెక్‌లెర్క్‌ను ఆస్కార్ పియాస్ట్రి ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఈ ఆధిక్యాన్ని చివరి వరకు ఆస్కార్ నిలబెట్టుకొని తన కెరీర్‌లో రెండో విజయాన్ని దక్కించుకున్నాడు. మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్‌కు మూడో స్థానంలో, మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్‌కు నాలుగో స్థానంలో, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఐదో స్థానంలో నిలిచారు. వీసా క్యాష్ యాప్ జట్టుకు చెందిన యుకీ సునోడా రేసును పూర్తి చేయడంలో విఫలమయ్యాడు. 24 రేసుల ఫార్ములావన్ సీజన్‌లో 17 రేసులు ముగిశాక మాక్స్ వెర్‌స్టాపెన్ 313 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని 18వ రేసు సింగపూర్ గ్రాండ్‌ప్రి ఈనెల 22న జరుగుతుంది.


విన్నర్ ట్రోఫీతో ఆస్కార్ పియాస్ట్రి



రేసులో పోటీపడుతున్న ఆస్కార్ పియాస్ట్రి

ఇంగ్లండ్ వన్డే జట్టు కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్



లండన్: ఇంగ్లండ్ యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌కు జట్టుకు సారథ్యం వహించే అరుదైన అవకాశం దక్కింది. ఆస్ట్రేలియాతో జరిగే ఐదు వన్డేల సిరీస్ కోసం బ్రూక్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించారు. గాయం కారణంగా ఆస్ట్రేలియాతో టి20 సిరీస్‌కు దూరమైన రెగ్యులర్ కెప్టెన్ జోస్ బట్లర్ ఇంకా కోలుకోకపోవడంతో వన్డేల నుంచి కూడా తప్పుకున్నాడు. దాంతో టీమ్‌కు నాయకత్వం వహించే చాన్స్ బ్రూక్‌కు లభించింది. ఇంగ్లండ్ తరఫున బ్రూక్ 15 వన్డేలు ఆడి 29.07 సగటుతో 407 పరుగులు చేశాడు. అయితే ప్రస్తుత అనుభవంకంటే కూడా అతని నాయకత్వ లక్షణాలపై నమ్మకం ఉన్న ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) బ్రూక్‌ను భవిష్యత్తు కెప్టెన్‌గా చూస్తోంది. 2018 అండర్–19 వరల్డ్ కప్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన బ్రూక్ టి20 బ్లాస్ట్‌లో యార్క్‌షైర్‌కు, హండ్రెడ్ టోర్నీలో నార్తర్న్ సూపర్ చార్జర్స్‌కు కెప్టెన్‌గా పని చేశాడు. ఇంగ్లండ్ జట్టు మూడు వేర్వేరు ఫార్మాట్‌లలో వరుసగా ఆడుతున్న మూడు సిరీస్‌లలో ముగ్గురు కొత్త కెప్టెన్లు జట్టును నడిపించడం విశేషం. శ్రీలంకపై టెస్టు టీమ్‌కు ఒలీ పోప్ కెప్టెన్ కాగా, ఆసీస్‌తో టి20 సిరీస్‌లో ఫిల్ సాల్ట్ సారథిగా ఉన్నాడు.

భారత డ్రైవర్ కుశ్‌కు తప్పిన ముప్పు



ఎఫ్2 రేసులో తీవ్ర ప్రమాదం


కుశ్

బాకు (అజర్‌బైజాన్): ఫార్ములావన్ అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేస్‌కు ముందు జరిగే ఫార్ములా2 ఫీచర్ రేస్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. రేస్ ఆరంభంలో సాంకేతిక లోపం కారణంగా జరిగిన పొరపాటుతో కార్లు ఢీకొని ప్రమాదం జరగ్గా... భారత డ్రైవర్ కుశ్ మైనీ అదృష్టవశాత్తూ తప్పించుకోగలిగాడు. ఫార్ములా2లో 23 ఏళ్ల కుశ్ 'ఇన్‌విక్టా రేసింగ్' టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రేస్ స్టార్ట్ లైన్ వద్ద ఇంజిన్‌లో సమస్య ఏర్పడటంతో కుష్ కారు స్టార్ట్ కాకుండానే ఆగిపోయింది. దాంతో వెనుక నుంచి దూసుకొచ్చిన ఇతర డ్రైవర్లు జోసెఫ్ మారియా, ఒలీవర్ గోత్‌లను ఇది గందరగోళానికి గురి చేసింది. ఆ రెండు కార్లూ తీవ్ర వేగంతో వచ్చి కుష్ కారును బలంగా ఢీకొట్టాయి. ఆ తాకిడికి కార్లు చిన్నాభిన్నం అయ్యాయి. కారులో ఉన్న కుశ్ అదృష్టవశాత్తూ బయటకు రాగలిగాడు. అనంతరం అతనికి వైద్యుల పరీక్షలు నిర్వహించి ప్రమాదం లేదని నిర్ధారించారు. రేసు ముగిసిన తర్వాత ఎఫ్2 నిర్వాహకులు కుశ్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రతీ రేసుకు ముందు జరిగే 'స్టార్ట్ సెటప్ ప్రొసీజర్'ను సరిగా పాటించకుండా గ్రిడ్‌పై ప్రమాదానికి కారణమైనందుకు అతనిపై 10 సెకన్ల పెనాల్టీ విధించారు. అయితే కుశ్ ఈ రేస్‌ను పూర్తి చేయలేదు కాబట్టి ఈ శిక్షను మారుస్తూ 'ఐదు స్థానాలు పెనాల్టీ'గా విధించారు. కుశ్ పాల్గొనే తర్వాతి రేసులో ఈ శిక్ష అమలవుతుంది.

టి20ల్లో గిల్‌కు విశ్రాంతి!

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో జరిగే మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్ నుంచి ఓపెనర్ శుబ్‌మన్ గిల్‌కు విశ్రాంతినివ్వాలని సెలక్టర్లు భావిస్తున్నారు. బీసీసీఐ 'వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్' విధానం ప్రకారం అతడికి విరామం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. భారత్, బంగ్లాదేశ్ మధ్య అక్టోబర్ 7, 10, 13 తేదీల్లో మూడు టి20 మ్యాచ్‌లు ఉన్నాయి. అయితే అక్టోబర్ 16 నుంచే భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు జరుగుతుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌తో టి20లకంటే కివీస్‌తో టెస్టులకు గిల్ జట్టులో ఉండటానికే బోర్డు ప్రాధాన్యతనిస్తోంది. అందుకే బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల తర్వాత తగినంత విరామం ఇచ్చి అతడిని న్యూజిలాండ్ సిరీస్‌కు సిద్ధంగా ఉంచడం అవసరమని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఆపై ఆస్ట్రేలియా గడ్డపై కూడా భారత్ ఐదు టెస్టులు ఆడనుంది. ఇప్పటి వరకు 21 టి20లు ఆడిన గిల్ 139.27 స్ట్రయిక్ రేట్‌తో 578 పరుగులు చేశాడు. జింబాబ్వేతో ఇటీవల గిల్ సారథ్యంలోనే భారత జట్టు 4–1తో టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుత సీజన్‌లో భారత జట్టు ప్రాధాన్యతల్లో టి20లు చివరిగా ఉన్నాయి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో అత్యధిక పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించడంతో పాటు వచ్చే ఏడాది జరిగే వన్డే చాంపియన్స్ ట్రోఫీపైనే టీమ్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో పేసర్లు బుమ్రా, సిరాజ్ కూడా బంగ్లాతో టి20 సిరీస్ ఆడేది సందేహమే.

సాక్షి ప్లస్
సోమవారం।16-9-2024

ట్రంప్ సమీపంలో కాల్పులు

మాజీ అధ్యక్షుడు సురక్షితం



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమీపంలో కాల్పులు జరగడం కలకలం రేపింది. ఆదివారం ఆయన ఫ్లోరిడాలో తన వెస్ట్ పామ్ బీచ్ నివాసం సమీపంలోని సొంత గోల్ఫ్ కోర్స్ లో గోల్ఫ్ ఆడుతుండగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్టు సమాచారం. అయితే ట్రంప్ క్షేమంగానే ఉన్నట్టు ఆయన ప్రచార బృందం వెల్లడించింది. 'కాల్పుల ఘటన అనంతరం ట్రంప్ సురక్షితంగా అన్నారు. ప్రస్తుతానికి ఇంతకన్నా వివరాలేవీ లేవు'అని ట్రంప్ ప్రచార బృందం అధికార ప్రతినిధి స్టీవెన్ చెంగ్ తెలిపారు. ట్రంప్ క్షేమమేనని ఆయన భద్రత వ్యవహారాలు చూసే సీక్రెట్ సర్వీస్ విభాగం కూడా ధ్రువీకరించింది. కాల్పుల శబ్దం వినిపించగానే గోల్ఫ్ కోర్స్ ను మూసేసి ట్రంప్ ను అక్కడి నుంచి హుటాహుటిన తరలించినట్టు తెలిపింది. కాల్పులు ట్రంప్ ను లక్ష్యంగా చేసుకుని జరిగాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థ మాత్రం కాల్పులు ట్రంప్ ను ఉద్దేశించినవి కావని స్పష్టం చేసింది. ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఓ అనుమానాస్పద వ్యక్తి తుపాకీతో సంచరిస్తుండగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ అతనిపై కాల్పులు జరిపింది. ఘటన గురించి అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కు అధికారులు నివేదించారు. ఘటనలో ఎవరికీ గాయాలు అయినట్టు కూడా సమాచారం లేదని స్థానిక పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

ఇటీవలే హత్యాయత్నం

అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మళ్లీ బరిలో ఉన్న 78 ఏళ్ల ట్రంప్ పై రెండు నెలల క్రితమే హత్యాయత్నం జరగడం తెలిసిందే. జూలై 13న పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తుండగా థామస్ మాథ్యూ క్రూక్ అనే యువకుడు సమీపంలోని గోడౌన్ మీదినుంచి ఆయనపై కాల్పులకు తెగబడ్డాడు. కుడి చెవికి తూటా తగిలింది. ట్రంప్ రక్తమోడుతూనే అమాంతం దయాస్ కిందకు ఒరిగి తనను తాను కాపాడుకున్నారు. భద్రతా సిబ్బంది వెంటనే దుండగున్ని కాల్చి చంపారు. అనంతరం ట్రంప్ ను హుటాహుటిన అక్కడినుంచి తరలించారు. నాటి నుంచి ఆయనకు భద్రతను మరింత పెంచారు.



నేవీ అధికారులు రూప, దిల్నా

జలమార్గాన ప్రపంచయానం

ఇద్దరు నావికాదళ మహిళా అధికారుల సాహస యాత్ర

భారత నౌకా దళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు జలమార్గాన ప్రపంచాన్ని చుట్టబోతున్నారు. లెఫ్టినెంట్ కమాండర్లు ఎ.రూప, కె.దిల్నా అతి త్వరలో ఈ సాహసానికి పూనుకోనున్నట్టు నేవీ అధికార ప్రతినిధి కమాండర్ వివేక్ మాధ్వాల్ ఆదివారం వెల్లడించారు. నావికా దళానికి చెందిన ఐఎన్ఎస్వీ తరిణి నౌకలో వారు ప్రపంచాన్ని చుట్టి రానున్నట్టు తెలిపారు. వారిద్దరూ మూడేళ్లుగా 'సాగర్ పరిక్రమ' యాత్ర చేస్తున్నారు. ''సాగర్ పరిక్రమ అత్యుత్తమ నైపుణ్య, శారీరక దృఢత్వం, మానసిక అప్రమత్తత అవసరమయ్యే అతి కఠిన ప్రయాణం. అందులో భాగంగా వారు కఠోర శిక్షణ పొందారు. వేల మైళ్ల ప్రయాణ అనుభవమూ సంపాదించారు'' అని మాధ్వాల్ వెల్లడించారు. 'గోల్డెన్ గ్లోబ్ రేస్' విజేత కమాండర్ (రిటైర్డ్) అభిలాష్ టోమీ మార్గదర్శకత్వంలో వారిద్దరూ శిక్షణ పొందుతున్నారు. గతేడాది ఆరుగురు సభ్యుల బృందంలో భాగంగా గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా బ్రెజిల్‌లోని రియో డిజనీరో దాకా వాళ్లు సముద్ర యాత్ర చేశారు. తర్వాత గోవా నుంచి పోర్ట్‌బ్లెయిర్ దాకా సెయిలింగ్ చేపట్టి తిరిగి డబుల్ హ్యాండ్ పద్ధతిలో బయలుదేరారు. ఈ ఏడాది ఆరంభంలో గోవా నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్ దాకా డ్యూయల్ హ్యాండ్ విధానంలో విజయవంతంగా సార్టీ నిర్వహించారు. నౌకాయాన సంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి భారత నావికాదళం గణనీయమైన ప్రయత్నాలు చేసిందని, సముద్ర వారసత్వాన్ని పరిరక్షించడానికి ఇలాంటి యాత్రలను ప్రోత్సహిస్తోందని మాధ్వాల్ తెలిపారు. ఐఎన్ఎస్-తరంగిణి, ఐఎన్ఎస్-సుదర్శిని, ఐఎన్ఎస్వీ-మహదీ, తరిణి నౌకల్లో సముద్రయానం ద్వారా భారత నావికాదళం సాహసయాత్రలకు కేంద్ర బిందువుగా నిలిచిందన్నారు. 2017లో జరిగిన చరిత్రాత్మక తొలి 'నావికా సాగర్ పరిక్రమ'లో భాగంగా మన మహిళా అధికారుల బృందం ప్రపంచాన్ని చుట్టొచ్చింది ఐఎన్ఎస్వీ తరిణిలోనే! 254 రోజుల ఆ సముద్రయానంలో బృందం ఏకంగా 21,600 మైళ్లు ప్రయాణించింది.

- న్యూఢిల్లీ

హ్యారీకి రాజకుటుంబం.. పుట్టినరోజు శుభాకాంక్షలు

బ్రిటన్ యువరాజు హ్యారీకి బ్రిటన్ రాజకుటుంబం జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. ఆదివారం ఆయన 40వ జన్మదినం సందర్భంగా బర్త్ డే కేక్ ఎమోజీతో మెరిసిపోతున్న హ్యారీ ఫోటోను పంచుకుంది. ''డ్యూక్ ఆఫ్ ససెక్స్‌కు 40 వ పుట్టినరోజు శుభాకాంక్షలు''క్యాప్షన్‌ను జత చేసింది. ప్రిన్స్, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కూడా ఈ ఫొటోను షేర్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



2021 తరువాత రాజకుటుంబం ఖాతా నుంచి హ్యారీకి వచ్చిన మొట్టమొదటి బహిరంగ పుట్టినరోజు సందేశం ఇది. డ్యూక్ అండ్ డచెస్ ఆఫ్ ససెక్స్ 2020 జనవరిలో రాయల్ డ్యూటీలను వదులుకుంటున్నట్లు ప్రకటించారు. ఆర్థికంగా స్వతంత్రంగా జీవించేందుకు వీలుగా రాజకుటుంబం క్రియాశీలక విధుల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరా సమీపంలోని మాంటెసిటోలో నివాసం ఉంటున్నారు. నెట్‌ఫ్లిక్స్, స్పాటిఫై సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

- లండన్

11 స్థానాల్లో పోటాపోటీ

హరియాణాలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య సంకుల సమరమే



భూపిందర్ సింగ్ హుడా



అనిరుధ్ చౌదరి



శ్రుతి చౌదరి



అనిల్ విజ్



నయాబ్ సింగ్ సైనీ



సావిత్రి జిందాల్



వినేశ్ ఫొగాట్



దుష్యంత్ చౌతాలా

హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల వేడి క్రమంగా తారస్థాయికి చేరుతోంది. పాలక బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీజేపీ బలహీనపడిందన్న (2019లో మొత్తం పది సీట్లనూ బీజేపీ నెగ్గగా.. 2024లో కాంగ్రెస్ సగం స్థానాలను చేజిక్కించుకుంది) విపక్షాల వాదనకు బలం చేకూర్చేందుకు కాంగ్రెస్‌కు, దాన్ని పూర్వపక్షం చేసేందుకు అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో ఘన విజయం అత్యవసరంగా మారింది. ఢిల్లీ, పంజాబ్ వెలుపల ఉనికి చాటుకోజూస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీకి కూడా ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే. కాంగ్రెస్ సమరోత్సాహంతో కనిపిస్తుండగా, పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ వ్యతిరేకతతో సతమతమవుతోంది. రైతు ఆందోళనల వంటివి ఆ పార్టీకి మరింత సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో పలు అసెంబ్లీ స్థానాలు ఈ రెండు పార్టీలతో పాటు జేజేపీ, ఐఎన్ఎల్‌డీ వంటి ప్రాంతీయ పార్టీల హోరాహోరీ పోరుకు వేదికగా మారాయి. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఆ హాట్ సీట్లపై ఫోకస్...

-సాక్షి, నేషనల్ డెస్క్

గర్హీ సంప్లా కిలోయి హుడా కంచుకోట

రాష్ట్ర కాంగ్రెస్ దిగ్గజం, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా కంచుకోట. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇప్పటిదాకా ఓటమే ఎరగని నేత ఆయన. దాంతో ఈ స్థానాన్ని నిలుపుకోవడం కాంగ్రెస్‌కు అత్యవసరం. 25 శాతం జనాభాతో హరియాణాలో ప్రబల శక్తిగా ఉన్న జాట్ల ఓట్లు ఈ స్థానంలో నిర్ణాయకం. వారిలో తమపై తీవ్ర ఆగ్రహం నెలకొని ఉండటం బీజేపీని కలవరపెడుతోంది. హుడాపై గాంగ్‌స్టర్ రాజేశ్ హుడా భార్య మంజు హుడాను బీజేపీ పోటీకి నిలిపింది. ఆమె తండ్రి మాజీ పోలీసు అధికారి కావడం విశేషం.

తోశాం వారసత్వ పోరు

కాంగ్రెస్ నుంచి పూర్వాశ్రమంలో క్రికెట్ అడ్మినిస్ట్రేటర్ అయిన అనిరుధ్ చౌదరి బరిలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి శ్రుతి చౌదరితో ఆయన తలపడుతున్నారు. వీరిద్దరూ దివంగత సీఎం బన్సీలాల్ మనవడు, మనవరాలు కావడం విశేషం. దాంతో అన్నాచెల్లెళ్ల పోరు అందరినీ ఆకర్షిస్తోంది. ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారి రాజ్యసభకు ఎన్నికైన కిరణ్ చౌదరి కూతురే శ్రుతి.

అంబాలా కంటోన్మెంట్ కాంగ్రెస్‌కు ఇంటి పోరు

బీజేపీ దిగ్గజం అనిల్ విజ్ ఇక్కడ ఆరుసార్లు గెలిచారు. మనోహర్‌లాల్ ఖట్టర్ మంత్రివర్గంలో హోంమంత్రిగా చక్రం తిప్పారు. కానీ నయాబ్ సింగ్ సైనీ మంత్రివర్గంలో చేరకుండా దూరం పాటిస్తున్నారు. గురువారం ఆయన నామినేషన్ దాఖలు వేళ బీజేపీ నేతలేవరూ వెంట లేకపోవడం చర్చకు తావిచ్చింది. కాంగ్రెస్ ఇక్కడ ఇంటి పోరుతో సతమతం అవుతోంది. పర్విందర్ సింగ్ పరీని బరిలో దించగా పార్టీ సీనియర్ నేత నిర్మల్‌సింగ్ కుమార్తె చిత్రా శర్వర ఇండిపెండెంట్‌గా పోటీకి దిగారు. గత ఎన్నికల్లో కూడా ఆమె ఇండిపెండెంట్‌గా పోటీ చేసి అనిల్ విజ్ చేతిలో 20 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.

లద్వా సీఎం సైనీకి పరీక్ష!

గత మార్చిలో ఖట్టర్ స్థానంలో సీఎంగా పగ్గాలు చేపట్టిన సైనీ ఇక్కడ బరిలో ఉన్నారు. ఉప ఎన్నికల్లో ఖట్టర్ కంచుకోట అయిన కర్నాల్ నుంచి గెలిచిన ఆయన ఈసారీ అక్కడినుంచే పోటీ చేయాలని భావించారు. కానీ బీజేపీ అధిష్టానం ఆదేశం మేరకు పార్టీకి అత్యంత సురక్షితమైన ఈ స్థానం నుంచి అయిష్టంగానే బరిలో దిగారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నెగ్గడం విశేషం. సిట్టింగ్ ఎమ్మెల్యే మేవాసింగ్ ఈసారి కూడా బరిలో అన్నారు.

బద్లీ బీజేపీకి గట్టి పరీక్ష

బీజేపీ నుంచి రాష్ట్ర పార్టీ మాజీ చీఫ్, జాట్ నేతఓం ప్రకాశ్ ధన్‌ఖడ్ బరిలో ఉన్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేశారు. 2014లో నెగ్గగా 2019లో కాంగ్రెస్ ప్రత్యర్థి కుల్‌దీప్ వత్స్ చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారీ ఆయనతోనే అమీతుమీ తేల్చుకుంటున్నారు.

హిస్సార్ బీజేపీకి జిందాల్ సవాల్!

అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ కీలకంగా మారే ఈ స్థానం ఈసారి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోనే ధనిక మహిళ అయిన పారిశ్రామిక దిగ్గజం సావిత్రి జిందాల్ ఇండిపెండెంట్‌గా బరిలో దిగడమే అందుకు కారణం. ఆమె కుమారుడు నవీన్ జిందాల్ ఇటీవలే బీజేపీలో చేరి లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర స్థానం నుంచి విజయం సాధించడం తెలిసిందే. అయినా సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కమల్ గుప్తాకే హిస్సార్ టికెట్ దక్కింది. కాంగ్రెస్ నుంచి మళ్లీ రామ్ నివాస్ రారా బరిలో ఉన్నారు.

కైతాల్ బరిలో సుర్జేవాలా జూనియర్

కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా 2019లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి లీలారామ్ గుర్జర్ చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారి గుర్జర్‌పై సుర్జేవాలా కుమారుడు ఆదిత్య బరిలో ఉన్నారు. తండ్రి ఓటమికి ఆయన బదులు తీర్చుకోగలరా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఉచానా జేజేపీ అడ్డా!

మాజీ డిప్యూటీ సీఎం, జేజేపీ చీఫ్ దుష్యంత్ చౌతాలా సిట్టింగ్ స్థానం. రాష్ట్రంపై జేజేపీ పట్టు సడలుతున్న దృష్ట్యా ఈసారి ఇక్కడ ఘన విజయం ఆయనకు అత్యంత కీలకం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జేజేపీ 10 సీట్లు నెగ్గి కింగ్ మేకర్‌గా ఆవిర్భవించడం, బీజేపీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం తెలిసిందే. బీజేపీ నుంచి దేవేందర్ అత్రి, కాంగ్రెస్ నుంచి బ్రిజేంద్ర సింగ్ ఆయనకు పోటీ ఇస్తున్నారు. మాజీ ఐఏఎస్ అయిన బ్రిజేంద్ర గత మార్చిలోనే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్ చేశారు.

ఎలెనాబాద్ ఐఎన్ఎల్‌డీకి అగ్నిపరీక్ష

జేజేపీ మాదిరిగానే నానాటికీ ప్రభ తగ్గుతున్న ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ)కు ఇక్కడ విజయం ప్రతిష్టాత్మకంగా మారింది. ఈసారి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే, పార్టీ ప్రధాన కార్యదర్శి అభయ్ సింగ్ చౌతాలా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి భారత్ సింగ్ బెనివాల్, బీజేపీ నుంచి ఆరెస్సెస్ మూలాలున్న అమర్ చంద్ మెహతా ఆయనకు పోటీ ఇస్తున్నారు.

జులానా హై ప్రొఫైల్ పోరు

ఈసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న స్థానం. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఒలింపియన్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆ పార్టీ తరఫున ఇక్కడి నుంచి ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. బీజేపీ కెప్టెన్ యోగేశ్ బైరాగికి టికెట్ ఇవ్వగా, ఆప్ నుంచి మరో రెజ్లర్ కవితా దేవి బరిలో దిగడం విశేషం. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల వివాదంలో మోదీ సర్కారు వ్యవహార శైలి బీజేపీకి ఇక్కడ బాగా ప్రతికూలంగా మారవచ్చని అంటున్నారు.

హోడాల్ బరిలో పీసీసీ చీఫ్

ఈ ఎస్సీ రిజర్వుడు స్థానంలో కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ ఉదయ్ భాన్ బరిలో ఉన్నారు. దాంతో బీజేపీ గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన జగదీశ్ నాయర్‌ను పక్కన పెట్టి హరీందర్‌సింగ్ రామ్ రతనన్‌కు టికెటిచ్చింది.

మదురో హత్యకు సీఐఏ కుట్ర!

ఆరుగురు విదేశీయుల అరెస్టు: వెనిజులా



వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో హత్యకు అమెరికా నిఘా సంస్థ సీఐఏ కుట్ర పన్నిందా? అవునని వెనిజులా అంతర్గత వ్యవహారాల మంత్రి డియోస్డాడో కాబెల్లో ఆరోపించారు. తమ దేశాన్ని అస్థిరపరచడానికి కుట్ర పన్నారనే ఆరోపణలతో ఒక యూఎస్ నేవీ సీల్ ఆఫీసర్‌తో సహా ఆరుగురు విదేశీయులను అరెస్టు చేసినట్టు ప్రకటించారు. వారిలో అమెరికన్లు ఇద్దరు స్పెయిన్, ఒక చెక్ పౌరుడు ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 400 అమెరికా రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కుట్రలో సీఐఏతో పాటు స్పెయిన్ జాతీయ నిఘా విభాగం కూడా పాలుపంచుకుందని కాబెల్లో ఆరోపించారు. వీటిని అమెరికా విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. మదురోను గద్దె దించే కుట్రలో తమ ప్రమేయముందన్న వాదనలు పూర్తిగా అవాస్తవమని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి ఒకరన్నారు. వెనిజులా రాజకీయ సంక్షోభానికి ప్రజాస్వామ్య పరిష్కారం కోసం అమెరికా మద్దతిస్తూనే ఉంటుందన్నారు. దీనిపై అదనపు సమాచారం కోరుతున్నట్లు తెలిపారు. తాము కూడా దీనిపై వెనిజులాను సమాచారం అడుగుతున్నట్లు స్పెయిన్ విదేశాంగ శాఖ తెలిపింది. మదురో ఇటీవలే అధ్యక్ష ఎన్నికల్లో వివాదాస్పద రీతిలో గెలవడం తెలిసిందే. ఆ విజయాన్ని గుర్తించడానికి వెనిజులా ప్రతిపక్షంతో పాటు అమెరికా కూడా నిరాకరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

- కారాకస్

యూరప్‌లో వరద విలయం

బోరిస్ తుఫానుతో పలు దేశాలు అతలాకుతలం



చెక్ రిపబ్లిక్‌లోని కోట్లోవ్ జిల్లాలో వరద

కుండపోత వర్షాలు మధ్య, తూర్పు యూరప్‌లో బీభత్సం సృష్టిస్తున్నాయి. బోరిస్ తుఫాను ధాటికి విపరీతమైన వర్షపాతం నమోదవుతోంది. రొమేనియా, ఆస్ట్రియా, జర్మనీ, స్లొవేకియా, హంగేరీ సహా పలు మధ్య యూరోపియన్ దేశాల్లో భారీ వర్షాలు కురిశాయి. చెక్ రిపబ్లిక్ కూడా ఎడతెరిపి లేని వానలతో అతలాకుతలమవుతోంది. భారీ సంఖ్యలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దేశవ్యాప్తంగా 90 చోట్ల వరద హెచ్చరికలను ప్రకటించారు. ఓపావా సహా పలు నగరాల్లో వేలాది మందిని ఇళ్లను వదిలి ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వం కోరింది. రాజధాని ప్రేగ్‌నూ వరద విలయం సృష్టిస్తోంది. దక్షిణ బొహెమియా ప్రాంతంలో వరదల దెబ్బకు ఓ డ్యామ్ బద్దలైంది. 1997 నాటి 'శతాబ్దపు వరద'ల కంటే పరిస్థితి దారుణంగా ఉందని చెక్ ప్రధాని పీటర్ ఫియాలా వాపోయారు. నైరుతి పోలెండ్‌లోని ఒపోల్ ప్రాంతంలో నది ఉప్పొంగడంతో పట్టణం వరద ముంపుకు గురైంది. దేశంలో రెండో అతి పెద్ద నగరం క్రాకోవ్ కూడా వరదలో చిక్కుకుంది. కరెంటు లేక, టెలిఫోన్ నెట్‌వర్క్ పని చేయక జనం నరకం చూస్తున్నారు. ఆస్ట్రియాలో వియన్నా పరిసరాలను విపత్తు ప్రాంతంగా ప్రకటించారు. భారీ వర్షాలు మంగళవారం దాకా కొనసాగుతాయన్న అంచనాలు మరింత భయపెడుతున్నాయి.

- ప్రేగ్

దేశ ప్రజాస్వామ్యానికి 2024 కీలక మలుపు

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: గత పదేళ్లుగా ప్రజాస్వామ్య వ్యవస్థలను, సంస్థలను నాశనం చేసేందుకు, వాటి సమగ్రతను దెబ్బతీసేందుకు మూకుమ్మడి ప్రయత్నాలు జరిగాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అయితే, దేశ ప్రజాస్వామ్యానికి 2024 ఒక కీలకమలుపు వంటిదని ఖర్గే పేర్కొన్నారు. మన జాతి నిర్మాతలు ఎంతో కష్టపడి నిర్మించిన ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం ఉంచుతూ 140 కోట్ల మంది భారతీయులు ఈ ఎన్నికల్లో విభిన్నమైన తీర్పు ఇచ్చారన్నారు. 'ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎంతో ఉత్తమమైంది. ప్రజలు తమను ఎలా పాలించాలో తెలిపేందుకు, నాయకులను జవాబుదారీగా ఉంచేందుకు ఈ విధానంలో అవకాశం ఉందన్న మన ప్రథమ ప్రధాని నెహ్రూ వ్యాఖ్యలను ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా ఆయన 'ఎక్స్'లో ఉటంకించారు. రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకునేందుకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని ఖర్గే పేర్కొన్నారు.



అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినం సందర్భంగా ఆదివారం బెంగళూరు విధానసౌధ వద్ద మానవహారం కార్యక్రమంలో కర్నాటక సీఎం సిద్ధరామయ్య. (ఇన్‌సెట్‌లో) బీబీఎంపీ కార్మికులు. రాష్ట్రంలో 31 జిల్లాలను చుడుతూ 2,500 కి.మీ. మేర నిర్వహించిన ఈ మానవహారం ప్రపంచంలోనే అతి పెద్దదని ప్రభుత్వం పేర్కొంది.

'టారిఫ్'పై ట్రంప్‌కే ఓటు

రాయిటర్స్ పోల్‌లో వెల్లడి

వాషింగ్టన్: అగ్రరాజ్యాన్నీ అప్పుల భారం వెన్నాడుతోంది. దాంతో దేశ అప్పుల భారాన్ని తగ్గించే నేతకు అమెరికా ఓటర్లు జై కొడుతున్నారు. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌తో పోలిస్తే విదేశీ వస్తువులపై అధిక పన్నులు వేసి అమెరికా రుణ భారాన్ని తగ్గిస్తానన్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు ఎక్కువ మంది ఓటర్లు మద్దతు పలుకుతున్నట్లు తాజాగా రాయిటర్స్/ఇప్సోస్ పోల్ సర్వేలో వెల్లడైంది. ఇప్పటికే దేశ అప్పు ఏకంగా 35 లక్షల కోట్ల డాలర్లు దాటిపోయింది. పన్నులు పెంచుకుంటే ప్రభుత్వానికి ఆదాయం పెరిగి పాత అప్పులను తీర్చుతుందనే భావనతో ఓటర్లు ట్రంప్ వైపు మొగ్గుచూపుతున్నారని సర్వే పేర్కొంది. ''ఎగుమతులపై 10 శాతం పన్నులు విధిస్తానని, చైనా ఉత్పత్తులపై 60 శాతం దిగుమతి పన్ను విధిస్తానని హామీ ఇచ్చిన ట్రంప్‌కు 56 శాతం మంది ఓటర్లు మద్దతు పలికారు. ఈ విషయంలో హారిస్ వైపు నిల్చున్న ఓటర్లు కేవలం 41 శాతం'' అని సర్వే పేర్కొంది. పలు సర్వేల్లో హారిస్ ఆధిక్యతలో ఉన్నా ఏడు స్వింగ్ రాష్ట్రాలే విజేతను నిర్ణయిస్తాయని సర్వే అభిప్రాయపడింది.

ఎంపీ రషీద్ బీజేపీ తొత్తు

ఎన్సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్/బారాముల్లా: ఎంపీ ఇంజినీర్ రషీద్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ తొత్తు అని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఆరోపించారు. ''తిహార్ జైలులో ఉన్న ఆయన్ను ఎన్నికలకు ముందే ఎందుకు విడుదల చేశారు? ఇక్కడి ముస్లింల్లో చీలికలు తేవడానికి. వాళ్ల గొంతులు నొక్కడానికి'' అని ఆదివారం మండిపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్సీ-కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ఉగ్రవాదం జడలు విప్పుతుందన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ఫరూక్ తిప్పికొట్టారు. అసత్యాలతో ప్రజల్ని మోసగిస్తున్నారన్నారు.

అవి బీజేపీ రబ్బర్ స్టాంపులు: రషీద్

ఫరూక్ అబ్దుల్లా విమర్శలపై ఇంజినీర్ రషీద్ మండిపడ్డారు. ఆయన, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ రబ్బర్ స్టాంపులు, తోలు బొమ్మలు అంటూ దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వ కశ్మీర్ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. కశ్మీర్ ప్రజలు ఎవరి దయాదాక్షిణ్యాలపైనా ఆధారపడరన్నారు.



ఆదివారం ముంబైలోని మెరైన్ డ్రైవ్‌లో సముద్ర తీరాన రిటైనింగ్ వాల్‌పై నిలిచి సరదాగా సెల్ఫీ తీసుకుంటున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

విపత్తులు... నష్టం కలిగించే ఆకస్మిక సంఘటనలు

ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ఆకస్మిక సంఘటనలే విపత్తులు. క్రీపూ. 430లో ఏథెన్స్ నగరంలో 'టైఫస్' వ్యాధితో సంభవించిన నష్టాన్ని మొదటి విపత్తుగా నమోదు చేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. 1556లో చైనా లోని 'సాంగ్జీ' ప్రావిన్స్‌లో సంభవించిన భూకంపం వల్ల సుమారు 8,30,000 మంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. దీంతో సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

విపత్తులు - ప్రాథమిక భావనలు

సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లిష్‌లో డిజాస్టర్ అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి..

1) డస్ (Dus), ఆస్టర్ (Aster) అనే గ్రీకు పదాలు.
2) డెస్ (Des), ఆస్ట్రే (Astre) అనే ఫ్రెంచ్ పదాలు.
3) డిస్ (Dis), ఆస్ట్రో (Astro) అనే లాటిన్ పదాలు

- గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే 'దుష్ట నక్షత్రం' అని అర్థం.
- విపత్తుల ముఖ్య లక్షణాలు
  1. ఆకస్మికంగా సంభవిస్తాయి.
  2. అతివేగంగా విస్తరిస్తాయి
  3. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక వనరులను ధ్వంసం చేస్తాయి.
  4. ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తాయి.
  5. ప్రకృతి వనరులను ధ్వంసం చేసి ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధికి విఘాతం కలిగిస్తాయి.

క్రీ.పూ. 430లో ఏథెన్స్ నగరంలో 'టైఫస్' వ్యాధితో సంభవించిన నష్టాన్ని మొదటిసారిగా నమోదు చేసినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. దీన్నే తొలి విపత్తు నమోదుగా భావిస్తారు. 1556లో చైనాలోని 'సాంగ్జీ' ప్రావిన్స్‌లో సంభవించిన భూకంపం వల్ల సుమారు 8,30,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది ఇప్పటి వరకు అత్యధిక ప్రాణ నష్టం జరిగిన విపత్తు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ అండ్ రెడ్ క్రీసెంట్ సొసైటీస్ (ఐఎఫ్ఆర్‌సీ) ప్రచురించిన ప్రపంచ విపత్తు నివేదిక-2010 ప్రకారం 2000 - 2009 మధ్య ప్రపంచ వ్యాప్తంగా విపత్తుల ప్రభావానికి గురైన వారిలో 85 శాతం మంది ఆసియా, పసిఫిక్ ప్రాంతానికి చెందినవారు. యునైటెడ్ నేషన్స్ ఇంటర్‌నేషనల్స్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (యూఎన్ఐఎస్‌డీఆర్) విడుదల చేసిన 'గ్లోబల్ అసెస్‌మెంట్ రిపోర్ట్ -2011 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వరదల ప్రభావానికి గురవుతున్న వారిలో 90 శాతానికి పైగా దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్ దేశాల ప్రజలు ఉన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం 1995-2004 మధ్య సంభవించిన విపత్తుల వివరాలు..

1) వరదలు - 30 శాతం
2) తుపానులు - 21 శాతం
3) కరవు- 19 శాతం
4) మహమ్మారి వ్యాధులు - 15 శాతం
5) భూకంపాలు, సునామీలు - 8 శాతం
6) భూతాపాలు - 4 శాతం
7) హిమపాతాలు - 11 శాతం
8) అగ్ని పర్వతాలు - 1 శాతం
9) కీటకదాడులు - 1 శాతం

ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారతదేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్' రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారతదేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువ సార్లు సంభవించిన విపత్తు 'వరదలు'గా ఆ నివేదిక పేర్కొంది.

ఇండియన్ డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్ట్స్ ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒకవిపత్తుకు తరచు గురవుతున్నాయి. 25 ప్రదేశాలు విపత్తు భరిత ప్రాంతాలు. దీనికి కారణాలు..

1) భారతదేశంలోని విశిష్ట శీతోష్ణస్థితి
2) అధిక జనాభా
3) సుదీర్ఘ తీరరేఖ
4) వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ
5) ఖనిజోద్గ్రహణం
6) అటవీ నిర్మూలన, గ్లోబల్ వార్మింగ్

విపత్తుల అవగాహన కోసం కింద పేర్కొన్న ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి..

1. **వైపరీత్యాలు:** ఒక భౌగోళిక ప్రాంతంలో ఆస్తి, పర్యావరణ, ప్రాణ నష్టం కల్గించే శక్తి రూప ఆకస్మిక సంఘటనలే వైపరీత్యాలు. వైపరీత్య ధృతి, దాని ప్రభావ కాలం ఆధారంగా వైపరీత్యాలు రెండు రకాలు..
   - **ర్యాపిడ్- అన్‌సెట్ హజర్డ్స్ (Rapid - onset Hazards):** ఒక ప్రాంతంలో ఆకస్మికంగా సంభవించి, కొద్ది కాలం మాత్రమే ప్రభావం చూపే వాటిని ర్యాపిడ్ అన్‌సెట్ హజర్డ్స్ అంటారు. భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, భూపాతం, తుపానులు, వరదలు మొదలైనవి.
   - **స్లో- అన్‌సెట్ హజర్డ్స్ (Slow - onset Hazards):** ఒక ప్రాంతంలో నెమ్మదిగా సంభవించి, దీర్ఘ కాలం ప్రభావం చూపేవాటిని స్లో అన్‌సెట్ డిజార్డ్స్ అంటారు. కరవు, పర్యావరణ క్షీణత, చీడపీడలు, నెమ్మదిగా సంభవించే వరదలు మొదలైనవి.
   - 1999లో విపత్తు నిర్వహణపై కె.సి. పంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికార కమిటీ' దేశంలోని పలు ప్రాంతాల్లో పరిశోధించి 31 రకాల విపత్తులను గుర్తించింది. వీటిని ఐదు సబ్‌గ్రూప్‌లుగా విభజించింది.
2. **దుర్భలత్వం:** విపత్తు నష్ట తీవ్రతను పెంచే ఆ ప్రాంత పరిస్థితుల పరిధిని దుర్భలత్వం అంటారు. ఇది ప్రజల ఆర్థిక పరిస్థితి, లింగభేదం, పేదరికం, నిరక్షరాస్యత, వయసు, పట్టణీకరణ, జనాభా పెరుగుదలపై ఆధారపడి ఉంటుంది.
3. **సామర్థ్యం/సమర్థత:** వైపరీత్యం వల్ల నష్టపోయిన ఆస్తులు, వనరులను, జీవనోపాధిని పునరుద్ధరించుకోగల శక్తినే 'సామర్థ్యం' అంటారు.
4. **విపత్కరస్థితి/ముప్పు:** వైపరీత్యాలు, దుర్భలత్వ పరిస్థితుల మధ్య పరస్పర చర్యల కారణంగా ఊహించదగిన నష్టాలు జరిగే సంభావ్యతనే 'విపత్కరస్థితి' అంటారు. ఈ ముప్పు స్థాయి ఆధారపడే అంశాలు..
   - ఎ) వైపరీత్య స్వభావం
   - బి) వైపరీత్య ప్రభావానికి గురయ్యే అంశాల దుర్భలత్వం
   - సి) ఆ అంశాల ఆర్థిక విలువ



మాదిరి ప్రశ్నలు

1. 'విపత్తు' అనే పదాన్ని ఏ భాష నుంచి గ్రహించారు?
   ఎ) అరబిక్ బి) గ్రీకు
   సి) లాటిన్ డి) ఫ్రెంచ్
2. కిందివాటిలో ర్యాపిడ్ అన్‌సెట్ వైపరీత్యం?
   ఎ) భూకంపాలు బి) అగ్ని పర్వతాలు
   సి) సునామీ డి) పైవన్నీ
3. 1999లో కె.సి.పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికార కమిటీ' దేశంలో ఎన్ని రకాల విపత్తులను గుర్తించింది?
   ఎ) 20 బి) 10 సి) 31 డి) 21
4. ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనానికి, ఆస్తులకు నష్టాన్ని కలగించే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలను ఏమంటారు?
   ఎ) విపత్తులు బి) వైపరీత్యాలు
   సి) దుర్భలత్వం డి) అపాయం
5. 'విపత్తు' అనేది దేని ఫలితం?
   ఎ) వైపరీత్యం బి) దుర్భలత్వం
   సి) విపత్కరస్థితి డి) ఎ, బి
6. 2010 ప్రపంచ విపత్తుల నివేదిక ప్రకారం 2000-09 మధ్య కాలంలో సంభవించిన విపత్తు బాధితుల్లో 85 శాతం ప్రజలు ఏ ప్రాంతానికి చెందినవారు?
   ఎ) ఉత్తర ఆసియా బి) ఆసియా పసిఫిక్
   సి) ఆగ్నేయాసియా డి) వాయవ్య ఆసియా
7. ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన విపత్తుల్లో భూకంపాలు, సునామీల శాతం ఎంత?
   ఎ) 5 శాతం బి) 6 శాతం
   సి) 7 శాతం డి) 8 శాతం
8. ప్రపంచ విపత్తుల్లో వరదల శాతం ఎంత?
   ఎ) 20 శాతం బి) 30 శాతం
   సి) 35 శాతం డి) 40 శాతం
9. విపత్తు అనేది ఒక సంఘటన అయితే దాని వల్ల కలిగేది?
   ఎ) ప్రాణనష్టం
   బి) జీవనోపాధి దెబ్బతినడం
   సి) ఆస్తి నష్టం డి) పైవన్నీ
10. వైపరీత్యం ఒక ప్రమాదకర సంఘటన అయితే అది కిందివాటిలో ఒక?
    ఎ) భూకంపం బి) సునామీ
    సి) వరద డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) సి; 4) బి; 5) డి; 6) బి; 7) డి; 8) బి; 9) డి; 10) డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఎక్కడ ఉంది? - న్యూఢిల్లీ
- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రచురించే ద్వైవార్షిక జర్నల్ పేరు? - డిజాస్టర్ అండ్ డెవలప్‌మెంట్
- ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 1996-2000 మధ్యకాలంలో విపత్తుల వల్ల భారత జాతీయ ఉత్పత్తిలో సుమారు ఎంత శాతం నష్టం వాటిల్లింది? - 2.25 శాతం
- జాతీయ విపత్తు నిర్వహణ విధానాన్ని కేంద్ర మంత్రి మండలి ఏ సంవత్సరంలో ఆమోదించింది? - 2009
- జనాభా మీద సార్థకంగా విపత్తు ప్రభావాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు? - మెరుగైన ప్రణాళికలు, సన్నాహక అవగాహన, నివారణ చర్యలు
- దేశంలో తుపానులు, తుపాను తరంగాలు, సునామీల వల్ల హాని సంభవించగల తీరప్రాంత విస్తీర్ణం? - 5,700 కిలోమీటర్లు
- ఇండియాలో విపత్తు కార్యనిర్వాహక చట్టం ఏ సంవత్సరంలో రూపొందించారు? - 2005
- భారతదేశంలో ఏ నెలలో దుమ్ము తుపానులు ఎక్కువగా సంభవిస్తాయి? - మే
- వల్కానిక్ బారెన్ ద్వీపం ఎక్కడ ఉంది? - దక్షిణ అండమాన్
- సునామీ తరంగాలు/అలలు సంభవించడానికి కారణం? - సముద్రంలో భూకంపాలు
- ఏ దేశంలో సాధారణంగా భూకంపాలు సంభవించవు? - ఆస్ట్రేలియా
- 2005లో ప్రపంచ విపత్తు నిర్వహణ సమావేశం ఎక్కడ జరిగింది? - జపాన్
- సార్క్ విపత్తు నిర్వహణ వెబ్‌సైట్? - www.saarc-sdmc.nic.in
- 1957లో నేషనల్ సివిల్ డిఫెన్స్ కాలేజ్ ఎక్కడ స్థాపించారు? - నాగపూర్
- రిక్టర్ స్కేల్‌తో కొలిచేది? - భూ కంపాల తీవ్రత
- సముద్రగర్భంలో సంభవించే భూకంపాన్ని ఏమంటారు? - సునామీ
- వరదలు రావడానికి ప్రధాన కారణం? - భారీ వర్షపాతం
- 1980-2010 మధ్యకాలంలో సంభవించిన భూకంపాల సంఖ్య? - 34
- సార్క్ విపత్తు నిర్వహణ కేంద్రం ఎక్కడ ఉంది - న్యూఢిల్లీ
- సైక్లోన్ అనే గ్రీకు పదానికి అర్థం? - పాముచుట్లు
- సునామీలు అధికంగా ఎక్కడ సంభవిస్తాయి? - పసిఫిక్ మహాసముద్రం
- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ దేనిని తయారు చేస్తుంది? - నేషనల్ పాలసీ ఆన్ డిజాస్టర్ మేనేజ్‌మేంట్
- విపత్తుల రకాలు? - జీవ సంబంధ, భూ సంబంధ, నీటి, వాతావరణ సంబంధ విపత్తులు
- పసిఫిక్ ప్రాంతంలో సునామీ హెచ్చరిక గ్రూపు ఎక్కడుంది? - టోక్యో
- నేషనల్ ప్లాట్‌ఫాం ఆన్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఎక్కడ ఉంది? - న్యూఢిల్లీ
- జాతీయ విపత్తు నివారణ దినం? - అక్టోబర్ 29
- కేంద్ర జలకమిషన్ కింద ఏర్పడిన జాతీయ నీటి అకాడమీ ఎక్కడ ఉంది? - పుణే
- అకస్మాత్తుగా లేదా దురదృష్టంగా సంభవించి సమాజ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసే సంఘటనే విపత్తు అని నిర్వచించింది? - ఐక్యరాజ్యసమితి


ఇచ్చిన పటాల్లో వృత్తాన్ని గుర్తిస్తే విద్యార్థి సాధించిన లక్ష్యం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మ్యాథ్స్

గణితశాస్త్ర బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలు, మూల్యాంకనం

1. ఒక వ్యక్తి దేన్ని మొదట, మధ్యలో, తుదిగా చేయాలో నిర్ణయించడానికి అవకాశం కల్పించేది?
   ఎ) సృజనాత్మకత బి) క్రమశిక్షణ
   సి) సంస్కృతి డి) జ్ఞానం
2. 'వ్యక్తులు వారి వారి స్థాయి, నైపుణ్యాన్ని బట్టి గణితాన్ని వృత్తిగా ఎన్నుకుంటారు' ఏ ఉద్దేశాన్ని సూచిస్తుంది?
   ఎ) సన్నాహ బి) క్రమశిక్షణ
   సి) ఉదరపోషణ డి) ప్రయోజన
3. 'గణిత అభ్యసనం వల్ల క్రమశిక్షణ, నిర్మాణాత్మకత, క్రమసరళి మొదలైన సులక్షణాలు అలవడతాయి' అని తెలిపే ఉద్దేశం?
   ఎ) శీలోద్దేశం బి) జ్ఞానోద్దేశం
   సి) సన్నాహోద్దేశం డి) ప్రయోజనోద్దేశం
4. రాణి 'తాను పొందిన గణిత భావనలు తన పెరటి వైశాల్యం కనుక్కోవడానికి వినియోగిస్తే అది ఏ విలువను తెలుపుతుంది?
   ఎ) సన్నాహ బి) క్రమశిక్షణ
   సి) ఉదర పోషణ డి) ప్రయోజన
5. విద్యార్థులు గణితాన్ని తీరిక సమయాల్లో మనోరంజకంగా ఉపయోగించేలా చూడడం ఏ స్థాయి ఉద్దేశం?
   ఎ) పూర్వ ప్రాథమిక బి) ప్రాథమిక
   సి) ప్రాథమికోన్నత డి) ఉన్నత
6. సమయపాలన, ధైర్యం, ఆత్మవిశ్వాసం అలవాటు చేసే విలువ?
   ఎ) సన్నాహ బి) మేధా సంబంధిత
   సి) క్రమశిక్షణ డి) సాంస్కృతిక
7. 'విద్యార్థికి ఒక అంశంలోని సామర్థ్యం మరొక అంశంలోని సామర్థ్యాన్ని పెంచుతుంది'' అని తెలిపినవారు?
   ఎ) థారన్‌డైక్ బి) పైథాగరస్
   సి) బ్రాడ్‌ఫోర్డ్ డి) బెర్ట్‌లాట్
8. ''ఎక్కడ లయ ఉందో అక్కడ సంఖ్య ఉంటుంది' అని తెలిపే గణిత బోధన విలువ?
   ఎ) మేధో సంబంధిత బి) సౌందర్యాత్మక
   సి) మానసిక డి) సామాజిక
9. గణిత బోధనా ఉద్దేశాలు ఉపాధ్యాయుడు ఎప్పుడు నిర్ణయించుకోవాలి?
   ఎ) బోధనాభ్యసనకు ముందు
   బి) బోధనాభ్యసన జరుగుతున్నప్పుడు
   సి) బోధనాభ్యసన తర్వాత
   డి) మూల్యాంకనం చేస్తున్నప్పుడు
10. వీటిలో ఉన్నతస్థాయి గణిత బోధనా ఉద్దేశం?
    ఎ) గణితాన్ని మనోరంజకంగా ఉపయోగించుకోవడం
    బి) గణిత గుర్తులు, చిహ్నాలు పరిచయం చేయడం
    సి) విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందించడం
    డి) గణిత శాస్త్ర నైపుణ్యాలు, గుర్తులను నిత్య జీవితంలో ఉపయోగించుకోవడం
11. $(a+b)^2=a^2+2ab+b^2$ను రేఖాచిత్రం ఆధారంగా బోధించడం ఏ సహసంబంధాన్ని తెలుపుతుంది?
    ఎ) అంతర్గత బి) బాహ్య
    సి) అంతర్గత-బాహ్య డి) బాహ్య-బాహ్య
12. గణిత పజిల్స్ ద్వారా విద్యార్థుల్లో పెంపొందించే విలువ?
    ఎ) సౌందర్యాత్మక బి) సృజనాత్మక
    సి) మానసిక డి) మేధో సంబంధిత
13. విద్యా విధానం ముఖ్య ఉద్దేశం?
    ఎ) పాఠశాల అవసరాలు తీర్చడం
    బి) ఉపాధ్యాయుడు తన బోధనను మెరుగుపర్చుకోవడం
    సి) విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలు పెంపొందించడం
    డి) విద్యార్థుల గైర్హాజరును తగ్గించడం
14. విద్యార్జన ప్రాథమిక ఉద్దేశం?
    ఎ) ఉదర పోషణార్థం బి) ప్రయోజనం
    సి) జ్ఞానం డి) శీల నిర్మాణం
15. వ్యాపారం, పరిశ్రమలు గణితంపై ఆధారపడడం ఏ విలువను సూచిస్తాయి?
    ఎ) ప్రయోజన బి) క్రమశిక్షణ
    సి) సాంస్కృతిక డి) సామాజిక
16. గణితం ఉద్దేశాలకు సంబంధించి వీటిలో సరైంది?
    ఎ) ఉద్దేశం విశాల అర్థం ఉన్న పదం
    బి) ఉద్దేశాలు గణిత విద్యా దిశను సూచిస్తాయి
    సి) కోరికను ప్రకటించేవి ఉద్దేశాలు
    డి) పైవన్నీ
17. గణిత బోధన ఎందుకు చేయాలో తెలుసుకోవడానికి తోడ్పడేవి?
    ఎ) విలువలు బి) ఉద్దేశాలు
    సి) లక్ష్యాలు డి) స్పష్టీకరణలు
18. 'ఏదైనా ఒక విషయంలోని సమస్యను మరొక విషయం సహాయంతో పరిష్కరించడమే సహ సంబంధం' అని నిర్వచించినవారు?
    ఎ) డట్టన్ బి) బేకన్
    సి) బ్రాడ్‌ఫోర్డ్ డి) థారన్‌డైక్
19. విద్యార్థులను ఉత్పాదక జీవితం గడపడానికి సిద్ధం చేయడం ఏ స్థాయి బోధనోద్దేశం?
    ఎ) ప్రాథమిక బి) ప్రాథమికోన్నత
    సి) పూర్వ ప్రాథమిక డి) ఉన్నత
20. గణితం అభ్యసించిన విద్యార్థి జీవితంలో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవడానికి సంసిద్ధుడుగా ఉండడం ఏ విలువను సూచిస్తుంది?
    ఎ) క్రమశిక్షణ బి) సన్నాహ
    సి) ప్రయోజన డి) సాంస్కృతిక
21. ఇచ్చిన భిన్నాలను క్రమ, అపక్రమ భిన్నాలుగా విద్యార్థి వర్గీకరించడం ఏ లక్ష్యాన్ని తెలుపుతుంది?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
22. ఇచ్చిన పటాల్లో వృత్తాన్ని గుర్తిస్తే విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) నైపుణ్యం డి) ప్రశంస
23. శిల్ప నిర్మాణాలు పరిశీలించి, వాటి నిర్మాణ సూత్రాలన్నీ గణితాధారాలే అని తెలపడం ఏ విలువను తెలియజేస్తుంది?
    ఎ) ప్రయోజన బి) సాంస్కృతిక
    సి) క్రమశిక్షణ డి) సమాచార
24. రాణి త్రిభుజ వైశాల్యం కనుక్కోవడానికి $A = \frac{1}{2}bh$ ను సూచిస్తే ఆమె సాధించిన లక్ష్యం?
    ఎ) నైపుణ్యం బి) వినియోగం
    సి) అవగాహన డి) జ్ఞానం
25. ప్రకృతి శక్తులకు సంబంధించిన అవగాహనకు గణితం ఉపయోగపడుతుంది. ఇది ఏ విలువను సూచిస్తుంది?
    ఎ) ప్రయోజన బి) క్రమశిక్షణ
    సి) సాంస్కృతిక డి) కళాత్మక
26. సకల శాస్త్రాలకూ గణితం మూలం, ద్వారం లాంటిదని అన్నవారు?
    ఎ) నెపోలియన్ బి) లైబ్నిజ్
    సి) బేకన్ డి) లాక్
27. సన్నిహిత సంబంధాలున్న భావనలను విచక్షణ చేస్తాడనే స్పష్టీకరణ ఏ లక్ష్యానికి చెందుతుంది?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
28. సంఖ్యారేఖపై భిన్నాలను సూచించిన విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
29. గణిత అధ్యయనం ద్వారా సృజనాత్మకత పెంపొందడం ఏ విలువను సూచిస్తుంది?
    ఎ) ప్రయోజన బి) క్రమశిక్షణ
    సి) సాంస్కృతిక డి) సన్నాహ
30. కారణాలు తెలుపుతాడు అనేది ఏ లక్ష్యానికి చెందుతుంది?
    ఎ) నైపుణ్యం బి) వినియోగం
    సి) జ్ఞానం డి) అవగాహన
31. జ్ఞానం, నైపుణ్యాలు ఏ విద్యా విలువకు చెందుతాయి?
    ఎ) ప్రయోజన బి) క్రమశిక్షణ
    సి) సాంస్కృతిక డి) కళాత్మక
32. మంచి నడవడి ఆశయాలు ఏ విలువను సూచిస్తాయి?
    ఎ) ప్రయోజన బి) క్రమశిక్షణ
    సి) సాంస్కృతిక డి) కళాత్మక
33. I = PTR/100 నుంచి P =100×I/TR అని తెలిపిన విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) వినియోగం బి) ఆగమనం
    సి) అవగాహన డి) నైపుణ్యం
34. ఇచ్చిన భిన్నానికి సమాన భిన్నాలను తప్పులు లేకుండా విద్యార్థి వేగంగా తెలిపాడు. ఇది ఏ లక్ష్యాన్ని సూచిస్తుంది?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
35. గణితంలో ఆటలు, పాటలు ఏ విలువను తెలుపుతాయి?
    ఎ) సన్నాహ బి) సమాచార
    సి) కళాత్మక డి) సాంస్కృతిక
36. ఒక దీర్ఘ చతురస్ర వైశాల్యం దాని పొడవు, వెడల్పుల లబ్ధానికి సమానం అనేదానికి A=lb అని విద్యార్థి తెలిపితే, ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) విశ్లేషణ డి) వినియోగం
37. బ్లాక్ హార్స్ట్ వర్గీకరణలో చేరని విద్యావిలువ?
    ఎ) దృక్పథాలు బి) భావనలు
    సి) సామర్థ్యాలు డి) సమాచారం
38. అభినందనలు ఒక విద్యా విలువగా వర్గీకరించినవారు?
    ఎ) బ్లాక్ హార్స్ట్ బి) యంగ్
    సి) మున్రిక్ డి) బ్రెస్లిచ్
39. విద్యార్థి ప్రధాన సంఖ్యలకు 7, 11, 19... లను ఉదాహరణగా తెలిపితే ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) జ్ఞానం బి) అభిరుచి
    సి) వినియోగం డి) అవగాహన
40. లక్ష్యాలు రూపొందించడంలో నియమాలు తెలిపినవారు?
    ఎ) బ్లూమ్ బి) మేసియా
    సి) ఫ్రాస్ట్ డి) లాంగ్
41. ఎలిమెంటరీ స్థాయి గణిత బోధనోద్దేశం కానిది?
    ఎ) గణితంపట్ల ఆసక్తి కలిగించడం
    బి) ఉత్పాదక, నిర్మాణాత్మక జీవితాన్ని గడపడం
    సి) గణిత భాష గుర్తుల పరిచయం
    డి) క్రమత, శుభ్రత, కచ్చితత్వం సాధించడం
42. మార్కెట్‌లో వివిధ వస్తువుల ధరలను కనుక్కొని ధరల పట్టీ తయారు చేయడం ఏ నియోజనంలో భాగం?
    ఎ) పాఠానికి ముందు సిద్ధం చేయాల్సిన
    బి) సాధన చేయాల్సిన
    సి) వ్యాసక్తుల డి) పరీక్ష
43. అభ్యసన అనుభవాలతో పరస్పర చర్యపొందిన తరువాత విద్యార్థుల్లో గమనించిన మార్పు?
    ఎ) లక్ష్యం బి) స్పష్టీకరణ
    సి) అభ్యసన ఫలితం డి) ఉద్దేశం
44. మానసిక చలనాత్మక రంగంలో కృషిచేసినవారు?
    ఎ) క్రాత్‌హోల్ బి) ఆర్.హెచ్. దవే
    సి) మేసియా డి) బ్లూమ్
45. A = ph ను విద్యార్థి గది నాలుగు గోడల వైశాల్యం దాని భూ చుట్టుకొలత, ఎత్తుల లబ్ధానికి సమానమని తెలిపితే ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) అవగాహన బి) వినియోగం
    సి) అభిరుచి డి) నైపుణ్యం
46. భావావేశ రంగంలో ఉన్నత లక్ష్యం?
    ఎ) లాక్షణీకరణం బి) వ్యవస్థాపన
    సి) విలువకట్టడం డి) గ్రహించడం
47. నూతన దత్తాంశాలను ప్రతిపాదించడం ఏ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
48. సవరించిన బ్లూమ్ వర్గీకరణలో ఉన్నత లక్ష్యం?
    ఎ) మూల్యాంకనం బి) ఉత్పత్తి
    సి) విశ్లేషణ డి) వినియోగించడం
49. విద్యార్థి ప్రధానసంఖ్య నిర్వచనాన్ని తెలిపాడు. ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం?
    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం
50. స్పష్టీకరణల లక్షణం?
    ఎ) లక్ష్యాల పరిధిని తెలుపుతాయి
    బి) లక్ష్యానికి మరొక లక్ష్యానికి తేడా తెలుపుతాయి
    సి) పరీక్షాంశాల ఎన్నికకు ఉపయోగం
    డి) పైవన్నీ
51. మూల్యాంక ప్రక్రియలో నాలుగు ప్రధాన ఉపక్రియలకు చెందనిది?
    ఎ) తీర్పు తయారు చేయడం
    బి) సమాచారం వివరించడం
    సి) బోధించడం
    డి) నిర్ణయం తీసుకోవడం
52. 'త్రిభుజాలు నిర్మించడం' ఏ నియోజనానికి ఉదాహరణ?
    ఎ) పాఠానికి ముందు సిద్ధం చేయాల్సిన భాగం
    బి) సాధన చేయాల్సిన భాగం
    సి) వ్యాసక్తుల భాగం డి) ఏదీకాదు
53. కింది పటాన్ని పరిశీలించి ఉన్నతస్థాయి విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని తెలిపితే ఆ విద్యార్థులు సాధించిన లక్ష్యం?



    ఎ) జ్ఞానం బి) అవగాహన
    సి) వినియోగం డి) నైపుణ్యం

సమాధానాలు

1) బి	2) సి	3) ఎ	4) డి	5) బి
6) సి	7) ఎ	8) బి	9) ఎ	10) డి
11) ఎ	12) బి	13) సి	14) ఎ	15) సి
16) డి	17) బి	18) సి	19) డి	20) బి
21) బి	22) ఎ	23) బి	24) సి	25) ఎ
26) సి	27) బి	28) డి	29) బి	30) డి
31) ఎ	32) సి	33) సి	34) డి	35) సి
36) బి	37) సి	38) డి	39) డి	40) సి
41) బి	42) సి	43) సి	44) బి	45) ఎ
46) ఎ	47) సి	48) బి	49) ఎ	50) డి
51) సి	52) బి	53) బి		

జ్ఞానోద్దేశం:
- గణిత అభ్యసన వల్ల విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, విశ్లేషణ, వివేచన, క్రమశిక్షణ మొదలైనవి అలవడతాయి.
- గణిత అధ్యయనం వల్ల ఒక వ్యక్తి తాను ఎంచుకున్న రంగంలో ప్రసిద్ధుడవుతాడు.

శీలోద్దేశం:
- శీలం అంటే ఒక వ్యక్తి ఇతరులతో కలిసినప్పుడు తన ప్రవర్తనావళి.
- గణిత పఠనం వల్ల విద్యార్థికి మంచి లక్షణాలు, క్రమశిక్షణ, నిర్మాణకత, క్రమ సరళి, పద్ధతి మొదలైనవి అలవడతాయి.

సాంస్కృతిక ఉద్దేశం:
- సంస్కృతిని మనం ముందు తరాల నుంచి అందుకొని తగిన విధంగా మార్పులు, చేర్పులు చేస్తూ ఎక్కువగా విద్యా మాధ్యమం ద్వారా భావితరాల వారికి అందిస్తాం.
- గణితం సంస్కృతికి అద్దం వంటిది - బేకన్

సన్నాహోద్దేశం:
- విద్యార్థులను ఏ రంగానికైనా, ఏ కళకైనా, ఏ వృత్తికైనా గణిత అభ్యసనం ద్వారా సన్నద్ధులను చేసి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకోవడానికి వీలు కల్పిస్తుంది.

స్వయం అధ్యయనోద్దేశం :
- విద్యార్థి గణిత ఉద్దేశాలను తెలుసుకున్నప్పుడు, గణితంపై ఇష్టం పెంచుకొని స్వయం అధ్యయనం చేస్తాడు.

సహసంబంధం:
- జ్ఞానాన్ని చిన్న చిన్న ముక్కలుగా కాకుండా సమగ్రమైన మొత్తంగా అందించడం వల్ల విద్యార్థికి అవగాహన సులభమవుతుంది.
- ఏదైనా ఒక విషయంలోని సమస్యను మరొక విషయం సహాయంతో పరిష్కరించడమే సహసంబంధం - బ్రాడ్‌ఫోర్డ్
- విద్యార్థికి ఒక అంశంలోని సామర్థ్యం మరో అంశంలోని సామర్థ్యాన్ని పెంచుతుంది- థారన్‌డైక్

సహసంబంధం రెండు రకాలు
1) అంతర్గత సహ సంబంధం
2) బాహ్య సహ సంబంధం

అంతర్గత సహ సంబంధం: గణితంలో వివిధ శాఖల మధ్య ఉండే సహసంబంధం

ఉదా: $(x+y)^2=x^2+2xy+y^2$కు జ్యామితీయ నిరూపణ, బీజగణిత, రేఖాగణితాల మధ్య సహసంబంధం తెలియజేయడం

బాహ్య సహ సంబంధం: ఇది గణితం, ఇతర సబ్జెక్టులకు మధ్య సహ సంబంధం తెలుపుతుంది.

ఉదా: 1) కర్బనాన్ని క్రమషడ్భుజి ద్వారా చూపడం, రసాయన శాస్త్రం - గణితం
2) మానవుడిలోని ఎముకల సంఖ్య - 206, జీవశాస్త్రం - గణితం.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com


సాక్షి ప్లస్
సోమవారం। 16-9-2024

వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ



శీతోష్ణస్థితి-వాతావరణ పొరలు-సూర్యపుటం

వాతావరణ సంఘటనం

భూమిని ఆవరించి సుమారు 1600 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న గాలిపొరను 'వాతావరణం' అంటారు. వాతావరణ పొరలకు భూగురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల అవి భూమిని ఆవరించి ఉంటాయి. భూమి ఆకర్షణ వల్ల వాతావరణం భూ ఉపరితలం వద్ద దట్టంగా, ఎత్తుకు వెళ్లే కొద్దీ పలుచగా ఉంటుంది. వాతావరణాన్ని అట్మాస్ఫియర్ అంటారు. అట్మాస్ అంటే ఆవిరి.

వాతావరణ స్థితి: ఒకరోజు లేదా కొన్ని గంటల్లో వాతావరణ అంశాల పరిస్థితిని తెలియజేస్తుంది. ఇది ప్రాంతాలను బట్టి మారుతుంది. తాత్కాలికమైంది, అస్థిరమైంది.

శీతోష్ణస్థితి: ఏదైనా ఒక ప్రాంతానికి సంబంధించి కొన్ని ఏళ్ల సగటు ఉష్ణోగ్రత, వాయుపీడనం, పవనాలు, వర్షపాతం తదితర భౌతికాంశాల పరిస్థితులను తెలుపుతుంది. ఇది వందల ఏళ్ల వాతావరణ పరిస్థితుల సంగ్రహం.

వాయువులు

జీవకోటి మనుగడకు ముఖ్యమైన వాయువు ఆక్సిజన్. మొత్తం వాతావరణంలో నీటిఆవిరి సుమారు 0.4 శాతం ఉంటుంది. దీనిలో అధిక భాగం భూమికి దగ్గరగా ఉంటుంది.

నైట్రోజన్	78.08 శాతం
ఆక్సిజన్	20.94 శాతం
ఆర్గాన్	0.93 శాతం
కార్బన్ డై ఆక్సైడ్	0.03 శాతం
ఇతర వాయువులు	0.02 శాతం
మొత్తం	100.00 శాతం

వాతావరణం - పొరలు

వివిధ పదార్థాల ఆధారంగా వాతావరణాన్ని రెండు ప్రధాన పొరలుగా విభజించారు. అవి..

1) సమరూప ఆవరణం (Homo sphere)
2) బహురూప ఆవరణం (Hetero sphere)

సమరూప ఆవరణం:
ఈ ఆవరణం 90 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. దీనిలో మూడు పొరలుంటాయి. అవి.. ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, మెసో ఆవరణం. సమరూప ఆవరణం అంతటా నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల నిష్పత్తి ఒకే రకంగా ఉంటుంది.

బహురూప ఆవరణం:
90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను బహురూప ఆవరణం అంటారు. దీనిలో వాయువుల నిష్పత్తి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. దీనిలో థర్మో ఆవరణం, ఎక్సో ఆవరణం అనే రెండు పొరలు ఉన్నాయి.

ప్రపంచ వాతావరణ సంస్థ ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
భారత వాతావరణ సంస్థ ప్రధాన కార్యాలయం మహారాష్ట్రలోని పుణేలో ఉంది.

ట్రోపో ఆవరణం:
ఇది వాతావరణంలో అన్నిటికంటే కింద ఉన్న పొర. ధ్రువాల వద్ద 8 కిలోమీటర్ల ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు ఇది విస్తరించి ఉంటుంది. ఈ పొర సగటు ఎత్తు 13 కిలోమీటర్లు.
భూమధ్యరేఖ వద్ద బలమైన సంవహన ప్రవాహాల వల్ల వేడిమి చాలా ఎత్తు వరకు వెళుతుంది. కాబట్టి ఇక్కడ ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలోని ధూళికణాలు, తేమ అంతా ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం లాంటి వాతావరణ అంశాలన్నీ ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి. ఈ పొరలో పైకి వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీన్ని 'సాధారణ క్షీణతా క్రమం' అంటారు. నీటి బిందువులు ఘనీభవించటం, భాష్పీభవనం కావటం, ద్రవీభవనం, వర్షపాతం, తుపానులు వంటివన్నీ ఈ పొరలోనే జరుగుతాయి.

స్ట్రాటో ఆవరణం:
ఈ పొర 50 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఇందులో మబ్బులు ఉండవు, కాబట్టి వర్షపాతం, తుపానులు వంటివి ఉండవు. దీంతో జెట్ విమానాలు ఎగరడానికి ఈ పొర చాలా అనువుగా ఉంటుంది. స్ట్రాటో ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

మెసో ఆవరణం: ఇది 80 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఉల్కలు ఈ పొరలోకి ప్రవేశించగానే కాలిపోతాయి. ఎత్తు పెరిగే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

థర్మో ఆవరణం: ఇది 400 కి.మీ. వరకు ఉంటుంది. థర్మో ఆవరణంలో ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతాయి. ఈ పొరలో అయాన్లు అనే కణాలు ఉంటాయి. వీటికి విద్యుదావేశం ఉంటుంది. ఈ అయాన్ల వల్ల భూమి నుంచి ప్రసారితమయ్యే రేడియో తరంగాలు తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి. ఈ పొరని 'ఐనో ఆవరణం' అని కూడా అంటారు.

ఎక్సో ఆవరణం
ఇది వాతావరణంలో అన్నింటికంటే చివరి పై పొర.

సౌరశక్తి - సూర్యపుటం

సూర్యుడి నుంచి నిరంతరం విడుదలయ్యే శక్తిని సౌర వికిరణం అంటారు. సూర్యుడిలో నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియే అణు సంఘటనం. సూర్యుడి వ్యాసం, భూమి వ్యాసం కంటే 109 రెట్లు ఎక్కువ ఉంటుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి కంటే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి 28 రెట్లు అధికం. సూర్యుడు భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దగా ఉంటాడు. సూర్యుడు విడుదల చేస్తున్న శక్తిలో భూమి గ్రహించే శక్తి (2 వేల మిలియన్లు) 2 వేల మిలియన్లలో ఒక వంతు.

సూర్యపుటం: భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్యుడి శక్తిని సూర్యపుటం అంటారు. సగటున భూమి ఒక చ.సెం.మీ. ఉపరితల విస్తీర్ణంలో నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన సూర్యపుటాన్ని గ్రహిస్తుంది. దీన్నే సౌర స్థిరాంకం అంటారు. భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతాన్ని ఆల్బిడో అంటారు. భూమి ఆల్బిడో 35 యూనిట్లు.

సూర్యపుటం ప్రభావితం చేసే అంశాలు

సూర్యకిరణాలు భూమి మీద పడే కోణం:
సూర్య కిరణాల వాలు తక్కువగా ఉంటే సూర్యపుటం తీవ్రత ఎక్కువగా, వాలు ఎక్కువగా ఉంటే తీవ్రత తక్కువగా ఉంటుంది.

ఉదా: సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో కంటే మిట్ట మధ్యాహ్నం వేళ సూర్యపుటం ఎక్కువ.

ఉదా: సూర్యకిరణాలు లంబంగా ప్రసరించే ఉష్ణ మండల ప్రాంతాలు, సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించే ధ్రువ ప్రాంతాల కంటే ఎక్కువ సూర్యపుటాన్ని గ్రహిస్తాయి.

పగటి ప్రమాణం
పగటి ప్రమాణం ఎక్కువగా ఉండే వేసవి కాలాలు పగటి ప్రమాణం తక్కువగా ఉండే శీతాకాలాల కంటే అధిక సూర్య పుటాన్ని గ్రహిస్తాయి.
భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళ్లే కొద్దీ వేసవి కాలం పగటి ప్రమాణం పెరుగుతుంది. శీతాకాలంలో రాత్రి ప్రమాణం పెరుగుతుంది.

ముఖ్యమైన పదాలు - అర్థాలు

- **సౌర వికిరణం:** సూర్యుడి నుంచి నిరంతరం విడుదయ్యే అపరిమితమైన శక్తి.
- **అణు సంఘటన:** సూర్యుడి నుంచి నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియ.
- **సూర్యపుటం:** భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్య శక్తి.
- **సౌర స్థిరాంకం:** ఒక చ.సెం.మీ. భూమి విస్తీర్ణం 1 నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన ఉష్ణాన్ని గ్రహించటం.
- **భూ వికిరణం:** భూమి గ్రహించిన శక్తిని దీర్ఘతరంగాలుగా విశ్వంలోకి విడుదల చేయడం.
- **ఆల్బిడో:** భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతం.
- **ఉష్ణ సమతుల్యం:** సూర్యపుటం ద్వారా భూమి ఎంత వేడెక్కుతుందో, భూ వికిరణం ద్వారా అంతగానే చల్లబడటం.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోని పై పొరను ఏమని పిలుస్తారు?
   1) ట్రోపో స్ఫియర్ 2) స్ట్రాటో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ఎక్సో స్ఫియర్
2. వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?
   1) నియాన్ 2) ఆర్గాన్
   3) మోనాజటాన్ 4) ఏదీకాదు
3. వాతావరణంలోని ఏ పొర నుంచి రేడియో తరంగాలు ప్రసారమవుతాయి?
   1) ఐనో ఆవరణం 2) మెసో ఆవరణం
   3) స్ట్రాటో ఆవరణం
   4) ట్రోపో ఆవరణం
4. భూమికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర?
   1) ఎక్సో స్ఫియర్ 2) ఐనో స్ఫియర్
   3) ట్రోపో స్ఫియర్ 4) స్ట్రాటో స్ఫియర్
5. రాత్రివేళల్లో భూమి నుంచి సముద్రం వైపు వీచే గాలులను ఏమంటారు?
   1) సముద్ర మంద మారుతం
   2) భూమంద మారుతం
   3) చల్లని గాలి 4) రాత్రి గాలి
6. వాతావరణంలోని అత్యల్ప ఎత్తులో ఉన్న పొరను ఏమని పిలుస్తారు?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) మెసో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ట్రోపో స్ఫియర్
7. వాతావరణ మార్పులు ఎక్కువగా ఎక్కడ జరుగుతాయి?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) ట్రోపో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) మెసో స్ఫియర్
8. భూమి మీద ఆక్సిజన్ భాగం?
   1) 20.94 శాతం 2) 46.5 శాతం
   3) 41.5 శాతం 4) 8.13 శాతం
9. ఓజోన్ ఆవరణం అని దేన్ని పిలుస్తారు?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) మెసో 4) ఎక్సో
10. స్పేస్ స్టేషన్ ఏ ఆవరణంలో ఉంది?
    1) ట్రోపో 2) స్ట్రాటో
    3) థర్మో 4) ఎక్సో
11. వాతావరణ పొరలు వేటి మూలంగా వేడెక్కుతాయి?
    1) ఉష్ణ వికిరణం 2) భూ వికిరణం
    3) ఉష్ణ వాహకం 4) ఉష్ణ సంవహనం
12. భూమి సగటు ఆల్బిడో?
    1) 35 శాతం 2) 45 శాతం
    3) 37 శాతం 4) 38 శాతం
13. సముద్రమట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం (మిల్లీ బార్లలో)?
    1) 1083.3 2) 1019.3
    3) 870 4) 1013.2
14. అధిక ఉష్ణోగ్రతలు గ్రహించే నేలలు?
    1) ఎర్ర నేలలు 2) నల్లరేగడి నేలలు
    3) ఇసుక నేలలు 4) ఒండ్రు నేలలు

సమాధానాలు

1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 4; 14) 2.

ఉద్యోగాలు

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 23 పోస్టులు

విజయనగరం జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **పోస్టుల వివరాలు:** డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కుక్, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏడో తరగతి, పదో తరగతి, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం


» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, విజయనగరం, విజయనగరం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 20.09.2024.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

ఎన్ఐఈ, చెన్నైలో కన్సల్టెంట్ పోస్టులు

చెన్నై(తమిళనాడు)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎపిడిమియాలజీ(ఎన్ఐఈ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్(సైంటిఫిక్-మెడికల్)-01, కన్సల్టెంట్ (సైంటిఫిక్-నాన్ మెడికల్)-01, కన్సల్టెంట్(టెక్నికల్-నాన్ మెడికల్) (స్టాటిస్టిక్స్)-01, కన్సల్టెంట్(టెక్నికల్-నాన్ మెడికల్)-01, కన్సల్టెంట్ (సైంటిఫిక్-మెడికల్)-01, కన్సల్టెంట్(సైంటిఫిక్-నాన్ మెడికల్)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 70 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు కన్సల్టెంట్(మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.1,00,000, టెక్నికల్ (మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.36,440.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.09.2024
» **పని ప్రదేశం:** ఐసీఎంఆర్-ఎన్ఐఈ, చెన్నై.
» **వెబ్‌సైట్:** www.nie.gov.in

The antonym of ambitious is..



BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.1-10): *Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.*

1. If you need to write (1)/ a lot of similar letters, (2)/ set up a template (3)/ of your computer. (4) No error (5)
2. It is astonishing to know (1)/ that although spiritual leaders (2)/ of millions of people, (3)/ the pope has no temporal power. (4) No error (5)
3. It's tempting (1)/ to speculate (2)/ about what might (3)/ had happened. (4) No error (5)
4. The old idea (1)/ that this work was not (2)/ suitable for woman (3)/ was no long tenable. (4) No error (5)
5. I struggle to (1)/ keep my temper (2)/ with the kids (3)/ when he misbehaves. (4) No error (5)
6. Equipments on (1)/ the space station (2)/ is tele operated (3)/ from earth. (4) No error (5)
7. If he resigned (1)/ it would be (2)/ tantamount to admitting (3)/ that he is guilty. (4) No error (5)
8. I am not prepared (1)/ to discuss (2)/ about this (3)/ on the phone. (4) No error (5)
9. I managed to talk (1)/ my way out of (2)/ having to (3)/ give a speech. (4) No error (5)
10. Settling the disputes (1)/ requires (2)/ great tact (3)/ but diplomacy. (4) No error (5)

Directions (Q.11-15): *Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.*

11. The_____ Prime minister has survived another crisis.
    1) Protection 2) charging
    3) Teflon 4) barrier
    5) rigidity
12. The tantalizing _____of fresh coffee wafted towards them.
    1) Relish 2) taste
    3) hue 4) aroma
    5) spread
13. They won't find ____ takers for the house ____ that price.
    1) Few, on 2) much, for
    3) more, of 4) many, at
    5) some, in
14. Wealth is not _____ synonymous with happiness.
    1) Necessity 2) necessary
    3) necessarily 4) necessitate
    5) natural
15. She managed to ____ everyone's interest ____the end of her speech.
    1) Arise, from 2) allow, till
    3) sustain, until
    4) attract, unless 5) catch, to

Directions: (Questions 16 - 20) *Which of the phrases (1),(2),(3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.*

16. She teaching me to be less critical of other people.
    1) Teach 2) teached
    3) taught 4) was taught
    5) No correction required
17. They were surprised to find that he has already left.
    1) He is 2) he have
    3) he's 4) he'd
    5) No correction required
18. We are having trouble keep in with the recent surge in demand.
    1) Keeping away
    2) keeping up 3) keep at
    4) keeping on
    5) No correction required
19. The submarine have time to submerge before the warship could approach.
    1) Having 2) was had
    3) had had 4) is having
    5) No correction required
20. A political storm is brood upon the Prime Minister's comments.
    1) Breed over 2) breed up
    3) breed upon 4) brewing over
    5) No correction required

Directions (Q.21-25): *Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.*

A) In addition, circulars of the University Grants Commission on ragging, rulings of the High Court and Supreme Court in ragging cases, and other related literature, are being circulated among students.
B) But what was common among all these colleges was the orientation on anti-ragging measures.
C) Each college had charted out the day differently for the students.
D) The boards and complaint boxes are already put up or are in the process of being readied with names and numbers of new members from the college and also that of the police department.
E) Colleges have already constituted fresh anti-ragging committees or are in the process of constituting one with representatives from the second and third year students.
F) It is also advised to have a few parents in the committee to make it more approachable to the freshers who can gain confidence with the inclusion of parents.

21. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) E 5) F
22. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) E
23. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D
    4) E 5) F
24. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) D 3) C
    4) E 5) F
25. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) E 5) F

Directions (Q.26-30): *Choose the word which is wrongly spelt from the five options given.*

26. 1) awkward 2) addendum
    3) aerial 4) affidavit
    5) aesthetis
27. 1) kabab 2) karaoke
    3) knowledgeable
    4) kudos 5) kernel
28. 1) scrumptious 2) sophomore
    3) segue 4) sergant
    5) scenario
29. 2) benefitting 2) billioneer
    3) biopsy 4) bilingual
    5) bologna
30. 1) discipliain 2) gorgeous
    3) verbiage 4) weird
    5) teepee

Directions (Q. 31-35): *Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.*

India on Monday said it will alter its energy mix in a way that renewables will occupy a greater proportion in the future, making it clear that it's willing to take more responsibility in the days ahead. Prime Minister Narendra Modi told US President Barack Obama that he was willing to participate in shaping an "**ambitious** agenda" ahead of the Paris meet on climate change. Prime Minister Narendra Modi and President Barack Obama today decided to "further refine" the Indo-US strategic partnership while pushing ahead with cooperation in the areas of security, counter-terrorism, defence, economy and climate change. During the talks, Modi underlined the need for concrete outcomes at the upcoming global conference on climate change in Paris even as Obama said India's leadership at the meet will set the tone for decades to come."We discussed how we can further refine our **strategic** vision," said Obama after the hour-long talks, third between the two leaders in over a year. He said the two leaders discussed how to move forward in various areas like security, economy, trade and investment as also cooperation to defense procurement. "On all these issues, the Prime Minister has been an outstanding partner," Obama said. Appreciating the US President's "friendship, vision and commitment for the relationship", Modi said the bilateral partnership addresses a broad range of strategic and security concerns – counter terrorism, cyber security, training."Our defense cooperation, including defense trade and training is expanding. As existing terrorism threats grow and new ones emerge, we have resolved to further deepen cooperation on counter-terrorism and radicalism," the Prime Minister said. With regard to climate change, both Obama and Modi expressed their commitment to meet the challenge faced by the world. "Much of our discussion today was focussed on the upcoming Climate Conference in Paris. We are encouraged by the aggressive nature of Prime Minister Modi's commitment to clean energy," the US President said about the meet beginning November 30. "I think India's leadership in the upcoming conference will set the tone not just for today but for decades to come," he said, adding he has confidence in the ability of the two countries to partner with other large countries like China in this regard. Modi said, "President and I share an uncompromising commitment on climate change, without affecting our ability to meet the development aspirations of humanity. We have both set ambitious national agendas." Pressing the need for developing mechanisms to ensure affordable as well as accessible sources of clean energy, the Prime Minister said, "We look forward to comprehensive and concrete outcome in Paris with a positive agenda on combating climate change. He said the outcomes of the Paris meet should focus on access to finance and technology for the developing world, especially the poor countries and small island states. "I also thank President Obama for his positive response to my call for a global public partnership for developing affordable clean energy sources that will enable faster adoption of clean energy across the world," he said.

31. The main motto of the leaders discussed in the passage is
    1) to counter anti terrorist groups
    2) uncompromising commitment on climate change
    3) encouraging the aggressive nature
    4) focus on access to finance and technology
    5) defense trade and training
32. Emphasis has been laid in the talks upon
    1) concrete outcomes at the upcoming global conference on climate change in Paris
    2) development aspirations of humanity
    3) developing poor countries and small island states
    4) access to finance and technology for the developing world
    5) set up ambitious national agendas
33. To set the tone means
    1) establish the way that event or activity will continue
    2) developing affordable clean energy sources
    3) call for a global public partnership
    4) positive agenda on combating climate change .
    5) about the beginning
34. The synonym of strategic is
    1) deliberate 2) debilitate
    3) dilute 4) devastate
    5) destitute
35. The antonym of ambitious is
    1) inert 2) striving
    3) pushy 4) grand
    5) magnify

KEY

1) 4 2) 2 3) 4 4) 4 5) 4
6) 1 7) 4 8) 3 9) 5 10) 4
11) 3 12) 4 13) 4 14) 3 15) 3
16) 3 17) 4 18) 2 19) 3 20) 4
21) 3 22) 3 23) 1 24) 4 25) 5
26) 5 27) 1 28) 4 29) 2 30) 1
31) 2 32) 1 33) 1 34) 1 35) 1